
భారతి

సాహిత్య మాసపత్రిక

సెప్టెంబరు 1982



వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

భారతి

మాసపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

సెప్టెంబరు 1982
సంపుటము : 59 సంచిక : 9

విడిప్రతిక వెల నాలుగు రూపాయలు

విషయానుక్రమణిక

సెప్టెంబరు 1982

గంటలు

శ్రీ వజ్ఝల కాళిదాసు

వేళ తప్ప కుండా
విధిగా ప్రతి రోజూ
టంగు టంగు మంటూ
ఖంగు ఖంగు మంటూ
వాగుతూ ఉంటాయి
బడి గంటలు.... గుడి గంటలు!

గడియారాలలో
పనియారాలలో
నాటక శాలల్లో
సినిమా హాలుల్లో
వినబడే గంటలు!

ఆఫీసు గదుల్లో
ధనవ తుల ఇళ్ళల్లో
రేడియోల్లో - టెలిఫోనుల్లో
వీధంట అమ్ముకొనే వాళ్ళ చేతుల్లో
గణ గణ మనే గంటలు!

అవన్నీ అలావుంచు
అవి నిత్యం వింటూన్న గంటలే లే!

కాని
ఎవరేనా వింటున్నారా

చెవులతో కాదు గుండెతో—
కరుణతో సాన భూతితో
కరిగి పోయే గుండెతో—

ఆవరించు కుంటున్న చీకటిలో
ఆవగింజంత కాంతికోసం,
ఆకలిరేపే మంటల
ఆర్పగల ఒక మెతుకుకోసం,
అలమటించి పోయే
ఆర్తుల అరుపుల గంటలు?!?!



అ సు ర సం ధ్య

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

అసలు, రాక్షసత్వం
పాతాళాలే బ్రద్దలు చేసుకొని వచ్చిందో,
దైత్యులలోంచే పొగలు సెగలై వచ్చిందో,
దానవులలోనే దావానలంలా విచ్చుకొందో,
మానవులలోనే మంటలు మంటలై మండిందో,
ఎప్పుడు పుట్టిందో
ఎక్కడ పుట్టిందో తెలీదు—

కాని,
పులి పంజా విప్పినచోట,
పాము పడగ యెత్తిన చోట,
డేగ కన్ను వాలిన చోట,
భల్లూకబంధం బిగిసిన చోట,
నెత్తురొలికిన చోట,
అదికళ్లకు కడుతుంది—
మనసుకు పడుతుంది—
అనుభవానికి విడుతుంది—

అక్షర తపస్వి, అరణ్యాన,
ఆ రాక్షసశక్తి విశ్వరూపాన్ని కనుగొన్నాడు—
అబ్బుర పడినాడు—
ఘంటంపట్టి దానికొక బొమ్మకట్ట తలపెట్టినాడు—

ఒక తల ఆపోవ లేదు
అటుతల, ఇటుతల చేర్చినాడు
తృప్తి కాలేదు
తల తరువాయి తలగా, వరసగా, పదితలలు పేర్చినాడు
అటుచేతికీ, ఇటుచేతికీ పక్కగా
చేయిపక్క చేయిగా, చేయికి చేయిగా
ఇరవై చేతు లమరించినాడు—
రాక్షస రాక్షసుణ్ణి సృష్టించినాడు—

ఏదో చెప్పలేని భయంకరాకర్షణ
వాని నంటి పెట్టుకొని,
ఏదో క్రౌర్య సౌందర్యం
పది తలలపై పడగ విప్పుకొని,
అంత తమోరూపం వెనకా, లీలగా,
ఏదో వెలుగు తళుక్కుమని—
కవి తన సృష్టికి తానే ఉలిక్కిపడి
ఒక్కసారి చేతులు జోడించినాడు—

★ ★

రావణా! లోకవిద్రావణా!
ఎంత అద్భుతంగా కవి వల్మీకంనించి ఆవిర్భవించావు!
ఎంత విచిత్రంగా వికాసించావు! విస్తరించావు!

విశ్వ సర్వస్వానికి రావణతంత్రులు బిగించి
రౌద్ర రుద్రంగా రుద్రవీణలు మోగించి
నీ పలుకే పలికించావు!
నీ పాటే పాడించావు!

సముద్రాలు వెంట పాడినయ్—
పర్వతాలు ప్రతి - ధ్వనించినయ్—
ఆకాశాలు అనుసరించినయ్—
అఖిల భువనాలూ ఆడినయ్—
చంద్ర సూర్యగతులూ జతులూ మారినయ్—
నిఖిల ప్రపంచాన్ని నీ జ్వలత్ చైతన్యాగ్నిలో
భగ్గు మనిపించావు—

వెలుగుకీ వెలుగుకీ మధ్య
అసుర సంధ్యాట్టహాసంతో, తమోరూపంతో
ఇంతింతై, అంతంతై, అనంతంగా వ్యాపించావు—

నింగికీ నేలకీ మధ్య
రావణ స్వర్గాన్ని నిర్మించావు!
చరిత్ర సృష్టించావు—

★ ★

రావణా రావణా !
గరుడులు, గంధర్వులు, కిన్నెరులు, కింపురుషులు,
యక్షులు, రాక్షసులు, దేవతలు, మారీచుడు,
మాల్యవంతుడు, విభీషణుడు, కుంభకర్ణుడు, హనుమం
తుడు, అంగదుడు
ఎవ్వరికీ అంతుపట్టని వాడివే
అంతు చిక్కని వాడివే
అవక్ర విక్రముడివే
అద్భుత బ్రహ్మణ్యుడివే

శ్రుతి స్మృతితో, తపోహంకృతితో, హుంకృతితో,
కైలాసమే క్రక్కదలించి
కైలాసేశ్వరుణ్ణి కానిపించు కొన్న వాడివే !
ఆత్మ లింగాన్నందుకొన్న వాడివే !
చరిత్ర సృజించిన వాడివే !

అయితే,
చిత్రం ఏమిటంటే
నీకే తెలీని నీ ప్రాణ రహస్యం !
సుందరీ సౌందర్య సాగర తీరాల పానగోష్ఠిలో,
లలనా లావణ్య వన మధ్యాన గాన గోష్ఠిలో,
కళ్లంతా ఎర్రని అహంకారంతో
ఒళ్లంతా నీల వికారంతో
పది తలల, ఇరవై చేతుల శరీరమూ
పట్టని తామసంతో, మలీమసంతో,
ఒక్క శూర్పణఖ చేతికి మాత్రం చిక్కిపోయిన
గోర్వంకవు !
ఉపద్రవంగా మారిపోయిన ఉల్కవు !

ఇంక నిన్నే దైవం దీవించగలడు !
ఏ సోదరు డనునయించగలడు ?
ఏ రాముడు క్షమించ గలడు !
ఏ తల్లి ప్రేమించ గలదు !
ఏ అప్సరస వరించ గలదు !
ఏ మండోదరి మన్నించ గలదు !
ఏ సీత హర్షించ గలదు !
తృణప్రాయంగానే చూస్తుంది—
తుంచి వేస్తుంది—

★ ★

శ్రీరామ శరవణ విశ్రాంత జీవనా ! రావణా !
ఈ అదృష్టాధ్వ ప్రయాణంలో
నువ్వు దారితప్పీతప్పని రాక్షస ప్రతిభుడివి !
శ్మశానంలోని శివాలయానివి !

ఆహవ భూమియందు, విల్లందుకొనే ముందు
ఆ శ్రీరాముడూ, బహుశః నిన్ను చూసి, మెచ్చుకోలుగా
చేతులు జోడించే ఉంటాడు—

అయితే ఒక్క అనుమానం
అసుర సార్వభౌమా !
నీ మహా తమోరూపం కళ్లకు కట్టడానికి
అక్షర తపస్వి
ఎన్నితలలు ధరించాడో
ఎన్ని చేతులు వరించాడో
ఎవరు చెప్పగలరు ?
ఎవరు విప్పగలరు !

డాక్టర్ ఘంటా జవహర్‌లాల్

శాతవాహనులు జైనమత పోషకులా?

భారతదేశ చరిత్రలో ప్రసిద్ధి గాంచిన వంశములలో శాతవాహన వంశమొకటి. వీరు దక్షిణాపథపతులనియు త్రిసముద్రాధిపతులనియు చరిత్రలో కీర్తింపబడిరి. మహాపరాక్రమ సమన్వితులై శక, యవన, పహ్లావాదుల విజృంభణము నణచి జగజ్జేయమానమైన కీర్తిప్రతిష్ఠలు నార్జించి చరిత్రలో పేరెన్నిక గాంచిన రాజవంశస్థులలో నొకరిగా పరిగణింపబడిరి. వీరిని సాతవాహనులనియు, శాలివాహనులనియు, శాతకర్ణులనియు వేర్వేరుగా పిలుచుచున్నారు. పురాణములలో ఈ వంశము వారిని ఆంధ్రులనియు, ఆంధ్రభృత్యులనియు [1] వ్యవహరించిరి. మహోజ్జ్వలమైన కీర్తిని వెదజల్లిన వంశమగుటచే, శాతవాహనరాజుల చుట్టూ పెక్కు గాథలు అల్లబడినవి. పురాణములు గూడా శాతవాహన వంశవృక్షమును వేర్వేరుగా తెల్పుచున్నవి. ఒక పురాణమునకు మరియొకదానికి శాతవాహన రాజుల వంశక్రమం, కాలం తెలుపుటలో పొంతన లేదు. ఈ వంశ చరిత్రను తెల్పు చారిత్రక సాధనాలు, పురాణాలు, కావ్యములు, కథనములు పెక్కు లభించినను, అస్పష్టముగా, అపరిష్కృతముగా లిఖింపబడిన చరిత్రగూడా శాతవాహన రాజులదే.

ఈ వంశ ప్రతిష్ఠను మొదట నెలకొల్పినవాడు శ్రీముఖ శాతవాహనుడు. శాతకర్ణి, హాలుడు, గౌతమీపుత్ర శాతకర్ణి, పులోమావి యజ్ఞశ్రీ శాతకర్ణి యీ వంశమున ప్రశస్తిగాంచిన చక్రవర్తులు. దాదాపు నాల్గున్నర శతాబ్దుల దీర్ఘకాలము ఆంధ్రదేశమును పాలించియు, పెక్కు చారిత్రిక సాధనాలు లభించియు, శాతవాహనులు ఎక్కడివారు, వారి కాలం ఎప్పుడు ప్రారంభమైంది, అసలు శాతవాహన రాజులెందరు, ఎప్పటి వరకు వారు పరిపాలించిరి, వారి రాజ్యవిస్తృతి మొదలగు ప్రశ్నలు చరిత్రలో అపరిష్కృతములుగా మిగిలిపోయినవి. ఈ అపరిష్కృతములకు మరియొక అపరిష్కృత సమస్యను ఈ వ్యాసం మూలంగా నేను జేర్చుచున్నాను — అసలు శాతవాహనులు జైనమత పోషకులా ?

లభ్యమైన చారిత్రిక సంపత్తి మూలంగా శాతవాహన సామ్రాజ్యము అత్యున్నత దశకుచేరి, సర్వమతములకు నిలయమైయున్నదని బోధపడుచున్నది. శాతవాహన యుగంలో హిందూ బౌద్ధ, జైనమతములు మిక్కిలి ప్రచారములలో నున్నవి. శాసనాలు శిల్పకట్టడాలు మూలంగా శాతవాహనులు హిందూ, బౌద్ధమతములను పోషించిరని స్పష్టముగా తెలియుచున్నది. శాతవాహన కాలంలో జైనమత స్థితి, దానికి రాజులిచ్చిన చేయూత తెలిసికొనుట మిక్కిలి క్లేశముతో గూడిన విషయము. ఈ విషయముపై చరిత్రకారులు దృష్టి కేంద్రీకరించలేదు.

శాతవాహనయుగము, హిందూ, బౌద్ధములకు శరత్పూర్ణిమా నిశియనుట తెల్లము. కాని జైనమతము వెనుకబడి యుండెనని తలపరాదు. మొదటగా మనం జైన వాఙ్మయమును, కథనాలను పరిశీలించి, వాటిని చారిత్రిక సాధనాలకు జతకూర్చి పరిశీలిద్దాం. జైన వాఙ్మయము శాతవాహన రాజులను, వారి జైన మతాదరణమును విరివిగా పేర్కొనుచున్నది. "జైనఅవశ్యక సూత్రము" [2] ప్రతిష్ఠానపురమును పాలించిన శాలివాహనరాజు జైనమత పోషకుడుగా పేర్కొనుచున్నది. జినప్రభసూరి "కల్పప్రదీపము" [3] లో ప్రతిష్ఠానపుర చక్రవర్తి రాజ్యంలో గల 52 సైనికులు 52 జినాలయములను వారివారి పేర్లతో కట్టించిరని తెల్పుచున్నది. ప్రభావిక్రమ చరితము [4] మూలంగా శ్రీ శాతవాహన చక్రవర్తి జినతీర్థమును కట్టించినట్లు బోధపడుచున్నది. కాళికాచార్యుని కథనము [5] మరియు యితర జైనకథనముల మూలంగా, కాళికాచార్యుడు జైనపండుగైన 'పర్యూషణ' తిథిని, శాతవాహన రాజుయొక్క అభ్యర్థనపై మార్చినట్లు విదితమగుచున్నది. అనగా శాతవాహనరాజు జైనపండుగ వైశిష్ట్యమును స్వయంగా తెల్పుకొనుటకు ఆ పండుగ కార్యక్రమమును తనకు వీలుగా మార్పించినట్లుగా మనం గుర్తించాలి. ఇంకా జైన గ్రంథాలు[6] శాతవాహన రాజులలో శక్తి కుమారుడు జైన పిపాసిగా తెల్పుచున్నవి. ఈ శక్తి కుమారుని నాగనిక శాతకర్ణి కుమారుడైన 'శక్తిశ్రీ'గా చరిత్రకారులు గుర్తించిరి. [7]

పైన పేర్కొన్న జైన గ్రంథాల కథనములను చరిత్ర కారులు పరమ ప్రమాణములుగా తీసుకోలేదు. అయినా అన్ని జిన గ్రంథాలు శాతవాహనులు జైన మత పోషకులని తెల్పుచున్నవి. ఇట్టి సందిగ్ధావస్థలో శాతవాహనుల నాణెములు జైన గుహలో బయల్పడినవి. శాసనముల తర్వాత నాణెములు ప్రమాణములుగా చరిత్రకారులు గుర్తిస్తారు.

కరీంనగరుజిల్లా కప్పారావుపేట గ్రామంలో శాతవాహనుల పూర్వరాజుల నాణెములు బయల్పడినవి. వీటి వునికిని చరిత్ర కందించిన వారు డాక్టరు పరబ్రహ్మశాస్త్రిగారు. కప్పారావుపేటకు దాపుననే చిన్నగుట్టకలదు. దానిని స్థానికులు నేటికి 'మునులగుట్ట'గా పేర్కొనుట విచిత్రము. అ గుహలోనే డాక్టరు శాస్త్రిగారికి శాత వాహనుని నాణెములు లభ్యమైనవి. వీటిపై వారు వ్యాసములుగూడా భారతిలోనే ప్రచురించిరి.[8] జైన గుహలను బౌద్ధ గుహలను వేర్వేరుగా గుర్తించుట అతి కష్టతరము. ఇది చరిత్రకారులకు క్లేశము కల్గించు సమస్య. అయినా జైన గుహలు 'రాతిపరుపులు' విధిగా కల్గివుండునని చరిత్రకారుల పరిశోధనలో వెల్లడైంది. జినులు తమ అవసాన కాలంలో విధిగా 'సల్లేఖన' వ్రతమాచరింతురు. ఆ సల్లేఖన వ్రతమాచరించుట కనువుగా వారు వారి గుహలలో 'రాతిపరుపులు' ఏర్పరచుకొంటారు. ఇచ్చట జైన గుహలు నాల్గు రాతిపరుపులు కల్గివున్నవి. అచ్చట దొరికిన శాతవాహన రాజుల నాణెముల మూలంగా పైని పేర్కొన్న జైన కథనములు కట్టు కథలుగావని రూఢియగుచున్నది. శాతవాహనులు హిందూ, బౌద్ధ మతములతో సమానముగా జైనమతము నాదరించిరనుట సుస్పష్ట మైనది. జైనమతము ఆంధ్రరాష్ట్రములో శాతవాహనుల కాలం నాటికే రాజాదరణ ప్రజాదరణ చూరగొన్నదిగా మనం గుర్తించాలి.

సంప్రదించిన పుస్తకములు

1. సాతవాహన సంచిక, పుట 69
2. జె. బి. బి. ఆర్. యస్. జర్నలు, XVI, భాగములు 3, 4, పుట 290
3. జె. బి. బి. ఆర్. ఎ. యస్. జర్నలు, భాగము 10, పుట 133
4. ఇండియన్ యాంటిక్వేరీ, భాగము 9, పుటలు 247 నుండి
5. క్వ. జె. యమ్. యస్. జర్నలు, భాగము 13, పుటలు 498 నుండి
6. కేంబ్రిడ్జి హిస్టరీ అఫ్ ఇండియా, భాగం 1, పుట 478
7. సెలక్టు శాసనములు, భాగం 1, పుట 190
8. భారతి, జూన్ 1978, పుటలు 51-55

[గమనిక : 1981 మార్చి మాసములో రాష్ట్ర పురాతత్వ శాఖవారు నిర్వహించిన శాతవాహన సెమినారులో నాచే చదువబడిన ఆంగ్ల వ్యాసమునకు ఆంధ్రానువాదము.]

నీ ముంగిట మోకరిల్లుతుంటాను...

డాక్టర్ గుమ్మనూరు రమేష్ బాబు

ప్రశాంత సుప్రభాత సమయంలో
నిర్మల నిర్వాణ నిశ్శబ్ద గమనంలో

ఈ హృదయం
నీ పద సన్నిధిలో
అర విరసిన శతసహస్రదళ పుండరీకం!
'ఓం' బీజాక్షర స్వరమెక్కడో నినదిస్తోంది
'ఉత్తిష్ఠోత్తిష్ఠ' స్తోత్రమేదో వినిపిస్తోంది

విహరించే భరతపక్షి ఆలాపనలో
వేణుగానము గగనసీమ నంటగా
విప్రోత్తముని గాయత్రీ అర్చనలో
పరబ్రహ్మ నాదము విశ్వమంతటనూ అలరించగా
నిశ్చల నీలాకాశములో
తెలి జిలుగు వెలుగు పుంజములు
వేనవేల తారకలకు సరిక్రొత్త ప్రత్యామ్నాయమ్ములుగా!
నీ పదయుగళ విగళిత ప్రకాశ మానమ్ములుగా!!

తూరుపు దెసలో
విరజిమ్ము కొంటున్న అరుణకాంతులు
దినకరోదయ శుభోదయ ఘడియలుగా!
జీవ చైతన్య వికసిత ప్రసూనమ్ములుగా!!

ప్రభూ!
విప్పారుకొంటున్న ఈ రశ్మిలో
తొలిబంగారు కిరణాన్ని కావాలని
మేలుకొలుపు నేనే పాడాలనీ ఉంది!

ఎర్రబారిన యీ యేటి నీట తానమాడి
పాపపంకిలమ్ముల ప్రక్షాళించి
నీ కోవెల గంటలు నేనే మ్రోగించాలని ఉంది!

తండ్రీ!
గరిక చివర నిలిచిన మంచు ముత్యమ్మును
కెంజాయల మేలిమి ముత్యంజేసి
నీ పాదసేవ నేనే చేయాలని మనసారా ఉంది!

విచ్చిన తెల్లతామరల పసిడి సొబగులో
పచ్చకర్పూరంపు నిండు హారతిలో
నిన్ను చూస్తూ ఉండి పోవాలని పేరాశగా ఉంది!

ఈ సమయం
కొన్ని క్షణమ్ములకే నిలయమైనా
నాకు మాత్రం
ఈ ఉదయం
ఊర్ధ్వలోకాల లభ్యమయ్యే మహాభ్యుదయం!

అందుకే
ఊహ తెలిసిన నాటినుంచి
ఊపిరొదులు వరకు
ప్రతి ఉదయం నేనిలాగే
ప్రభూ! నీ ముంగిట మోకరిల్లుతుంటాను....
మోకరిల్లుతూ ఉంటాను!

శ్రీ సి. ఆర్. యస్. శర్మ

రాయలసీమ తెలుగు : అసాధారణ లక్షణాలు

1. భాషలో వైవిధ్యం మూడు రకాలు : చారిత్రకం, ప్రాంతీయం, సాంఘికం. ఈ మూడింటిలోనూ వ్యవహర్తల మధ్య కన్పించే అంతరమే (డిస్టెన్స్) భాషా వైవిధ్యానికి ప్రధాన కారణం. ఒకే భాషకు చెందిన ప్రాచీన, ఆధునిక మాండలికాల మధ్య కన్పించే వైవిధ్యం చారిత్రకకాంతరం వల్ల ఏర్పడింది. ప్రాంతీయ వైవిధ్యం నైసర్గిక సీమలు, రాజకీయపు హద్దులవల్ల ఏర్పడుతుంది. సాంఘిక అంతరం వ్యవహర్తల మధ్య భాషా వైవిధ్యాన్ని (వర్గ మాండలికాలను) కల్గిస్తుంది.

2. తెలుగులో నాలుగు ప్రాంతీయ మాండలికాలు గుర్తింపబడ్డాయి [కృష్ణమూర్తి, 1974]. అవి : 1) పూర్వ 2) దక్షిణ 3) ఉత్తర 4) మధ్య మండలాలు. కొందరు పూర్వ మండలాన్ని ప్రత్యేకంగా గుర్తించక, మధ్యమండలంలో అంతర్లీనం చేశారు [లక్ష్మీనారాయణ శర్మ, 1979] మధ్యమండలపు భాషే ఆధునిక ప్రమాణ తెలుగుకి [ఇక నుంచీ ఆ. ప్ర. తె.] ప్రధానాధారం.

2. 1. తెలుగులో మాండలికాల (ప్రాంతీయ, వర్గ) మీద సమగ్ర పరిశీలన జరగవలసి ఉంది. అందులోనూ దక్షిణ మండలమైన రాయలసీమ తెలుగు మాండలికం [ఇక నుంచీ రా. తె.] మీద జరిగిన పరిశీలన తక్కువ. ఇందులో ఎన్నో ప్రాచీన లక్షణాలుండటంవల్ల దీన్ని ప్రాచీన వ్యవహార ప్రాంతం (రిలిక్ ఏరియా) గా గ్రహించవచ్చు. ఈ మాండలికంలోని విశేషాలను గురించి గతంలో అక్కడక్కడా సూచన ప్రాయంగా వర్ణన జరిగింది. [సుబ్రహ్మణ్యం-1971, 1974 ; రామారావు-1974]

2. 2. ఏ మాండలికమైనా సంపూర్ణ సమరూపాత [హోమోజెనిటీ]ను కలిగిఉండదు. ఆయా మాండలికాల్లో ఉన్నతస్థాయి వర్గాల వారి భాష మిగిలినవారి భాష కన్నా వేరుగా ఉంటుంది. ఇందుకు కారణాలు ఉన్నత సాంఘికస్థాయి, ఆర్థిక స్తోమత, విద్యార్హతలు, అధిక సామాజిక సంబంధాలు మొదలైనవి. అందువల్ల ఒకే ప్రాంతంలో శిష్టవర్గాల భాష, శిష్టేతరుల భాష వేరువేరుగా ఉండటం గమనించవచ్చు.

తెలుగులో వర్గ మాండలికాల మీద కానీ, ప్రాంతీయ, వర్గ మాండలికాల పరస్పర చ్ఛేదం (ఇంటర్ సెక్షన్), పరస్పర ప్రభావాన్ని గురించి కానీ నిశితంగా పరిశోధన జరగాల్సి ఉంది. భాషా వైవిధ్యంలో, ఏక కాలిక దృష్టితో చూస్తే, ప్రాంతీయ, సాంఘిక మాండలికాల్లోనే ఎన్నో అవాంతర భేదాలున్నాయి .సామాజిక సందర్భాల (సోషల్ కాంటెక్స్ట్స్) ననుసరించి, వక్తృ శ్రోతృ సంబంధాల్నిబట్టి, వక్త ప్రమత్తత, అప్రమత్తతల్నిబట్టి, వృత్తినిబట్టి, విషయాన్ని (సబ్జెక్ట్) బట్టి ఇలా ఎన్నో కారణాలవల్ల భాష మారుతుంది. వీటన్నింటి పరిగణనలోకి తీసుకుంటూ, భాషను ప్రత్యేకంగా కాక, దాని సహజమైన సామాజిక సందర్భాల్లో పరిశీలించే విభాగం సామాజిక భాషా శాస్త్రం.

ఆ. ప్ర. తె. కు ప్రధానాధారం మధ్యాంధ్ర శిష్ట వ్యవహారం. ప్రమాణ భాష ముఖ్యంగా శిష్టవ్యవహారం ప్రాతిపదికగానే ఏర్పడుతుందనటానికి ప్రపంచ భాషల్లో ఎన్నో ఉదాహరణలున్నాయి. దీని అర్థం శిష్ట వ్యవహారం సహజంగానే ప్రమాణీకరింప బడిందని కాదు. భాషేతర కారణాలవల్ల శిష్టత్వాన్ని సంపాదించినవారి వ్యవహారం శిష్ట వ్యవహారం, అదే ప్రమాణం. తెలుగుభాషకు సంబంధించినంత వరకూ ప్రాంతీయ వైవిధ్య దృష్టితో చూస్తే మధ్యాంధ్రం, సాంఘిక వైవిధ్య దృష్టితో చూస్తే శిష్ట వ్యవహారం ఆ. ప్ర. తె. కు ప్రాతిపదికలు. ఈ రెండింటి కలయికతో విస్తరిస్తున్నదే ఆ. ప్ర. తె. ఈ విస్తరించటమే ప్రమాణీకరణం (స్టాండర్డయిసేషన్). ఈ ప్రమాణీకరణ క్రమం ముఖ్యంగా బాహిర వ్యవహారానికి (పబ్లిక్ యూసేజి) సంబంధించినది [సౌత్‌వర్త్, దాస్వాని, 1974] అందుచేత ఏ ప్రాంతంలోనైనా గృహ పరిసరాల్లో (హోమ్ ఎన్విరాన్‌మెంట్స్) ప్రాంతీయ మాండలికం విన్పించే అవకాశం ఉంది. ఇది వ్యవహర్త సాంఘికస్థాయి, విద్యార్హతలు మొదలైన అంశాల మీద ఆధారపడి ఉంటుంది.

3. రాయలసీమలో విద్యావంతులు బాహ్యపరిసరాల్లో ఆ. ప్ర. తె.ను వాడినా, గృహ పరిసరాల్లో మాత్రం రా. తె. ను వాడటం కన్పిస్తుంది. ఇది ద్విమాండలిక భాషిత (బయిడయాలెక్టలిసమ్)గా గ్రహించవచ్చు. ఇది ప్రాంతీయ వైవిధ్య దృష్టితో కన్పించే లక్షణం.

సాంఘిక వైవిధ్య దృష్టితో చూస్తే రాయలసీమ ప్రాంతంలోని శిష్టేతరుల్లో కూడా ద్వైమాండలిక లక్షణాలు కన్పిస్తాయి. ఇక్కడి ద్విమాండలిక భాషిత గృహ పరిసరాల్లో తమ వర్గ (ప్రాంత) మాండలికాన్నుపయోగించే శిష్టేతరులు, శిష్ట వర్గాల వారితో సంభాషించేటప్పుడు వారి వర్గ మాండలికాన్ని అనుకరింప బూనటం.

4. ఈ వ్యాసంలో దిగువ ఇవ్వబోతున్న అంశాలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. 1) కేవలం శిష్టేతర వ్యవహారంలో విన్పించేవి 2) రాయల సీమలోని విద్యావంతుల వ్యవహారంలోనూ కన్పించేవి.[1]

ఒక్కొక్క వర్గపు రూపాలూ వాటి ఆ. ప్ర. తె. ప్రతి రూపాలతో దిగువ పట్టికల్లో చూపించ బడ్డాయి.

వ ర్గ ం - 1

సంఖ్య	అంశం	ఆ. ప్ర. తె. రూపాలు	రా. తె. శిష్టేతర రూపాలు
1.	పదాది చకారం, పదాది వకారం (పూర్వాచ్చుల ముందు)	ఎ) ఉంటాయి ఉదా : చేశాడు విన్నాడు	బి) లోపిస్తాయి ఉదా : సేసినాడు ఇన్నాడు
2.	విధ్యర్థక బహువచన ప్రత్యయం	ఎ) —ండి ఉదా : రండి, చెయ్యండి	బి) —ర్రి ఉదా : రార్రి, సెయ్యర్రి
3.	భావి ప్రత్యయం	ఎ) —తా-/-తున్— ఉదా : వస్తాను, వస్తుంది	బి) —తా— ఉదా : వస్తాను, వస్తాది
4.	భూత వర్తమానాల్లో 'ఉండు' ధాతురూపం	ఎ) ఉన్— ఉదా : ఉన్నాడు	బి) ఉండ్ ఉదా : ఉండినాడు ఉండాడు
5.	ప్రేరణ ప్రత్యయ రూపం (కొన్ని క్రియల్లో)	ఎ) —ఇంచు ఉదా : (తాగు)—తాగించు (రాయు)—రాయించు	బి) —పించు— ఉదా : తాపించు/తాపిచ్చు రాయ్‌పించు/రాయ్‌పిచ్చు
6.	కొన్ని ద్వ్యక్షర యాంత ధాతువుల రూపం వ్యతిరేకంలో	ఎ) 'వ' చివర కలవి ఉదా : కలవదు కురవదు తడవదు	బి) 'స' చివర కలవి ఉదా : కలసదు కురసదు తడసదు

వ ర్గ ం - 2

సంఖ్య	అంశం	ఆ. ప్ర. తె. రూపాలు	రా. తె. శిష్ట, శిష్టేతర రూపాలు
7.	వ్యతిరేక విధి ప్రత్యయం	ఎ) —అకు ఉదా : చెయ్యకు	బి) —అకు/-వాకు/-బాకు [2] ఉదా : చె/సెయ్యాకు, చె/సెయ్యవాకు, చె/సెయ్యబాకు
8.	శత్రర్థక ప్రత్యయం	ఎ) —తూ— ఉదా : వస్తూ	బి) —తా/-తూ— [3] ఉదా : వస్తా, వస్తూ
9.	భూతకాల ప్రత్యయం	ఎ) —అ్-/-అ-/ఇన్— ఉదా : అడ్డాను తిన్నాను వచ్చింది	బి) —ఇనా-/-(ఇ)తి-//-ఎ-[4] /-ఇన్- ఉదా : వచ్చినాను, వస్తివి, వచ్చె,

సంఖ్య అంశం	ఆ. ప్ర. తె. రూపాలు	రా. తె. శిష్ట, శిష్టేతర రూపాలు
10. ప్రేరణ ప్రత్యయ రూపం	ఎ) —ఇంచు— ఉదా: చూపించు, కొట్టించు	బి) —ఇచ్చు—5 ఉదా: చూపిచ్చు, కొట్టిచ్చు
11. నిశ్చయార్థకం + ప్రశ్నార్థకం	ఎ) అలి+అ ఉదా: రావాలి+అ	బి) అల+న (శ్రుతి 'న' కారం) +అ ఉదా: రావాల+న+అ→ రావాలనా/రావాల్నా
12. పూర్ణతా వాచి ప్రకారం (పర్ స్పెక్టివ్ ఆస్పెక్ట్)	ఎ) భావిలో మాత్రం ఉదా: వచ్చి ఉంటాడు	బి) అన్ని కాలాల్లో ఉదా: వచ్చి ఉండె (→వచ్చుండె)- భూతం వచ్చి ఉన్నాడు/ఉండాడు-వర్తమానం వచ్చి ఉంటాడు - భవిష్యత్

5. పై పట్టికలోని కొన్ని అంశాలను కింద విపులీకరించటం జరిగింది.

ఎ) విధ్యర్థక బహువచన ప్రత్యయంగా కన్పించే-రి (2-బి) తెలంగాణంలో (కడపజిల్లాలోనూ) కన్పించే-ని ప్రత్యయం నుంచి తిరోగామి సంపూర్ణ సమీకరణం ద్వారా ఏర్పడి ఉండవచ్చు.

బి) 'తాగు', 'కాగు', చేయు', 'పూయు', 'రాయు' మొదలైన క్రియలమీద (బహుశా 'గ' కారాంతాలు, 'య' కారాంతాలు ?) ప్రేరణ - ఇంచు ప్రత్యయం ఆ. ప్ర. తె. లో అవ్యవహితంగా చేరుతుంది. కాని రా. తె. లో దీనికి ముందు - ప్ - (5. బి) చేరుతుంది. ఇది తిను - తినిపించువంటి క్రియల సామ్యంవల్ల ఏర్పడి ఉండొచ్చు.

సి) ఆ. ప్ర. తె. లో చాలా త్ర్యక్షరయాంత ధాతువులు వ్యతిరేకంతో చివర 'వ' తో ఉంటాయి. ఈ క్రియల్లోని చివరి 'య' కారం కాల ప్రత్యయాల ముందు 'స' అవుతుంది బహుశా ఈ సామ్యంవల్ల రా. తె. శిష్టేతర వ్యవహారంలో వ్యతిరేకంలో కూడా 'స' కారం (6-బి) కన్పిస్తుంది.

డి) పూర్ణతావాచి ప్రకారం నిర్మాణం ఇలా ఉంటుంది.
ప్రధానక్రియక్త్వార్థకం + సహాయక క్రియాధాతువు + కాల ప్రత్యయం + పురుష ప్రత్యయం
(ఉండు → ఉన్ -)
ఆ. ప్ర. తె. లో భావి పూర్ణతా వాచి ప్రకారం మాత్రమే ఉపయోగించబడుతూంది. రా. తె. లో మూడు కాలాల్లోనూ ఈ ప్రకార ప్రయోగం కన్పిస్తుంది.

ఇ) శత్రర్థక ప్రత్యయంగా - తా - రా. తె. లో ఎక్కువగా కన్పించినా వక్త విద్యా, సాంఘిక, ఆర్థిక స్థాయిలు పెరిగే కొద్దీ జాగరూక శైలితో - తూ - వాడటం పెరుగుతుంది. అయితే యాదృచ్ఛిక శైలిలో - తా - కన్పించే అవకాశమూ ఉంది.

ఎఫ్) నిజానికి ప్రేరణ ప్రత్యయంగా - ఇంచు - యే అన్ని ప్రాంతీయ మాండలికాల్లోనూ కన్పిస్తుంది. ఇది వర్ణసమీకరణం వల్ల) యాదృచ్ఛిక శైలిలో (కాషువల్ స్టయిల్) - ఇచ్చుగా మారటం మధ్య మండలానికి చెందిన వ్యవహర్తల వ్యవహారంలోనూ కన్పించింది. అంచేత ఇది ప్రాంతీయం కాకపోవచ్చు. జాగరూక శైలిలో (కేర్ ఫుల్ స్టైయిల్) విద్యావంతుల వ్యవహారంలో - ఇచ్చు కన్పించే అవకాశాలు తక్కువ.

జి) 11. బి లోని శ్రుతి 'న కారం బహుశా చారిత్రకంగా పూర్వ రూపాలైన 'రావలెను/రావలయును' లోని 'న' కారానికి ధారణ (రిటెన్షన్) కావచ్చు. ఏకకాలిక దృష్టితో చూస్తే దీన్ని శ్రుతి (గ్లయిడ్)గా భావించాలి. ఇది ఆ. ప్ర. తె. లో కన్పించదు.

6. ఛామ్‌స్కీ, హాలెలు ప్రతిపాదించిన అసాధారణతా (మార్కెడ్‌నెస్) సిద్ధాంతరీత్యా భాషలో సహజస్థితీ, క్లిష్టత లేకపోవటమూ సాధారణ లక్షణాలు (అన్ మార్క్‌డ్) గాను, దీనికి వ్యతిరేకంగా సంక్లిష్టంగా కన్పించేవి అసాధారణ లక్షణాలు (మార్క్‌డ్)గాను పరిగణింపబడతాయి. [లక్ష్మీనారాయణశర్మ, 1980]. పట్టికలో రెండు వర్గాలుగా చూపించిన అంశాలను సాధారణ, అసాధారణాలుగా వర్గీకరిస్తే

ఆ. ప్ర. తె. లో 3ఎ, 12ఎ మాత్రమే అసాధారణాలుగా, రా. తె. లో 3బి, 12బి మాత్రమే సాధారణాలుగాను కన్పిస్తాయి. 6

ఈ చర్చను బట్టి

1. రా. తె. లో అసాధారణ లక్షణాలు, ఆ. ప్ర. తె. లో సాధారణ లక్షణాలు ఎక్కువ ఉన్నట్టూ,

2. ప్రమాణీకరణ క్రమంలో భాషలో ఏకరూపత ఏర్పడుతున్నట్టూ, తెలుస్తుంది.

ప్రమాణ భాషా ప్రయోజనాల్లో ఏకీకరణం (యూనిఫయింగ్) ఒకటి. ఒకభాషా ప్రాంతంలో ఉన్న వివిధ మాండలికాల విభిన్నత్వానికి అతీతంగా వాటన్నిటిని కలుపుకుని పోగలది, అన్నిటిని ఏకీకృతం చెయ్యగలది ప్రమాణభాష. ఇది అన్ని మాండలికాలనూ కలుపుకుని విస్తరిస్తుంది కాబట్టి విభిన్న మాండలికాల మధ్య ఉన్న వైవిధ్యం చాలావరకూ ప్రమాణభాషలో తగ్గిపోతుంది. ఈ విధంగా వైవిధ్యం, బహురూపతలకు బదులుగా ఏకరూపత భాషలో ఏర్పడుతుంది. దీన్నే అసాధారణతా సిద్ధాంతరీత్యా చెపితే, మాండలికాల్లో కన్పించే బహురూపతా లక్షణాలు, ప్రత్యేక విలక్షణ అంశాలు అసాధారణ లక్షణాలు. ప్రమాణ భాష ఏర్పడే క్రమంలో ఈ అసాధారణ లక్షణాలు సాధారణాలుగా మారటమే ఏకరూపత ఏర్పడే విధం.

వర్తమాన సాహిత్యాన్ని సమీక్షించి చూస్తే ఆ.ప్ర. తె. లో అన్ని ప్రాంతీయ, వర్గ మాండలికాలనుంచీ ప్రయోగాలు ప్రవేశిస్తున్నట్టు తెలుస్తుంది. ఇవి ప్రమాణ భాషా ప్రయోజనాల్ని నెరవేర్చగల్గితే ప్రమాణంఅవుతాయి. అయితే వార్తాసాధనాల్లోనూ, రచనల్లోనూ, సినిమాల్లోనూ దాదాపుగా ఏకరూపతతో ఉన్న ప్రమాణభాష ఈనాడు అందరికీ సుబోధకంగా ఉంది. అన్ని ప్రాంతాల వారికీ, అన్ని వర్గాల వారికీ ఇది సమానంగా అందుబాటులో ఉంది. ఇదే ప్రమాణ భాషకున్న ఏకీకరణ ప్రయోజనం.

7. విద్యావంతుల వ్యవహారంలో శైలీ పరివృత్తి కన్పించవచ్చు. ఇది ప్రమాణ భాషవైపుంటుంది. ఈ శైలీ పరివృత్తి వక్త విద్యాస్థాయిని, సాంఘిక స్థాయిని బట్టి, అతనికి ప్రమాణ భాషలో ఉన్న సంసర్గాన్ని బట్టి ఉంటుంది. ప్రమాణ భాషలో శైలీ పరివృత్తి ఉన్నా అది ప్రమాణ భాషా పరిధిని అతిక్రమించదు. అందులోని శైలీపరివృత్తి విషయాన్ని బట్టో వక్తనుబట్టో మారుతుంది, కాని మాండలికం వైపుండదు.

ప్రమాణ భాష	← శైలీ పరివృత్తి (స్టయిల్ షిఫ్టింగ్) →	మాండలికం

రా. తె. లో విద్యావంతుల శైలిని పైన పేర్కొన్న దానికి ఉదాహరణంగా చెప్పవచ్చు. యాదృచ్ఛిక శైలిలో కన్పించే రా. తె. ప్రత్యేక లక్షణాలు జాగరూక శైలిలో ఉండవు. ఈ రకమైన శైలీ పరివృత్తి శిష్టేతరభాషలో కన్పించే అవకాశం తక్కువ. ఇందువల్లనే రా. తె. లోని అంశాలను రెండు వర్గాలుగా విభజించి చూపటం జరిగింది. మొదటి వర్గంలో శైలీ పరివృత్తితక్కువ. రెండో వర్గంలో ఎక్కువ. అయితే రెండో వర్గంలో చూపబడిన లక్షణాలు శిష్ట, శిష్టేతర వర్గాల వ్యవహారంలో కన్పించటంవల్ల శిష్టవర్గానికి సంబంధించి శైలీ పరివృత్తి ఉందనీ, శిష్టేతర వర్గానికి సంబంధించి [ప్రమాణ భాషతో పోల్చినపుడు] శైలీ పరివృత్తి ఉండదనీ చెప్పవచ్చు. శైలీపరివృత్తికీ, ద్విమాండలిక భాషిత (బయిడయాలెక్టలిసమ్)కూ దగ్గర సంబంధముంది.

ఇంతవరకూ చర్చించిన దాన్ని సంక్షేపిస్తే,

1. రా. తె. లో అసాధారణ లక్షణాలు, ఆ. ప్ర. తె. లో సాధారణ లక్షణాలు ఎక్కువ ఉన్నాయి.

2) ఈ అసాధారణ లక్షణాలు ప్రమాణ భాషలో సాధారణ లక్షణాలుగా కన్పించటమే ఏకరూపత ఏర్పడటం

3) రా. తె. మాండలికానికి చెందిన విద్యావంతుల వ్యవహారంలో శైలీ పరివృత్తి ఉంది.

4) శైలీపరివృత్తి రా. తె. నుంచి ప్రమాణభాష వైపుంటుంది.

అధోజ్ఞాపికలు

1. ఈ రెండు వర్గాల్లోనూ కన్పించే కొన్ని అంశాలు మిగిలిన ప్రాంతీయ మాండలికాల్లో కూడా శిష్టేతర వ్యవహారంలో కన్పించవచ్చు.

2. ఈ మూడు ప్రత్యయాలూ స్వేచ్ఛా ప్రవృత్తిలో (ఫ్రీ వేరియేషన్) ఉంటాయి. వీటి ప్రయోగంలో కొంత మాండలిక

ఛాయగా గోచరించవచ్చు. అయితే వీటి పరిసరాల్లో తేడా ఉండదని గమనించాలి.

3. ఇవి కూడా స్వేచ్ఛా ప్రవృత్తిలో ఉంటాయనే చెప్పొచ్చు. అయితే విద్యార్హతలు, సాంఘిక ప్రతిష్ఠ మొదలైనవి పెరిగే కొద్దీ -తూ- ప్రయోగం ఎక్కువవుతుంది. కాని శిష్టేతర వ్యవహారంలో -తా-యే కన్పిస్తుంది.

4. -ఇనా-,-ఇతి-స్వేచ్ఛా ప్రవృత్తిలోనూ, ఇవి రెండూ -ఎ-, -ఇన్- -లతో పరస్పర పరిపూరక ప్రవృత్తి (కాంప్లిమెంటరీ డిస్ట్రిబ్యూషన్) లోనూ ఉంటాయి. వీటి వ్యాప్తి ఇలా ఉంటుంది.

- ఇనా - → ఉత్తమ పురుష, మధ్యమ పురుష, ప్రథమ పురుష - (మహద్వాచకం)

(ఇ)తి — → ఉత్తమ, మధ్యమ పురుషలు

— ఎ — → ప్రథమ పురుష

— ఇన్ — → ప్రథమ పురుష - మహతీ వాచకం

5. -ఇచ్చు- అన్నది విద్యావంతుల వ్యవహారంలో ఎక్కువగా యాదృచ్ఛిక శైలిలో మాత్రం కన్పిస్తుంది.

6. ఆ. ప్రా. తె. లో 3ఎ, 12ఎ లు వ్యవస్థ దృష్ట్యా అసాధారణాలు — ఒకదానిలో సంశ్లిష్టత ఉండటం, ఇంకో దానిలో సహజ స్థితి లేకపోవటంవల్ల- కాని ప్రమాణభాషా ప్రయోజనాల దృష్ట్యా, ఏకరూపత దృష్ట్యా ఇవి సాధారణాలుగా భావిస్తే ఆ. ప్రా. తె. లో 12 అంశాలూ సాధారణాలే. కాకపోయినా ఆ. ప్రా. తె. లో సాధారణ లక్షణాలు ఎక్కువ ఉండటం గమనించాలి.

ఉపయుక్త గ్రంథాలు

కృష్ణమూర్తి, భద్రిరాజు 1974 : "తెలుగు మాండలికాలు : ప్రమాణ భాష" తెలుగు భాషాచరిత్ర, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు

రామారావు, చేకూరి 1974 : "ఆధునిక భాష : సంగ్రహ వర్ణనం" కృష్ణమూర్తి(1974)లో

లక్ష్మీనారాయణ శర్మ, కుంటముక్కల 1979 : "భాషా వైవిధ్యం - తెలుగు" ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 69. 26-30, హైదరాబాదు

,, 1980 : "కృతక సాధు రూపాలు : దార్ఢ్యతా సూత్రం" భారతి 57/6, 59-64 హైదరాబాదు

సుబ్రహ్మణ్యం, పి. ఎస్. 1974 : యాన్ ఇంట్రడక్షన్ టు మాడర్న్ తెలుగు, అన్నామలయి యూనివర్సిటీ, అన్నామలయి నగర్

,, 1977 : ద్రావిడ భాషలు సత్యవతీ పబ్లికేషన్స్, అన్నామలైనగర్.

సాల్‌వర్గ్, ప్రాంక్లిన్, దామ్స్వాని సి. జె. 1974 : ఫౌండేషన్స్ ఆఫ్ లింగ్విస్టిక్స్ ది ఫ్రీ ప్రెస్, న్యూయార్క్



ఉ ద్ధ ర్త

ఖమ్రుద్దీన్

నిన్న సాయంత్రం—
తన ఆటకు పావులుగా పైర్లను వాడుకున్నంతసేపూ
వాడుకుని,
రేపు ఆకలార్తుల భీకర దూకలి తీర్చే ఆ పైర్లనే గాలి
క్రూరంగా నేలమట్టం చేస్తుంటే చూసిన
నా కళ్ళను మౌనంలోకి ఎలా నెట్టను....?....
ఆ చూసింది చూసినట్లు చిత్రిస్తే ఎర్రెర్రగా మోస్తూ
కపాళానికి అంటుకుపోయిన కళ్ళను అమితంగా ఆకర్షిస్తూ
గుండె గుండెలో పెనుమంటలు రగిలించే చెట్లను
నే నెరుగుదును—

కొండల్ని దూసుకుని,
సెలయేళ్ళని తోడ్కొని,
నదుల్ని కలుసుకుని
కడలి సారధ్యంలో
ఉప్పెనగా ఉద్యమించే జలపాతాలను
నే నెరుగుదును—

కళ్ళలో మెరుపులతో
గొంతులో ఉరుములతో
పిడికిట్లో పిడుగులతో
నిర్భయంగా ముందుకుసాగే మేఘాలను
నే నెరుగుదును—

అంతేకాదు............

చీకటి వాతపడి బతుకులు చెడి
కుమిలిపోతూ కుళ్ళిపోతూ బాధల్నుంచి విముక్తికోసం,
కుళ్ళిన వ్యవస్థనుమార్చే తమనుతీర్చే అరుణారుణ
మూర్తులకోసం
ఆశగా అర్జీలు పెట్టుకునే శిథిల జీవాలను
నే నెరుగుదును—

సుఖం మరిగిన జీవించడ మ్మాత్రమే ఎరిగిన స్వార్థం చేసిన
సంకుచిత శాసనోల్లంఘన శక్తి లేక ఎదురు చెప్పక
నిస్సహాయంగా పూడ్చిపెట్టుకున్న ఆ జీవాల గొంతుల
సమాధుల్లో
ఏ స్వేచ్ఛారవాలు గ్రమగ్గుతున్నాయో,
ఏ జీవనం కోరుకుంటున్నాయో కూడా
నే నెరుగుదును—

బురదలో పుట్టినంత మాత్రాన అస్పృశ్యులు అభాగ్యులు,
సహజీవనానికి, సమతా స్వాగతోత్సవ సంరంభంలో
పాల్గొనడానికి
అనర్హులు కారని నుడివితే,
ఆప్యాయతతో తడివితే
కళ కళమని ప్రఫుల్లోన్ముఖంగా విప్లవించే
ముగ్ధ ముకుళాలను
నే నెరుగుదును—

నే నెరుగుదును;
మార్పంటూ మహోదయమంటూ
పులిన తలంపై వెన్నెల గీతాలు గిలికి
చల్లనయ్యలుగా బతికిపోతున్న బ్రహ్మారథం
పట్టించుకుంటున్న
అల్పులకు అతీతుడిగా నా కర్తవ్యమేంటో—

అందుకే.... ....

ఆ సాయంత్రం నుంచి
ఈ వేకువకు ప్రయాణించింది;
కాంతి కుంచెలు పొదిగిన కిరణహస్తాలతో
ఉత్సాహంగా ఇక్కడ ఉదయించింది!

[అళ్ళాపురంలో వున్న నా తమ్ముడు కత్బుద్దీన్ వద్దకు వెళ్ళినప్పుడు .... అక్కడి ఉదయంలో రాసినది.]

డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి

పూసపాటి వారి సీసమాలిక

పూసపాటి రాచిరాజు రచించినట్లు కల సీసమాలిక పూసపాటి వారి సీసమాలిక. అది రాచిరాజు సీసమాలిక అనియు వ్యవహరింపఁబడినది. ఇది ప్రథమతః 'తెలుగు పారాశరీయ హోర విజయరామ రాజీయము' అను గ్రంథము నందు ముద్రింపఁబడినది.[1] తదుపరి 'ఆంధ్రవిజ్ఞానము' అను గ్రంథము నందును ముద్రింపఁబడినది.[2] ఆ సీసమాలికలో ఏబదియాఱు సీసపాదములు, ఒక తేటగీతి పద్యము కలవు. అందు వసిష్ఠగోత్రమునకు చెందిన ఏబదియాఱు క్షత్రియ కుటుంబముల వివరములు కలవు. అందు పూసపాటి రాజవంశ మూలవివరము ప్రథమ విశేషము. అందు మాధవవర్మ గుఱించి ఇట్లు కలదు.

'అతని తనూజుఁ డాతతబలోన్నతుఁడు మా
ధవవర్మ నృపతి సుత్రాతఁబోలి
జనకు నాజ్ఞను సప్తశతి సాంగముగ రామ
దేశికుచే నుపదేశమొంది
కనకదుర్గ కటాక్ష ప్రాప్త విభవుఁడై
మఱియసింగరి బోర ప్రమందఁజేసె
చలబరహ త్తి మళ్ళబలాధిపుని రక్త
ధారచేఁ బరదేవతను భజించె
వసుదిగింద్రియ శకవత్సరంబుల జయ
వాటికా దుర్గవైభవముఁ గాంచె
గగనవాణీ వాక్య గౌరవంబునఁ బూస
పాటి భూమినిఁ బురీవరముఁ గట్టి
వాసిఁ గాంచుటఁ బూసపాటివారను నింటి
పేరుఁగాంచిరి రాచపెద్దలయిన
యమల రాజాదిగాఁబ్రముఖులు మావారు
తద్గృహ నామంబుఁదాల్చుచుండ్రి'

ఇందు గమనింపవలసిన అంశము లివి :

1. మాధవవర్మ కనకదుర్గా కటాక్షప్రాప్తవిభవు డగుట,
2. మాధవవర్మ 666వ సంవత్సరమునందు బెజవాడ దుర్గవైభవము గాంచుట,
3. మాధవవర్మ పూసపాడులో పురము కట్టుట,
4. మాధవవర్మ కాలము నుండి పూసపాటి ఇంటిపేరు వెలయుట.

ఇందు బెజవాడ విషయము వినా మిగిలినవి పదునేడవ శతాబ్దినుండి పందొమ్మిదవ శతాబ్దివఱకు గల పూసపాటి రాజకవులఁ తదాస్థానకవుల గ్రంథములలోని అంశములకు సంవదించునవికావు. పూసపాటి తమ్మిరాజు కృష్ణవిజయమునందు ఇట్లు కలదు.

'భువనవర్ణితుఁడైన యా బుద్ధవర్మ
పుత్రుసుచరిత్రు గాంచె నమిత్రజైత్రు
నిజమనోంబుజ నిహిత త్రినేత్రుఁగులప
విత్రు మాధవవర్మ పృథ్వీకళత్రు 74 ప.

ఆ నృపాగ్రణి యింద్రకీలాద్రిచెంత
నిరుపమంబైన కృష్ణవేణీ తటమున
రాజధానిగ నొనరించె శ్రీజితాల
కాపురంబైన జయవాటికాపురంబు 75 ప.

శాలివాహన సుశక వర్షముల సంఖ్య
యరయ నేనూట పదునాలుగైననాడు
ధర్మనియతికి మాధవవర్మ మెచ్చి
కనకవర్షంబు గురియించె కనకదుర్గ 76 ప.

ధర్మనియతిచేత ధరయేలుచుండి యా
బుద్ధవర్మసుతుడు భువనసుతుడు
నిడుదవోలిచెంత నిలిపెను దుర్గంబు
గిరిసమంబు గాగఁ గీర్తికొఱకు 77 ప. 1 ఆ.

ఇందు గమనింపవలసిన అంశము లివి :

1. మాధవవర్మ రాజధాని బెజవాడ
2. మాధవవర్మ ధర్మనియతికి మెచ్చి కనకదుర్గ 692వ సంవత్సరమునందు కనకవర్షము కురిపించుట
3. మాధవవర్మ నిడుదవోలు చెంత దుర్గమును నిలుపుట.

ఇందలి కనకదుర్గ కనకవర్ష కథ ఇతర గ్రంథములందును పఠితపాఠము. ఇది మండపట్టి కామేశ్వరశాస్త్రి మార్కండేయ పురాణము నందు ఇట్లు కలదు.

'పెక్కు సైన్యములతో దిక్కులెల్లను గెల్చి
యక్కుమారుడు వచ్చె నాంధ్రదేశ
మున కందు బెజవాడ కనకదుర్గాంబా ప్ర
సాదంబునకు బురశ్చర్యజేయ
తన్నిష్ఠకలరి కాత్యాయనీ దుర్గా మ
హాదేవి కమిణ బ్రత్యక్షమయ్యె
నద్దేవి వరమున నాత్రేయవంశ్యు ల
విచ్ఛిన్న రాజ్యాభివృద్ధి నలరు
వారు గాగను సౌవర్ణవర్ష మేడు
గడియలమ్మహి వర్షింపగాను సిద్ధి
బడసి గౌతమీకృష్ణల నడుమ నిడుద
వోలు పురి రాజధానిగా నేలె జగతి'

ఇందు మాధవవర్మ నిష్ఠకు సంతసించి బెజవాడ కనకదుర్గ ప్రత్యక్షమై, ఏడు గడియలు కనకవర్షము కురిపించినట్లు కలదు. ఇది చాటుపద్యములందు ఇంకొక విధముగ కలదు. ఆ చాటు పద్యము లివి[3] :

'ఆయతకీర్తి సజ్జనకులాగ్రణి మాధవవర్మ చింతలం
గాయలుకోసి యమ్ముకొను కట్టెలగుండ తనూజుడావుకై
శ్రీయుతుడైన పుత్రు తలచేతికి నిచ్చె బెజాడపాదె నా (?)
పాయక నిల్చె నార్థి శతదాన శకాబ్దముగైన కాలమున్
కట్టెలగుండి ... కట్టెదురనే దనపట్టిదెచ్చి య
చ్చట్టున జంపజేసి ని ధర్ముడు మెచ్చి సువర్ణవృష్టి య
చ్చట్టణభూమిలో గురియజేసెను మాధవవర్మ పాడిసెం
పెట్టిదొయంచు నింద్రసభ బేర్కొనిరప్పుడు దేవసంఘముల్.

చిరుకుక జిరుకెత్తు కసకంపు వర్షంబు
నేరాజు కురిపించె నేడుగడెలు
దురితవిదూరుడై దుర్గ జగన్మాత
మెప్పించె నేరాజు మేదినందు
గరువంబునకు బోయవమ(బన్ని శిశు ....
తన శిశు జంపెను ....
చతురంగబలములు శక్తితో సంధించి
పగతుర నేరాజు పరపినాడు

భానువంశ్యుండు సహకార బాంధవుండు
ధర్మపాలుండు ఓసు .. తాత ఒం(గి
హెస(గ నెవ్వాడు నీసాటి భూనపాటి
రాజకులదీప ! ఉద్దండ రాచమాన !

ఎనిమిదివేల దోరగల యేనుగులున్ పదినేల జొక్కి త్రో
క్కని దశలక్షవాజులును గాలుడు పోని ....
ఎనయగ దుర్గయిచ్చె ధనమిద్ధ ధనంజయ భీకరాంతకున్
మనుజవరేణ్య తంబరగు మాధవవర్మకు గారవంబునన్'

ఇందు మాధవవర్మ చింతకాయలు కోసి అమ్ముకొని జీవించు కట్టెలగుండ కొడుకు చావునకు, తన కొడుకు తల ఇచ్చెనని, కట్టెలగుండ మాధవవర్మ కట్టెదుట అతని కొడుకును చంపెనని, అది విచిత్రమని అప్పుడు శివుడు ఏడు గడియలు కనకవర్షము కురిపించెనని కలదు. కనకదుర్గ మాధవవర్మకు గజతురగ పదాతులను ధనము ఇచ్చెనని మాత్రమే కలదు. (రథములను ఇచ్చినట్లు కృష్ణవిజయము నందు కలదు). ఇందు శివుడు కనకవర్షము కురిపించిన కాలము 592 వ సంవత్సరము. ఇది పూసపాటి తిమ్మిరాజు కృష్ణవిజయములోని కాలమును సంవదించునది. అంతేకాదు. పయి చాటుపద్యములలోని కనకవర్ష కథాఘట్టము పండ్రెండవ శతాబ్దిని శాసన ప్రోక్తమైన విషయమును సంవదించును. ఆ విషయ మిది[4] :

'పండ్రెండవ శతాబ్దము నందు వేంగీ దేశాధీశ్వరునకు సామంతుడుగ నుండిన పల్లకేత భూపాలుడు బెజవాడ మల్లేశ్వర స్వామివారి యాలయములో నొక శాతిపలకమీద వ్రాయించిన శాసనములో నుదాహరింపబడిన గాథలలో శాలివాహనశకము 117వ సంవత్సర ప్రాంతమున నొక మాధవవర్మ యను రాజు కలడనియు, అతని కుమారుడు చింతగింజల నమ్ముకొని పొట్టపోసికొనెడి యొక స్త్రీయొక్క బిడ్డను సంహరించినందున రాజు విచారించి తన కొడుకుమీద నేరము ఋజువైనందున న్యాయపక్షమునే పూని కొడుకునకు నురిశిక్ష విధించెననియు, అందుకై మల్లేశ్వర స్వామి యతని న్యాయబుద్ధికి సంతోషించి యాతనిపై సువర్ణ వర్షమును గురిపించి యాతని పుత్త్రుని బీదరాలగు నా స్త్రీయొక్క కీర్తిని భూమిపై స్థాపితము చేసెననియు, నీ మొదలుగాగల విషయములు పేర్కొనబడినవి (Report on Epigraphy No. 665, Public, 28th July, 1810, Part II, pp. 81-82, paras 8 & 9). కాబట్టి మాధవవర్మ ఖ్యాతి యప్పటికే ప్రఖ్యాతమై యున్నది. ఈ మాధవవర్మ చరిత్రమునం గొంత కల్పన యుండినను మాధవవర్మ కల్పితపురుషుడని మాత్రము చెప్పవలను గాదు. ఇయ్యవి భావిపరిశోధనమునంగాని తేటపడునట్టి విషయములు కావు.'

ఇది 1912వ సంవత్సరము నందు చిలుకూరి వీరభద్రరావు గారు ప్రకటించిన విషయము. ఇందు శాలివాహన శకము 117వ

సంవత్సరము ప్రామాదికము. "శాసనములో చెప్పబడిన సంవత్సరము సరిగా శకము 514 ('శ్రీ మచ్ఛాకాబ్దే బ్ధిశశిసాయకసమ్మితే')," అని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు అందిచ్చిన సమాచారము.5 కనుక మాధవవర్మ కాలము 514+78=592వ సంవత్సరము. అప్పటి మాధవవర్మ విష్ణుకుండిరాజు మొదటి మాధవవర్మ అగును. అతని ధర్మనిరతికి మల్లేశ్వరస్వామి కనకవర్షము కురిపించుట పండ్రెండవ శతాబ్దికి ప్రసిద్ధము. అది మొదలు మాధవవర్మ అనేక రాజవంశములకు మూల పురుషుడు. అందు కాకతీయ రాజవంశ మూలపురుషుడైన మాధవవర్మ ఒకడు. అతడు 'శాలివాహన శకము 281 తారణనామ సంవత్సర మాఘశుద్ధ 5 గురువారము శ్రవణా నక్షత్రం నుండి (411) వరకు' పరిపాలించెనని ప్రతాప చరిత్రము నందు కలదు (369-489). పూసపాటి రాజవంశ మూలపురుషుడైన మాధవవర్మ మరొకడు. ఆ మాధవవర్మకు పద్మాక్షీదేవి ప్రత్యక్షమైనది. ఈ మాధవవర్మకు కనకదుర్గాదేవి ప్రత్యక్షమైనది. పండ్రెండవ శతాబ్ది బెజవాడ శాసనములోని మల్లేశ్వరస్వామి కనకవృష్టి పదునేడవ శతాబ్ది నుండి పూసపాటి రాజకవుల, తదాస్థాన కవుల గ్రంథము లందు కనకదుర్గ కనకవృష్టిగ మారిపోయినది. కనకదుర్గ కనకవృష్టి పూసపాటి వారి సీసమాలికను కనకదుర్గ కటాక్ష దృష్టిగ తీరిపోయినది. చాటుపద్యములలోని, కృష్ణవిజయములోని, మార్కండేయ పురాణములోని మాధవవర్మకాలము 592వ సంవత్సరము. ఇది సరిగా బెజవాడ శాసనములోని కాలమును సంవదించునది. పూసపాటి రాజవంశ మూలపురుషుడైన మాధవవర్మ కాలము చాటు పద్యము లందు, కృష్ణ విజయము నందు, మార్కండేయ పురాణము నందు ఒకవిధముగ కలదు. పూసపాటి వారి సీసమాలికను మరొకవిధముగ కలదు. అంతేకాదు. సీసమాలికలోని కాలము నందు మూడు అరుసు సరిపెట్టినట్లు కలదు. కనుక పూసపాటి వారి సీసమాలికలోని మాధవవర్మ కాలము ప్రామాణికము కాదు.

ఇక మాధవవర్మ పూసపాడు పురమును కట్టించి వాసి గాంచినట్లు, మాధవవర్మ కాలమునుండి పూసపాటి అను ఇంటిపేరు వెలసినట్లు పూసపాటి వారి సీసమాలికను కలదు. కాని, పూసపాటి తమ్మిరాజు కృష్ణవిజయము నందు అమలరాజు 'పూసపాటి పురాంక భూషణుండు' అని కలదు (110 ప. 1 ఆ.) అంతేకాదు. ఓరుగంటి సోమశేఖరకవి రామకృష్ణార్జునరూపనారాయణీయము నందు అమలరాజు పూసపాడును ఏలుట వలన పూసపాటి అను ఇంటిపేరు వచ్చినట్లు కలదు.

'రాజిత కీర్తి యా యమలరాజు —
అల పూసపాడనంగను
వెలసిన బురమేలుచుంట విశ్వంభరలో
వల పూసపాటి వారన
విలసిల్లిరి రాజవరులు విశ్రుతు లగుచున్'

ఇందు అమలరాజు పూసపాడు పురమును ఏలుట వలన పూసపాటి అను ఇంటిపేరు వచ్చినట్లు కలదు. మరి అమలరాజు పూషవాట మను పురము నిర్మింప, అది పూసపాడు అనబడి, అమలరాజ వంశీయులు పూసపాటి వారయినట్లు మండ్రచిట్టి కామేశ్వరశాస్త్రి మార్కండేయ పురాణము నందు కలదు.

అ భీమనందనుం డమల రాజాఖ్యుండు
కనకదుర్గా కటాక్షప్రసార
మాత్మాంగమునకు రక్షార్థంబు కవచమై
దనర శాత్రవులను దునిమి పెక్కు
రాజ్యముల్గైకొని రాజరాజసమాన
వైభవుండయి కీర్తి వర్ధిలంగ
పూషవంశ్యుల వాసభూమి నాదగనొక
పూషవాట మనంగ బొలుచు పురము

కొండపలిసీమ నొనరించె యుండెనందు
పామరోక్తుల నది పూసపాడనదగె
నదిమొదలు పూసపాటివారైరి యమల
రాజవంశజులైనట్టి రాజులెల్ల'

ఇందు పూసపాడునకు ఇంచుక గీర్వాణము వచ్చినది. పూసపాటి రాజులు సూర్యవంశ క్షత్రియులు. పూషశబ్దము సూర్య వాచకము. కనుక పూషవాటమును కల్పనము వాటముగ కుదురును. పూషవాటము పామరోక్తుల పూసవాడఅగును గాని పూసపాడు కాదు. పూసపాడుపండితోక్తుల పూషవాట మగును. అయినది. అది కొండపల్లిసీమను కలదని స్థలనిర్దేశము. కనకదుర్గ కటాక్షవీక్షణము రక్షా కవచమైన, మైలమభీమన కొడుకు అమలరాజు పూసపాడు నిర్మాత అగుట కంటె పూసపాడు నివాసి అగుట చరిత్రకు సంవదించునది. అది మైలమభీమన అను వ్యాసము నందు వివరింతును. కొండపల్లి సీమ యందు పూసపాడు నిర్మించుటయేగాక, అమలరాజు అందు నివసించినట్లును, పద్యము నందు కలదు. పూసపాడు నందు నివసించినవారికి పూసపాటి అను ఇంటిపేరు వచ్చుట లోకసహజము. గ్రామనామములు ఇంటిపేరు లగుట ప్రసిద్ధము. అంతేకాదు. గ్రామనామములు సర్వకుల గృహనామము లగుట సర్వసాధారణము. పూసపాటి అను ఇంటిపేరు ఒక క్షత్రియులకు మాత్రమే కాదు, బ్రాహ్మణులకును కలదు. పూసపాడు పురనిర్మాణము వలన గాని,

పూసపాడు పురనివాసము వలన గాని అమలరాజు మొదలు అమలరాజు వంశీయులకు పూసపాటి అను ఇంటిపేరు వచ్చుట పొత్తు పొసగునది. మఱి పూసపాటి వారి సీసమాలికను మాధవవర్మ 'పూసపాటి భూమినిఁ బురీవరము గట్టి వాసిఁగాంచుటఁ బూసపాటి వారను నింటిపేరు' వచ్చినట్లు కలదు. పురములేని భూమికి పూసపాటి భూమి అను వ్యవహారము సహజము కాదు. కట్టిన పురమునకు పూసపాడు అను పేరు పెట్టుట సహజము. అంతేకాదు. పూసపాడు పురనిర్మాణము మాధవవర్మ కావించినట్లు మఱెక్కడను కానరాదు. అంతేకాదు. అమలరాజు పూసపాడు గ్రామ నివాసి అయిన, అతని పెద్దకొడుకు మాధవవర్మ పూసపాడు పురనిర్మాత కావచ్చును. అమలరాజు పెద్ద కొడుకు మాధవరాజు అప్రసిద్ధుడు కాడు. 'పూసపాటి కులోద్భవుండైన మాధవవర్మ యన్ వసుమతీ వల్లభుండు విపుల సైన్యముతోడ బెజవాడ చెంత నప్పెద్ద సింగక్షమా విభువరేణ్యు సురపురీవరసౌఖ్య భాసురునిఁజేసి.... అనిగొందిపురాది గోత్రాధిపతుల .... గెలిచి .... తద్విజయ స్తంభచయంబుల .... నిలిపె' నని వక్కలంక వీరభద్రకవి వాసవదత్తా పరిణయము నందు వర్ణించిన (41-44 ప. 1ఆ,) మాధవవర్మ అమలరాజు పెద్ద కొడుకు మాధవరాజు అగును. కనుక పూసపాటి వారి సీసమాలిక లోని మాధవవర్మ పూసపాడు పురనిర్మాణాదికమును ప్రామాదికము కాదు.

మొత్తము మీద పూసపాటి వారి సీసమాలికలోని మాధవవర్మ కాలము, మాధవవర్మ పూసపాడు పురనిర్మాణాదికమును చరిత్ర కాదు. చరిత్రాభాసము.

ఇక పూసపాటి వారి సీసమాలికను పూసపాటి రాజవంశ మూలవివరము తదుపరి, వత్సవాయ రాజవంశ మూలవివరము ద్వితీయ విశేషము. ఆ సీసపాదము లివి —

'మామకవంశ భీమనృపాలు సచివుండు
దండనాథాగ్రణి దానరాజు
వేములవాడ శ్రీ భీమనచే రామ
గోపాలచరితంబు గొనిన మేటి
వత్సవాయిని చంద్రవర్మచే గిరినిధి
గగనేందు శకములఁ గానుకొంది
సజ్జాపురముఁగొట్టి సకలారి మండల
భయదప్రతాపంబు బాదుకొలిపి
వెలసె నా వంశజు లిల వత్సవాయి వా
రైరి .... '

ఇది నిడుదవోలు వేంకటరావుగారు నిర్ణయించిన, చాగంటి శేషయ్యగారు నిర్ధరించిన, ఆరుద్రగారు అనుమానించిన విషయము. ఇందు 'వేములవాడ శ్రీ భీమనచేరామగోపాలచరితంబు గొనినమేటి' అను పంక్తికి 'వేములవాడ శ్రీ భీమమనీషిచే గోపాల చరితంబుగొని నమేటి' అను పాఠాంతరము కలదు. వేములవాడ భీమకవి రచించినది రామగోపాలచరితము కావచ్చును, గోపాలచరితమును కావచ్చును. గోపాలచరితమైన, కావ్యము. రామగోపాలచరితమైన, ద్వ్యర్థి కావ్యము కావచ్చును. అది 'రాఘవవాసుదేవీయ'మను నిడుదవోలు వేంకటరావుగారి నిర్ణయమునకు[6] గోపాలచరితమను పాఠాంతరము బాధకము.

ఆరుద్రగారి అనుమానమిది[7] :

"_రాచిరాజు సీసమాలికలో వత్సవాయి వారి వంశానికి మూలపురుషుడు దానరాజనీ, అతడు చంద్రవర్మచే వత్సవాయిని కానుకగా పొందాడనీ, ఈ బహుమానపు తారీఖు క్రీ. శ. 1175 అనీ ఉంది. అయితే 'వత్సవాయి వారి మూలపురుషుడు సాగిపోతరా' జయినట్లు వత్సవాయి గోపరాజున కంకితమియబడిన 'రామవిలాస' మను గ్రంథములో ఏనుగు లక్ష్మణకవి వ్రాశాడు. 'గణపతిదేవునికి పూర్వము వత్సవాయి అను నింటిపేరుగల రాజకుటుంబమే లేదని స్పష్టముగ చెప్పవచ్చును. సాగి పోతరాజు కాకతి గణపతిదేవ చక్రవర్తి కాలమున కృష్ణాతీరమున గుడిమెట్టలో రాజ్యము చేయుచుండెనని బెజవాడ మొదలగు ప్రదేశములలో గల సాగిపోతరాజు శాసనముల వలననే బోధపడగలదు' అని చిలుకూరి వీరభద్రరావుగారు వ్రాశారు. (ఆంధ్రుల చరిత్రము - 5వ సంపుటము, 1936, పుటలు 73, 74) క్రీ. శ. 1175 లోనే వత్సవాయి కనుక, దానరాజు చంద్రవర్మ అనే వ్యక్తులు చారిత్రక పరీక్షకు నిలబడక పోవచ్చు."

ఇది నిజముగ చారిత్రిక పరీక్ష చేయవలసిన విషయము.

చిలుకూరి వీరభద్రరావుగారు తెలియఁజేసిన చాగివంశ రాజుల చారిత్రిక సత్యము లివి[8] :

1. 'చాగివంశపు రాజుల యొక్క శాసనములు కృష్ణామండలములో నందిగామసీమలో నున్న గుడిమెట్ట, ముక్త్యాల, అనుమంచిపల్లె, పెనుగంచిప్రోలు, నవాబుపేట మొదలగు ప్రదేశము లందును బెజవాడలోను' కలవు.

2. ముక్త్యాలశాసనమునందు 'ముప్పరాజు వంశమున గోంక దోరప రాజు, అతనికి పోతరాజును, ఆ పోతరాజునకు రాజాంబిక యందు త్యాగరాజు (చాగిరాజును), అతనికి దోరపరాజును, అతనికి చాగి పోతరాజును జనించిరని' కలదు.

3. గుడిమెట్ట శాసనము నందు 'దోరపరాజునకు చిమ్మాంబిక యందు జనించిన పోతరాజు గుడిమెట్టలో విశ్వేశ్వరుని ప్రతిష్ఠాపనము' చేసినట్లు కలదు.

> 'శ్రీకృష్ణ వేణ్యా స్తట భూమిభాగే
> శ్రీ పోతభూపో గుడిమెట్టనామ్ని
> విశ్వేశ్వరాఖ్యం శివమాదిదేవం
> సంస్థాపయామాస పురే స్వకీయే'

4. బెజవాడ శాసనము నందు 'నరసింహుని కుమారుడైన చాగి పోతరాజు .... త్రిపురాంతక కాశ్మీర మల్లేశ్వర [illegible]డనారాయణ స్థానంబులఁ గనకకలశంబులను బెట్టించి సింహగిరి యందు నరసింహునకు సాగిపోత సముద్రంబను చెఱువు గట్టించి శ్రీ పర్వతంబున (శ్రీశైలమున) మల్లికార్జునదేవుని ముందట నందికేశ్వరుని ప్రతిష్ఠించి దేవభోగంబులకై కంభముపాడు, ముచ్చింతలు, బూదవాడ మొదలగు గ్రామముల నిచ్చి, బ్రాహ్మణోపభోగంబులుగా ననేకాగ్రహారంబు లొసంగెనని' కలదు. 'ఈ శాసనము కాకతి గణపతిదేవచక్రవర్తి సింహాసన మధిష్ఠించిన క్రీ. శ. 1199దవ సంవత్సరమున వ్రాయఁబడినది.'

ఇక ఏనుగు లక్ష్మణకవి రామవిలాసము నందు ఇట్లు కలదు-

> 'సహ్యజాతీరమునకు భూషణమనంగ
> సిరుల కిరవగు గుడిమెట్టపురము దనకు
> రాజధానిగ సత్కళాభోజరాజు
> సాగిపోతక్షమాభర్త జగతియేలె
> ఆ సాగిపోతనృపతికి
> భూసుర రక్షకుడు మదరిపుత్రాసదబా
> హాసత్వుడు నరసింహుడు
> భాస్కరతేజుడు జనించి ప్రజలన్బ్రోచెన్.


> ఆ నరసింహభూపతి కహర్పతి యామవతీశతుల్య తే
> జోనిధు లబ్బినీతనయ సుందరు లిద్దరు గల్గి రాత్మజుల్
> భూనుత (సుర?) కీర్తియౌ మనుమపోతమహీతలనాధ
> చంద్రుడున్
> మానసనాగ్రగణ్యుఁడగు మాచనృపాలుడు వంశవర్ధనుల్.
> స్థిరభక్తిగ్గుడిమెట్టలోపల బ్రతిష్ఠించె న్కృపాసింధు బం
> ధురసౌధంబున విశ్వనాధు బరమాత్మున్ రాజనారాయణున్
> సురవంద్యున్ బెజవాడయందు నిలిపెన్ సుశ్లోకధర్మైకత
> త్పరశీలుండగు మన్మపోతనృపుఁడేతన్మాత్రుడే యెన్నగన్'

ఇందు నరసింహరాజు కొడుకు మనమపోతరాజు గుడిమెట్టలో విశ్వనాథుని ప్రతిష్ఠించినట్లు కలదు. గుడిమెట్ట శాసనము నందు దోరపరాజు కొడుకు చాగిపోతరాజు గుడిమెట్టలో విశ్వేశ్వరుని ప్రతిష్ఠించినట్లు కలదు. విశ్వేశ్వరుడే విశ్వనాథుడు. కనుక 'దోరపరాజునకు నరసింహరాజను నామాంతరము కలదని' చిలుకూరి వీరభద్రరావుగారి విశ్వాసము.9 అది ఊహామాత్రశరణ్యము. అంతేకాదు. అనావశ్యకము. ఉపరి, ప్రాచీనుడైన దోరపరాజు కొడుకు చాగి పోతరాజు గుడిమెట్టలో విశ్వేశ్వరుని ప్రతిష్ఠించిన చారిత్రిక సత్యమును అర్వాచీనుడైన ఏనుగు లక్ష్మణకవి నరసింహరాజు కొడుకు మనుమ పోతరాజు విశ్వనాథుని ప్రతిష్ఠించినట్లు చెప్పుట సంభవము. కనుక బెజవాడ శాసనములోని నరసింహుని కుమారుడైన చాగి పోతరాజు, రామవిలాసములోని నరసింహరాజు కొడుకైన మనుమపోతరాజు ఒకడు కావచ్చును. అతని తాత చాగి పోతరాజు వత్సవాయ రాజవంశ మూలపురుషుడని రామవిలాసము నందు కలదు. మనుమ చాగి పోతరాజు బెజవాడ శాసనకాలము 1199వ సంవత్సరము. అనగా ప్రాభవకాలము పంద్రెండవశతాబ్ది తుదిభాగము. కనుక తాత చాగి పోతరాజు ప్రాభవకాలము పంద్రెండవశతాబ్ది తొలి భాగము కావచ్చును.

మఱి, రామవిలాసము నందు మనుమపోతరాజు తమ్ముడు మాచరాజు వంశానుక్రమణిక ఇట్లు కలదు.

> 'ఆ మాచనృపతి సుతుడు మ
> హామహుఁ డెఱపోతనక్షమాధీశ్వరుఁడా
> శ్రీమంతు సుతులు జగదభి
> రాములు శ్రీ తెలుగురాయ రామనరేంద్రుల్'

ఇందు మాచరాజు కొడుకు ఎఱపోతరాజు, ఎఱపోతరాజు కొడుకులు తెలుగు రాయలు, రామరాజు అని కలదు. మొత్తముమీద రామవిలాసములోని చాగి వంశరాజుల వంశవృక్ష మిది :




ఇందు మనుమ పోతరాజు కాలము పండ్రెండవశతాబ్ది తుదిభాగము కనుక, అతని తమ్ముని మనుమలు తెలుగురాయ, రామరాజుల కాలము పదమూడవ శతాబ్ది తుదిభాగము కావచ్చును. అది స్థూలముగ పదమూడవ శతాబ్ది ఉత్తరార్ధము.

పదమూడవశతాబ్ది ఉత్తరార్ధములోని రామరాజు వత్సవాయ నగరము నందు నివసించుట వలన సాగివంశమునకు వత్సవాయ నామ వ్యవహారము కలిగినదని రామవిలాసము నందు కలదు.

'ఆ రామరాజేంద్రు డాజిరంగంబున
వైరిరాజుల గెల్చి వారిచేత
మదగజకంకణ మాణిక్యగాణిక్య
కనకాంబరము లుపాయనములందె
యాచకశ్రేణుల కభిమతార్థము లిచ్చె
ప్రజల సంరక్షించె భరతునట్లు
తగ వత్సవాయాఖ్య నగరంబు నిజనివా
సముజేసె నది కారణముగ సాగి
వంశమునకు వత్సవాయ నామము లోక
సుప్రసిద్ధమగుచు నొంపుగాంచె
రామరాజు తెలుగురాయ డనంతుడు
....

ఇందు చివరిపాదము శిథిలమైనది కాబోలు చుక్కలు పొందుపబడినవి. అయినను రామరాజు వత్సవాయనగరము నందు తన నివాసమును పాదుకొల్పుట వలన సాగి వంశమునకు వత్సవాయవంశమను వ్యవహారము వచ్చినట్లు స్పష్టము. కనుక సాగి వంశమునకు వత్సవాయ వంశమను వ్యవహారము రామరాజు వలన పదమూడవశతాబ్ది ఉత్తరార్ధము నందు వచ్చినట్లు కరతలామలకము.

రామరాజు తర్వాత రామవిలాసము నందు వంశక్రమము లేదు. 'ఆ పావనాన్వయంబున' తిరుమలరాజు పుట్టెనని కలదు. తిరుమలరాజునకు, పెద్దాపురము సంస్థానమును స్థాపించిన వత్సవాయ తిమ్మరాజునకు నడుమ నాలుగు తరములు కలవు.



ఇందు పేరరాజు కొడుకు తిమ్మరాజు పెద్దాపుర సంస్థాన సంస్థాపకుడు. అతని కాలము[10] 1555 – 1607. అనగా పదునారవ శతాబ్ది ఉత్తరార్ధము. కనుక తిరుమలరాజు కాలము పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధము కావచ్చును.

పదమూడవశతాబ్ది ఉత్తరార్ధమునకు పదునాల్గవశతాబ్ది ఉత్తరార్ధమునకు నడుమ (1250 – 1350) వత్సవాయ వంశక్రమము రామవిలాసమునందు లేదు.

పదమూడవ శతాబ్ది ఉత్తరార్ధములోని తెలుగు రాయలు రేకపల్లి దుర్గాధ్యక్షుడని రామవిలాసము నందు కలదు.

'అచలాధీశ్వరధీరు రేకపల్లిదుర్గాధ్యక్షు విద్వేషి రా
ట్ప్రచయోద్వేల బలావలేప తిమిరప్రద్యోతనున్ విక్రమా
ర్క చరిత్రోన్నతు కావ్యనాయకుని నేడ్కన్ బ్రస్తుతింపం
దగున్
సుచరిత్రాఢ్యుని వత్సవాయ తెలుగుక్షోణీశ చూడామణిన్'

ఇందు వత్సవాయ తెలుగురాయల రాజ్యము రేకపల్లి దుర్గమని కలదు.

పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధములోని వత్సవాయ తిరుమల రాజు రాజ్యమేలినట్లు రామవిలాసము నందు కలదు.

'ధరణి సుఖించె శత్రు వనితా నయనాంబు(జ) లగ్నకజ్జల
స్ఫురణదొలంగె రత్నధనపూర్ణములయ్యె మహీసురేంద్ర మం
దిరములు నాల్గు వర్ణములు తేజము నొందె స్వధర్మనిష్ఠచే
దిరుమలరాజు మేరునగధీరుడు మేలుగ రాజ్యమేలగన్'

ఇందు వత్సవాయ తిరుమలరాజు రాజ్యమేలినట్లు కలదు. రాజ్యము పేరులేదు. తిరుమలరాజు కొడుకు నాగరాజు 'మన్నెరాజపూజ్యుడు' అని, నాగరాజు కొడుకు తిమ్మరాజు 'అవని యేలె'నని రామవిలాసము నందు కలదు. అవని పేరు లేదు. అది తిరుమలరాజు రాజ్యమే అగును. తిరుమలరాజు రాజ్యము తెలుగురాయల రేకపల్లి దుర్గము కాని, రామరాజు వత్సవాయనగరము కాని అగుటకు, అవి వారికిని తిరుమలరాజునకును నడుమ ఇంచుమించు ఒక శతాబ్ది కాలము వత్సవాయ రాజవంశజులకు క్రమపరిప్రాప్తము కావలయును. అయిన తెలుగురాయ, రామరాజులు మొదలు తిరుమలరాజు వరకు వత్సవాయ రాజవంశము గురించి రామవిలాసము మౌనము వహింపవలసిన అవశ్యకము కానరాదు. అనగా తెలుగురాయల రేకపల్లి దుర్గాధిపత్యము, రామరాజు వత్సవాయ నగరాధిపత్యము వారితోనే ముగిసి, కాలాంతరమున తిరుమల రాజునకు రాజ్యప్రాప్తి కలిగినట్లు అవగాహన మగును.

ఇక పూసపాటి వారి సీసమాలికను 'పూసపాటి భీమనృపాలుని సచివుడు, దండనాథుడు అయిన దానరాజు వత్సవాయిని చంద్రవర్మచే కానుకనందె' నట్లు కలదు. 'దానరాజు' పేరు కావలసిన అవశ్యకము లేదు. అంతేకాదు. రామవిలాసములోని వత్సవాయ రాజవంశ వర్ణనము నందు దానరాజు పేరు కానరాదు. దానకర్ణుడైన రాజు దానరాజు కాగలడు. పూసపాటి భీమనృపాలుని కాలము పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధము. వత్సవాయ తిరుమలరాజు కాలము పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధము. వత్సవాయ తిరుమలరాజు 'మేలుగ రాజ్యమేలగ మహీసురేంద్ర మందిరములు రత్నధన పూర్ణము లయ్యె' నని రామవిలాసము నందు కలదు. అది చాలును వత్సవాయ తిరుమలరాజు దానరాజు అగుటకు. అంతేకాదు. వత్సవాయ తిరుమల రాజు పూర్వులకు శతాబ్ది కాలము రాజ్యములేదని రామవిలాసమును బట్టి గ్రాహ్యము. కనుక వత్సవాయ తిరుమలరాజు పూసపాటి భీమనృపాలుని సచివుడు, దండనాథుడు అగును. పూసపాటి భీమ నృపాలుడు నిడుదవోలు దుర్గాధిపతి. కనుక వత్సవాయ తిరుమల రాజు నివాసము కూడ నిడుదవోలు. అనగా వత్సవాయ నగరము పరాధీనము. అయినను గృహనామకారణము, మూలపురుష నివాస మును అయిన వత్సవాయనగరమును స్వాధీనము చేసికొనవలెనను కాంక్షకలుగుట సహజము. అది చంద్రవర్మ అధీనమైన, చంద్ర వర్మను మెప్పించి కానుక నందుట సంగతము. అది పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్ధము నందు మాత్రమే సంభవము. కనుక పూస పాటి వారి సీసమాలికలోని వత్సవాయ గృహనామ కారణము ప్రామాణికము కాదు; వత్సవాయ బహుమాన స్వీకారకాలమును ప్రామాణికము కాదు. వత్సవాయ బహుమాన స్వీకారము మాత్రము నిర్బాధకము. అంతేకాదు. 'మహీసురేంద్ర మందిర ములు రత్నధన పూర్ణములు' చేసిన దానరాజు ఉరపు వత్సవాయ తిరుమలరాజు 'వేములవాడ శ్రీ భీమనచే రామగోపాల చరితంబు గొనినమేటి' అగుట కూడ, లేదా 'వేములవాడ శ్రీ భీమమనీషిచే గోపాల చరితంబు గొనిన మేటి' అగుట కూడ నిర్బాధకము.

మొత్తము మీద పూసపాటి వారి సీసమాలికలోని దానరాజు వత్సవాయిని కానుకనందిన కాలము, దానరాజు వంశజులు వత్సవాయి వారైన వైనము యథార్థము కాదు. కథార్థము.

ఇట్లు పూసపాటి రాజవంశమూలము వత్సవాయ రాజవంశ మూలమువలె ఇతర రాజవంశ మూలములును కల పూసపాటి వారి సీసమాలిక తుదిని కర్తృకాలముల చరిత్ర కలదు. అది ముఖ్య విశేషము. ఆ సీసపాదముతోడి తేటగీతి పద్యమిది —

'అనుచు శ్రీరామచంద్రార్పణముగ ఋతు
గగనాబ్ధి చంద్ర శకంబు నందు
సరస సంగీత సాహిత్య చక్రవర్తి
రాజమార్తాండ శ్రీ తమ్మిరాజరాజ
రాచిరోజోదితంబు విభ్రాజితంబు
ధరణి వెలయుత నాచంద్ర తారకముగ'

ఇందు పూసపాటి వారి సీసమాలికను పూసపాటి తమ్మిరాజు ప్రభువు కొడుకు రాచిరాజు రచించినట్లు కలదు. అంతేకాదు 'ఋతు గగనాబ్ధిచంద్ర శకంబునందు'ను రచించినట్లు కలదు. దీనిని బట్టి రాచిరాజు కాలము శా. శ. 1406 (క్రీ. శ. 1484) అయినట్లు స్పష్ట మగుచున్నది' అని చాగంటి శేషయ్యగారి అభిప్రాయము.[11] అంతేకాదు. 'పూసపాటి తమ్మిరాజు II కొడుకు రాచిరాజు II' పూసపాటి వారి సీసమాలికను రచించెననియును చాగంటి శేషయ్య గారి సమన్వయము.[12] ఇంకా, 'పూసపాటి తమ్మిరాజు II కొడుకు రాచిరాజు II' 'నవభారత గ్రంథకర్త కాక, కృతిభర్త యైనను నీ సీసమాలికను బట్టి యాతడు కవియే యని చెప్పవచ్చును' అనికూడ చాగంటి శేషయ్యగారి నిర్ణయము.[13] కాని పూసపాటి వారి సీస మాలిక రచనాకాలము 1484వ సంవత్సరము కాదనుటకు పూసపాటి వారి సీసమాలికలోనే ఆధారము కలదు. ఆ సీసపాద మిది —

'నందేల కృష్ణ భూనాథుండు దేమపు
కొండాధిపుడు పెద్ద గోపరాజు

ఇందలి నంద్యాల కృష్ణభూనాథుడు పింగళి సూరన కళా పూర్ణోదయమునకు కృతిభర్త అయిన నంద్యాల కృష్ణమరాజు గాని, అతని జ్ఞాతికుటుంబములలోని పినతాతలు కృష్ణ భూమీరమణుడు (52 వ.) గాని, కృష్ణనృపుడు (56 వ.)గాని కావలయును. నంద్యాల కృష్ణమరాజు ప్రసక్తి 1605వ సంవత్సరము నందలి మట్ల అనంత భూపాలుని సిద్ధవట శాసనము నందు కలదు.[14]

'నందేల క్రిష్ణమ నరనాథ భయదాన
దక్షదోర్దండ విచక్షణుండు'

ఇందలి నంద్యాల కృష్ణమరాజు కళాపూర్ణోదయము కృతి భర్త నంద్యాల కృష్ణమరాజు. అతని కాలము పదునారవశతాబ్ది ఉత్తరార్ధము కంటె పూర్వము కాదు. అతని జ్ఞాతి కుటుంబముల లోని పినతాతల కాలమును పదునారవ శతాబ్ది పూర్వార్ధము కంటె పూర్వము కాదు. కనుక నంద్యాల కృష్ణభూనాథుని ప్రసక్తికల పూసపాటి వారి సీసమాలిక రచనాకాలము 1484వ సంవత్సరము కాజాలదు.

పూసపాటి వారి సీసమాలికలోని నంద్యాల కృష్ణభూనాథుని ప్రసక్తిని గమనించిన ఆరుద్రగారి అభిప్రాయ మిది[15] :

'దీనిని ఎవరో అర్వాచీనులు సృష్టించారు. ఈ సాహిత్య ఫోర్జరీని దువ్వూరి వారు (నటశ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారు) ప్రకటించారు .... ఎవరో ఎందుకో సృష్టించినదే తప్ప ఈ సీస మాలిక రాచిరాజుది కాదు. భావి పరిశోధనవల్ల ఈ ఫోర్జరీ చేసిన దెవరో బయటపడవచ్చును'.

అసలు కూటసృష్టి అన్నది వాఙ్మయరంగము నందును అనభ్యస్తవిద్య కాదు గాని, కూటసృష్టి అనుటకు నిర్ధారక సాధనము కావలయును. పూసపాటి వారి సీసమాలిక కూటసృష్టి అనుటకు, రాచిరాజు కృతము కాదనుటకు నంద్యాల కృష్ణభూనాథుని ప్రసక్తి నిర్ధారక సాధనముకాదు. అది పూసపాటివారి సీసమాలిక రచనాకాలము 1484వ సంవత్సరము కాదనుటకు మాత్రమే నిర్ధారక సాధనము.

పూసపాటి వారి సీసమాలికలోని 'ఋతుగగనాబ్ధిచంద్ర' సంఖ్య 1406 + 78 = 1484వ సంవత్సరము మాత్రమే గాక, 1706 + 78 = 1784వ సంవత్సరము కూడ అగును. చతుస్సముద్రముల వలె సప్తసముద్రములును ప్రసిద్ధము. సముద్ర సంఖ్యను నాల్గుగ పరిగణించుట బహుళమైనను, ఏడుగ పరిగణించుట శాసనము లందును విరళముగ కలదు. నంద్యాల కృష్ణభూనాథుని ప్రసక్తినిబట్టి పూసపాటి వారి సీసమాలిక రచనాకాలము 1784వ సంవత్సరము. ఆ కాలము నందు పూసపాటి తమ్మిరాజు కొడుకు రాచిరాజు కానరాడు గాని లేకపోడు. కృష్ణవిజయమును రచించిన పూసపాటి తమ్మిరాజు కాలము పదునేడవశతాబ్ది. అతని తర్వాత అతని వంశవృక్షము కానరాదు. అయినను పదునేడవ శతాబ్ది తమ్మిరాజు మనుమని పేరు ముఖల తమ్మిరాజు అగును. అతని కొడుకు పేరు రాచిరాజు కావచ్చును. అతని కాలము పదు నెన్మిదవ శతాబ్ది తుదిభాగమే అగును. అతడు పూసపాటి వారి సీస మాలికను రచించిన తమ్మిరాజు ప్రభువు కొడుకు రాచిరాజు అగును. రాజశబ్దము, రాజమార్తాండ బిరుదము వంశక్రమానుగతములైన రాజలాంఛనములు. కనుక పూసపాటి వారి సీసమాలిక రాచిరాజ కృతమే కావచ్చును. కూటసృష్టి కాకపోవచ్చును. ప్రాచీనము మాత్రము కాదు. అర్వాచీనమే. నంద్యాల కృష్ణభూనాథుని ప్రసక్తి తదర్వాచీనతకు తార్కాణము. వత్సవాయ రాజవంశ మూల విసరములోని కథార్థము తదుపజలకము. పూసపాటి రాజవంశమూల వివరములోని చరిత్రాభాసము తన్నిర్ధారకము.

1784వ సంవత్సరము రచనాకాలముగు పూసపాటి వారి సీసమాలికను 1327 - 1400 సంవత్సరములు జీవితకాలమైన వేములవాడ భీమకవి రామగోపాలవిలాసము లేక గోపాలవిలాసమును రచించి, వత్సవాయ తిరుమలరాజునకు అన్వయించు దానరాజునకు అంకిత మిచ్చిన అంశమును సంశయమును కలిగించునది. కాని, వేములవాడ భీమకవి విశాఖమండల కవిగ 'విశాఖపట్నం డిస్ట్రిక్టు మాన్యుయల్' అను గ్రంథము నందు కలదు. అది విశాఖ మండల వ్యవహారమును బట్టి డి. యఫ్. కార్మికల్ 1865వ సంవత్సరము నందు ప్రకటించిన విషయము. ఇది పూర్వోక్తము. వేములవాడ భీమకవి కళింగ గంగుమీద చెప్పినచాటు పద్యములును వేములవాడ భీమకవికి కళింగ దేశమునకు గల సంబంధమును చాటునవి. విశాఖమండలము కళింగదేశములోనిది. కనుక వేములవాడ భీమకవి రామగోపాల విలాసము లేక గోపాలవిలాసము 1865వ సంవత్సరమునకు పూర్వము విశాఖమండల వ్యవహార ప్రసిద్ధము కావచ్చును. అది 1784వ సంవత్సరము నందు పూసపాటి వారి సీసమాలికను పూసగ్రుచ్చిన విషయమగుట నిరాఘాటము.

మొత్తము మీద పూసపాటి వారి సీసమాలిక పూసపాటి తమ్మిరాజు కొడుకు రాచిరాజు రచించినది కావచ్చును. రచనా కాలము 1484వ సంవత్సరము కాదు. 1784వ సంవత్సరము. అందలి మాధవవర్మ కాలము, మాధవవర్మ పూసపాడు పురనిర్మాణాదికము ప్రామాణికములు కాదు. దానరాజు వత్సవాయిని దానమందిన కాలము,దానరాజువంశజులు వత్సవాయివారైనవైనమునుప్రామాణికములుకాదు. దానరాజు అనదగిన వత్సవాయ తిరుమలరాజు వేములవాడ భీమకవి రామగోపాల విలాసములేక గోపాలవిలాసమునకు కృతిభర్త కావచ్చును. అతడు పూసపాటి రాజవంశ ముఖ్యపురుషుడు, నిడుదవోలు దుర్గాధిపతియును అగు భీమరాజునకు సచివుడు, దండనాథుడు కావచ్చును. ఆభీమరాజు మైలమభీమన అగును. అదిమఱొకవ్యాసము.

సూచికలు

1. సమగ్ర ఆంధ్రసాహిత్యం, మొదటి సంపుటం, పుటలు 207-8
2. ఆంధ్ర విజ్ఞానము, సంపు.5, పుటలు 2701-3
3. చాటుపద్య మణిమంజరి - ద్వితీయ భాగము, పుటలు 76,77
4. ఆంధ్రుల చరిత్రము - ద్వితీయ భాగము, ప్రథమ ముద్రణ, పుటలు 141-2
5. తెలుగు విజ్ఞాన సర్వస్వము, మూడవ సంపుటము, పుట 120
6. భారతి - సంపుటి 26, సంచిక 3, పుటలు 137-9
7. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - మొదటి సంపుటం, పుటలు 208-9
8. ఆంధ్రుల చరిత్రము - ద్వితీయ భాగము, ప్రథమముద్రణ, పుటలు 253-5
9. పైది, పు. 255
10. ఎ. ఆంధ్ర కవుల చరిత్ర - ద్వితీయభాగము, పు.
10. బి. ఆంధ్ర కవితరంగిణి - పండ్రెండవ సంపుటము, పుటలు 159-60
11. ఆంధ్ర కవితరంగిణి - 8వ సంపుటము, పుటలు 59-60
12. పైది, పు. 58-9
13. పైది, పు. 65
14. శాసన పద్యమంజరి - ప్రథమ భాగము, పుటలు 108-10
15. సమగ్ర ఆంధ్ర సాహిత్యం- పెండెండక సంపుటము, పు. 282

గాయం

శ్రీ కె. శివారెడ్డి

ఇప్పటికీ రాత్రులు నిదరమధ్యలో ఉలిక్కిపడిలేస్తుంటాను
పొడుగాటి నాలుకతో గాయాల్ని నాక్కుంటూ
కూర్చుంటాను
అటుగా నడచి వెడుతున్న రోడ్డు కరుస్తుంది
షాపుల ముందు వరండాలు కరుస్తాయి
పబ్లిక్‌గార్డెన్‌లో చెట్లనీడలూ
పగటి చీకట్లూ రాత్రి వెన్నెల క్రీనీడలూ కరుస్తాయి.

గాయాలు మానవు
కొత్తగా నెత్తురులోడుతూ చెక్కుగడుతూ
చెక్కు లేచిపోతూ రక్తాలోడుతూ
పొద్దు గూకబోయే ముందటి ఆకాశమంత పచ్చగా
కావుర్లు గమ్ముతూ వుంటాయి.

గాయాలు మానవు
పొడవాటి జీవితమంత నాలుకతో
నాక్కుంటూ కూర్చుంటాను
అమ్మా నాన్నల్ని అంటానికి వీల్లేదు
పక్కింటి కుర్రాణ్ణి అంటానికి వీల్లేదు
ఆకల్ని అణగారిన కోర్కెల్ని
అమ్మినవాణ్ణి కొన్నవాణ్ణి - ఎవణ్ణీ అంటానికి వీల్లేదు

మంచాల నులకనీ నేలమీద చాపనీ
వంటిమీద వంటినీ
కళ్ళ కత్తుల్ని చేతుల ఊబుల్ని
లంగాలమీద మరకల్ని
యమ్. ఎల్. ఎ. క్వార్టర్స్‌నీ - పోలీస్‌స్టేషన్స్‌నీ
పదిరూపాయలు ఫైనేసి చేతులు దులుపుకునే
న్యాయస్థానాల్నీ
దేన్నీ అంటానికి వీల్లేదు_

ఆఖరికి నాలో అభివృద్ధి చెందుతున్న
సవాలక్ష రోగక్రిముల్ని కూడా అంటానికి వీల్లేదు_
ఎవడి రక్షణలో వాడున్నాడు
ఎవడి నీతులూవాడికే - ఎవడి కవచాలూవాడికే
ఎవడి ధర్మకాటాలూ వాడికే - ఎవడి కళ్ళూ వాడికే
ఎవడి కళ్ళచూపుల ప్రపంచమూ వాడికే
ఎవడి జాగ్రత్తలో వాడున్నాడు
ఎవడి రక్షణలో వాడున్నాడు

ఇక్కడ
గాయాల్చెయ్యటమూ నీతే
గాయాల్ని పచ్చగా పెంచటమూ నీతే
మానుతున్న గాయాల్ని పుల్లలతో పొడవటమూ నీతే_
ఇప్పటికీ రాత్రులు నిదరమధ్యలో ఉలిక్కిపడి లేస్తుంటాను
పొడవాటి నాలుకతో గాయాల్ని నాక్కుంటూ
కూర్చుంటాను.

మొన్న యిటే యిటే ఈ రోడ్డంటే ఇందిరాగాంధీ వెళ్ళింది
నేను ఇక్కడేఇక్కడే యిలానేయిలానే పడిపోయివున్నాను
గాయపడి వున్నాను_

రోజూ యిటు ఏ కవో రచయితో కళాకారుడో
వేదాంతో భక్తుడో మంత్రో ముఖ్యమంత్రో
ఆఫీసరో ప్యూనో ఎవరో ఒకరు వెళ్తూనే వుంటారు_
రోజూ యిటు ఆవులూ గేదెలూ బస్సులూ లారీలూ
కుక్కలూ పందులూ గాడిదలూ వెళ్తూనే వుంటాయి
నేను యిక్కడే మెట్లపక్కనే దుమ్ములో
చీకట్లో పేలికల్లో పొడవాటి దరిద్రం నాలుకతో
గాయాల్ని నాక్కుంటూ కూర్చుంటాను.

తెలుఁగుపాట

శ్రీ మంగిపూడి వేంకటశర్మగారు

తెలుఁగు నుడి కారంపు సొంపును
తెలుఁగుకైతల తియ్యఁదనమును
తెలుఁగుపలుకుల కలికిపెంపును
తెలిసి పాడవె భారతీ! ౧

తెనుగుఁబాసకు తొలకరింపఁగ
తెనుఁగురచనలు పల్లవింపఁగ
తెనుఁగు మనములు పులకరింపఁగ
మొనసి పాడవె భారతీ! ౨

నవరసంబులు పొంగి పొరలఁగ
నవ్యభావము లుల్లసిల్లఁగ
నవనవోన్మేషము చెలంగఁగ
తవిలి పాడవె భారతీ ౩

తెలుఁగుభాగ్యరమావిలాసము
తెలుఁగునాఁడుల భోగమహిమము
తెలుఁగురాజుల రాజ్యవిభవము
చెలఁగి పాడవె భారతీ ౪

తెలుఁగుకోటల తెలుఁగుపేఁటల
తెలుఁగు తోఁటల తెలుఁగుపాటల
తెలుఁగు మాటల సోయగంబులు
తెలిసి పాడవె భారతీ! ౫

వేఁగి నగరపు ప్రాభవంబును
విజయనగరపు వైభవంబును
బాగు మీఱెడు పంచమస్వర
భణితిఁ బాడవె భారతీ! ౬

రాణ గల శ్రీకాకుళోన్నతి
రాణ్మహేంద్రపురంబు కీరితి
పోణి గల పెనుగొండ పురముల
పొలుపు పాడవె భారతీ ! ౭

ధరణికోట యశోవిశేషము
ధన్యకటకము ధాన్యకటకము
సిరులు మించిన సింహనగరము
చెలువు పాడవె భారతీ! ౮

కొండవీడు పరాక్రమము గో
ల్కొండ గన్న యఖండభాగ్యము
కొండపల్లి యశంబు దిక్కులు
నిండఁ బాడవె భారతీ! ౯

ఓరుగల్లు పరాక్రమంబును
పేరుగల పల్నాటివీర్యము
వీరబొబ్బిలి వింతశౌర్యము
కేరి పాడవె భారతీ! ౧౦

విష్ణువిక్రము శాలివాహను
విష్ణుదేవుని విష్ణువర్ధన
కృష్ణరాయల రాజరాజుల
కీర్తిఁ బాడవె భారతీ! ౧౧

తెలుఁగురాజ్యపురమను తెలుఁగుల
పలుకుచెలి తంజామునం దిడి
యలరిచిన రఘునాథరాయల
యశము పాడవె భారతీ! ౧౨

రెడ్డిరాజుల పౌరుషంబును
దొడ్డవెలమల సాహసంబును
గడ్డుమగలగు రాచబిడ్డల
కడిమిఁ బాడవె భారతీ! ౧౩

కమ్మదొరల యశః ప్రభావము
కాపువీరుల ఘన ప్రతాపము
కుమ్మరాదుల క్షాత్రతేజము
కోరి పాడవె భారతీ! ౧౪

---

౮ సింహనగరము = నెల్లూరు ౧౧ విష్ణుదేవుడు - ఆంధ్ర విష్ణువు అను ఆంధ్రనాయకుడు. రాజరాజు - రాజనరేంద్రుడు ౧౨ తంజాము= అందలము, తంజావూరు.

గండు మిగిలిన శత్రుశూరుల
గుండెలను నిర్దించినట్టి య
ఖండుఁడగు తిమ్మరుసు బుద్ధుల
కొండఁ బాడవె భారతీ! ౧౫

ఇదిగో! ఢిల్లీశ్వరునిఁ గొనిపో
యెద నటుంచును చాటి చెప్పుచు
చదురుచేసిన చిత్రచర్యల
సచివుఁ బాడవె భారతీ! ౧౬

పండితుండై యాజియై యు
ద్దండకవియై మంత్రిమణియై
దండిగాయకుఁడై చెలంగిన
ధన్యుఁ బాడవె భారతీ! ౧౭

కావ్యతిక్కన కలముపోడిమి
ఖడ్గతిక్కన కత్తివాఁడిమి
దివ్య లక్కణ మంది మెచ్చఁగ
తీర్చి పాడవె భారతీ! ౧౮

కడిఁదిశత్రువు లెత్తివచ్చిన
కరుకు పద్దెము లంపి సిగ్గున
వెడలఁజేసిన కైత పెద్దల
నుడులు పాడవె భారతీ! ౧౯

భాగవతసత్తములు పోతన
త్యాగరాయల రామదాసుల
భాగధేయంబైన భక్తిని
తోగి పాడవె భారతీ! ౨౦

రెడ్డి వేమనయోగి చెప్పిన
దొడ్డవేదాంతముల భావము
దెలిపి తెనుంగుపడుచుల
జడ్డుఁ బాపవె భారతీ! ౨౧

పోటి యెఱుఁగని వేదగానము
సాటి మించిన శాస్త్రజ్ఞానము
మేటిచిత్ర కళాభిమానము
చాటి పాడవె భారతీ! ౨౨

తెలుఁగునౌకల నెక్కి మిక్కిలి
తెలివి మెఱయఁగ నెల్లసీమల
మెలఁగి చెలఁగిన నగరలక్ష్ముల
మేలుపాడవె భారతీ! ౨౩

వ్యాస కుంభజులకు శరణ్యము
వాస మల దక్షునకు మోక్షపుఁ
గోశమగు దక్షపురి మహిమము
కొసరి పాడవె భారతీ! ౨౪

నవ్యమతి భవభూతి విద్యా
నాథ సుకవుల భావబంధుర
దివ్యకావ్య రసామృతము రుచి
తెలిసి పాడవె భారతీ! ౨౫

రాజవీధులు వేదవిద్యా
రణ్యములలోఁ దీరిచిన బుధ
రాజు సచివులరాజు శ్రీయతి
రాజుఁ బాడవె భారతీ! ౨౬

ఆనాటి తెలుగు పాట 'భారతి' మాసపత్రిక ప్రారంభ సంచిక రుధిరోద్గారి సంవత్సరము పుష్య మాసము(1924 సం॥ జనవరినెల)లో వెలువడింది. అంటే భారతి మొదలై మొన్న జనవరికి 58 సంవత్సరాలైంది. దాదాపు ఆరు దశాబ్దాలుగా తెలుగు భాషకి, విమర్శకు, పరిశోధనకు భారతి చేసిన కృషి అద్వితీయం-అపూర్వం. భారతదేశంలో భారతి లాంటి సాహిత్య - పత్రిక మరే భాషలోను లేదేమో ?

ఈనాటి వరకు కవులు, రచయితలు, విమర్శకులు, పరిశోధకులు భారతిలో తమ రచనలు ప్రచురింపబడటం గర్వకారణంగా భావిస్తారు.

భారతి ప్రారంభసంచికలో మొదటి పేజీలో గాంధిశతకము నుంచి కొన్ని పద్యాలు ప్రచురించారు. ఈ శతకకారుని పేరు కీ॥శే॥ మంగిపూడి వేంకటశర్మగారు.

---

౧౬. యుగంధరమంత్రి. ౧౭. తంజావూరు నందున్న గోవిందదీక్షితులు. ౧౯. అల్లసానిపెద్దన. ౨౩. మోటుపల్లి మొదలగునవి. ౨౬. విద్యారణ్యస్వామి.

ఈయన ప. గో. జిల్లా పిప్పరనివాసి. జాతీయ భావం కల్గిన సంఘ సంస్కర్త. శ్రీయుతులు దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, కొండా వెంకటప్పయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ముట్నూరి కృష్ణారావు, స్వామి సీతారాం, పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం, హరిసర్వోత్తమరావుగార్లతో శర్మగారికి సన్నిహిత సంబంధాలుండేవి. వారందరికీ శర్మగారిపై మంచి అభిమానం వుండేది.

బాలవితంతు విలాపము, నిరుద్ధభారతం, గాంధి శతకము (పద్యకావ్యాలు) వీరమతి, కృష్ణవేణి (నాటకములు), రాజలేఖ, లలిత (నవలలు) ద్రౌపదీదేవి చరిత్ర ఈయన రచనలలో కొన్ని.

శర్మగారు 1882లో జన్మించారు. అంటే మనం ప్రస్తుతం ఆయన శత జయంతి సంవత్సరంలో ఉన్నాం.

తెలుగుజాతి మర్చిపోయిన మహాకవులలో శర్మగారు ఒకరు. 1932లో హరిజనుల సమస్యపై, అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన రచించిన పద్యకావ్యమే 'నిరుద్ధభారతం' (దీనికి కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ముందుమాట రాశారు.)

భారతి ప్రారంభసంచికలో (పుట 7,) భారతి ఆగమనాన్ని ఆహ్వానిస్తూ శర్మగారు తెలుగు పాట రాశారు.

ఈమధ్య భారతి ప్రచురణ కొన్ని నెలలు నిలిచిపోతే కవులు, రచయితలు, విమర్శకులు, సాహితీ పిపాసకులు ఎంతోమంది బెంగపడ్డారు. మళ్ళీ కొద్దినెలలుగా భారతిప్రచురింపబడటం అందరికీ ఆనందకారణమయ్యింది. భారతి పునరాగమనాన్ని పురస్కరించుకుని, మంగిపూడి వేంకట శర్మగారి శత జయంతిని పురస్కరించుకుని 'తెలుగుపాట'ను మనం మననం చేసుకోడం ఎంతైనా మంచిదనుకుంటాను.

శ్రీ వీరభద్రరావు పమిడ్మి



శ్రీ బి. జనార్ధన్‌రావు, శ్రీ జి. సితంబరస్వామి, శ్రీమతి జి. వినోద

వెదురు కార్మికులు - సమస్యలు

దేశ ఆర్థికాభివృద్ధిలో ఉత్పత్తి కారకాలయిన, భూమి, ప్రకృతి సంపద, మానవశక్తి, సాంకేతిక పరిజ్ఞానము మొదలగు అనేక అంశాలతోపాటు పారిశ్రామికీకరణ కూడా ప్రముఖపాత్ర వహిస్తుంది. పారిశ్రామికీకరణలో భారీ పరిశ్రమలు ఎంత ప్రాముఖ్యం వహిస్తాయో, చిన్నతరహా కుటీరపరిశ్రమలు కూడా అంతే ప్రాధాన్యత వహిస్తాయి. జపాన్, స్విట్జర్లాండు, చైనా వంటి దేశాలలోని ఆర్థిక వ్యవస్థలో కుటీరపరిశ్రమలు గణనీయమైన పాత్ర వహిస్తున్నాయి. అదే విధంగా భారతదేశము చేతి వృత్తులకు చారిత్రకంగా ప్రసిద్ధి వహించినటువంటిది. నేత, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, మున్నగు అన్ని చేతివృత్తులపై భారత దేశంలో గణనీయమైన, జనాభా ఆధారపడి జీవించుచున్నారు.

అనేక చారిత్రక కారణాలవల్లనైతేనేమి, పెట్టుబడిదారీ ధోరణులు ప్రబలడం వల్లనైతేనేమి, దాని ఫలితమైన "పోటీ మార్కెటు" విజృంభించడం వల్లనైతేనేమి కుటీరపరిశ్రమలు తీవ్రమైన తాకిడికి గురి అవుతున్నాయి. నాణ్యతలో, పెట్టుబడిలో, ముడిసరుకు లభ్యంలో పెద్దపరిశ్రమ ఉత్పాదక వస్తువులచే మార్కెటుపై ఆధిపత్యం వహించినందువల్ల వాటితో పోటీపడలేక పోవుచున్నాయి. పోటీ మార్కెటు వ్యవస్థలో ఉన్న చేపను పెద్ద చేప మింగివేసినట్లుగా, స్థానిక పరిశ్రమలను పెట్టుబడిదారీ భారీ పరిశ్రమలు క్రమేపి మింగివేయడం స్వాభావికంగా జరుగుతుంది. దానికి కారణం ఆర్థిక వ్యవస్థపై ప్రైవేటు పెట్టుబడిదారుల ఆధిపత్యమే. ఎప్పుడైతే ప్రైవేటు పెట్టుబడి మార్కెటులో అధికమవుతుందో స్వాభావికంగానే లాభాశయం ప్రధాన ధ్యేయమవుతుంది. ముడిసరుకుపై గుత్తాధిపత్యం వహించి (ఫలితంగా స్థానిక పరిశ్రమలకు ముడిసరుకు లభ్యం కష్టమవుతుంది) ద్రవ్యం పెట్టుబడిచే దానికి నగిషీలు చెక్కి దానికి అంతకు అంత లాభాలు ఆర్జించడం జరుగుతుంది. అందువల్ల పై విధమైన పెట్టుబడులు పెట్టలేక పోటీకి తట్టుకోలేక ముడిసరుకుపై నియంత్రణను కోల్పోయే క్రమంలోనే కుటీరపరిశ్రమలు ప్రైవేటు పెట్టుబడిదారుని దయాదాక్షిణ్యాలపై ఆధారపడవల్సివస్తుంది. ఈ క్రమంలోనే కుటీర పరిశ్రమలు తమ 'స్వయం ఉత్పాదకశక్తి'ని కోల్పోయి అనేకమైన ఇబ్బందులకు గురికావల్సివస్తుంది. అట్లా అనేక సమస్యలకు గురి అయ్యే కుటీర పరిశ్రమలలోనే ఒకటి వెదురు పరిశ్రమ. దానిపైన ఆధారపడి జీవిస్తున్న వారే వెదురు కార్మికులు.

పై అంశాన్ని దృష్టియందుంచుకొని ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలోని వెదురు పరిశ్రమ స్థితిగతులను దానిపై ఆధారపడి జీవిస్తున్న వెదురు కార్మికులను గురించి తెల్పడానికి ప్రయత్నించినాము. అందువల్ల ఈ వ్యాసము పూర్తిగా మేదరి వృత్తి కార్మికులకు సంబంధించినది. అదే ఉద్దేశముతో వారియొక్క కుటుంబవివరాలను అక్షరాస్యత స్థాయిని సామాజిక పూర్వాపరాన్ని నివాస స్థితిగతులను ఈ వ్యాసరచనలో వివరించినాము. ఇందుకుగాను తెలంగాణా ప్రాంతంలోని, కరీంనగర్ జిల్లాలోని స్థానికంగాను, చుట్టు పట్ల ఉన్న మేదరి వృత్తికార్మిక కుటుంబాలను అధ్యయనమునకు క్షేత్ర ఆధారముగా తీసుకోవడమైనది.

వ్యాస ద్వితీయ భాగములో ఈ వృత్తిలో ఇమిడి ఉన్న అనేక సమస్యలను వివరించడమైనది. ఆయా సమస్యలపై అభ్యర్థుల అభిప్రాయములు క్రోడీకరించి తెల్పినాము. సమస్యలలో ముఖ్యంగా ముడిసరుకు లభ్యం, సరఫరా రీతి, ప్రభుత్వపాత్ర సహకార సంఘాల వైఖరి - పనితీరు, వాణిజ్య బ్యాంకులపాత్ర మార్కెటు సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, నానాటికి కృంగి పోతున్న వారి ఆర్థిక జీవనము ఫలితంగా సంభవించే 'వలసలు మున్నగు సమస్యల గురించి చర్చించడమైనది.

పై రెండు భాగాలలో వెలువడిన వాస్తవాలు మరియు వెలిబుచ్చిన అభిప్రాయాల ఆధారంగా కుటీరపరిశ్రమల భవిష్యత్తు, దానితో ముడిపడి ఉన్న మేదరి వృత్తికార్మికుల 'ఉనికి'ని క్లుప్తంగా వివరిస్తూ పోటీ మార్కెట్టులో ప్రైవేటు పెట్టుబడి ఆధిపత్యం వహిస్తున్న సమాజంలో ప్రభుత్వరంగం కుటీరపరిశ్రమలకు తగిన ప్రోత్సాహం ఇస్తున్నట్లు అయితే ఎంతవరకు ఈ వృత్తికార్మికులు తమ "స్వయం ఉనికి"ని నిలబెట్టుకుంటారన్న అంశాన్ని చివరగా చర్చించడమైనది.

పరిశోధక అంశం వివరణ

పరిశోధనాంశ ప్రాంతమైన కరీంనగర్‌జిల్లా తెలంగాణ ప్రాంతములో నున్న 10 జిల్లాలలో ఒకటి. 11824 చదరపు కిలోమీటర్లతో 1087 పల్లెలతో 11 పట్టణ ప్రాంతాలతో 19,13,928 మంది జనాభాను కల్గియున్న కరీంనగర్‌జిల్లా ప్రముఖ పారిశ్రామిక జిల్లాకూడా. ఇచ్చట వ్యవసాయం ప్రధానవృత్తి. జిల్లాలోని విద్యా

వ్యాపకులు 3,00,660మంది. ఈ జిల్లాలో వివిధ వాణిజ్య బ్యాంకులు ఉన్నాయి. వివిధ వృత్తులకు సంబంధించి 1,46,274 మంది కలరు. వివిధ వృత్తులలోనే ఒకరు మేదరివృత్తి కార్మికులు. వీరిసంఖ్య 1,320. వీరు 320 సహకార సంఘాలుగా ఏర్పడినారు. పై విధంగా ఉన్న ఈ వృత్తి కార్మికుల సంఖ్యలో కరీంనగర్ స్థానిక ప్రాంత మందు తాలూకా పరిసరాల్లో ఉన్న 6 గ్రామాల్లో ఏర్పడిన 6 మేదరి సహకారసంఘాల్లో గల సభ్యులు మాత్రమే గాక స్థిర నివాసం ఏర్పరచుకొని ఈ వృత్తిపై జీవనం గడుపుచున్న వారితో కల్పి మొత్తం 272 కుటుంబాలలో 163 కుటుంబాలనుండి వివిధ అంశాలపై అభిప్రాయ సేకరణ చేయడమైనది.

పరిశీలించిన గ్రామాలు – కుటుంబాల వివరణను ఈక్రింది పట్టికలో వివరించినాము.

క్రమ సంఖ్య	ప్రాంతాలపేర్లు	స్థానికంగా నివసించే మేదరి వృత్తి కుటుంబాలు	పరిశీలన గావించిన కుటుంబాల సంఖ్య
1	కరీంనగర్	210	110
2	జమ్మికుంట	13	10
3	హుజూరాబాద్	10	9
4	హుస్నాబాద్	2	2
5	గోపాల్‌పూర్	2	2
6	ముత్తారం	2	2
7	సుందరగిరి	8	8
8	మొట్టపల్లి	7	7
9	[illegible]లంగూర్	6	3
10	బెజ్జంకి	10	10
	మొత్తం	272	163

ఈ క్షేత్ర అధ్యయనంలో అదనంగా రెండు పరిశోధనా పద్ధతులను అవలంబించడం జరిగింది. ఒకటి తయారు చేసిన ప్రశ్నావళి, రెండవది పరిశోధకుల వ్యక్తిగత పరిశీలన. అట్లాగే ఆయా సంబంధిత అధికార కార్యాలయాల్లో వ్యాస అంశానికి సంబంధించిన సమాచార సేకరణ గావించినాము. అవసరమైన చోట అధికారులతో చర్చలు కూడా జరిపినాము.

వయస్సు వివరాలు

వివిధ గ్రామాల్లో ఉన్న అభ్యర్థుల వయస్సు వివరాలు పరిశీలించినట్లు అయితే ఈ క్రింది విధంగా ఉన్నాయి. మొత్తం 163 మందిలో 46–50 వయస్సులో అత్యధికులు ఈ వృత్తిని చేపట్టిన వారిలో ఉన్నారు. 36–40 ప్రాయపు వారు రెండవ స్థానము ఆక్రమించారు. తరువాత క్రమంలో 31–35 ప్రాయపు వారు రాగా 20–25 సం॥ లోపువారు తదుపరి స్థానము ఆక్రమిస్తారు. ఈ వృత్తిలో పని చేస్తున్న వారి సరాసరి సంఖ్య చూసినట్లు అయితే ఎక్కువగా నడివయస్కులు పనిచేస్తున్నట్లుగాను, తరువాత వారు యువవయస్కులు స్థానాన్ని కల్గి యున్నట్లు గాను తెలుస్తుంది. అంటే ఈ పనిలో కావల్సిన శారీరక శ్రమ అవసరం వల్లనూ, విపరీతమైన ఓపిక, కష్టనష్టాలు భరించే శక్తి కల్గియుండే వయస్సు వారు మాత్రమే ఈ పనిని చేపట్ట వల్సి యుంటుందని పై వాస్తవాలు తెల్పుతున్నాయి. తత్ఫలితంగా అటు పూర్తి బాల కార్మికులు ఇటు వృద్ధ కార్మికుల పాత్ర ఈ పరిశ్రమలలో తక్కువగా ఉన్నట్లుగా చెప్పవచ్చును.

ఈ వృత్తిలో పని చేస్తున్న వారు సాధారణంగా నిరక్షరాస్యులే. ఎక్కడో, ఒకచోట కొందరు ప్రాథమిక, మాధ్యమిక విద్య నభ్యసించిన వారు కన్పిస్తారు. దీనికి నిదర్శనంగా 163 కుటుంబాల పరిశీలనలో 11 మంది మాత్రమే అక్షరాస్యులుగా, మిగతా 152 మంది నిరక్షరాస్యులుగా తేలినది. ఉన్నత విద్యను అభ్యసించినవారు ఇద్దరు మాత్రమే కాగా, ఐదుగురు మాధ్యమిక విద్య, 4 గురు ప్రాథమిక విద్యనభ్యసించినట్లుగా వెల్లడయింది. ఈ అభ్యర్థుల తల్లితండ్రుల విద్యావివరాలను ప్రశ్నించగా కేవలం ఇద్దరు మాత్రమే అక్షరాస్యులని, 161 మంది నిరక్షరాస్యులని తేలినది. అంటే ఒక తరంలో ఉన్న నిరక్షరాస్యత ప్రభావం తరువాత తరంలో కూడా ఉండి పెద్దమార్పు వచ్చినట్లుగా కూడా కన్పడదు. నిరక్షరాస్యతకు గల కారణాలను చెప్పుతూ తల్లితండ్రుల అశ్రద్ధ, గ్రామీణ ప్రాంతాలలో ఉండటంవల్ల విద్యాసౌకర్యాలు అందు బాటులో లేవని, ఆర్థికంగా వెనకబడిన తనం, చిన్నతనంలోనే వృత్తిలోనే చేరవల్సి వచ్చినందువలన తాము విద్యను అభ్యసించే అవకాశం కలుగలేదని తెల్పినారు. పై రెండు తరాల వారిగానే గాక అభ్యర్థుల పిల్లల విద్యాస్థాయి కూడా ఆశాజనకంగా లేదు.

163 కుటుంబాలలో ఉన్న 600 మంది పిల్లలు విద్యను అభ్యసించుచున్నట్లుగా వెల్లడయింది. వీరిలో ఒకరు ఎమ్. బి. బి. ఎస్.లో ఉండగా 55 మంది 1-7 తరగతి వరకు, 10 మంది పిల్లలు 8 నుండి 10 వరకు, ఇద్దరు మాత్రం ఇంటర్ మీడియట్ వరకు చదువుతున్నారని మాత్రం వెల్లడయింది. వీరిలో 37 మంది ప్రైవేటుపాఠశాలలో విద్యనభ్యసించు చున్నారు.

అట్లాగే మీపిల్లల విషయంలో మీరు ఏమి ఆలోచిస్తున్నారు అన్న ప్రశ్నకు బహిర్గతమైన కొన్ని అంశాలు కూడా గమనింప తగినవి. 163 కుటుంబాలలో 35 కుటుంబాలు తమ పిల్లలను ఈ వృత్తికి సంబంధం లేని వ్యాపారానికి మార్చాలని అభిప్రాయ పడినారు. వారు పై చదువులు చదివించాలని, ప్రభుత్వ ఉద్యోగాలలో ప్రయత్నం చేయాలని 21 కుటుంబాల వారు, కులవృత్తిని అభివృద్ధి చేసుకోవాలని, చదివించడానికి తగిన ఆర్థిక స్తోమత లేదని మిగిలిన 84 కుటుంబాలవారు భావించగా, 23 కుటుంబాలవారు ముందు ముందు పై చదువులకు వీలుంటే పంపిస్తామని భావించారు. ఈఅభిప్రాయములను పరిశీలించినట్లు అయితే తమ పిల్లలను పై చదువులకు పంపించాలని ఉన్నప్పటికిని కూడా తగిన ఆర్థికస్తోమత లేక అత్యధికులు విద్యావకాశాన్ని తమ పిల్లలకు సమకూర్చుకోలేక పోవుచున్నారని భావించవచ్చు. పైవిద్యాస్థితిగతులు మాత్రమే కాకుండా పరిశీలనలో బయల్పడిన ఈ వృత్తి కార్మికుల జీవన పరిస్థితులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

జీవన పరిస్థితులు

ఈ జిల్లాలోని ఆయా ప్రాంతాలలో స్థిర నివాసం ఏర్పరచుకొని ఈ వృత్తిని చేపట్టిన 163 కుటుంబాలవారు మేదరి వారే. ఈ వృత్తిని అభివృద్ధి చేసుకొనుటకై ఇతర ప్రాంతాలనుండి ఈ జిల్లాకు తరలి వచ్చిన వారు ఇప్పుడిప్పుడే స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఇక వీరి కుటుంబాలలో సాధారణంగా పిల్లలు సగటున 4 గురు కన్పిస్తుంటారు. వీరిలో ఆడపిల్లల శాతం 60% కలదు. ఆర్థికంగా వెనుకబడిన వీరు, చేపట్టిన వృత్తిలో అధిక రాబడి లేక కుటుంబభారం బాధ్యత మరింత పెరిగిపోతున్నదని, అందువల్ల తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొనలేక పోతున్నామని 104 కుటుంబాలు వెల్లడించడం జరిగింది. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగుటచే కుటుంబభారంబాధ్యతమరింత పెరుగుతున్నదని వీరు తమ వృత్తికి చేదోడు వాదోడుగా నిలుచుట లేదని తెలియజేశారు.

ఈ కుటుంబాలలో ఆడ పిల్లలు సాధారణంగా పెళ్ళి అయిన పిమ్మట అత్తవారింటికి వెళ్ళిపోవడం వల్ల, మగపిల్లలు పనికి అందిరాక పోవడం వల్ల ఈ కుటుంబాలు అధిక సంఖ్యలో పేదరికంతో బాధపడుతున్నట్లుగా తెలుస్తుంది. వీరి నివాస స్థితి గతులను పరిశీలించి చూస్తే, 163 కుటుంబాలలో, 94 కుటుంబాలు పూరి గుడిసెల్లో నివాసం చేస్తున్నారు. 25 కుటుంబాలు పట్టణ ప్రాంతాల యందు, పురపాలక సంఘ స్థానాలలో గుడిసెలు నిర్మించుకొని స్థలానికి నెలసరి కొంత అద్దె చెల్లించుచూ జీవనం గడుపుచున్నారు. 40 కుటుంబాలు స్వంత గూనపెంకు ఇంటిలో నివసిస్తున్నారు. వీరు స్థానిక కరీంనగర్ ప్రాంతాలలో, జమ్మికుంట ప్రాంతాలలో ఉంటున్నారు. ఇకస్వంత కాంక్రీటు ఇండ్లలో నివసిస్తున్నవి కేవలం ఆరు కుటుంబాలు కలవు. పై అంశాన్ని పరిశీలించినపుడు అనేక మంది ఈ వృత్తిలో కనీసం గృహవసతి లేక బాధపడుతున్నట్లుగా భావించవచ్చు. అంతంత మాత్రమే వచ్చే ఆదాయాలలో ఉన్న వానికి ఇంటి అద్దె గోరు చుట్టుపై రోకటి పోటు లాంటిదే అవుతుంది. అట్లాగే ఆరోగ్య సౌకర్యాల గురించి అడిగినపుడు 163 కుటుంబాల్లో జబ్బుపడిన రోజుల్లో 56 కుటుంబాలు ప్రభుత్వ దవాఖానాకు, మిగిలిన 107 కుటుంబాలు ప్రైవేటు దవాఖానాలకు వెళతామని వెల్లడి చేసినారు. పై 163 కుటుంబాలలో 25 కుటుంబాల వారు కులవృత్తిని వదిలి చిన్న వ్యాపారములను ప్రారంభించాలని అనుకుంటున్నారు. ఇక మిగిలిన 138 కుటుంబాలలో 21 కుటుంబాలు వ్యవసాయాన్ని అదనపు ఆధారంగా చేసుకొని ఉండాలని భావించగా మిగిలిన 117 కుటుంబాలు వేరే వృత్తి లేక దీని పైన జీవించక తప్పదని భావిస్తున్నారు.

ఈ వృత్తినే ఎందుకు చేపట్టవలసి వచ్చింది అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, ఈ వృత్తిని చేపట్టుటకు చెప్పుకోదగిన పెట్టుబడితో ప్రసక్తి లేదని, ఇన్ని రోజులుగా తమ వంశపారంపర్యంగా వస్తుంటున్న అభిమానం. కుటుంబ కారణాలవల్ల చదువు మానివేయవల్సి వచ్చిందని ఫలితంగా ఏ ఉద్యోగం దొరకడం కష్టమని అందువల్ల ఈ వృత్తిపై బ్రతకడం నిర్బంధం అయిపోయిందని తెల్పినారు. కులవృత్తిపై సంతృప్తిని గురించి ప్రశ్నించగా 25 కుటుంబాలు కొన్ని అంశాలపై వారి సమాధానములు వివరించలేదు, ఎందుకంటే వారు త్వరలోనే ఈ వృత్తిని వదిలిపోతున్నామని చెప్పడం వల్ల. 138 కుటుంబాలలో 17 మంది సంతృప్తి ప్రకటించగా 115 మంది ఇది కేవలం జీవనాధారం మాత్రమేనని, 6 గురు ఈ వృత్తిని కొనసాగించడం రోజు రోజుకు దుర్భర మవుతున్నదని చెప్పినారు. పై సమాధానాల తీరును పరిశీలించిన యెడల "ప్రత్యామ్నాయవృత్తి"లేకపోవడంవల్లగాని, ఉన్నవారికి పెట్టుబడి సరుకు అందుబాటులో ఉండక పోవడం వల్లగాని రోజురోజుకు తీవ్రమైన అసంతృప్తికరమైన "యాంత్రికజీవనాన్ని" కొనసాగిస్తూ జీవితాలలో

ఎటువంటి మార్పులేక జీవితాలపై నమ్మకాలు లేక "త్రిశంకు స్వర్గంలో" కొట్టుమిట్టాడుతున్నట్లుగా ఈ వృత్తి కార్మికుల జీవన పరిస్థితులపై వ్యాఖ్యానించవచ్చు. ఇటువంటి సందర్భంలో మీరు భవిష్యత్తులో ఏమి చేయాలను కుంటున్నారని అని ప్రశ్నించినపుడు వారి భవిష్యత్తు ప్రణాళికపై ఈ విధంగా తెల్పినారు. 138 కుటుంబాలలో అధిక శాతం గత్యంతరం లేక ఇందులోనే ఉంటున్నామని, ఏదైనా ఆర్థిక సంస్థ సహాయం లభించినచో వ్యాపారం ప్రారంభించాలని, 10 మంది ప్రభుత్వ ఉద్యోగం కోసం అన్వేషణ చేస్తున్నామని మిగతావారు ఇందులో ఉండటానికే నిశ్చయించుకున్నామని తెల్పారు.

పై విధంగా సామాజిక ఆర్థిక పూర్వాపరాన్ని కల్గియున్న ఈ మేదరి వృత్తి కార్మికులు వృత్తిపరంగా అనేకానేక సమస్యలనెదుర్కొంటున్నారు. ఈ సమస్యలలో ప్రధానంగా ముడిసరుకు, సహకారసంఘాలు, ప్రభుత్వ ధోరణి, ఆర్థిక సహాయం, రవాణా, మార్కెటు సమస్యలతో పాటుగా రోజు రోజుకి పెరిగిపోతున్న 'వలసలు' కూడా వీరి జీవన విధానంలో ఒక సమస్యగా పరిణమించింది.

వెదురు పరిశ్రమ – ప్రధాన సమస్యలు

ముడిసరుకు లభ్యము-పంపిణి విధానము-ప్రభుత్వపాత్ర

వెదురు పరిశ్రమలలో పనిచేసే కార్మికులుగాని, కుటుంబాలుగాని ముడిసరుకు విషయంలో తీవ్రమైన బాధలకు గురి అవుతున్నారు. ఈ వృత్తి వారికి కావలసిన ముడి పదార్థమైన వెదురు తగిన పరిమాణంలో సకాలంలో సరసమైన ధరలకు లభించడం లేదు. పల్లె ప్రాంతాలలోని ఉత్పత్తిదారు వీటిని తాలూకా ప్రాంతాలలో, స్థానికజిల్లాలోని మధ్యవర్తుల వద్ద నాణ్యతలేని హెచ్చు ధరకు పట్టి కొనడం జరుగుతుంది. ముఖ్యంగా ఆర్థిక స్తోమతలేని కుటుంబాలవారికి ఇది ఒక క్లిష్టసమస్యగా మారింది. స్థానిక మార్కెట్లలో ఈ ముడి పదార్థములు లభించక పోవడమేకాకుండా నాణ్యత పూర్తిగా కోల్పోతున్నది కూడా. కుటీరపరిశ్రమలలో లక్షణాలలో ఒకటైన స్థానిక మార్కెట్లలో లభించు ముడి దార్థము "ఈ పరిశ్రమలు వినియోగించును అన్నమాట కేవలం ఈ పరిశ్రమ విషయంలో నామమాత్రమైనది. స్థానికంగా కాకున్న ఏరోజుఏస్థలంలో దొరుకుతుందో వినియోగదారులకు అంతుచిక్కడం లేదు. ఫలితంగా స్థానిక మార్కెటులో" సరుకు అందుబాటులో లేక పోవడంవల్ల ఈవృత్తివారు మధ్యవర్తులదోపిడికిగురికాబడుతున్నారు.

గత పదిసంవత్సరాల క్రితం ఈ ముడిపదార్థాల విషయమై ప్రభుత్వం అడవిలోని వెదురు స్థలాలను పరిశోధన కావించి ఆ స్థలాలను ప్రైవేటు కంట్రాక్టర్లకు ఇచ్చివేసే పద్ధతి ఉండేది. ఈ ప్రైవేటు కంట్రాక్టర్లు వెదురు కొట్టించి మధ్యవర్తులకు పెద్ద మొత్తంలో అమ్మతూ ఉండేవారు. వీరివద్ద ఈ వృత్తిపై ఆధారపడినవారు వెదురును నెలరోజులకు సరిపడే సరుకును తీసుకొని తమవృత్తిని కొనసాగించెడివారు. ఈ పొకర్యాలవల్ల ఒక రకంగా ఈ వృత్తివారికి దీర్ఘకాలికంగా నష్టం వాటిల్లినా, స్వల్పకాలికంగా అరువుపై సరుకు లభ్యమగు చుండెడిది. కాని క్రమేణా ప్రభుత్వం ఈ వెదురును ప్రైవేటు వృత్తులద్వారా కాకుండా దీనినిర్వహణకై సహకార సంఘాలను ప్రోత్సహించినది.

వెదురు పరిశ్రమ – సహకార సంఘాల పాత్ర

ఒక గ్రామానికి చెందిన ప్రజలుగాని, లేదా ఒక గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని కొన్ని గ్రామాలుకలిసి ఒక సహకార సంఘాన్ని ఏర్పరచడం జరుగుతుంది. ఈ సంఘాలు తమకు కావల్సిన ముడి సరుకును ప్రభుత్వం అడవిలో చూపించిన స్థలంనుండి వారి స్వంత బాధ్యతపై సరుకులను కొట్టించుకొని సంఘ సభ్యులకు పంచవలిసి వుంటుంది. ఈ జిల్లాలో పై రీతిన 1320 మంది 32 సంఘాలుగా ఏర్పడినారు. ఈ విధానము 1978 వరకు ఉండినది. ఈ విధానము అమల్లో ఉన్నంతకాలం తాము అంతగా కష్టాలకు గురికాలేదని 163 కుటుంబాలవారు భావించినారు. పరిశీలన కావించిన వెదురు సహకార సంఘాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

	ప్రాంతాల పేరు	స్థాపించబడిన తేది	సభ్యుల వివరాలు
1	కరీంనగర్	14-9-77	120
2	జమ్మికుంట	27-7-77	73
3	హుస్నాబాద్	30-8-77	21
4	హుజురాబాద్	20-1-76	26
5	గోపాల్‌పూర్	16-1-79	27
6	ముత్తారం	—	—
7	సుందరగిరి	ఈ గ్రామం హుజురాబాద్ సంఘంలో కలదు	—
8	మొట్టుపల్లి	—	—
9	ములంగూర్	—	—
10	జెలంకి	8-8-77	45

పై విధంగా వివిధ ప్రాంతాలలో ఉన్న సహకార సంఘాల వల్ల ఆయాచుట్టుపట్ల ఉన్న గ్రామాల ప్రజలకు లాభం చేకూరిందా అన్న ప్రశ్నకు జవాబిస్తూ 163 కుటుంబాలు, సహకార సంఘాలలో వ్యవస్థాగతంగా కొన్ని తగాదాలు ఉన్నప్పటికీ అంతగా ముడి సరుకు విషయమై ఇబ్బంది పడలేదని తెల్పినారు. కాని 1979 సంవత్సరంలో ఈ వెదురు నంతటిని ప్రభుత్వం తన స్వాధీనంలోకి తీసుకొని ప్రైవేటు కంట్రాక్టర్లకు ఇచ్చి తన సహకార సంఘాలకు స్వంత బాధ్యతపై ఇవ్వడం నిలిపివేసిందని తెలియజేసినారు. ఈ విషయంలో అటవీ అధికారులను మీరు స్వంత బాధ్యతలపై తీసుకొనుటకు గల కారణములు ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ వారు ఇలా తెల్పినారు: స్థానిక కార్మికులలో ఉద్యోగతావకాశాలు వృద్ధి చేయడం, వెనుకబడిన వర్గాల వారికి రోజువారి పని కల్పించే ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని వారు తెల్పినారు.

ప్రస్తుతం ముడిసరుకును ఈ కార్మికులు రెండు పద్ధతుల ద్వారా పొందుతున్నారు. (1) ప్రభుత్వ వేలం (2) సిర్‌పూర్ పేపర్ మిల్ అధికారుల ద్వారా. ప్రభుత్వం సాధారణంగా అదిలాబాద్ జిల్లా అడవిలోని వెదురును తప్ప, ఆంధ్రప్రదేశ్ ఖమ్మం జిల్లాలోని ఇతర రాష్ట్రాలలోని అడవుల యందుగల వెదురును తమ స్వంత బాధ్యతలపై కొట్టించి వేలం వేస్తుంది. ఈ వేలం వేసే సమయంలో ఈ వృత్తి కార్మికులకు తెలియపరుస్తుంది. ఒక వ్యక్తి వేలంలో ముడి పదార్థములను కొనుగోలు చేసిన తరువాత మొత్తం డబ్బు చెల్లించవలయును. లేదా 1/4 వంతు చెల్లించి మిగతా డబ్బు 60 రోజులలో తీసుక వెళ్ళని పక్షంలో మరియొక ముప్పయి రోజులు స్థలపు అద్దె చెల్లించి తీసుకొని పోవు సదుపాయము కూడా కలదు. అంతకు గడువు దాటినట్లు అయితే, తత్సంబంధించిన అటవీ అధికారులు స్వాధీనం చేసుకొందురు. వేలం వేసేటప్పుడు ఈ వృత్తి కార్మికులు 'వేలం వేసే తేదీ' ఎలా తెలుస్తుంది అన్న ప్రశ్నకు ప్రభుత్వం వారు వీరికి ఉత్తరాల ద్వారా వేలం వేయు స్థలమును, తేదీ, ఇతర వివరాలను వ్రాసి ప్రతివ్యక్తికి పంపుతారని తెలియజేశారు. ముడిసరుకును అధిక మొత్తంలో కొనుగోలు చేయువారు ఆయాప్రాంతాలకు వెళ్ళి వేలంలో పాల్గొనే ముందు వారు అటవీశాఖాధికారికి 500 నుండి 1000 వరకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొను అధికారం పొందెదరు. ఈ విధముగా ప్రతినెల, రెండునెలలకు ఒకసారి వేలంలో పాల్గొనెదరు. ఈవృత్తిపై ప్రధానంగా ఆధారపడిన 138 కుటుంబాలలో కేవలం 15 కుటుంబాలు మాత్రమే వేలంలో పాల్గొంటాయని తెలిపినారు. మిగతా 123 కుటుంబాలు పాల్గొనమని తెల్పినారు. అంటే ఇచ్చట రెండు పరిశీలించ దగిన అంశాలున్నాయి. ఒకటి, అధిక సంఖ్యలో నున్న మేదరి కుటుంబాలకు ఈ వేలంలో పాల్గొనే అవకాశం లేదని, దానికి డిపాజిట్ చెల్లించే ఆర్థిక శక్తి లోపించడమేనని భావించవచ్చును. రెండవది, వేలంలో పాల్గొనే శక్తి లేకపోవడం వల్ల వృత్తిని వదులు కోలేక పోవచ్చు. అట్లా వదులుకోలేక తప్పనిసరిగా మధ్యవర్తి దగ్గర ముడిసరుకును కొనుగోలు చేయవల్సి రావడం వల్ల ఈ వృత్తిపై మధ్యవర్తి ప్రాబల్యం ఎంతగా ఉందో తెల్సుకొనవచ్చును. ముడిపదార్థాన్ని పొందే విషయంలో ఎదుర్కొనే సమస్యల గురించి 115 కుటుంబాల వారు వెల్లడించిన అభిప్రాయాలను ఈ క్రింది విధంగా తెల్పవచ్చును.

1. వేలం సాధారణంగా సుదూరప్రాంతాలలో జరుగుచుండెనని, ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, కోయిలగూడెం, మహారాష్ట్రలోని సిర్‌వంచ, కనర్‌గారూ, బలార్షా ప్రాంతాలలో జరుగు చుండెడిదని తెలిపినారు. ఈ సందర్భంలోనే సామీప్యంలో ఉన్న అదిలాబాద్ జిల్లా అడవి ప్రాంతంలోని వెదురు ప్రభుత్వాధీనంలో ఉండక పోవడం గమనించ దగ్గ అంశం.

2. దగ్గరలో వేలం జరగక పోవడంవల్ల కొనుగోలు చేసిన సరుకును రవాణా చేయడానికి అయ్యే ఖర్చులు కూడా విపరీతముగా ఉంటాయి. ఒక లారి లోడుకు సగటున 2000 రూ॥లు పడుతుందని తెల్పినారు. అంటే 2000 రవాణాకు పోనూ డిపాజిట్ 1000 మొత్తం మూడువేలు కనీసం వేలంలో పాల్గొనుటకు కల్గియుండాలన్నమాట.

3. రవాణాకు అయ్యే ఖర్చులవల్ల దూర ప్రాంతాలవారు నిరుత్సాహం చెందడమే కాకుండా స్థానిక వర్తకులు సాధారణంగా వేలంలో ప్రాబల్యాన్ని పొందుతారు. వారు అధికంగా పాట పాడటం జరుగుతుందని తద్వారా ఇతరులకు సరుకు గిట్టుబాటు ధరకు లభ్యంకాదని తెల్పినారు.

4. ఇదివరకటి వలె (1978కి ముందు వలె) వేలంలో అరువు సౌకర్యం లేకపోవడం కూడా అనేక మంది ఈ వృత్తి కార్మికులు వేలంలో పాల్గొనలేక పోవుచున్నారు. అందువల్ల వేలంలో పాల్గొనలేకపోవడం, మధ్యవర్తుల దగ్గర అధిక ధరకైనా ముడిసరుకును కొనడానికి వారిపై వత్తిడిని తెస్తుంది. నిల్వ ఉంచుకొనే స్థోమత లేనందువలన, ఒకవేళ ఉంచుకొన్న వెదురు పండిపోయి, పనికి రాదేమోనన్న భయం ఉండటం మూలంగా 112 కుటుంబాలు సరుకును జిల్లా మధ్యవర్తుల ద్వారా, 11 కుటుంబాలు తాలూకా మధ్యవర్తుల ద్వారా సరుకును కొనుగోలు చేస్తారని తెలియచేశారు. అందువల్ల ఈ వృత్తిలో స్పష్టంగా "మధ్యవర్తి" ఒక నిర్ణయాత్మక అంశంగా భావించవచ్చును. వాస్తవానికి 'వేలం' అమల్లో ఉన్న

మార్కెటు విధానములో స్వాభావికంగానే 'మధ్యవర్తి ప్రాబల్యం' ఉండటం దాదాపుగా కనిపించుటువంటి అంశము.

ముడిసరుకు విషయంలో ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు అన్న అంశముపై కూడా ఈ వృత్తివారు కొన్ని అభిప్రాయములను వెలిబుచ్చినారు.

1. సిర్పూర్ పేపర్ మిల్స్‌వారు సరుకులను సరియైన సమయంలో సరఫరా చేయరని.

2. అధికారరీత్యా నాణ్యతలేని సరుకును అంటగట్టటం జరుగుచున్నదని.

3. రవాణా చార్జీలు భరించలేకుండా ఉన్నామని.

4. నెలసరి ముడిసరుకుకై కనీసం రెండు మూడుసార్లు అయినా తిరగనిదే సరుకు లభ్యం కాదని, అందువల్ల అనవసరపు రవాణా ఖర్చులకు గురిఅవుతున్నామని తెలిపినారు. పై ఇబ్బందులు భరించలేక, ఈ ప్రాంతాల్లోగల 6 సహకార సంఘాలు మూసివేయడమైనదని సంఘ కార్యదర్శులు తెలియ జేయడమైనది. పై ఇబ్బందులను విన్నవించినప్పుడు అటవీ అధికారులు ఎలాంటి అసక్తి కనబరచలేదని తెలియ జేసినారు.

అంతేగాక ఈ వృత్తివారికి ముడిసరుకు సరఫరా చేయు విషయంలో 1978 సంవత్సరం వరకు ప్రభుత్వం సహకారసంఘాలుగా ఏర్పడిన వారికి, వారి బాధ్యతపై వెదురును కొట్టించు అధికారము ఇచ్చినది. ఆ తరువాత ప్రభుత్వం అదిలాబాద్ జిల్లా అడవిలోని వెదురును, సిర్పూర్ కాగజ్‌నగర్ మిల్లు అధికారులకు కంట్రాక్టుపై ఇవ్వడం మూలాన, సంఘాలు తమ బాధ్యతపై వెదురును కొట్టించుకొనే అధికారము కోల్పోయినారు. ప్రస్తుతం ప్రతి సభ్యునికి నెలకొకసారి 100 బ్యాగ్‌లు సిర్పూర్ పేపర్ మిల్స్ ద్వారా సరఫరా అగునట్లు ప్రభుత్వం చూచుచున్నది. దానిపై సంఘంలోని వారు తమ నెలసరి ముడిసరుకు విషయమై తమ ప్రాంతంలోని 'విస్తరణాధికారికి' దరఖాస్తు పెట్టుకొనవల్సియుంటుంది. వారు ఆ దరఖాస్తును జిల్లాస్థాయి సహకారముల అభివృద్ధి జనరల్ మేనేజర్‌గారికి సిఫారసు చేయుదురు. వారు ఈ విషయాన్ని అదిలాబాద్ సర్కిల్ అధికారులకు తెలియపరిచెదరు. వారు తమ సర్కిల్ క్రింద యున్న బెల్లంపల్లి లేదా జన్నారం రెండు డివిజన్సుకు దరఖాస్తును పంపెదరు. డివిజన్ అధికారులు సంఘమునకు నెలసరి కోటా ఇవ్వవల్సిందిగా ఉత్తర్వు జారి చేయుదురు. ఆ తరువాత సిర్పూర్ పేపరు మిల్స్ అధికారులు తమ, తమ, అధీనంలో ఉన్న వెదురును సభ్యునికి 100 చొప్పున కట్టించి సరఫరా చేయుదురు. ఇందుకుగాను ప్రతి సంఘము, ప్రభుత్వానికి వెదురుకై 2,000, రాయల్టికై 60, రూపాయిలు, కొట్టించిన కూలికై 60, రూపాయిలు, రవాణాకై 100, రూపాయిలు, చెల్లించవల్సియుండును. ఆ తరువాత మంజూరు చేయబడిన వెదురుకై 1,000 రూ॥ లు ప్రతి సంఘం భరించవల్సియుంటుందని 6 సహకార సంఘాలలో 3 సహకార సంఘాలు తెల్పినాయి. ముడిసరకు సరఫరా విషయమై సహకార సంఘాలు పై విధంగా బాధ్యత కల్గి యున్నప్పటికిని పరిశీలనా పరిధిలో ఉన్న సహకార సంఘాల 'స్థితిగతులు' ప్రోత్సాహకరంగా లేవు. సహకారసంఘాలు సరుకు తీసుకొనేటప్పుడు కట్టవల్సిన రాయిల్టిపై ప్రస్తుతం కోర్టులో దావానడుపబడుచున్నది. ఈ విషయమై ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం ఒక అధికార పత్రం ద్వారా 1980 సం॥ వరకు సంఘాలు చెల్లించవల్సిన రాయల్టి కేవలం 18.75లు మాత్రమేనని ఉత్తర్వు జారి చేసినది. ఈ ఉత్తర్వును 1979 సెప్టెంబరులో రద్దు చేసినారు. (రద్దును)ను దీనిని సవాల్‌చేస్తూ కోర్టులో ఉన్న సహకార సంఘాలు దావా వేసినాయి. ఎందుకంటే 6 సహకార సంఘాలలో ప్రస్తుతం కేవలం మూడు మాత్రమే పనిచేయుచున్నవి. మిగిలిన సంఘాలు ఎన్నో కారణాల వల్ల మూసివేయబడినాయని జవాబిచ్చిన సభ్యులు భావించినారు.

మూసివేయబడిన సహకార సంఘాల వివరాలు

ప్రాంతపు పేరు	స్థాపించబడిన సమయం	సంఘం మూసివేసిన దాదాపు సమయం
1. కరీంనగర్	14-9-1977	2 సం॥ క్రితం
2. జమ్మికుంట	20-7-1977	,,
3. హుజురాబాద్	20-11-1976	,,

ఇక మిగిలిన, గోపాల్‌పూర్, హుసునాబాద్, బెజ్జంకి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటుండగా తమ సంఘాలు నడిపిస్తున్నామని తెల్పినారు. ఈ సంఘాలలో కూడా హుస్నాబాద్ సంఘంవారికి గత 7 మాసాలనుండి ముడిసరుకు రావడం లేదని స్థానికంగా ఉన్న సంఘ సభ్యులు తెలియజేసినారు. సంఘాలు మూసివేయుటకు గల కారణాలను స్థూలంగా ఈ రకంగా వివరించినారు.

1. సంఘాలలోని అధికారుల స్వలాభాపేక్ష — దుర్వినియోగం

2. పాలకవర్గ సభ్యులయొక్క నిరక్షరాస్యత

3. సంఘం నుండి లభించినరేకు సరకు అందక పోవడంవల్ల ఒక విధంగా అనాసక్తి పెరగడం.

4. సంఘము నుండి నాణ్యతలేని ముడిసరకు సరఫరా చేయడం వలన అయినా ఆ సరుకునే కొనడం మున్నగు కారణాలను 120 సభ్యులలో 93 మంది సభ్యులు చూపించినారు.

ఇదే అంశాన్ని సంఘ కార్యదర్శిని అడుగగా, సంఘ ఆ సభ్యులలో సహకార భావం లేకపోవడం, వ్యక్తిగత అసక్తి ఎక్కువగా ఉండటం, ముడి సరుకు విషయంలో అటవీ అధికారుల అసమర్థత, ఖర్చులు అధికం కావడం, సిర్‌పూర్ పేపర్ మిల్‌వారు సమయానికి సరుకు అందించలేక పోవడం, వంటి కారణాలను సంఘం మూసివేయడానికి కారణాలుగా తెల్పినారు. దాదాపు ఇదే అభిప్రాయమును ఇతర సంఘాల కార్యదర్శులు తెల్పినారు.

పై విధంగా సహకార సంఘాలు మూసివేయబడిన రీతిపై కొన్ని అభిప్రాయములను ఈ సందర్భములో పేర్కొనవచ్చును. వెదురు సరఫరాను సిర్‌పూర్ పేపరుమిల్స్ చేతుల్లో ఉంచడం మూలానా మేదరి వృత్తిపై "స్వయం నిర్ణయాధికారాన్ని" కోల్పోవడం జరిగింది. స్వయం నిర్ణయాధికారం కోల్పోవడం 'పరాధీనత'కు ప్రారంభదశ. పరాధీనత రానురానూ కార్మికులను క్రమేపి వెట్టి బానిసలుగా లేదా "చెప్పుచేతల్లో మెదిలే (బానిసలుగా) పనిముట్లుగా" మారుస్తుంది. ఈ క్రమమే ఈ వృత్తి కార్మికులలో స్పష్టంగా కన్పడుతుంది. ముడిసరుకు లభ్యమయ్యే తీరు కూడా చాలావరకు డొంక తిరుగుడుగా, అనేక కష్టనష్టాలతో కూడుకున్నదిగా ఉండటం మూలాన ఈ వృత్తి కార్మికులు మధ్యవర్తుల దగ్గర సరుకును కొన రావలసి రావడంవల్ల, సరుకుపైన వెచ్చించే ధర వీరి చేతుల్లో లేక పోవడం వల్ల వివిధ దశలలో వీరు దోపిడికి గురిచేయ బడు చున్నారు. ఫలితంగా రోజు రోజుకు మరింత పేదరికంలో ఈ వృత్తివారు దిగజారి పోతున్నారు. పై అంశమే కాకుండా ఈ వృత్తిలో నిలదొక్కుకోవడానికి కావల్సిన "మూలధనం" ఎంతో అవసరంగా ఉంటుంది. ఈ వృత్తివారికి ప్రభుత్వబ్యాంకుల నుండి తగినంత ఆర్థిక సహాయం అందక పోవడం కూడా గమనించ తగిన అంశము.

వెదురు వృత్తి కార్మికులు - వాణిజ్య బ్యాంకులు

కరీంనగర్ జిల్లాయందు 8 జాతీయ బ్యాంకులు, ఒక జిల్లా సహకార బ్యాంకు తమ 79 శాఖలద్వారా వ్యాపార కార్యకలాపాలను కొనసాగిస్తున్నవి. వీటితోపాటు ఆంధ్రాబ్యాంకు, యునైటెడ్ కమర్షియల్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు తమ శాఖల ద్వారా కార్యకలాపాలను కొనసాగిస్తున్నప్పటికీ "అందవలసిన" రుణ సహాయం సరిగ్గా అందడం లేదని ఈ పరిశీలనలో వెల్లడించిన అభిప్రాయముల ఆధారముగా తెల్పవచ్చును. దీనికి నిదర్శనంగా 161 మందికి ఏలాంటి బ్యాంకు ఈ రోజువరకు ఎలాంటి సహాయం చేయలేదని తెలుపగా, ఇద్దరు మాత్రం స్వల్పసహాయం పొందినామని తెల్పినారు. గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి సంస్థ (కరీంనగర్ జిల్లా) శాఖ ఈ వృత్తికి సంబంధించి ఏర్పడిన 32 వెదురు సహకార సంఘాలలో కేవలం రెండుసంఘాలకు మాత్రం 10,000 రూపాయిలు రుణసహాయంగా సహాయం చేయుటకు సమ్మతించినది. ఈ రెండు సహకార సంఘాలలో గోపాలపురం సహకార సంఘమునకు 3000, హుసునాబాద్ వెంకటేశ్వర వెదురు సహకార సంఘమునకు రు॥ 4000 అందజేయడమైనదని తెలియచేసినారు. రుణాన్ని తిరిగి 'వాయిదా' పద్ధతిపై వసూలు చేస్తారని తెలిపినారు. ముందు ముందు ఎంత రుణాన్ని ఆశిస్తున్నారని ప్రశ్నించగా 7 కుటుంబాల వారు 500-1000ల వరకని, 113 కుటుంబాలు 1,000 నుండి 2,000 వరకు అని, 46 కుటుంబాలు 5000 నుండి 6000 వరకు, 3 కుటుంబాలు 10,000 వరకు కావాలని తెల్పినారు.

పై అభిప్రాయముల ధోరణిని గమనించినప్పుడు రెండు అంశాలుస్పష్టమవుతాయి. ఈవృత్తికార్మికులుమౌలికంగాప్రభుత్వం యొక్క ఆర్థికసహాయం దృష్ట్యా నిర్లక్ష్యం చేయబడినవారని "సవతి తల్లి" చూపును పొందుచున్నారని అందుకొరకై వారు అప్పు కొరకై ఎదురు చూడటం జరుగుతున్నదని ఊహించ వచ్చును. అంతేగాక ఈ వృత్తిపై ప్రైవేటు బ్యాంకులు కూడా అసక్తి కనబరుస్తున్నట్లుగా కన్పించదు. పై విధమైన సమస్యయే గాక, మార్కెటు సౌకర్యం సమస్య కూడా ఈ వృత్తి కార్మికులలో ఉంటున్న ప్రధాన సమస్య.

వెదురు కార్మికులు - మార్కెటు

వస్తుతయారి తరువాత సకాలములో వాటిని విక్రయించడం అనేది తగిన మార్కెటు సౌకర్యం ఉన్నప్పుడు మాత్రమే వీలవుతుంది. అప్పుడే అయా సంబంధిత పరిశ్రమ దీర్ఘకాలికంగా నిలదొక్కుకోవడం జరుగుతుంది. కాని ఈ అంశం ఈ వృత్తి కార్మికుల విషయంలో లోపించినట్లుగా కన్పడుతుంది. తాము ఉత్పత్తి చేసిన వస్తువులను ఆర్థిక దుర్భరత్వంవల్ల వెంట వెంటనే పల్లె ప్రాంతాల యందు తిరిగి అమ్ముకోవల్సి యుంటుంది. మీరు వస్తువులను ఎన్ని రోజులకు ఒకసారి అమ్ముదురు అన్న ప్రశ్నకు, 138 కుటుంబాలు ఇంటివద్ద ప్రతిరోజూ అమ్ముతామని, పై సంఖ్యలోనే 30 కుటుంబాలు స్థానిక సంతలోనే వారంలో ఒకరోజు అమ్ముతామని తెల్పినారు. మిగతా రోజులలో 6 కుటుంబాలు గ్రామ ప్రాంతాలకు వెళ్ళి అమ్ముతామని తెలిపినారు. గ్రామ ప్రాంతాలకు వెళ్ళి అమ్మవల్సి వచ్చినపుడు 4. కి. మీ నుండి 10 కి. మీ. వరకు ప్రయాణించవల్సి యుంటుందని తెలిపినారు. కరీంనగర్‌లో స్థాని

కంగా స్థిరపడినవారు కేవలం ఎవరైనా కావాలని ముందు అడిగినట్లు అయితేనే ఆ అవసరాన్ని బట్టి వస్తు తయారి చేస్తామని తెలిపినారు. ఈ వృత్తి కార్మికులు వృత్తి స్థలముల యందు ఎదుర్కొనే సమస్యల గురించి చెబుతూ సాధారణంగా ప్రజలు, చెప్పిన ధరకు కాకుండా బేరాలాడుతారని, పల్లె ప్రాంతాలలో తమ వస్తువులకు గిట్టుబాటు ధర రావని కొన్నిసార్లు అసలు సరుకు అమ్ముడుపోదని, అందువల్ల ఎంత ప్రయాసపడి కొన్ని మైళ్ళు ప్రయాణం చేసి కొన్నిసార్లు వుత్త చేతులతో ఇంటికి చేరుకోవల్సి యుంటుందని తెలిపినారు. తగినంత ముడి సరుకు లేకపోవడమే ఒకవైపు ఈ పరిశ్రమకు తీవ్ర అఘాతం కాగా, మరొకవైపు ఉత్పత్తిచేయబడిన వస్తువుకు మార్కెటు లేకపోవడం "గోరుచుట్టుపై రోకటిపోటు" లాగానే ఉంటుంది. అంతేగాక పెద్ద పెద్ద సంస్థల నుండి పోటా ప్లాస్టిక్ సామాగ్రి రావడం, మార్కెటులో స్వాభావికంగానే వెదురు పరిశ్రమకు – దాని ఉత్పత్తులకు ఒక దెబ్బ. ఎందుకంటే నగిషీలు చెక్కబడిన పెట్టుబడి ముద్దతో, ముడిసరుకును గుత్తాధిపత్యం ఇదివరకే కల్గియున్న పెద్ద పెట్టుబడి పరిశ్రమలతో – చాలీచాలని పెట్టుబడితో–శ్రమశక్తిని అధారంగా చేసుకొని జీవించే స్థానిక పరిశ్రమలు మార్కెటులో తట్టుకోలేకపోతాయి. ద్రవ్యోల్బణ పరిస్థితులలో మరింతగా ఈ వృత్తి కార్మికులు బాధపడవల్సివస్తుంది. దీనికి అదనంగా భరించలేని రవాణా ఖర్చులు వారి బలహీన ఆర్థిక వ్యవస్థను మరింతగా కృంగదీస్తున్నాయి. స్వంత వృత్తికి తగిన ఆదరణ లభించనప్పుడు, బాధలను పట్టించుకొనే ప్రత్యామ్నాయ మార్గం లేనప్పుడు ఏ వృత్తి కార్మికులకైనా సులభంగా తోచేమార్గం "వలస పోవడమే". ఈ వలస అనేది తమ స్థానిక ప్రాంతాలనుండి కావచ్చు. తమ వృత్తుల నుంచి మరొక వృత్తికి మారటం కావచ్చు. అందువల్ల ఈ పరిశీలనలో బయల్పడిన మరొక ముఖ్య అంశం 'వలసలు' కూడా ఒకటి.

వ ల స లు

అనాదిగా ఈ వృత్తివారు పల్లెల్లో జీవనం కొనసాగిస్తూ, వెదురు వృత్తిని ప్రధానంగా ఎంచుకొని వ్యవసాయ వృత్తిని అనుబంధంగా ఎంచుకొనేవారు. కాని క్రమేపి వారి ప్రధానవృత్తి పల్లెల్లో ప్రోత్సాహకరంగా లేనందువల్ల అనుబంధవృత్తి ఆధారాలు క్షీణిస్తూ ఉండటం వలన వీరు పట్టణాలకు వలస రావడం కొనసాగుతూ ఉన్నది. 110 కుటుంబాలలో 80 మంది పల్లె ప్రాంతాలయందు పనులు లేక, తమవృత్తికి తగిన ఆదరణ లభించక ఇతర వ్యాపారాలు చేపట్టే నిమిత్తము పట్టణాలకు వచ్చామని తెలిపారు. తమ ప్రయత్నం ఫలించక పోగా సరియైన సహాయం, లభ్యంకాక, పోటీమార్కెటులో తట్టుకోలేక ఇదివరకటి జీవనం కన్నా ఇప్పుడే ఎక్కువ కష్టనష్టాలకు గురి అవుతున్నామని తెల్పారు.

ఇక తాత్కాలిక స్థాయిలో స్థిరనివాసం ఏర్పరచుకున్న కుటుంబాలలో 21 కుటుంబాలవారు దాదాపు 10 సం॥ క్రితం దరిదాపులగల వీణవంక, వల్లభాపూర్, ముత్తారం, నిజామాబాద్, మున్నగు ప్రాంతాలనుండి తరలి వచ్చినారు. వీరు కూడా పైన తెల్పిన కారణాలనే తాము తరలి రావడానికి కారణాలుగా సూచించారు.

ముడి సరకు సరసమైన ధరకు లభ్యంకాక అధికధరతో కొని, లాభాలు ఆర్జించలేక, ఇతర పట్టణ ప్రాంతాలలో ద్రాక్షబుట్టలు, కిళ్ళీ ఆకుల బుట్టలు, పండ్లబుట్టలు అల్లుటకై డిసెంబర్ మొదలు కొని మార్చి మాసం వరకు హైదరాబాద్‌కు తరలి వెళ్లట జరుగుచున్నదని తెలిపినారు. స్థానిక కరీంనగర్ నుండి 10 కుటుంబాలు, హుస్నాబాద్ నుండి 8 కుటుంబాలు, సుందరగిరి పల్లె ప్రాంతాల నుండి 2 కుటుంబాలు, గోపాల్‌పూర్‌లోని 2 కుటుంబాలు ఇట్లా తరలి వెళ్ళినామని తెలిపినారు. అంటే కేవలం పల్లెలనుండి మధ్య తరగతి పట్టణాలకు మాత్రమేగాక–మళ్ళీ మధ్య తరగతి పట్టణాల నుండి మహానగరాలకు "వలసపోయేరీతి" ఈ వృత్తి కార్మికులలో కన్పిస్తూ ఉంటుంది. స్థానిక ప్రదేశాలనుండి, అందుబాటులో ఉన్న వనరుల నుండి ఎంత తీవ్రంగా వారు తరలి పోవడం జరుగుతూ ఉందో అంత తీవ్రంగా వారు స్థానిక ప్రదేశాలకు, వృత్తి ఉనికికి, స్వయం ప్రతిపత్తికి దూరమై మార్కెటు అవసరాలను తీర్చేవారుగా మిగిలి పోతున్నారని దానికై వారు సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారని ఫలితంగా పరాధీనతకు లోను అవుతున్నారని భావించవచ్చును.

ము గిం పు

ముందు వివరించినట్లుగానే కుటీర పరిశ్రమలు, చేతి వృత్తులు దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన పాత్ర వహిస్తాయి. ఒకదానివెనుక మరొకటిగా వచ్చిన పంచవర్ష ప్రణాళికలలో కుటీర పరిశ్రమలపై ఎంతో ప్రాధాన్యత నొక్కి చెప్పినా నిధులు ఎన్నికేటాయించినా అనుకున్నంతగా ప్రగతి సాధించలేక పోయామని ప్రభుత్వ నివేదికలే తెల్పుతున్నాయి.

ప్రస్తుత పరిశోధిత అంశములో కూడా పై అభిప్రాయము వాస్తవమవుతున్నది. వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ, పారిశ్రామికా భివృద్ధి బ్యాంకులు వెదురు వృత్తి వారిపైన ఎలాంటి ప్రభావమును చూపుటలేదనే చెప్పాల్సి యుంటుంది. ఒకవైపు పరిశ్రమను పోషిం

చుకునే స్వయం పోషకత్వం నానాటికి దెబ్బతినిపోగా అందుబాటులో ఉండవల్సిన 'ముడిసరుకు' వ్యవహారము పూర్తిగా నిరుత్సాహజనకంగా మారుతూ ఉండటంవల్ల ఈ వృత్తి కార్మికులు తీవ్రమైన ఆందోళనచెందుతున్నారు. మధ్యవర్తి ప్రాబల్యము, ముడిసరుకు పై పెట్టుబడిదారుని ప్రాబల్యము ముఖ్యంగా సమీపంలో ఉన్న అడవీ ప్రాంతముపై ఉండటంవల్ల, ప్రైవేటు వ్యక్తిదయాదాక్షిణ్యాల మీద ఈ వృత్తివారు ఆధారపడవలసి వస్తుంది. "ఆధారిత ప్రభావం అధికమైన కొలది స్వయం ఉత్పాదికత క్షీణిస్తూ ఉండటం ఆ క్షణం జరిగే ఫలితము" ఈ ఫలితమే మేదరి వృత్తి కార్మికులలో కన్పిస్తుంది. స్థానిక ప్రాంతాలలో భారీ పరిశ్రమలు అభివృద్ధి చెందడం ఒకవైపు "జాతీయ అవశ్యం" దృష్ట్యా అభిలషణీయమే అయినా, ఆ ప్రగతి స్థానిక నిపుణతలను దెబ్బతీసేదిగా ఉండకూడదు. కానీ ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకున్నట్లుగా కన్పించదు. భారీ పరిశ్రమలు పెరిగినప్పుడు మార్కెట్టు భారీ ఉత్పాదన వస్తువుపరమై ఉండి, చేతివృత్తుల ఉత్పాదకత సవతితల్లి ప్రేమమాత్రమే పొందుతుంది. ఈ అంశము వెదురువృత్తి కార్మికుల విషయంలో నిజమైంది. ఉత్పత్తి చేసిన వస్తువులు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నటువంటివై వుండి కూడా వాటిని విక్రయించడానికి తగిన మార్కెటు సౌకర్యం లేక పోవడం, నెలకొల్పబడిన సహకార సంఘాలు అనేక కారణాలవల్ల సరిగ్గా నడవక పోవడంవల్ల, ప్రభుత్వ ధోరణిలో చెప్పుకోతగ్గ మార్పు కనిపించనందువల్ల, అవసరమైన 'కార్మికతత్త్వము' లోపించినందువల్ల ఈ వృత్తి కార్మికులు ఒక రకంగా "చావు బతుకుల" మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. అత్యధిక సంఖ్యాకులు అనుభవించాల్సిన సౌకర్యాలు తాము తమ తరంలో అనుభవించలేక పోయినా, కనీసం తమ ముందు తరాల వారికైనా కూడా అందించ లేక పోతున్నారని ఈ పరిశీలనవల్ల వెల్లడించిన జీవన పరిస్థితులు సూచిస్తున్నాయి.

అందువల్ల ఈనాడు ఈ కార్మికులు వృత్తి పరంగా ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారని భావించవచ్చు. ఇటువంటి సందర్భములో ఇబ్బందులను తెల్సుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం అనాసక్తతతో ఉదాసీన వైఖరి అవలంబించినట్లయితే, తమ సమస్యల సమస్యలను పట్టించుకోలేని ప్రభుత్వవ్యవస్థ ఉన్నప్పుడు ప్రభుత్వమే తే ప్రైవేటు పెట్టుబడుల ప్రవేశానికి అనుమతించి, ఆ పరిశ్రమల సంక్షేమాన్ని పట్టించుకొన్నప్పుడు ఏ వృత్తివారి జీవన పరిస్థితులయినా దుర్భర మవుతాయి. ఒకతరంనుండి మరొక తరం వరకు కూడా జీవన విధానంలో మార్పు రాక అసమ రూప జీవన విధానం ఆచరణలో ఉంటుంది. ఈ అసమ రూప జీవన విధానము యొక్క అంతమే ఏ వృత్తి కార్మికుల జీవితంలోనైనా ప్రగతి సాధించడానికి అవకాశముంటుంది.

భా వ ధా ర

డాక్టర్ పోచిరాజు శేషగిరిరావు

ఆరని తృష్ణ యొక్కఁడు
విహారము సేయును స్వాంతవీధి, వి
డ్డూరముగాఁగ కన్పడు, పుటుక్కున
ప్రేలును లోకసూత్ర, మే
దూరపు లోకమో కనుల
తొంగలి ఱెప్పలలోనఁ దోచు, సం
చారము సేయు భావము
ప్రసన్న కథాకలితార్థ యుక్తిమై.

రంగుల కాగితంపుపువు రాలిన రాలును - కాంతిహీనతన్
క్రుంగిన క్రుంగు, లోకమున రోదిల రెవ్వరు దానికోసమై;
పొంగిన జవ్వనమ్ము విరబూచిన పువ్వును నిల్ప చూతు రె
బ్భంగిని నిల్ప యత్నపడి పాటవమంతయు నొడ్డి దానికై.

తోరపు కోరికల్ మదిని తోచినతోడనె ఇంద్రియాళి క
ర్పూరపరాగముల్ చిదిమిపోయును రాసులు - తత్పరీమళ
శ్రీరుచిరమ్ములై కవన సేవధులై తలపుల్ గమించు - త
త్పారముతాకబోయి శతథా చరియించునురాగమాలికల్.

మారిన నా హృదంతరము మర్మరముల్
పొనరించు, నేవియో
తీరని కోర్కెలూరు, తియతీయని మాయని యూహలెల్ల న
న్నారెడునట్లు చేయు, రసమూరును
స్వాంతమునందు - నంత - క
ర్పూరపరాగపొందు రుచిపూరము లాంతరసీమ క్రమ్మెడున్.

ప్రిదిలినరాగరేఖ మురిపించును ముంచును భావుకోత్తమున్,
కదలిన భావధార రసనామధురాంచిత కావ్యసృష్టికిన్
మదిని లగింపఁజేసి రసమార్గమునన్ బయనింపఁజేసి స
మ్ముద మొదవించు స్నాయువులు ముట్టుచు కావ్య
రసానుభూతికిన్.

తేరిన తేట నీటివలె
తీయని తేనియవాకవోలె, వి
ప్పారు గులాబి పూవువలె, ప్రన్న
ని వెన్నెలవోలెనై రుచి
స్ఫార కవిత్వ మల్లిన రసస్ఫురణల్
సురభీకరించుచున్
హారతులెత్తు జాతికి -
జయావహమై సుమనోభిరామమై.

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయ శర్మ

విజయనగరం జిల్లా గ్రామ నామములు ఒక పరిశీలన

1979వ సం॥ జూన్ 1వ తేదీన విజయనగరం (ఉ॥ అ॥ 18° 5' N తూ॥ రే॥ 83° 25' E) కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 23వ జిల్లా యేర్పడినది. ఈ క్రొత్తజిల్లాకు తూర్పున శ్రీకాకుళం జిల్లా, ఈశాన్యంగా బంగాళాఖాతం, పడమట దక్షిణాలలో విశాఖజిల్లా, ఈశాన్యంగా ఒరిస్సారాష్ట్రం ఎల్లలుగా ఉన్నాయి. విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలలోని ప్రాంతాలను (వరుసగా 4 + 5 తాలూకాలు) పుణికి పుచ్చుకుని యేర్పడిన ఈ జిల్లా మొత్తం విస్తీర్ణం 6,539 చ॥ కి॥ మీ. జనాభా సుమారు 18,09,688. నేటికి జిల్లాలో కురుపాము, పార్వతీపురం, బొబ్బిలి, బాడంగి, సాలూరు, గజపతినగరం, చీపురుపల్లి, శృంగవరపు కోట, వియ్యంపేట, విజయనగరం, భోగాపురం, నెల్లిమర్ల మొత్తం 12 తాలూకాలు ఉన్నాయి. సమితుల సంఖ్య 14. అసెంబ్లీ స్థానాలు 12. పార్లమెంటరీ స్థానాలు 2. మున్సిపాలిటీలు 3. జిల్లాలో మొత్తం గ్రామాల సంఖ్య 1,546[1].

గ్రామనామముల పుట్టు పూర్వోత్తరాలను తెలుసుకోవడానికి ముందుగా ఈ జిల్లాకు గల చారిత్రక నేపథ్యాన్ని గమనించ వలసి ఉంది. పురాతత్వ పరిశోధనల వలన శృంగవరపుకోట తాలూకాలోని జామి గ్రామ ప్రాంతంలోను, చిలకగడ్డ తీరంలోను, గజపతినగరం తాలూకాలో చంపావతీ తీరంలో ఆంధ్ర, కుంపిల్లిల వద్ద నవీన శిలాయుగపు మానవుల నివేశనప్రదేశాలు గుర్తించబడినవి.[2] అందువలన ఈ జిల్లా ప్రాంతం ఆదిమానవుని కాలం నుంచి జీవన యోగ్యంగా వుంటూ వస్తోందని తెలుస్తోంది.

విజయనగరానికి ఈశాన్యంగా 8 మైళ్ళ దూరంలో గల రామతీర్థము బౌద్ధ, జైన హిందూ మతములకు త్రివేణీ సంగమముగా నుండినదని చెప్పవచ్చును. భోగాపురము, లక్కవరపు కోటలలో జినాలయములు ఉండినవి. నారాయణపురం, సిరిపురం, జయతి, సారిపల్లి మొదలగు చోట్ల కళింగ శైలికి చెందిన దేవాలయములు ఉన్నవి. చారిత్రకముగా గోదావరి మహానదుల మధ్య ప్రదేశం కళింగదేశముగా పరిగణించబడినది. తూర్పుగాంగులు బహుకాలము ఈ ప్రాంతమును ఏలినారు. మధ్యయుగములో దక్షిణకళింగములో వడ్డాది మత్స్య వంశీయులు, జంతర్నాడు, పీరకోటాం పల్లవులు మొదలగు చిన్న చిన్న రాజ్యములు తలయెత్తేయి. గోల్కొండ నవాబ్, మొఘల్ ఫౌజ్‌దారీల అధికారము ఈ ప్రాంతముపై చెల్లినది. 17వ శతాబ్దము మధ్యకాలములో విజయనగరం, బొబ్బిలి సంస్థానములు రూపొందినవి. అంతకుముందు జయపురం (ఒరిస్సా సంస్థానము, ఈ ప్రాంతమందు విస్తరించుకొని ఉండేది. ఆంధ్ర, సాలూరు, సంగమ వలస, చెముడు, మేరంగి, పాచిపెంట, బెలగాం (పార్వతీపురం) మొదలగు చిన్న సంస్థానములు జయపురం వారి చేతనే సృష్టించబడినది.

ముందుగా ఈ ప్రాంతమును వివిధ కాలములలో యేలిన రాజవంశముల, పాలకుల నామములు ఈ ప్రాంత గ్రామ నామములుగా యేర్పడిన వైనము సూచింపనగును. తూర్పు గాంగులకు చోళులకు మధ్య రాజకీయ వైవాహిక సంబంధము లుండినవి.

చోళ - గాంగ సంబంధి గ్రామనామములు

గంగ చోళ్ళ పెంట (గ),† చొళ్ళంగి (చోళ + గంగ) పేట (భో), చోడవరం (నె), చోడమ్మ అగ్రహారం (భో), గై (వై)తుల చోడవరం (భో), చోళ్ళ పాదం (పా).

'చోళ్ళు' అనేవి ఆహారధాన్యాలలో ఒకటిగా వున్నాయి. వాటికి ఆ పేరు కూడా 'చోళ' సంబంధం వలన వచ్చినదనే ఊహ అసమంజసం కాదు.

తూర్పు గంగ రాజులలో మూడవ అనియంక భీముడు (12-11-1238) ప్రముఖుడు. భీమ నామధేయులు వడ్డాది మత్స్య వంశీకులలోనూ కనిపిస్తారు. 'భీమవరం' గ్రామ నామముగా బాడంగి, శృంగవరపుకోట, చీపురుపల్లి తాలూకాలలో ఉన్నది. శృంగవరపుకోట, గజపతినగరము తాలూకాలలో 'మధుపాడ'[3] లు ఉన్నాయి. తూర్పు గాంగులలో మధుకామార్ణవుడు ఉన్నాడు.

ఈ ప్రాంతంలో ప్రధానదైవతమైన పలఖలింగేశ్వరుని మధుకేశ్వరునిగా కూడ వ్యవహరిస్తారు. ఆ ప్రకారం కూడా ఈ 'మధుపాపలు' ఏర్పడి వుండవచ్చు.

బొబ్బిలికి 13 మైళ్ళ దూరంలో 11వ శతాబ్దానికి చెందిన నీలేశ్వరాలయం నారాయణాపురంలో ఉంది. అక్కడ 'రేపర్తి' నాయకుల శాసనాలు లభించాయి. వారిలో మేడపరాజు (1100-1180) ప్రముఖుడు. ఈయన పేరుననే కాబోలు పెదమేడపల్లి, చిన మేడపల్లి (గ) ఏర్పడినవి.

శిలావంశ[4] - నందాపుర - జయపుర[5] సంస్థాన సంబంధ గ్రామ నామములు

జయపుర సంస్థానాధీశుల తొలి స్థావరం నందాపురం. నందాపురాన్ని తొలుత శిలావంశపు వారు పాలించారు. వారిలో గంగరాజు, ప్రతాప గంగరాజు, విశ్వనాధరాజు, భైరవరాజు ఉన్నారు. జయపుర పాలకులలో భైరవదేవు, ముగ్గురు విశ్వంభర దేవులు, ముగ్గురు బలరామదేవులు, నలుగురు రామచంద్రదేవులు, హరిదేవు, వీరవిక్రమదేవు ఇద్దరు విక్రమదేవులు, ఒక ముకుందదేవుఉన్నారు. వీరి మూలపురుషుడు వినాయక దేవుడు. మొదటి విశ్వంభర దేవు విశ్వనాధదేవుగా కూడా వ్యవహరింపబడినాడు. ఈ ప్రాంతంలోని చిన్న సంస్థానములు జయపురాధీశులచేత సృష్టించబడినవే కావున జయపుర పాలకుల పేర్లను వారు తమ వంశాలలో నిలుపుకోవడం చేత విశ్వంభర, రామచంద్రాది నామధేయులు ఆ చిన్న సంస్థాన పాలకులలో మరికొందరు కనిపిస్తారు[6].

ఈ క్రింది గ్రామ నామములు పైవారి పేళ్ళ మీదుగా ఏర్పడి నట్లు తోచుచున్నది.

1. నందాపురం (పా)
2. భైరిపురం (బొ)
3. భైరిపురం (చీ)
4. ముకుందరాజపురం (శృం)
5. ముకుందరాజపురం (వి)
6. ముకుందపురం (శృం)
7. విశ్వనాథపురం (సా)
8. విశ్వంభరపురం (పా)
9. విక్రమపురం (పా)
10. రామచంద్రాపురం (సా)
11. రామచంద్రాపురం (పా)
12. మొఖాసాహరిపురం (పా)
13. వినాయకపల్లి (శృం)
14. బలభద్రరాజపురం (గ)
15. గంగరాజపురం[7] (పా)

విజయనగరము పూసపాటి[8] సంబంధి గ్రామ నామములు

17వ శతాబ్దపు మధ్య భాగము నుంచి ఈ ప్రాంతంలో పూసపాటి వారు ప్రబలురైనారు. పూసపాటి గృహనామము ఊరు పేరుగా కూడా కనిపిస్తుంది. పూసపాడి (కు), పూసపాటి పాలెం, పూసపాటి రేగ (భో). 'గజపతి' అనునది పూసపాటి వారి బిరుద నామము. గజపతి నగరం తాలూకా కేంద్రంగా వుండగా వియ్యంపేట తాలూకాలో మరి ఒక గజపతి నగరం వున్నది.

పూసపాటి వారి తొలి స్థావరములలో ఒకటి కుమిలి[9]. దీని ప్రాచీన నామధేయము కుంభికాపురము. కుమిలి కోట కట్టిన కృష్ణమరాజు పితామహుడు పెదకృష్ణభూపతి (16శ॥ ఉత్తరార్థం) ఈయన పేరున వెలసినది పెదకృష్ణరాజపురం (శృం). విష్ణుభక్తి సుధాకర గ్రంథకర్త విజయరామరాజు తండ్రి భూపాలరాజు. వెంకటాచల మహత్మ్య కృతికర్త కొండ్రాజు, తండ్రిపేరు కూడ భూపాలరాజే. భూపాలరాజు రేగ గజపతినగరం తాలూకాలో వున్నది. అన్నమరాజు వలస (సా), అన్నమరాజుపేట (శృం)లు పూసపాటి వారిలో గల ఇద్దరు అన్నమరాజులలో నెవరిపేరుననైనా ఏర్పడి వుండవచ్చు. ఉషాభ్యుదయకర్త వెంకటపతిరాజు[10] (1669-1720) అగ్రజుడు అన్నమరాజు[11]. ఈయన కొంతకాలము రాజ్యాధికారం కూడా నెరపాడు. ఈయన పితామహుడు కూడా అన్నమరాజు నామధేయుడే.

ఆనందపురం (వి) మొదటి ఆనందరాజు (1671-1717) లేక రెండవ ఆనందరాజు (1732-1760) ల పేర్లనుబట్టి ఏర్పడినదై వుండాలి.

పూసపాటి వారిలో విజయరామ నామధేయులు ఐదుగురు కలరు.[12] విజయరామ గజపతినగరం, గజపతినగరం తాలూకాలో ఉన్నది. కురుపాం తాలూకాలో మూడు, చీపురుపల్లి తాలూకాలో రెండు, గజపతినగరం, సాలూరు తాలూకాలలో చెరివొకటి విజయరామపురములు ఉన్నాయి.

పెద విజయ రామరాజు భార్యపేరు చంద్రాయమ్మ.[13] చంద్రమ్మపేట విజయనగరం తాలూకాలో ఉన్నది. ఈమె తండ్రి కలిదిండి రంగరాజు. గజపతినగరం, కురుపాం తాలూకాలో ఉన్న 'శ్రీరంగ రాజపురము'లు ఈయన పేరున ఏర్పడి వుండుటకు వీలున్నది. 'రంగ' శబ్దము ఎక్కువగా ప్రాచుర్యంలో ఉండే బొబ్బిలి సంస్థానాధీశుల వలన ఈ గ్రామ నామములు ఏర్పడి వుండుటకును అవకాశమున్నది.[14] కూచిమంచి జగ్గకవి చంద్రరేఖా విలాప (ప) ము మూలమైన ప్రఖ్యాతుడు (పెద విజయ రామరాజు బావమరిది) చింతలపాటి నీలాద్రిరాజు. ఈయన పేరును స్ఫురింపచేసే నీలాద్రిపురం (చి), నీలాద్రిరాజుపేట (విజ) ఉన్నవి.

నారాయణ గజపతి[15] (1786-1845) పేర నారాయణ గజపతి రాజపురం (గ) ఉన్నది.

గజపతినగరం, శృంగవరపుకోట, వియ్యంపేట, పార్వతీపురము, కురుపాం, బొబ్బిలి, బాడంగి, సాలూరు తాలూకాలలో మొత్తం 11 సీతారామపురములు వున్నవి. పూసపాటి పాలకులలో పొట్నూరు కోట నిర్మాత సీతారామచంద్రరాజు (1669-1697), పెదవిజయ రామరాజు పెదతండ్రి దేవులపల్లి పాలకుడు సీతారామరాజు (1717-1741), చిన విజయరామరాజు (1748-1794) సవతి సోదరుడు. దివాన్ సీతారామరాజు మొత్తం ప్రముఖంగా ముగ్గురు సీతారామ నామధేయులు కనిపిస్తారు. ఈ పదకొండు గ్రామనామాలలో కొన్ని వీరి పేరున ఏర్పడి వుండవచ్చు. సీతారాములు ఆంధ్రులకు అభిమాన దైవతాలు కనుక భగవన్నామాంకితముగా కూడ ఈ గ్రామ నామములు ఏర్పడి వుండవచ్చు.

విజయనగరానికి ఆ పేరు ఎలాగ పెట్టబడినదో తెలుసుకోవడం ఆసక్తిదాయకంగా వుంటుంది. విజయనామ సంవత్సరము (1713) విజయదశమి జయవారము నాడు విజయరామరాజు పేర నిర్మించబడినది. కావున పంచజయశబ్దపూర్వకముగా విజయనగరం అనే పేరు ఉంచబడింది.[16]

బొబ్బిలి[17] సంస్థాన సంబంధి గ్రామనామములు

రంగారావు అనేది బొబ్బిలి పాలకులకు వంశక్రమానుగతమైన బిరుదు. బొబ్బిలి, వియ్యంపేట తాలూకాలలో రంగరాయపురములు చెరిఒకటి వుండగా "J" (జనార్దన) రంగరాయపురాలు బొబ్బిలి తాలూకాలలో రెండు, కురుపాం తాలూకాలో ఒకటి ఉన్నవి. వియ్యంపేట తాలూకాలో రంగాపురం, కురుపాం తాలూకాలో రంగప్ప వలస ఉన్నవి. బొబ్బిలి తాలూకాలో వెంగళ రాయపురం ఉన్నది. బొబ్బిలి పాలకులలో మూడవ వాడు వెంగళరావు. బొబ్బిలి యుద్ధము (1757) వీరుడు వెంగళరావు. పెదవెంగళరావు కుమారుడు పెదజనార్దన రంగారావు లక్కవరపు కోటను సంపాదించి పరిపాలించెను. ఇందువలన ఆ ప్రాంతంలో (లక్కవరపుకోట ఫిర్కా) ఒక రంగాపురం యేర్పడినది.

చిన్నసంస్థానముల పాలకవ్యక్తులపేరనేర్పడిన గ్రామనామములు

సాలూరు

భోజరాజపురములు కురుపాం, గజపతినగరం, బొబ్బిలి తాలూకాలలో ఉన్నవి. సాలూరు పాలకుడు రామచంద్రరాజు (1772-1801) సోదరులలో భోజరాజు ఒకడు. రామచంద్రరాజు పౌత్రునిపేరు నారాయణ భోజరాజు. రామచంద్రరాజు మరియొక సోదరుని పేరు బుచ్చిరాజు. అతనికి అప్పలరాజు అని మరియొక పేరు కూడా ఉన్నది. బుచ్చిరాజుపేట గజపతినగరం తాలూకాలోను అప్పలరాజుపేట సాలూరు తాలూకాలోనూ ఉన్నవి. సాలూరు తాలూకాలో సన్యాసిరాజుపురం వున్నది. సాలూరు పాలకులలో సన్యాసిరాజ నామాంకితులు చాలా మంది ఉండటం చేత ఈ గ్రామము వారిలో నెవరిపేర ఏర్పడినదో నిశ్చయించుట వీలుగా కున్నది.

సాలూరుకు ముందరి పేరు మరిసరేవలస అని తెలుస్తోంది.

"మరిసరే వలసయను గ్రామంబు బట్ట
ణంబుజేసి సాలూరు నామంబు పెట్టి
ప్రకటితముగ రత్నారావునకు నొసంగి
పుత్రికను నల్లుని కూడ పురినినిలిపె."[18]

కురుపాము

కురుపాము సంస్థాన సంపాదకుడు సన్యాసిదొర. పెద సన్యాసిరాజు కుమారుడు శివరామరాజు (1740-1794). ఈతని కుమారుడు చిన సన్యాసి రాజుతోనే 1803లో శాశ్విత పరిష్కారము జరిగింది. ఈతని దత్తపుత్రుడు సీతారామరాజు 1830లో చనిపోగా అతని భార్య సుభద్రమ్మ 1841లో ఆమె మరణ కాలము వరకు జమీని నిర్వహించింది. శివరామరాజుపురం పార్వతీపురం తాలూకాలోనూ శివరామరాజుపేట శృంగవరపుకోట తాలూకాలోనూ ఉన్నవి. శివరామపురాలు పార్వతీపురం తాలూకాలో మూడు. కురుపాం, బొబ్బిలి, సాలూరు తాలూకాలో వొకటొకటిగా ఉన్నవి. సుభద్ర గ్రామము బొబ్బిలి తాలూకాలోనూ, సుభద్రమ్మవలస పార్వతీపురం తాలూకాలోనూ ఉన్నవి.

మేరంగి

1794వ సంవత్సరము పద్మనాభ యుద్ధానంతరం మేరంగి జమిందారి పొందినవాడు శత్రుచర్ల గంగరాజు (1770-1803). గంగరాజపురాలు రెండు పార్వతీపుర తాలూకాల్లో ఉన్నవి. ఈయన కుమారుడు చంద్రశేఖరరాజు (1798-1833). అతని పౌత్రుడు చంద్రశేఖరరాజు. చంద్రశేఖరరాజపురం పార్వతీపురం తాలూకాలో ఉన్నది. మేరంగి జమిందారులు గొర్తి సాంబమూర్తి శాస్త్రి గారికి ఇచ్చిన అగ్రహారము సాంబన్నావలస పేరిట నేటికి పార్వతీపురం తాలూకాలో ఉన్నది. అదే తాలూకాలో గొర్తివలస ఉంది. వేంకటకవి (1790-1850) కార్తీక మహాత్మ్య కృతి భర్త

మార్కొండ ఆదెయ్య మేరంగి దివాను. అయన గృహనామము పేరిట 'మార్కొండ పుట్టి' సాలూరు పార్వతీపురం తాలూకాలలో ఉన్నవి.

పా ర్వ తీ పు ర ం

ఈ సంస్థాన సంపాదకుని పుత్రుడు సుందర నారాయణ ధాత్రరాజు. సుందర నారాయణపురం పార్వతీపురం తాలూకాలో వున్నది. అతని పౌత్రుడు ధనంజయుడు (1865–1888). ధనుంజయపురం పార్వతీపురం తాలూకాలో ఉన్నది.

కా శీ పు ర ం

శృంగవరపు సంస్థానానికి మరియొక పేరు కాశీపురం. బొబ్బిలి యుద్ధంలో విజయనగరం పక్షము వహించినవాడు ముఖీ కాశీపతిరాజు. కాశీపతిరాజపురం శృంగవరపుకోట తాలూకాలో ఉన్నది.

స ం గ ము వ ల స

సంగమువలస పాలకులకు నిశ్శంక అన్నది బిరుదనామము. నిశ్శంకపురము పార్వతీపురం తాలూకాలో నున్నది. పెద విజయరామరాజు సమకాలికుడు జి. యన్. దొర పెద్ద కొడుకు పెద్దన్న నిశ్శంక జియ్యన్నవలస విజయనగర తాలూకాలో ఒకటి వుండగా జియ్యంవలసలు రెండు పార్వతీపురం తాలూకాలో కన్పిస్తున్నవి. పెద్ద నిశ్శంకపురం, పెద నిశ్శంకుని రెండవ కుమారుడు వెంకట నిశ్శంకుని పేర వెంకట నిశ్శంకపురం పార్వతీపురం తాలూకాలో ఉన్నాయి. పెద నిశ్శంక భార్య పేరును అయన పౌత్రుడు పెద్దన్న భార్య పేరునూ గంగమాంబయే. రెండవ యామె రాజ్యచక్రమును దిప్పిన సమర్ధురాలు. గంగమాంబాపురం గంగమ్మవలస గ్రామాలు పార్వతీపురం తాలూకాలో ఉన్నాయి. వెంకట నిశ్శంకుని మూడవ భార్యపాపమ్మ. ఈమె కుమారుడు కన్నన్న. అతని భార్య సీతమ్మ. పాపమ్మవలస బొబ్బిలి తాలూకాలోనూ సీతమాంబపురం పార్వతీపురం తాలూకాలోనూ ఉన్నవి.

సంగమువలన గ్రామనామమును గూర్చి రెండు అభిప్రాయములు నున్నవి. నిశ్శంకచరితము,[19] శ్రీమన్ నిశ్శంకచరిత్రము.[20] సంగ్రామ విరతి లేక సంగ్రామ వసతి యనునదియే ఉచ్చారణ వశమున తెలుగులో సంగమ వలసగా మారినదని పేర్కొనుచున్నవి. "ఇది కృత్రిమ వ్యుత్పత్తిగా దోచుచున్నది. సంగ్రామ శబ్దము సంగమ కావచ్చునుగాని విరతి, వసతి శబ్దములు వలస కానేరవు. ధ్వని పరిణామ సూత్రములకీ రూప పరిణామ నిరూప పద్ధతి పూర్తిగా విరుద్ధము .... ఇది సంఘము వలసయో లేక సంగమ (= పాడిక, కూటమి) వలసయో కావచ్చును."[21]

'సంతోషపురము'లు పార్వతీపురం కురుపాం తాలూకాలలో నున్నవి. మొండెము కొల్లాం అడవులలో పాలకొండ పితూరిదారుల నెదిరించిన తెల్లదుమ్ము ముఖాసాదారు సంతోషరాయని[22] పేర ఈ గ్రామనామాలు ఏర్పడినట్లు తోచుచున్నవి. 'పాయకపాడు' సాలూరు తాలూకాలో నున్నది. గ్రీభార శాపవిమోచనము పోరాముసంస్థానము దీనబంధు అనేవానికి జయపురపాలకునిచేత పాయకరావు అను బిరుదుతో ఇచ్చినట్లు తెలుపుతోంది. పాయకరావు అనగా యుద్ధమునందు ముందు నిలుచువాడని ఒక అర్థము వున్నది. ఈ బిరుదు సత్యవరం, అనకాపల్లి జమిందారులకును గలదు. కాగా, 'పాయకారి' అనగా తాత్కాలిక కౌలుదారిని అని వేరొక అర్థమున్నది. ఈ పాయకారి శబ్దమే పాయకరావు అయుండవచ్చు. పోరామువారి బిరుదు మీదుగా పాయకపాడు ఏర్పడడానికి వీలున్నది. 'పజ్జి' అనగా ఒరియాలో గ్రామపెద్దయని అర్థము. అలాగున ఏర్పడినది పెదపజ్జిపాలెం (విజ), పెదబంటుపల్లి (చీ), కౌలువాడ (భో)మొ॥ కూడా ఈ విధమైన ఈనాము గ్రామ నామములుగనై తోచును.

ఒక ప్రాంతపు ప్రజలు కారణాంతరాలువల్ల వేరొక ప్రాంతానికి వలసపోయి స్థిరపడినపుడు పాతచోటుపై మమకారముతో క్రొత్త గ్రామానికి ఆపేరే పెట్టుకోవడం ఒక రివాజు. ఈ క్రింది గ్రామ నామములు ఆ విధంగా యేర్పడి ఉండవచ్చు. ఉదా :- టెక్కలి (నె), ఇచ్ఛాపురం (కు). ఇవి రెండు ఈ జిల్లాకు ఆను కొని వున్న శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ గ్రామములు. నేటి శ్రీకాకుళం జిల్లాలో ఉండిన దేవాది సంస్థానం దేవిడి అని కూడా జన వ్యవహారంలో చెప్పబడేది. దేవాడ గ్రామనామముగా చీపురు పల్లి, శృంగవరపుకోట తాలూకాలలో ఉన్నది. విశాఖజిల్లాలో కల భీమునిపట్నాన్ని భీమిలి అని కూడా అంటారు. ఆగ్రామ నామాన్ని పోలినదే భీములి (వి). శ్రీకూర్మం ఈ మండలంలో ప్రముఖ దేవస్థానము. కూర్మవరం (వి), కూర్మనాధపురం (బొ) ఆ పేరు వలన వచ్చినవి. నేడు ఒరిస్సా రాష్ట్రములో ఉన్న గునుపురం పోలినవి గుమపురం (భో), గుణనుపురం (పా).

ఒకే పేరుతో వివిధ తాలూకాలలో గ్రామములున్నవి. ఉదా :-రామభద్రపురం (విజ & శృం & సా) శిరిపురం (విజ&వి) గుడివాడ (భో & వి), అలమండ (పా & శృం) సుమిత్రాపురం (చీ & చొ).

ఒకే పేరుగల గ్రామాలను వేరు వేరుగా గుర్తించడానికి ఆయా పేర్ల ముందు చిన్న, పెద్ద అని విశేషణము చేర్చడం ఒక ఆనవాయితీ. ఈ విశేషణానికి ఆధారాలు ఆయా గ్రామాల జనాభా, వైశాల్యము, ప్రాచీనతలలో యేదైనా కావచ్చు. ఉదా:- పెదనంది పల్లి - చిననందిపల్లి (చీ); పెదబొండపల్లి - చినబొండపల్లి(పా) పెదబత్తివలస - చినబత్తివలస (భోగ), పెదతాడివాడ - పినతాడి వాడ (భోగా), పెదవేమలి - పినవేమలి (విజ), పెదతరిణి - పిన తరిణి (నెల్లి), పెదచామలాపల్లి - పినచామలాపల్లి (గజ), పెద కాడ - చినకాడ (గజ), పెదగుడిపాల - చినగుడిపాల (వి).

క్రొత్తగ ఏర్పడిన గ్రామాలను అదే పేరు గల పాత గ్రామాల నుంచి వేరుగ గుర్తించడానికి ఆయా గ్రామ నామముల ముందు పాత క్రొత్త అని విశేషనామములు చేర్చటం సులభమైన పద్ధతి. ఉదా :-పాతబగ్గాం - కొత్తబగ్గాం (గ). భౌగోళిక విశేషము లను ముందు చేర్చటం చేత కూడా ఒకే పేరు గల గ్రామాలను వేర్పరచి చెప్పుట కలదు. ఉదా :- ఎగువమండ - దిగువమండ(కు), ఎగువకొండపత్తి - దిగువకొండపత్తి (శృం), ఇతరమైన ప్రత్యే కతను పేర్కొని కూడా ఒకే పేరున్న గ్రామాలను వేరు వేరుగా గుర్తించుకొనుట ఉన్నది. ఉదా :-కొండగంగ్రేడు-కోటగంగ్రేడు- పల్లిగంగ్రేడు (నె), రావివలస-ముడిదాం రావివలస (చీ), అమితాను రావివలస (భో), లింగాలవలస - కొండలింగాలవలస - మొఖాసా లింగాలవలస (గ), బాతు గుడబ-కొండగుడబ (కు), భోగాపురం- కోటభోగాపురం (భో), కొత్తవెలగాడ (విజ), కొండవెలగాడ (నె).

వేర్పాటుగ గుర్తించడానికి వీలు కల్పించని గ్రామ నామము లకు ఈ క్రిందివాటిని ఉదాహరణలుగ పేర్కొనవచ్చు. ఉ॥ దా॥ మీసాలపేట (నె & గ), గదబవలస (గ & చి & ప), భీమవరం (శృం & చీ), రామచంద్రపురం (మూడు బాడంగి తాలూకా), ఆల మండ (విజ & పా). భైరిపురం (చీ & కు), సుమిత్రాపురం (చీ & జ & బొ).

వలసలు

ఈ జిల్లాలో 'వలసలు' బహు విరివిగా గ్రామనామములుగా కానవస్తున్నాయి. ఒక్క క్రొత్త వలసలే 8, 7 తాలూకాలలో ఉన్నాయి. ఒక్క సాలూరు తాలూకాలోనే 3 చింతల వలసలు ఉండగా భోగాపురం తాలూకాలు మరియొక చింతల వలస ఉన్నది. గజపతినగరం తాలూకాలో స్వాముల చింతల వలసఉన్నది

వ్యక్తులపేర ఏర్పడిన వలసలు

అక్కందొర, పోలినాయుడు, సాంబన్న, తురకనాయుడు, సూరపుదొర, గంగమ్మ, అక్కమ్మదొర, కన్నప్పదొర, సుభద్రమ్మ, సోమినాయుడు (పా), గంగమ్మ దొర, కోసుదొర, నారాయణప్ప, జగ్గన్న దొర, పాపమ్మ రాముడు, మెంబన్న, లింగం, కామన్న, నారనాయదేవు (భో), గజరాయని, రంగప్ప (బా), యేటకాని. పాలన్న (సా). గులమ్మ, తాడెందొర, సారయ్య (గ), కొల్లయ్య (భో), అప్పన్న, శివ్వన్న దొర, శ్యామయ్య, రామాయ, భుజరాయ, గోపన్న, పోతయ్య (చీ),పాలన్న, చంద్రప్ప, ఖాసాయి, నాయుడు, పాపయ్య, మొక్కయ్య. బంగారు, జగ్గదొర, యెలసామంతు, తెన్నుసామంతు (సా).

జాతులు, వృత్తులు, కులముల పేర్లవలన ఏర్పడిన వలసలు

గొల్ల (కు), గొల్లల(చీ), పురోహితుని (సో), కమ్మ (భో), చౌదరింటి (బా), చాకి (భో).

జంతువులు, చెట్లు చేమలు మొ॥ బట్టి యేర్పడిన వలసలు

గుఱ్ఱపు (సా), ఏనుగు (చీ), తోట (సా), పూతిక (కు&చీ), వెలగ (భో & బా), రావి (చీ & సా) ఖర్జూ (బా), నిమ్మల (చీ), కంది (పా), పీతల (సా), పత్తికాయ (చీ), వుల్లేరు (బా), మామిడి. పనస (సా), జిల్లేడి (సా), గచ్చల (చీ), పీతల (సా), గేదెల(భో).

ఇతర వలసలు

ఉదా:- మూల, మూక, కట్టి, కట్టు, తుపాకి, డత్తి, దాగడ, గారిళ్ళ, ముచ్చెర్ల, గార్ల, మిర్తి, ఉత్తి, [చీ].

పూడి, పోడు, పాడు, ఏలు, లంక, గడ్డ, ఉప్ప, పాక, రేవు, కోన, చెర్ల, గుంట, మెట్ట, మడగ, గూడెం, పట్టి, లోవ, ప్రోలు, ఓలు, గుడబ, భద్ర, చెర్ల, అగ్రహారం, పేట, పాలెం, వాడ, మొదలైన దేశ్యాలు తుట్టతుదనుగల గ్రామనామములు ఈ జిల్లాలో ఉన్నవి. ఉదా :- మేకలపాడు [విజ], వెదురువాడ (విజ), పిట్టాడ [గ]: కిట్టుబర్తి [విజ], బుడతనపల్లి, [విజ], పెదమజ్జి పాలెం [విజ], ఖాదీసాయిబ్ పేట [విజ], రామిస్వామిపేట [శృం] ఎల్విన్ పేట [కు], ద్వారపూడి [విజ], తాటిపూడి [శృం], ఫకీరు కిత్తలి [నె], తాతవారికిత్తలి [నె], ముచ్చెర్ల [గ], ఇనువెంటి వెంకన్నాగ్రహారం [గ], లోతుగెడ్డ [గ], తమిడేరు [గ], డెందేరు [వి], ముంజేరు [భో], దారపట్టి [శృం], వీలుపట్టి [వి], మల్లివీడు [వి], రాజపులోవ [భో], వుద్దవోలు [పా], మామిడివెంట [పా] డంగభద్ర [పా], బాలగుడబ [పా].

పై వివరణల వలన ఈ జిల్లా గ్రామ నామముల విషయములో కొన్ని సామాన్య ధర్మములను గమనించవచ్చును. 1. అధిక శాతము గ్రామనామములు ఈ ప్రాంతము నేలిన రాజవంశముల. జమిందారుల, తదాశ్రితులైన రాజోద్యోగుల, కవి పండితుల గృహ నామములుబట్టియు, వేళ్ళనుబట్టియు ఏర్పడినవి. 2. 17వ శతాబ్దము నుంచి ఈ ప్రాంతమునందు గ్రామములు ఎక్కువగా ఏర్పడినట్లు తోచును. 3. ఈ జిల్లాలో ఏజన్సీ ప్రాంతము ఉండుటయు ఒక వైపు ఒరిస్సా రాష్ట్రమునకు సరిహద్దుగా నుండుటను బట్టి గ్రామ నామములపై ఆయా ప్రభావములు కనబడుచున్నవి. 4. వలసలు ఎక్కువగా ఉండుట, ఒకే పేరుగల గ్రామములుండుట బట్టి ప్రజలు ఒక ప్రాంతంనుంచి వేరొక ప్రాంతమునకు తరలివెళ్ళి నూతన గ్రామములను ఏర్పరచుకొన్నట్లు తెలియుచున్నది. 5. ఇతర జిల్లాల గ్రామనామ పరిశోధనములతో పోల్చిచూచినను ఈజిల్లాలో ప్రత్యేకతలంతగా ఉండునని తోచకున్నది. 6. గ్రామ నామములుంచుటలో చాలవరకు సామాన్య ధర్మములు ఈ ప్రాంతమందు కూడా పాటించబడినవి. 7. కొన్ని గ్రామ నామముల పురాతన నామము లేమైయుండునో తెలుసుకొనుటకు సాహిత్యము, శాసనాధారముల ద్వారా ఇంకను పరిశ్రమించి తెలుసుకొనవలసి ఉన్నది. 8. ఈ ప్రాథమిక పరిశీలన ఈ జిల్లా గ్రామ నామముల విషయమై ఇంకను విస్తృతమైన శాస్త్రీయ పరిశోధన జరుగవలసిన ఆవశ్యకతను గుర్తించుచున్నది.

అధోజ్ఞాపికలు

1. గ్రామనామముల జాబితాను అందజేసిన ఆం॥ప్ర. ప్రణాళిక & గణాంక కార్యాలయము, విజయనగరము వారికి రచయిత కృతజ్ఞత.
2. 'జామి - 1971 - ఎ సమ్మరీ ఆఫ్ ఎక్స్‌కవేషన్ రిపోర్ట్' ప్రొఫెసర్ ఓ. రామచంద్రయ్య, డాక్టర్ బి. ఆర్. సుబ్రహ్మణ్యం: ఎమ్. ఎస్. శర్మ కమ్మెమొరేషన్ వాల్యూమ్ (ఎడ్). డాక్టర్ ఆర్. సుబ్రహ్మణ్యం [హైదరాబాదు, 1976] అదే డి. భాస్కరమూర్తి, 'లేట్ స్టోన్ ఏజ్ కల్చర్ ఇన్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్.'

† సౌలభ్యము కొరకు కుండలీకరణములలో తాలూకాల పేర్లు సంక్షిప్తముగా పేర్కొనబడినవి. ఆ సంజ్ఞా వివరణ : కు = కురుపాం, పా = పార్వతీపురం, సా = సాలూరు, బొ = బొబ్బిలి, బా = బాడంగి, భో = భోగాపురం, చీ = చీపురుపల్లి, గ = గజపతినగరం, నె = నెల్లిమర్ల, విజ = విజయనగరం, శృం = శృంగవరపుకోట, వి - వియ్యంపేట.

3. 'కోరాడ, తామరాడ, గోనేడ ఇత్యాది నామాలలో శ్రుతమౌతూన్న ఆడశబ్దము వాడ శబ్దానికి శృంగభంగము కలిగితే నిష్పన్నమైనట్లు తోస్తూంది'- చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి 'కథలు-గాథలు', తృతీయభాగం, 'గ్రామ నామాలు', పే॥ 409, 500 "…. ఆయా నామాలలో వుండుకున్న పిల్లి మొట్ట మొదట పల్లిలోనుంచి వల్లిగా మారి తుట్టతుదకు విల్లిగా నవతరించిందేమో విజ్ఞులు విచారింపగలరు." [పైది] ప్రస్తుతము ఉదా :- ఉత్తరాపల్లి ఫిర్కాలోనే ఉత్తరావల్లి గ్రామము ఉంది.
4. శిలావంశచరిత్రకు చూ: **JHRS - Vols. XXV & XXVI**
5. ఈ సందర్భములో అవసరమైన జయపురపాలకులు వారి పరిపాలనా కాలములు : వినాయకదేవు [1443-1476], భైరవదేవు [1510-152], విశ్వంభరదేవు I [1527-157], బలరామదేవు I [1571-1597], వీరవిక్రమదేవు [1637-1669], రెండవ విశ్వంభరదేవు [1672-1676], హరిదేవు [1661-1684], రెండవబలరామదేవు [1684-1], ముకుందదేవు [16వ శతాబ్దము ఉత్తరార్ధం], మొదటి రామచంద్రదేవు [1708-1711], మూడవ బలరామదేవు [1711-1713], మూడవ విశ్వంభరదేవు [1713-1752], మొదటి విక్రమదేవు [1758-1781], రెండవ రామచంద్రదేవు [1781-1825], రెండవ విక్రమదేవు [1825-1 60], మూడవ రామచంద్రదేవు [1860-1889], మూడవ విక్రమదేవు [1875-1920], నాల్గవ రామచంద్రదేవు [1893-1931].

6. ఉదా :- పార్వతీపురం పాలకులలో విశ్వంభర దాట్రాజు, సాలూరి పాలకులలో రామచంద్రరాజు, మొ॥

7. మేరంగి పాలకులలోని గంగరాజు నామధేయునితో 1803లో శాశ్వత పరిష్కారం జరిగినది.

8. అసలు పూసపాడు [కృష్ణా] అనే చోట నివసించటం చేతనే వీరికి పూసపాటి వారనే గృహనామం వచ్చినట్లు ఒక సిద్ధాంతం వున్నది.

9. స్థలదుర్గ కుంభిశాపుర నికేతనులని పూసపాటివారి బిరుదు. బిరుదావళులలోనూ సాహిత్య గ్రంథాలలోనూ పేర్లు సంస్కృతీకరించబడటం ఉన్నది. మరియొక ఉదాహరణ :- పాచిపెంట. ఇది సాహిత్య గ్రంథాలలో ప్రాక్పురి, ప్రాచీపురి ఇత్యాదిగా వ్యవహరించబడింది.

10. మొదటి ఆనందరాజుకు ముందుగా రాజ్యపాలన చేసిన వెంకటపతిరాజు విజయనగరానికి పడమరగా గోస్తనీ తీరమునున్న కొత్తాము అనే గ్రామాన్ని 1715 సం॥లో వెంకటపతిరాజపురము అనే క్రొత్తపేరుపెట్టి బ్రాహ్మణులకు అగ్రహారంగా దానమిచ్చినట్లు శాసనాధారమున్నది.

ఆ దానశాసన మిట్లున్నది: "శ్రీమాన్ వెంకటపతిః శ్రితనిధిః శ్రీ పూసపాట్యాన్వయః .... కొత్తాము సంజ్ఞం పురం । కృత్వా వేంకటరాజా పట్టణ మతిప్రఖ్యాత మూర్వ్యాం సదా । "మా మొఖాసానుతు పొట్నూరు సీమ తాలూకు కొత్తాము గ్రామములోను .... యీ చొప్పున మర్యాద చేసి వేంకటపతిరాజపురం పేరుపెట్టి .... యిస్తిమి" అయితే యీ వెంకటపతిరాజపురం ఇప్పుడు గ్రామనామంగా కానరాదు. కొత్తామే గొట్టాముగా కానవస్తోంది.

11. పాచిపెంట సంస్థాన పాలకులలో మొదటి జమిందారు కూడా అన్నమరాజు నామధేయుడే.

12. పెద విజయరామరాజు [1708-1757], చిన విజయరామరాజు [1748-1794], విజయరామ గజపతి [1826-1879], విజయరామ గజపతి (1883-1922), విజయరామ గజపతి [1924]. పాలకొండ జమిందారీలో కూడా విజయరామ, సీతారామ, నీలాద్రి, వెంకటపతిరాజ నామధారులు లేకపోలేదు గాని ఆ సంస్థాన చరిత్ర ఆది నుంచి అంతంవరకు చీకాకులతోనే సాగినది కనుక ఆ పాలకులపేర్లు గ్రామ నామములగుటకు వీలు తక్కువ. పైగా ఈ తాలూకా లన్నీ పూర్తిగా విజయనగర సంస్థానానికి చెందినవి.

13. విజయనగరంలోని అయ్యకోనేరు ఈమె త్రవ్వించినదే. కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉండటంచేత కాబోలు, దీనిని హైకోనేరు అని అంటున్నారు. జనం నోళ్ళలోబడి చెరువుల పేర్లలాగే ఊరి పేర్లు కూడా అపభ్రంశము చెందుతూ వుంటాయి.

14. సంస్థాన సరిహద్దులనుబట్టి గ్రామనామముల పుట్టుపూర్వోత్తరాలను సర్వత్ర నిర్ణయించలేము. ఉదా :- బొబ్బిలి సంస్థానమునందలి అన్నమరాజుపేట తుమ్మలపల్లి మొ॥ గ్రామములు విజయనగరము జమిందారులకు కౌలునకీయబడుచుండెడివి. కురుపాల సంస్థాన పాలకుడైన శివరామరాజు (1740-1794) తన రాజ్యసమీపములోని మేరంగి సంస్థానమును బలవంతముగా నాక్రమించుకొని స్వీయరాజ్య సీమలను విస్తరింపజేసినాడు. 1889లో కురుపాం వారు చెముడు ఎస్టేట్‌ను కొనుగోలు జేసారు.

15. చెముడు పాలకులలో ఒక నారాయణ గజపతిరాజు కలడు. కాని ఈ గ్రామ నామముతో అతనికి సంబంధము లేదు. గ్రామము విజయనగరం వారి ఇలాకా లోనిది.

16. విజ్ఞాపురపు వెంకట కోదండరావు పంతులు (అను) "విశాఖపట్నము జిల్లా వృత్తాంత సంగ్రహము" (శ్రీ వేణుగోపాల ప్రెస్, విశాఖపట్నం, 1889) పు-502

17. సంస్థాన ప్రదాత చికాకోలు నవాబు షేర్‌మహమ్మద్‌ఖాన్ పేర నిర్మితమైన బెబ్బులి (షేర్ అనగా పెద్దపులి) జనుల వాడుకలో బొబ్బిలి అయినదనే వివరణ ధ్వని పరిణామ సూత్రములమేరకుకూడా విరుద్ధముగా లేదని విజ్ఞుల అభిప్రాయము.

'షేరనఁ దురుష్క భాషను జెలఁగను బలి
పెద్దపులి యను పదమయ్యె బెబ్బులియన
బెబ్బులియె నాఁడు నాఁటికి బొబ్బిలియనఁ
బొలిచె నక్షరములు మార్పుఁ బొంద నిపుడు'
—ప్రపదన పారిజాతము, అవతారిక, పు-8

18. నిష్కల సింహాచల సిద్ధాంతి 'కిమ్మూరి వంశావళి, 54

19. 'అతఁడు నందా పురాధి పత్యహిత సమితి
సమితి నడగించుటకు నొక్క చక్కి శిబిర
సన్నివేశంబు నొనరించి జయము గొనుట
వ్యవహృతంబయ్యె సంగ్రామ వసతి నాఁగ'

—నిశ్శంక చరితము, 9.

20. శత్రుగణ సంహరణ
శ్రీనారయుట నప్పురి సంగ్రామవసతి యనెడిపేరఁ
గరమలరారెన్'

—శ్రీ మన్నిశ్శంక చరిత్రము. 44,

'తెలుఁగు పలుకున సంగమవలన యనుచు
నచటి వారలు పలుకుట నదియువరుస
విశ్రుతంబయ్యెఁ జాల నుర్వీతలమునఁ
బామరప్రాజ్ఞ సామాన్య భణితి నిపుడు'
నిశ్శంక చరిత్రము,10
నేమాన సూర్యప్రకాశం, శ్రీమన్ నిశ్శంక చరిత్రము
(స్వేచ్ఛావతి, బరంపురం, 1913).
వరవస్తు వేంకట రంగాచార్యులు శ్రీమన్ నిశ్శంక చరితము,
(విశాఖపట్టణము, 1886)

21. తూమాటి దొణప్ప, ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణము, [ఆంధ్ర విశ్వకళా పరిషత్తు, వాల్తేరు, 1969] పుట 477, 478

22. విశాఖపట్నం జిల్లా వృత్తాంత సంగ్రహము, పు 547 అధోజ్ఞాపిక.

నా గీతి

"కన్న"

నీ గుండె నేనుగా
నా గొంతు నీవుగా
కాలమే గీతమై
రాలనే కరగించె

నా పెదవి పులకింప
నీ తరళ హాసాలు
నా మదిని పొంగాయి
నవరస తరంగాలు

నా కనుల నర్తింప
నీ కలల హరివిల్లు
నా ఊహ సాగాయి
నీహార మాలికలు

నా యెదను నినదింప
నీ హృదయ మాధురులు
నా వెంట నడిచాయి
నిర్నిద్ర కవనాలు

నీ గుండె నీదిగా
నా గొంతు నాదిగా
కాలమే శిల్పమై
పలుకకే నిలిచింది!

కార్యా లోకటైనా కారణాలు వేరు

శ్రీ వసంతరావు వేంకటరావు

కార్యాలొకటే కారణాలు మాత్రం వేరు.

శాశ్వత అయస్కాంత ముంది,
దాని నావరించి అయస్కాంత క్షేత్ర ముంది;

ఆ అయస్కాంత క్షేత్ర తీవ్రత
అయస్కాంతం తయారైనప్పుడే నిర్ణయమయింది.

తగిన జాగ్రత్తలు వహిస్తే క్షేత్ర తీవ్రత
తగ్గకుండా కాపాడు కోవచ్చు.

అయస్కాంతం జేబులో వేసుకొంటే
అయస్కాంత క్షేత్రం కూడా జేబులోనే ఉంటుంది.

★ ★ ★

ఒక లోహపు తీగెచుట్ట లోంచి
విద్యుత్తు ప్రవహింప చేస్తే
దాని చుట్టూ అయస్కాంత క్షేత్ర మావిర్భవిస్తుంది.

విద్యుత్తు ఉన్నంతవరకే దాని ఉనికి
అది విద్యుదయస్కాంత క్షేత్రం.

అయస్కాంత క్షేత్ర ధర్మాలూ, ఈ
విద్యుదయస్కాంత క్షేత్ర ధర్మాలూ ఒక్కటే!

రవంతైనా వ్యత్యాసం లేదు
అవి సర్వ సమానం!

కాని, విద్యుదయస్కాంత క్షేత్ర తీవ్రతను
యథేచ్ఛగా మార్చుకోగలం.

విద్యుత్ ప్రవాహ సత్వం ఎక్కువ చేయడం వల్లనో,
తీగెచుట్టల సంఖ్య ఎక్కువ చేయడం వల్లనో
అయస్కాంత క్షేత్ర తీవ్రత పెంచవచ్చు.

రెండూ అయస్కాంత క్షేత్రాలే.

ఒకదానికి కారణం శాశ్వత అయస్కాంతం,
రెండోదానికి కారణం తీగెచుట్టలోని విద్యుత్తు.

మొదటిది పరిమితం,
రెండోది అపరిమితం!

మానసిక శక్తివల్ల హిప్నటిజం, మెస్మరిజం
వంటివి సాధించవచ్చు;

వాటివల్ల జనాన్ని ఆశ్చర్యచకితుల చేయవచ్చు.

యోగాభ్యాసంవల్ల ఆత్మశక్తి పెంపొందించుకొని
అణిమాద్యష్ట సిద్ధులు – అణిమ మహిమ
గరిమ లఘిమ ప్రాప్తి ప్రాకామ్య
ఈ శత్వ వశిత్వములు – సంపాదించవచ్చు

అవి అతీంద్రియ శక్తులకు మూలం,
అట్టి అతీంద్రియ శక్తుల వల్ల కూడా
జనాన్ని ఆకర్షించవచ్చు. అయితే
జనానికి రెండూ ఒకే విధంగా కనిపిస్తాయి.

అంతమాత్రాన మానసిక శక్తి
ఆత్మశక్తిని సవాల్ చేసి
సాధించే దేమీ లేదు.

శాశ్వత అయస్కాంతం విద్యుదయస్కాంతాన్ని
సవాల్ చేస్తే ఓడి పోయేది శాశ్వత అయస్కాంతమే.

కార్యాలొకటైనా కారణాలు వేరు
అనే నిజం తెలుసుకోకుండా
కార్యాన్ని బట్టి కారణాన్ని
ఊహించడంలో పొరపాటు జరిగితే
మనసులో గందరగోళం చెలరేగి
అనవసరమైన సవాళ్ళకు దారితీస్తుంది.

"రేషనలిజం" అంటూ "ఇరేషనలిజం"
వైపు పరుగెత్తి అలజడి కలిగిస్తుంది.

★ ★ ★

కార్యాలొకటే అయినా కారణాలు వేరు
కావచ్చుననే సత్యం గ్రహించిన విజ్ఞులకు
సవాళ్ళతో నిమిత్తం లేదు!

—z—

డా. ముదిగొండ వీరభద్రయ్య

అనుభూతి కవిత్వం - స్వరూప స్వభావ ప్రయోజనాలు

ఈ మధ్యకాలాన "అనుభూతి" కవిత్వం అన్న పేరుతో కొంత మంది కవితలు రాస్తున్నారు. ఈ విధమైన కవిత్వం రాస్తున్న వాళ్ళల్లో ఉత్తమ స్థాయిలో రచిస్తున్న వాళ్ళు వేగుంట మోహన ప్రసాద్, కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, శ్రీకాంత శర్మ, ఇస్మాయిల్ గారలు. అనుభూతి కవిత్వం మీద కొంత చర్చ అవసరం.

అభ్యుదయ కవిత్వం స్పష్టరూపాన్ని 30లలో పొందడానికి ముందు భావకవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక వెలుగు వెలిగింది. భావకవిత్వం అనగానే ఆంగ్ల సాహిత్యంలో వచ్చిన రొమాంటిసిస్ట్ కవిత్వమూ, దానిమీది విమర్శలనూ తడుముకొని వాటినే మన భావ కవిత్వానికి అతికించారు విమర్శకులు. భావ కవిత్వానికి పూర్వం వచ్చిన తెలుగు కవిత్వం కవిత్వం అనిపించ లేదు కొందరికి. కేవలం కొన్ని ఆలోచనలను ఛందస్సులో ఇమిడ్చి కవిత్వంగా చూపబోయారు. గురజాడవంటి వారి 'దేశభక్తి' గేయాన్ని కూడా కవిత్వంగా భావించడం జరిగింది. 'ఆకులందున అణగి మణగే / కవిత కోకిల పలుక వలెనోయ్' అన్న స్ఫూర్తిని చివరకు గురజాడతో సహా చాలామంది పట్టించుకోలేదు. అలాంటి రోజుల్లో రాయప్రోలు కొత్త కొత్త భావచిత్రాలతో, పదచిత్రాలతో తెలుగు కవిత్వానికి పునరుజ్జీవనాన్ని కల్గించారు. ఆయనలో భావ కవిత్వం బీజరూపంలో మాత్రమే వుండగా, దాన్ని అత్యున్నత శిఖరాలకు అధిరోహింపజేసిన వ్యక్తి దేవులపల్లి. 'ఆకులో ఆకునై, పూవులో పూవునై, కొమ్మలో కొమ్మనై, నునులేత రెమ్మనై, ఈ యడవి దాగిపోనా' అన్న పాదాలతో భావకవిత్వం స్పష్టరూపంతో సాహిత్య చరిత్రలో ఒక విశిష్టస్థానాన్ని సంపాదించుకో గల్గింది.

'భావకవిత్వం' అన్న పదబంధంలోని 'భావం'పైన అనేక అభిప్రాయలు వ్యక్తీకరించబడ్డాయి. భావంలేని కవిత్వంవుంటుందా? ఉండదుకదా ? మరి ఈ 'భావం' ఏమిటి ? ఈ శాఖకింద వచ్చిన కవిత్వాన్ని చదివేక ఈ 'భావం' వ్యాసాల్లోనూ, ఉపన్యాసాల్లోనూ ఉండే ఆలోచనలు కావనీ, ఇది 'రసభావ' మనీ స్పష్టపడ్తుంది. రసభావమంటే ?.... రచయిత తన రచనకు ప్రేరకమైన ఏ అనుభవాన్ని పొందాడో ఆ అనుభవాన్ని పాఠకుడు పొందేటట్లు చేసేదే: ఇది రసంగా పరిణమించనూ వచ్చును. పరిణమించక పోవచ్చును కూడా. కాని రచయిత అనుభూతి మాత్రం పాఠకునికి అందడమే దీని ధ్యేయం.

ప్రాచీన కాలంలోని కవిత్వంలో మాత్రం ధ్యేయం ఇది కాదా ? అని అంటే ?_ ఇదే _ కాని కథ, దాని శిల్పమూ, వర్ణనలూ కల్గించిన సౌకర్యం భావ కవిత్వంలో చాలా భాగం లేవు. ప్రాచీన కవిత్వంలో పౌర్వాపర్యాలను తొలగించగా అక్కడక్కడా కన్పించే మంచి కవిత్వమంతా భావ కవిత్వమే. నాటకాల్లోని సౌందర్యం కథా కావ్యాల్లో లేదు. కథా కావ్యాల్లోని సౌకర్యం భావకవిత్వంలోలేదు. అందువల్ల భావకవిత్వం రాయడమూ, దాన్ని ఆనందించడమూ, కష్టమే. భావకవిత్వంలో కవిత్వం కానిదేదీ ఉండటానికి వీలులేదు. ప్రాచీన కావ్యాల్లో కవిత్వానుభూతి కలుగడానికి - ప్రోద్దీపకంగా కవిత్వం కాని రచనచాలా ఉండేది. ఈ శీర్షిక కిందవచ్చిన కవిత్వం లోని ఉత్తమ రచనలలో అలా లేదు. ఇది అచ్చ కవిత్వం.

అనుభూతి కవిత్వం అన్నది ఈ 6, 7, 8 దశకాలలో వస్తున్న కవిత్వం. ఇది భావ కవిత్వం మీది పరిణామం. రూపంలో భావకవిత్వం ఉపజాతి, దేశీయ ఛందాల్ని ఎక్కువ ఆదరించగా, అనుభూతి కవిత్వం 'వచనాన్ని' తనకు రూపంగా ఎంచుకొన్నది. 'భావకవిత్వం' అన్న పేరులోని అస్పష్టత ఈ 'అనుభూతి కవిత్వం' అన్న పేరుకి లేదు. 'భావకవిత్వం' అంటే ఏమిటో నిర్వచించి, చేసినంత వ్యాఖ్యానం 'అనుభూతి కవిత్వం' అంటే ఏమిటో చేయాల్సిన అవసరం లేదు. 'భావం' అన్నదాని అర్థాన్ని మించి 'భావకవిత్వం'లోని 'భావానికి' చెప్పాల్సి వచ్చింది. అందువల్ల అక్కడ అస్పష్టత చోటు చేసికొన్నది. అనుభూతి కవిత్వానికి ఆ అస్పష్టత లేదు. అనుభూతి కవిత్వ స్వరూప స్వభావాలు అర్థం చేసికోవడానికి కొన్ని ప్రధాన రచనల్ని పరిశీలించాలి.

"మునిగిపోతూన్న పడవ దిక్కు చూడు
అరుణవర్ణ పశ్చిమాద్రిని జారిపోతూన్న
కమలా కాయని చూడు, నన్ను చూడు
ఎంపుటాకుల మధ్య రాలిపడిన ఒకే ఒక్క
రోజాపంక చూడు, నన్ను చూడు
మదపుటేనుగు నోట కరచిన గడ్డి
పరకని చూడు, నన్ను చూడు."

"ఆఖరి ఆశ్రమం" [చితి చింత, పు. 4]

వేగుంట మోహనప్రసాద్ అనుభూతి తీవ్రతకు ఈ గేయం మంచి ఉదాహరణ. 'ఇక తనకున్న కాలం కొద్ది'— అన్నది ఆయన చెప్పదల్చుకొన్నది. ఇది కవితీకరణ పొందడానికి కావాల్సిన గాఢానుభూతిని తాను పొంది తన స్థితిని మనకు తెలిపాడు- కవి. అయితే మనకున్నూ అవి ఆఖరు క్షణాలనే అనుభవం రావడానికి అతని కవితాశక్తిపై కవితలో వీరవిహారం చేసింది. మునిగిపోతున్న పడవ, అస్తమిస్తున్న సూర్యుడు, చచ్చిన ఆకుల మధ్యన పడిపోయిన గులాబీ, మదపు టేనుగు నోట్లోని గడ్డిపరక— అన్నీ ఒక్క క్షణంలో గతించేవే సుమా ! తానూ అంతే. కథా కమామిషూ లేకుండానే మనని మృత్యువు అనే అనుభూతి దగ్గరకు తీసికొని వెళ్ళగల్గాడు కవి. అయితే ఈ అనుభూతి దుఃఖ మూలకమైంది. కాని ఇది కావ్యంలో ఆనందానుభవానికి హేతువవుతుంది. అందుకే కదా దేవులపల్లి తనని మనసారగా ఏడ్వనిమ్మని కవిత్వంలో చెప్పుకొన్నది :

"వెలుగు చల్లారి పోతూన్న జీవితం
ఇదీ నా దుఃఖానికి హేతువేకానీ
ఇదే సౌందర్యానికి సేతువు." [పై రచనే - పు. 5]

అని వేగుంట దుఃఖమే కావ్యంలో ఏ విధంగా సౌందర్యంగా రూపాంతరీకరణ పొందుతుందో గుర్తించాడు. ఇక్కడి 'సౌందర్యం' అనుభూతివల్ల కలిగే ఆనందంలోంచి పుడుతున్నది. అందుకే రచన విషయపరంగా (ఆత్మాశ్రయంగా) రూపధారణ చేసికొన్నా, అది అందరికీ అనుభవాన్నివ్వ కల్గుతుంది కాబట్టే — ఆ అనుభవం రసానుభూతి కాబట్టే — ఇది 'కవిత్వం' అవుతున్నది.

'సౌందర్యం' కవిరచనలో ప్రదర్శింపబడినంత మాత్రంలో సత్యాన్ని కాని, శివాన్ని కాని రచయిత తన కావ్యంలో ఇముడ్చ లాదని ఖరారు లేదు ! 'భావ కవిత్వం'లో 'తేటి వలపు' వంటి కవితలు 'సుందరా' లైనవే కాని శివకరాలు కావు. కవిత్వానికి కవిత్వంగా విలువ కట్టడం వేరు. ఆ కవిత్వాన్ని సామాజిక ప్రయోజన దృష్టితో వెల కట్టడం వేరు. అనుభూతి కవిత్వంలో ప్రధానమైనది సౌందర్యమే—అంటే అది కవిత్వంగా అత్యున్నత స్థాయిని పొందడమే. ఈ సౌందర్యాన్ని సాధించడానికి కవులు అలంకారాన్ని వాడారు. ఈ అలంకారాలు అనుభూతిలో ప్రాణం పోసికొన్నవే తప్ప కృత్రిమమైనవి కావు.

"రక్తపు మడుగులోని నిశ్శబ్దం విను
పూలు మంటల చొక్కాల్ని తొడుక్కునే దృశ్యంకను"

'ఛాయావాదం' [చితిచింత, పు.58]

అనలంకృతత్వంకూడా అనుభూతి తీవ్రత ఉంటే రాణిస్తుందనడానికి —ఒక భౌతిక సత్యంద్వారా ఒక ఆధ్యాత్మిక విషయాన్ని అనుభూతికి తెస్తున్న మోహన ప్రసాద్ రాసిన ఈ కింది పాదాలు నిరుపిస్తాయి.

"వృథా వర్షమని శపింపకు/ఎంతో దయలేకపోతే గాని ఎవరూ
అధోముఖంగ యీ పృథ్విపై బడరు/పిడుగైనా సరే." [అదే]

దేవతలు అవతరించడాన్ని పై పాదాలు సుందరంగా తెల్పుతున్నాయి.

తాత్త్విక సత్యాల్ని కూడా కవితామయంగా — సుందరంగా చెప్పడంతో తత్త్వ శాస్త్రంకన్నా కూడా కవిత్వం తన ఆధిక్యాన్ని చూపుకొన్న ఘట్టాల్ని 'అనుభూతి' కవితల్లో చూడగలం.

"ఎంతని పరచేది నీకు విశ్వబంధూ, యీ దయార్ద్ర గోళ
మంతా నిండి నీపాద ధూళే నామనస్సునిండి పురదుఃఖపు ధూళిలో
కలిసి నా జ్ఞాపకాల నన్నీ తుడిచేస్తే యింకెక్కడని నిలిచేది నేను."

["అతీతం" - అదే. పు.24]

పరమేశ్వరుడు నిండిన మనస్సులో సంకుచిత 'అహం' నశించి పోవడమన్న విషయాన్ని కవి పై విధంగా చెప్తున్నాడన్న మాట. దైవభక్తులేకాక కవికూడా 'నేను' ను తొలగించుకో లేనిది ఉత్తమ కవిత్వాన్ని రాయలేడు. ఈ విషయాన్నే రాస్తూ పొట్లపల్లి రామారావు.

"కోట్లు విలువ చేస్తుంది మీ కవిత/దాని నుపయోగించు
కోవడంలో ఏమైనా
అభ్యంతరాలున్నాయా మీకు?" / "ఆ కవిత నాదికాదు"ని
జవాబు వచ్చింది.
"అదేమిటి ?"/"నా పేరు చూస్తున్నారా ?"/"అవును."
"నా పేరున్న మాట నిజమే ! కాని ఏదైనా ఒక భావన
లోకం దృష్టిలోకి వచ్చిన వెనక దాని చుట్టు ప్రక్కల
"నేను, నాది" అనే మశ్శకంపను తొలగించి వేయడం
మర్యాద అవుతుంది.

విశ్వజనీనమైన ఒక భావన
ఎవరి హృదయం నుండి అయినా ప్రకటింపబడవచ్చు."

....

"వీలైనంత వరకు మనం వెనుకకు తప్పుకొని
హృదయ తోరణద్వారం గుండావచ్చే/రసదేవతకు
స్వాగతం పలుకాలె."

'ముక్కాలు'. పు-82, 83

ఉత్తమ కవితా భావానికి సంకుచితాహం కర్తకాదనీ, అది రాసే వేళ కవివ్యక్తి విశ్వమంతటి విశాలుడనే సత్యాన్నే కవి పై విధంగా సుందరంగా చెప్పాడు. కవిత్వాన్ని గురించి కవుల కన్నా గొప్పగా ఎవరు చెప్పగలరు ?! అనుభూతిని కవి గాఢంగా పొందినప్పుడు అతడు సామాన్యుడు. కవి ఆ అనుభూతికోసం కాచుకొని ఉంటాడు. ఇదే విషయాన్ని తెల్పుతూ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

"స్వాతివానకోసం/ముత్యపు చిప్పల్లా/నిరంతరం నీ కళ్లు
కాచుకొని వుండి,
అనుభవాల లోకాలోకనం చేస్తూ/ఊగిసలాడుతుంటాయి—
బ్రతుకంతా/ఏదో సడి, తడి,/అలజడి—
నువ్వు సర్తించ లేనంత/సున్నితంగా/ఒకప్పుడు
ఒళ్ళు జలదరిస్తుంది—/ఒకానొక అనుభవం/నీలో
ఘనీభవించే
మౌక్తికక్షణమే-/అప్పుడు నువ్వు/కాళిదాసువి/తాన్‌సేన్‌వి
మైకేలేంజెలోవి !"

'స్పర్శ' [అనుభూతి గీతాలు-పు.52]

జీవిత మంతా సడి-తడి-అలజడి [తపస్సు], కవి ఎంతో జాగ్రత్తగా కాచుకొని ఉన్నాడు 'అనుభవం' కోసం. అతని 'జాగ్రత్ స్థితి'లో అది రాలేదు! అతని 'కాపలా'ను తప్పించుకొని సున్నితంగా అతని హృదయంలో ఒకానొక అనుభవం జారి పోకుండా ఘనీభవించింది. ముత్యపు చిప్పలో పడ్డ మామూలు వానచినుకు ఎలా ముత్యంగా ఘనీభవించిందో—అట్లాగే ఈ అనుభవం కూడా కవిత్వంగా ఘనీభవించింది. కవియైన శ్రీకాంత శర్మ ఎంతో వాస్తవంగా అనుభూతి కవిత్వం మీద చేసిన నిర్వచనం ఇది. అంతేకాదు—ఇది కవిత్వం మీద కవిత్వంకూడా. శ్రీశ్రీ 'కవితా ! కవితా !' గీతంలోని

"నీ ప్రాబల్యంలో/చిరదీక్షా తపస్సమీక్షణలో/
విశ్రుల సమాధిలో
....

"నీకై మేలుకొనిన / సకలేంద్రియములలో / ఏదిరిచిస్తున్నానో...."

....

"క్షణికమై శాశ్వతమైన దివ్యానుభవం/బ్రహ్మానుభవం
కలిగించిన నను కరిగించిన కవనఘృణీ" [మహాప్రస్థానం]

అన్న పాదాలకు పై శ్రీకాంత శర్మ కవిత సమానార్థకం.

ఇలా ముత్యపుచిప్పలా కవి మనోఫలకంపై కొత్తజీవంతో ముద్రవేసికొని రూపాంతరం పొందిన 'అనుభూతి'యే అనుభూతి కవిత్వంలో ప్రత్యక్షమయ్యేది. ఒక విషయాన్ని 'జ్ఞాపకం' చేసి కోవడమన్నది అందరికీ అనుభవంలోని విషయమే. జ్ఞాపకాలనేక రకాలుంటాయి. ఒక్కొక్క జ్ఞాపకం ఒక్కొక్క రీతి 'అనుభూతి'ని పునస్సృష్టి చేయవచ్చును. వాస్తవ జీవితంలోని ఒక్కొక్క అనుభవం పునఃస్మరించడంలో దానికి గాఢత్వాన్నీ, ప్రాణాన్నీ ఇచ్చి ఒక కళా సృష్టి చేస్తాడు.1 శ్రీకాంత శర్మే రాసిన 'జ్ఞాపకం' అన్న కవితను చూడండి.

"జ్ఞాపకం/వేకువలాంటిది /ప్రశాంత దివ్య సౌరభాన్ని
తొలి సూర్యకిరణంవలె/వర్తమానపు అనుభూతిపై/పొదుస్తుంది-
"జ్ఞాపకం/శ్రావణ మేఘంలాంటిది /ఒక్క మెరుపుదెబ్బ కొట్టి
ఇంతకిన్నీరు కుండపోత పెట్టి/వాసనలు మాత్రం మిగిల్చి /
చక్కాపోతుంది—
"జ్ఞాపకం/లొడిమలాంటిది/అది ఎప్పుడో రాలిన పుష్పాల
సంకేతం—
"అగరువత్తి కొస యెరుపులా/అది మనసు అంచున
వెలుగుతుంది.
అరవిందం పొత్తిలిలో హిమబిందువులా
అది అంతరంగాన జేరుతుంది—
తనలోతాను జన్మిస్తుంది / తనలోనే లయిస్తుంది —
ఈ ప్రపంచపు ఉదయాస్తమయాల మధ్య
అది చైతన్యం విసిరిన / వెలుతురు రెక్క —"

(అనుభూతి గీతాలు - పు. 56)

కవిత్వ 'విషయం'గానే ఉన్న ఒక అనుభవం, జ్ఞాపకంగా మనస్సులో చేరి, పునఃస్మరణ వేళనో, రచనా వేళనో కవియొక్క కవితా ధర్మంచేత కవిత్వంగా ఎలా రూపాంతరాన్ని పొందిందో తెల్పుతాయి పై పాదాలు. ఒకరి అనుభవాలు మరొకరు పంచుకొంటే మనస్సులో జ్ఞాపకాల బరువు పెరుగుతుందే తప్ప ఒకరిపై

ఒకరి అనుభవాలు వేయగల్గిన ప్రభావం మాత్రం అంతగా ఉండదు. కాని అదే అనుభవం ఈ కవిత్వంలో 'అనుభూతి'గా రూపాంతరాన్ని పొందినప్పుడు, పరానుభవాలు స్వీయానుభవాలైనప్పుడు ఏ జ్ఞానం వస్తుందో — పాఠకునికి అదే జ్ఞానం కలుగుతుంది. అందువల్లే 'అనుభూతి' అంటే 'సానుభూతి'కి పైరూపం. సానుభూతే — రసానందంగా మారి–అదే చైతన్యపూరితమైన జ్ఞానాన్ని కల్గిస్తుంది. 'కుక్కపిల్లా, సబ్బుబిళ్లా, అగ్గిపుల్లా — కాదేదీ కవిత కనర్హం' అన్న శ్రీశ్రీ 'ఋక్కులు' లోని 'కవిత కనర్హం, కాదన్న దాని అర్థం అన్నింటినీ వర్ణించడం అనికాదర్థం. అన్నింటి మీదా కవి సానుభూతినీ, అనుభూతినీ పొందవచ్చుననీ అర్థం. ఒక వ్యక్తి జీవితంలో కష్టాల పాలయి జీవితంలో మాధుర్యం లేదని నిరాశావాదిగా ఉన్నప్పుడు అతని జీవితానికి ఈ కింది ఇస్మాయిల్ కవిత ఎలా మార్గ దర్శకమవుతుందో చూడండి —

"సెలయేరా, సెలయేరా ! / గలగల మంటో నిత్యం
ఎలా పాడగలుగుతున్నావు ?
చూడు, నా బతుకునిండా రాళ్లు / పాడకుంటే ఎలా ?"

'పాట' (చిలకలు వాలిన చెట్టు - పు. 52)

కష్టాల్లో మునిగిన వాడికి ప్రపంచంలో సుందరంగా కన్పించే, విన్పించే అనేక వస్తు విషయాల వెనుకన తననుభవించే కష్ట పరంపరలే ఉన్నాయని తెలిసి అది సహజమైందనే భావంతో ఉత్తేజాన్ని పొందగల్గుతాడు ఈ కవితని 'అనుభవించా'క. 'అనుభూతి కవి' దెప్పుడూ సౌందర్యదృష్టి. రోజూ ఉదయించే సూర్యుణ్ని శతకోటి కవులింతవరకు శతకోటి విధాలుగా అనుభవించి ఆయన మీద కవిత్వాలు రాసి ఉంటారని చెప్పి తాను రాయకుండా ఉండడు. కారణం — తాను తనదియైన ఒక కొత్త 'అనుభూతి'ని సూర్యోదయాన్ని చూస్తూ పొంది ఉంటాడు .... పొందకుండా ఉండలేడు గనుక. అందుకే ఇస్మాయిల్

"నలుగురాడాళ్ళు/ఒక పిల్లాడితో/ఎన్నిరకాలుగా ఆడుకోవచ్చునో లెక్కేసి చెప్పగలవా?/సరి, ఇదిచెప్పు,/ఉదయాలు అనాదినించీ సూర్యశిశువును / ఎన్ని విధాలుగా / ఎగరేసి పట్టుకొన్నాయో చెప్పుచూదాం.
ఈ / అందానికీ / ఆనందానికీ / అంతెక్కడ"

'పజిల్' (అదే - పు. 42)

ఈ కవిత మొత్తమూ ఇస్మాయిల్ సూర్యోదయంమీద ఎంత గాఢానుభూతిని పొందాడో తెల్పుతున్నది. 'సూర్యశిశువు', 'ఎగరేసి పట్టుకోవడం', 'అందం' 'ఆనందం' అనేవి ఇక్కడ కవితా విషయాన్ని (Subject) కవితావస్తువుగా (Content), (కవినీ, అతడి గేయాన్నీ, దానిలోని విషయాన్నీ, విడదీయరానంతగా పెనవేసి రూపాంతరీకరించాయి.2 కవి అయినవాడికి గుండెనిండా అనుభూతులుంటాయి. వాటిని గుర్తించి కవిత్వీకరించి వెలికి లాగడమే అతని పని! 3 దీన్ని కవిత్వీకరిస్తూ ఇస్మాయిల్

"కిచకిచమని శబ్దమైతే / కిటికీలోంచి చూశాను
ఎప్పటిలాగే చెట్టు / గుప్పిట విప్పి నిలుచుంది.
మరెక్కడిదీ చప్పుడు ? / పరకాయించి చూశాను.
పచ్చని చీకట్లో / ముంచేదో ఎర్రగ కదిలింది.
గుట్టు తెలిసింది : చిలక ! / చెట్టునిండా ఉన్నట్టున్నాయి
గుబురంతా వెతికి వీటిని గుర్తించడం ఒక సరదా.
ముక్కుల దీపశిఖలవల్ల/ ఒక్కొక్క చిలకనే పోలుస్తుంటే
తెలిసిందప్పుడు నాకు/చిలకలు వాలిన చెట్టు లోతైనకావ్యం/
లాంటిదని''

'చిలకలు వాలిన చెట్టు' — పు. 24

'లోతైన కావ్యం' అని అంటే అనుభూతి కావ్యం అనే అర్థం. ఏదో పక్షిని చెప్పకుండా చిలకలు అనడంలోనే ఉంది అందమంతా. ఏదో ఒక భావం, లోతుల్లోకి వెళ్ళని అనుభవం కవిత్వంగా మారలేదు. ఇక్కడ కవి తన అనుభూతులన్నింటినీ — 'ముక్కుల దీపశిఖల వల్ల ఒక్కొక్క చిలకనే పోల్చుకొన్నట్లుగా' — పోల్చుకొంటూ కావ్యగుణాన్నీ, కవితా ప్రాణాన్నీ పొందిన వాటిని మాత్రమే ఏరి ఏరి వెలికి తీస్తున్నాడన్న మాట !

అందరూ అనుభవించే పాణిగ్రహణంలోని 'లోతుని' కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ రాసిన అనుభూతి కవిత కొంత అనుభవానికి తెస్తుంది. అయన

"ఇక్కడ / కోరినంతలో / లభించేది కాదు / కలయిక"
....
"అయినా / ఎలాగో / కలిశాం / విద్యుత్తును ఇలాగే
ప్రవహించనీయి చేయివదలకు"
....
"అనివార్యమూ/అనంతమూ/ అయిన దుర్భర వియోగం/
ఎలాగూ ముందుంది.''
....
"ఈ చేయి వదలకు/ఇలానే/ఈగుండెజ్వాల్ని వెలగనీయి!"

—'చేయివదలకు' [వెలుతురు పిట్టలు–పు. 83]

మానవునిలో ఉండే ఈర్ష్యలూ, అసూయలూ, నిరంకుశ బుద్ధీ, హింసా ప్రవృత్తినీ కవిత్వీకరిస్తూ శ్రీమన్నారాయణ

'మెరక మీదున్న/గుడిసెకో స్థానం/పల్లంలో వున్న/మేడకో స్థానం'

....

'అన్నిటినీ మించిన స్థానంలో/సింహాసనం వేసుక్కూర్చో వాలనుకున్న నియంతలు/నెత్తుటిలో తడిసిన మెట్ల / మీంచి జారి పడ్డారు మట్టిలోకి !'

....

'తలలపైనే/దీపాలూ/తలల మీదే/పుష్పాలూ / యెందు కుంటాయో తెలుసా !?''

"స్నేహితులారా/మనం స్నేహితులం/మన మధ్యనే ఒక సింహాసనం వేసుకొందామనుకొంటే/చెల్లా చెదరై పోతాం / మళ్ళీ కనిపించం సిలువెక్క గలిగినవాడే/సింహాసనానికి అర్హుడు.''

'సింహాసనం' [అదే-పు. 75, 76.]

అని రాశాడు. సింహాసనానికి ఎలాంటి త్యాగం కావాలో కవిత్వ పరంగా చెప్పాడిట్లా. అయితే అనుభూతి నెరుగని విమర్శకులు ఇక్కడెక్కడ కవిత్వం ఉందని ప్రశ్నించ వచ్చును. తన హృదయాన్ని కవి హృదయంతో సమస్థాయికి తేలేనివాడు పాఠకుని గానూ, విమర్శకునిగానూ అయోగ్యుడే.[4] అందుకేనేమో సత్య శ్రీమన్నారాయణ 'విమర్శ' అనే కవిత రాశారు :

''కలర్ సైటున్న వాళ్ళో/కామెర్ల రోగినో పట్టుకొని
గరిక పోచ మీదో/హరివిల్లు సొగసు మీదో
కామెంట్ చెయ్యమని/అడిగినవాడు / అందుకైనా అయ్యుండాలి
అజ్ఞానాంధకారంలో/అల్లాడే మూర్ఖుడన్నా అయ్యుండాలి.''

[అదే- పు. 98]

['సాహిత్య మూర్ఖులు' ప్రతియుగంలోనూ ఉన్నారు ! వారికో నమస్కారం]. సహృదయుడే అనుభూతి కవిత మీద రాయాల్సివస్తే దాన్ని తెలుగు సాహిత్యనందన వనంలో ఇప్పట్టి గులాబీగా చెప్తారు.

మరి ఈ కవిత్వానికి ప్రయోజనం ఏమిటి ? సామాజిక ప్రయోజనాలను సాధించడానికి వేరువేరు రంగాలున్నాయి. సాంఘికసేవ, రాజకీయాలు, వాటికి ఆధారంగా అనేక సిద్ధాంతాలు వాటి భాష్యాలు ఉన్నాయి. కవిత్వంలో అవన్నీ రావచ్చును. తప్పులేదు. —అపసవ్యంకాదాను. కాని మొదటగా కవిత్వంరావాలి కదా వాటిలో వీటన్నింటికీ స్థానం![5] ప్రలోభాలలోపడి అసలు కవిత్వ పదార్థాన్నే విడిచిపెట్టారు.... అనేక అత్యాధునిక అభ్యుదయ కవులు. మానవునిలో అనుక్షణం లుప్తమవుతున్నట్లుగా అనిపించే మానవత్వాన్ని, దిగజారి పోనీకుండా నిల్పడం, మానవుణ్ణి మానవునిగా ఉంచడం, అనుభూతి కవిత్వ ప్రయోజనం. లోన మంట పుట్టంది, లోన కన్నీరుగా కరగనిది కవిగా ఎవ్వడూ మారలేడు.[6] శ్రీకాంతశర్మ ఇదే విషయాన్ని తెల్పుతూ ఇలా రాశారు.

'మానవ సమాజంలో / అనుభవాల మంటల గోళంనుంచి
ఆకారం ఏర్పరచుకొనే/జీవకణాల నెత్తుటి/నిప్పుముద్ద మనిషి/
అందంగా, మందంగా/ఆకారంపైకి ఏర్పడినా, లోపలమాత్రం/
అనుభవ పరంపరల / కన్నీటి తడిమంట
అరవిదే—చల్లారనిదే — / అది / చర్మపు లోపలి పొరల్ని
చుర చుర కోస్తుంది — / ఎప్పుడో కసిగా / ఆక్రోశిస్తూ
అగ్ని పర్వతపు లావా లాగ / బయట కురుకుతుంది.
....
గుండెల్లో మంటలు భరించే ఈ గోళ ప్రభావం
మన మనుషులకూ తప్పదు —
....
అన్నా, / మచ్చల మచ్చలు / ఈ పృథివిమీద / మూడొంతులు మున్నీరే —
....
రుజా భరిత జరా మరణ / జీవన లాస్యంలో
మూడొంతులు కనిపించని కన్నీరే —
....
ఈ కన్నీరు/ఏరుపెక్కినా/ ఆ మున్నీరు చెలియలికట్ట నెక్కినా
ఈ పృధివి కలగక తప్పదు —
నవోషస్సు / అనవసర గతాన్ని / తుడిచిపెట్టక తప్పదు.

—"ఉరికే కన్నీరు" (అనుభూతి గీతాలు -పు. 18, 19)

ఏరుపెక్కిన కన్నీటికీ, చెలియలి కట్టను దాటిన మున్నీటికీ ప్రాతినిధ్యం వహించడమే కవిత్వ ప్రయోజనం—నవోషస్సుల్ని సృష్టించి, అనవసర గతాన్ని తుడిచి పెట్టడం కాదాను ! అధర్మానికి గుండెల్లో మంట పుట్టకుండా, అన్యాయానికి చలించకుండా ఎవడైతే ఉంటాడో వాడు పుడమితల్లికి పుత్రుడే కాడు. ఐతే ప్రధానమైంది మానవునిలో మానవత్వాన్ని నిల్పి పోషించి, వాడి సమాజాన్ని స్వర్గంగా చేయడం. 'క్షితిజ రేఖపై ఇద్దరు' అన్న కవితలో శ్రీకాంతశర్మ ఈ మానవుల్ని ఏమీ సంస్కరించలేక పైకివెళ్తున్న ఒకణ్ణి — మానవులలో ఏదో సాధిద్దామని కిందకు దిగుతున్న మరొకడు క్షితిజ రేఖపై కలసి కింది విధంగా అన్నట్లుగా రాశారు.

"ఆత్మవర్తీ ! అనుభవ స్ఫూర్తీ ! / అస్తమయ సంధ్యావిరక్తీ !
అవతరిస్తున్న ఉదయుణ్ని, ఆశా హృదయుణ్ని, అపకునన్ను
అనుభూతులు నిండిన అఖండావనిని అర్థం చేసుకొంటాను.
అందరితో కలిసి, అక్కడే నా స్వర్గాన్ని నిర్మించుకుంటాను."

(అనుభూతి గీతాలు – పు. 12)

భూ ప్రజల్ని అర్థం చేసికోవడం, ఆశాబుద్ధి కల్గి ఉండడం, అనుభూతులు నింపుకోవడం, అందరితో కలిసిపోవడం, స్వర్గాన్ని నిర్మించుకోవడం, — ఇవీ ఆశయాలు .... అన్ని గీతాల్లోనూ ఇవన్నీ ఉంటాయని కాదు. వేగుంట మోహనప్రసాద్ రాసిన 'చితీ - చింత'లో నిరాశావాదం ఉంది. కాని ఆ నిరాశావాదం పాఠకుల్ని చావమని కానీ, ఫ్రెంచికవులు నెర్వెల్ వంటి వారి ఆత్మహత్యాదర్శంలాంటి సందేశాన్ని కాని ఇచ్చేది కాదు. జీవితం పండిన వాడి తాత్త్వికతకూ, అర్థవంతమైన వైరాగ్యానికీ దారి చూపేది అది. ఆ కావ్యమంతా 'నిరాశ' లేదు. అనుభూతి కవులందరూ అతనివలె నిరాశావాదాన్ని చూపలేదు. సత్యశ్రీమన్నారాయణ రాసిన 'నిదురా !' అన్న కింది కవిత ఇలాంటి కవిత్వానికి ఉన్న ఉత్తమ ప్రయోజనాన్ని చూపుతుంది —

"నిదురా ! / ఈరాత్రి / అగ్నిపగ్గాలతో బిగదీసిన /
నా కనురెప్పలపై
సుతిమెత్తని ముద్దులు పెట్టకు."
"ఈ చీకటిలో / పళ్ళిప్పని చెట్లకు / నీళ్ళోసే చేతుల
మంటలు చూస్తున్నాను / నిదురా ! / ఈ రాత్రి నావక్కన
చేరకు."
"పొడిచే సూర్యునికోసం / హృదుమైన స్వాగతం కోసం /
ఈ చీకటిలో
ఎర్రతివాసీ సంజెను నేసే / నెత్తుటివేళ్ళను చూస్తున్నాను/
నిదురా !
కిందకు దిగు / దయచేసి కిందకు దిగు I say get down"

(వెల్తురు పిట్టలు – పు. 48)

బాల గంగాధర తిలక్ 'ఆర్త గీతం'తోనూ, శేషేంద్రశర్మ 'అందాల అతిథులు' తోనూ పోల్చదగ్గ పై కవిత అభ్యుదయ భావాలకు 'అనుభూతి కవిత్వం' ఎలాంటి దృఢమైన పునాది నివ్వగల్గుతుందో నిరూపిస్తున్నది.

"ఎందుకు వస్తున్నాయి. ఈ అందమైన భావాలు / నిశ్శబ్ద బంధురమైన నా మందిరంలోకి / నా అందాల అతిథులకు ఏఆతిథ్యం ఇవ్వగలను..... కనురెప్పల కొసల మనలే ఒంటరి బాష్పంలాంటి / ఒక గంభీర కంఠస్వర గీతిక తప్ప / .... యెదలు భగ్నమైన యెండలు / కాంతికోల్పోయిన గాలులు / విషాదం తొణికిసలాడే వానలు విడిసే ఈ ఎడారి సత్రంలోకి / ఎందుకు వస్తారు మీరు ?

....

నీలాకాశంలో తెలిమబ్బులై పొండి / సాగరాల్లో నావలతెరచాపలై పొండి / దూర తీరాలకు తరలిపోయే పవనాలయి పొండి / రేపటి గులాబీల తోటల్లో / ఉషస్సులై పొండి / పొండి.."

"అందాల అతిథులు" (అగ్నిగర్భ - పు. 36-37
- శేషేంద్రశర్మ సం. డా॥ సుప్రసన్న)

"సాహిత్య మూర్ఖుల" నుంచీ, తెలుగు కవిత్వాన్ని కాపాడుకొంటూ వస్తున్న అనుభూతి కవులు తమ రచనల ద్వారా చూపిన అనుభూతి కవిత స్వరూప స్వభావ ప్రయోజనాలపై ఇంకా విమర్శకులు లోతైన పరిశీలన జరపాల్సి ఉన్నది.

"ఈ అనంత శబ్దమయ విశ్వమిది నాదమై, హృదయవీధి
లో అచ్ఛమైన అనుభూతి లోభనీయ స్పర్శకాగా
ఈ అనంతా కాంచలమ్ము లెగబట్టి గగనాల సమితి
లే అలలై గాలులందు దీర్ఘదాత్త స్వరూపమున
....
ఈ గాలి కదలాడి తేజమే అయిపోయెనొకసారి"

(తేజశ్చక్రము – పు. 20
(సుప్రసన్న)

అధోజ్ఞాపికలు

1. టు బి ఏబల్ టు రివయివ్ ఎన్ ఎక్స్పీరియన్స్ ఈస్ నాట్ టు రెమెంబర్ వెన్ ఎండ్ వేర్ ఎండ్ హౌ ఇట్ అక్కర్డ్ బట్ మియర్లీ టు హావ్ దట్ పెక్యూలియర్ స్టేట్ ఆఫ్ మయింద్ ఎవెయిలబల్.

ప్రిన్సిపల్స్ ఆఫ్ లిటరరీ క్రిటిసిజమ్ పు. 140
ఐ. ఎ. రిఛర్డ్స్

2. ఇండీడ్ ఓన్లీ వెన్ దీస్ టూ ఫోకల్ పాయింట్స్ — సబ్జెక్ట్ ఎండ్ అథర్ - ఆర్ వెల్డెడ్ టు గెదర్ ఇన్ ఎన్ ఆర్గానిక్ హోల్ ఈస్ ఆర్టిస్టిక్ కంటెంట్ పాసిబల్.

ఫవుండేషన్స్ ఆఫ్ మార్క్సిస్ట్ ఎయిస్థటిక్స్ – పు. 126
అవ్ నర్ జిస్.

3. కవిలో అనుభూతి మూలంగా ఫీలింగు కలుగుతుంది. ఫీలింగు స్థాయి భావపు సుడిగుండ మవుతుంది. కవి రసపరవశుడవుతాడు. కానీ కవి రాయడానికి కూర్చున్నప్పుడు మాత్రం రసాన్ని వాగ్రూపం చెయ్యడం లేదు. సమాహిత స్థితికి వచ్చి తన రసీభవనకు హేతువయిన స్థాయిభావాన్ని ఆశ్రయిస్తాడు. దాన్ని వాగ్రూపం చేస్తాడు. అనుభూతి మూలపదార్థమయినా అది ముడిపదార్థం.

కవిసేన మేనిఫెస్టో – పు. 149
— శేషేంద్ర

"ఎవ్రీ పోయెమ్, హవెవర్, ఈస్ ఎ స్ట్రిక్ట్‌లీ లిమిటెడ్ పీస్ ఆఫ్ ఎక్స్‌పీరియెన్స్, ఎ పీస్ విచ్ బ్రేక్స్ అప్ మోర్ ఆర్ లెస్ ఈసిలీ ఇఫ్ ఎలియన్ ఎలిమెంట్స్ ఇన్‌ట్రూడ్. ఇట్ ఈస్ మోర్ హాయిలీ ఎండ్ మోర్ డెలికేట్‌లీ ఆర్గనయిస్‌డ్ దాన్ ఆర్డనరీ ఎక్స్‌పీరియెన్స్ ఆఫ్ ది స్ట్రీట్ ఆర్ ఆఫ్ ది హిల్‌సయిడ్, ఇట్ ఈస్ ఫ్రెగయిల్.

"ప్రిన్సిపల్స్...." పు. 59

4. హి (గుడ్ క్రిటిక్) మస్ట్ బి ఎన్ ఎడెప్ట్ ఎట్ ఎక్స్‌పీరియెన్సింగ్, వితవుట్ ఎక్సెంట్రిసిటీస్, ది స్టేట్ ఆఫ్ మయిండ్ రిలెవెంట్ టు ది వర్క్ ఆఫ్ ఆర్ట్ హి ఈస్ జడ్జింగ్ (అదే పు. 87)

5. "విమర్శకుడు ఈనాటి ప్రతి కవితా సంకలనంలోనూ కవిత్వం ఎక్కడుంది అని మొట్టమొదట వెతకాలి .... కవిత ఉందా లేదా అన్నదే ప్రప్రథమ పాయింటు."

మేనిఫెస్టో – పు. 44

6. "ప్రాచీన కవిత్వం శోకంలో నుంచి వస్తే ఆధునిక కవిత్వం క్రోధంలో నుంచి వస్తుంది. కానీ ఒకటి గుర్తుంచుకోవాలి. ప్రాచీన కవి శోకంలో కూడా క్రోధమే ఉంది. కనకనే కిరాతుణ్ని వాల్మీకి శపించాడు."

అదే – పు. 215

వై కుం ఠ పా ళి

శ్రీమతి కోడూరి లీలావతీదేవి

ఆశల జల్లున
పడగల గొడుగులు
ఎగబ్రాకులు
దిగబ్రాకులు
పరచిన బ్రతుకున
మెరసే చిత్రాలు
పీడని మమతల
అందని ఆరాటాలు
అందిన ఆనందాలు
పునరావృత్తి పులకింతలు
మరో వైకుంఠ పాళికి
అనుభూతుల రవళి.

ఆలయం పగుళ్ళలో అశ్వత్థం

శ్రీ విరియాల లక్ష్మీపతి

పగిలిన గాలి గోపురం సందుల్లోంచి
మొలుస్తున్న రావి మొక్కల్ని సందర్శించు....
పెళ్ళలూడి పాడుపడిన గోడలమీద
బొమ్మల్ని వీక్షించు;

తిన్నగా మేధావితో చర్చిస్తావు.

అంతర్మథనంతో సంభాషిస్తే
అర్ష చక్షువు సూర్యుడిలా వెలుగుతుంది
కావ్య ప్రవల్హికలన్నీ తేటతెల్లమౌతాయి
బీటలువారిన గోడ - పికాసో చేతిలో
కదులుతున్న నీడ!

సారించిన ఏకాగ్రతలో గోడ నిలబడదు
వేంగో నిలుచుంటాడు; చరిత్ర కదులుతుంది

కళ్ళలో ప్రక్కకి తిరిగిన
బానిస కపాలంలో మూడు కళ్ళు కనిపిస్తాయి....

ఒక నేత్రం అర్ధభాగంలో
నారీతత్త్వం నర్తిస్తుంది
ఒక కోణంలోంచి
అర్కకాంతు డుదయిస్తాడు!

పొగలు కక్కుతున్న రైలింజన్లు
భూ వక్షోజాల మీద లైంగిక చర్యలు జరుపుతాయి

గుడి గోడల మీద
సామూహిక కేళీ కలాపాలు శిల్పీకరిస్తాయి....

బానిస గుండెల్లో శూలం గుచ్చుకున్న శబ్దం
సంకెళ్ళ కదలిక.... చప్పుళ్ళ మూలుగు.... వినిపిస్తుంది!

ఒక గావుకేక
బాణంలా నీ కర్ణేంద్రియంలో గుచ్చుకుంటుంది
చెవుల్లోంచి చెట్లు మొలిచి
ఇక్కట్లు పుష్పిస్తాయి....

కళ్ళల్లోంచి జారిన సముద్రం ప్రమిదలో
సూర్యుడు రగులుతాడు.

ఎరీనాలో సింహస్వప్నాలు
మేధల్ని పగుల కొడతాయి....

రోమన్ చక్రవర్తి కళ్ళలో
క్రూరమృగాల వికటాట్టహాసాలు
మైఖేలేంజిలో చేతిలో
కామూ ఏంజెల్సు జలపాతం ఘోషిస్తుంది

,జ్వాజ్వల్యంగా ప్రకాశించే సూర్యుడు
క్రాంతి తరంగిణి....

నీ విప్లవాధరాల పై కదిలే
అరుణారుణ అక్షయ తరంగిణి

ముస్సోలినీ కబంధ హస్తాల్లో
లోర్కాశవం చెప్పిన ఫాసిస్టుల రహస్యం!
నువ్వు నెరూడాతో కలిసి ఏడుస్తావు!

ఊళ్ళో గోడలు అప్పుడే అచ్చయిన
తాజా దినపత్రికలు!

సంఘర్షణ అక్షరాలై నిలబడుతుంది!
నగరం పేదరికం గోడల్లో ప్రతిబింబిస్తుంది
నువ్వు మేధావితో చర్చిస్తావు....
అతని ఆజ్ఞాపనలో నగరాలు బందీ...

గోడలు ఇరువర్గాల అసంతృప్తిని చిత్రిస్తాయి
అప్పుడు నువ్వు మార్క్స్ మహర్షితో
మాట్లాడుతావు! భూమిలా చిట్లిన
గడ్డం వెంట్రుకల్లోంచి
చిమ్మిన రక్తం వికాసతత్త్వం!
పగిలిన గోడల సమస్యలకు
అదే చిరంతన పరిష్కారం!

కిరణాల మధ్య సంఘర్షణ
అన్వేషిస్తే నువ్వే సత్యాన్వేషివి !

యుగాల పూర్వార్థంలో
నే గమనించిన సూర్యుడు ఒక యజ్ఞపశువు;

యుగాల ఉత్తరార్థంలో
నేను శాస్త్రానికి బలిపశువును !

పాడుపడిన గోడల్లో
కురుక్షేత్రాలు. . వియత్నాం యుద్ధాలు—

'మీరు దిట్టమైన గోడలు కట్టుకోండి....
మేం దట్టంగా నినాదాలు రాస్తాం!'

మీ గోడలు మా ఒంటికి చుట్టుకొన్న కొండచిలువలు
ఆ సమాధుల్లో మేం కుళ్ళి కుళ్ళి ఛస్తాం !

మీ గోడలు ఏపుగా ఎదగడం కోసం
మేం కంపోస్టు ఎరువులం !

పెళ్ళలూడిన గోడల మీద
తాజ్‌మహల్ కూలుతుంది

గోడల నీడల్లో సుదీర్ఘంగా
యామినీ ప్రాచీరేఖ !

ఒక ప్రక్క రజనీకర బింబం,
ఓ జన్స్వాంత కాంతిరేఖ !

అందులో నీ ముఖం చూసుకో ! కవిత్వం నేర్చుకో !
వేనవేల ఖండాలుగా చీలిన

నీ కవిత్వ ముఖాలలోంచి
పాడుపడిన గోడల మలిన హసనాలు....

తులసి క్రింద నిర్మాల్యంలో
పూలు చిందించే అమల హసనాలు....

అప్పుడు సరాసరి నువ్వు దేవుడితో ముచ్చటిస్తావు !

పెళ్ళలూడిన గోడల మీద
పురుగుల కోసం పులుతూ పులుతూ చూస్తున్న
ఊసరవెల్లి .... దానికోసం మార్జాలం కాన్స్పిరసీ !

ఒకదానికోసం వేరొకటి నిరంతరం కుట్ర !
అదృశ్యహస్తాలు రాసిన నినాదాల అర్థం అదే !

హస్తాల్లో.... ముఖాల్లో.... మేధల్లో... కాన్స్పిరసీ...
మనుషుల్లోంచి అస్థిపంజరాలు నడచి
భూస్థాపితం అవుతూంటాయి...

ఆకాశ హస్తాల్లో అస్తంగత సూర్యుడి దీనాలాపం...

ఆలయాలు కూలదోసి
హాస్పిటల్సు నిర్మించే రోగుల ఆర్తి కథనాలు

పగిలిన వయొలిన్ గోడలలోంచి
ద్వారం కదన కుతూహల రాగాలాపన...

కాలకలుషాబ్ధిలో ఆకలిమంటల
ఆర్తనాదం - దీపక్‌రాగం !

గోడలమీద సంగీతం
నీరోగా విలపించి నీరుగా కారి పోతుంది
నువ్వు వాగ్గేయకారులతో శ్రుతి కలుపుతావు

ముసుగు ముఖాల్లోంచి గాజుకళ్ళు
రెప్పలు చేసే క్రూరు చప్పుళ్ళు...

భూగోళాన్ని నెత్తిమీది కెత్తుకొని
అమ్మకానికై తిరిగే కలియుగ సైన్యావతారాలు...

బుద్ధి వక్రిస్తుంది... భూమి వక్రిస్తుంది
సూర్యుడు వక్రిస్తాడు కిరణాల సమేతంగా

అంటున్న మేధావి వంకర చూపులు—
గోడలమీద కొంకిరి గీతలు.

అప్పుడు నువ్వు ఐన్‌స్టయిన్‌తో
లంచ్ ఆరగిస్తావు; ఆలోచన ముసుగులో

అక్షరాల విప్లవ గీతాలు
దివాణం నాచుగోడల్లోంచి
దుముకుతున్న గురజాడ !

వెలుతురు సాగరం తురుముకున్న
చైతన్య నగరానికి విప్లవ రసప్లావితం
చేసిన మనిషి ఒకకొత్త సూర్యుడై ప్రభవిస్తాడు !

నేలకూలే ఆలయం పగుళ్ళలోంచి. .!

"ప్రభాతం"

భావకవితా మురళి - శ్రీ వేదుల దీపావళి

ఆంగ్లమున రొమాంటిసిజమ్ (కాల్పనికవాద కవిత్వము) అనే కవితా యుగానికి స్రష్టలైన కీట్సు, షెల్లీ, వర్డ్స్‌వర్తు, బైరన్ మొదలగు కవుల ప్రభావముతో తెలుగులో భావకవిత్వం ఆవిర్భవించింది. భావకవితా క్షేత్రములో విశేష పరిశ్రమ చేసిన కృషీవలులలో శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి ఒకరు. వీరి దీపావళి ఖండకావ్య సంపుటి ఆధునికాంధ్ర సాహిత్యములో అగ్రశ్రేణి కావ్యములలో అనర్ఘ రత్నమన వచ్చును. శ్రీ శాస్త్రిగారు బహుభాషాకోవిదులు. గౌతమీ కోకిల బిరుదాంకితులు. మహా కవిగా సమ్మానితులు. శతావధాని.

శ్రీ వేదుల దీపావళి కావ్యములో అనేక కొత్తపుంతలు త్రొక్కినారు. కప్పురమువలె గుప్పుమని కవితావాసనలు గుబాళించే నవ్య భావచిత్రాలను పదచిత్రాలను ఎన్నింటినో ఇందు చేర్చినారు. వీరి శబ్దములు శిరీషకుసుమ కోమలములు. భావములు అగాధ సాగర గభీరములు. ఇందలి రచన ఆత్మాశ్రయ రీతిలో సాగినది. వీరి వృత్తములలో నన్నయ ధారాశుద్ధి స్ఫురించుచుండును. నాగుల వలె వాగులవలె ఉరకలు పెట్టే వీరి వృత్తాలలో గణాలు, యతి ప్రాసలు, కరగి భావాలతో కలసిపోయి వాటి ఉనికిని కోల్పోయి నట్లనిపిస్తాయి. వారిపదునైన భావచిత్రాలు హృదయాల లోతులను స్పృశిస్తూ మనతో బాష్ప భాషణములు చేస్తాయి.

డా. దివాకర్ల వెంకటావధానిగారు ప్రశంసించినట్లు "ఆధునికాంధ్ర వాఙ్మయమున ప్రకృష్టమైన ప్రతిభా సంపదతో పాటు పారము లేని పాండితీ పాటవముగల శ్రీ వేదుల వారి కవిత ఎంత నవ్యమో యంత సంప్రదాయ సిద్ధము. ఎంత ప్రసన్నమో యంత గంభీరము. ఎంత అలంకారికమో యంత యనవద్యము. మసృణ మకరందమువలె వారి మంజుల కావ్యరసమునాని పరవశులు కాని రసిక మధుకర కుమారులుండరు."

ఈ సంపుటిలో ఏబది వరకు ఖండకావ్యములున్నవి. ప్రతి ఖండికా ఒక అపూర్వ కళాఖండము. రసజ్ఞుల ఉపజ్ఞకు తుష్టినీ, పుష్టినీ చేకూర్చే అమృత భాండము. ప్రతి భావగీతమూ పఠితల మనస్సుల సోకి దాని సంగీత మాధురితో పరవశింప జేయునదే.

ఇటువంటి రసవత్కావ్యము తన ప్రియమిత్రుడు, తన కవితావనీ వికసనమ్మున కామని పంటయైన సుశ్లోకుడు, కావ్యకళ లోతులు ముట్టిన మేటి శిల్పియైన శ్రీ నూతక్కి రామశేషయ్య చౌదరికి అంకితమిస్తూ "నాకును నీకు నెన్ని జననమ్ముల సౌహృదమో పరస్పరా లోకనమందె నా బ్రతుకులో నొక తీయని స్వప్నమేదియో పైకొనినట్టులయ్యె"నని భావకవుల సహజమైన జన్మాంతర బంధముల నమ్మికను వ్యక్తముచేసినారు. ఎడబాయకొలది ప్రవృద్ధి నొందు ఈ కృతికర్త కృతిభర్తల స్నేహాకృతి సూచన ప్రాయముగా ప్రేయసీ ప్రియులకు, రాధా మాధవులకు, భక్తుడూ - భగవంతునకు మధ్యగల ఆత్మీయతను స్ఫురింప జేయుచున్నది.

భావకవిత్వమున భావమునకున్న ప్రాధాన్యత వస్తువునకు లేదు. దేనికది ఒక సమగ్ర రచనయై భాసిల్లుచుండును. ఈ సంపుటి నందలి గీతములు వస్తుగతముగా పరిశీలించగా ఆ క్రమ గీతులలో ఈ క్రింది అంశములు గోచరించినవి. వాటినీ క్రింద విశ్లేషింతును.

(1) భగవంతునికై భక్తుని యావేదన :- కవి అంతర్ముఖుడై తనకు తాను ప్రియునిగా, రాధగా, గోపికగా భావన చేసుకుని కవితాగానం చేసినాడు. ప్రేమించడము ప్రాణి సహజ లక్షణముగా భావకవులందరి వలెనె ఈయన కూడా భావించినాడు. "కేదారమును దున్ని నీరు కట్టినచో నారెట్లు నాటుకొనునో యట్లే ప్రబలతాపవిదీర్ణమై కన్నీళ్ళతో పదను వారినపుడే హృదయములో ప్రేమపాదుకొను"నంటాడు.

కురులు దువ్వకొని, పూలు ముడిచి గొజ్జగి పూవుల లేమెరుంగు ఉంబరము ధరించి, గంధ కలశమ్ముల మేన నలంది, కస్తురి తిలకమ్ము దిద్ది సువర్ణ భూషణోత్కరములు దాల్చిన ప్రియురాలు వాకిలి తెరచి వెన్నసూర్చుచు తన ప్రియునికోసము ఎదురు తెన్నులు చూసినది. ఇందులో జీవుడు దేవుని కోసమై అలమటించడం భంగ్యంతరముగా చెప్పినాడు. పూలకన్న నతి కోమలమైన యాతని శరీరము నొచ్చునని తమ్మి పుప్పొడి తెచ్చి పాన్పుపై పరచింది. ఆమె హృదయ స్పందనపు మ్రోతలే యాతని పదస్వనంబులని మేన్పులకలు రేగా యూపిరాపి వినుచు నిరీక్షించినది ఒకింత నిరాశ యొకింత యాశతో ఆమె హృదయము శంకగొన్న వనీ మృగి గుండె పోలికయైనది. అట్లు నిరీక్షించుచున్న యామె

వెనుకగా వచ్చి యామె ప్రియుడు చిరునవ్వు చిందిస్తూ చిగురు కేలుతో యామె భుజము స్పృశించినాడు. ఆతని కరస్పర్శమున పులకించి యపశయైన యామె ఎదయాతని నాత్మనాథునిగ గుర్తించినది. అంతలో ప్రకృతి సౌధపు దక్షిణ ద్వారము తెరచుకొని వచ్చిన మృదుల పవమాన పరిమలోర్మికలు ఆయిరువురిని బంధించి వైచినవి. ఆ దృఢాశ్లేషమున ఇరువురొక్క హృదయమొక్క ప్రాణమై 'ప్రేయసీ'యని 'ప్రాణప్రియా'యని బాష్ప భాషణములతో పలుకరించుకొన్నారు.

అపుడు వృద్ధ సంధ్యా తపస్విని పెదవి విరిచింది. విశ్వ వీణాగళము నీరవించిపోయింది. "మనము దిన సంధ్యలము. మన వియోగైక్యములే ప్రేమ దేవతకు రేయింబవళ్ళు"యని ఆ ఒక్క క్షణమాత్ర కలయికనే దివ్యమైనదిగా భావించుకొని గతాన్ని స్మరించుకుంటుంది. కార్తిక చంద్రికా మనోజ్ఞ సమయమందు బహుకాల పరిచితులవలె తొలి దృష్టిలో నేకమైన మధురస్మృతులు గుర్తుకొస్తాయి.

"మనము నవప్రేమ ఫలకింతానంద పథములో జీవన మంగళ యాత్ర బయలుదేరినాము. రెప్పపాటులో యుగయుగముల ప్రేమ వియోగ భారమూర్తి వైచి మైమరచినాము. నీభుజా బంధన మెపుడు సడలించితివో యపుడే నా హృదయకుసుమ దళాలన్నీ నీవు నడచిన బాటలో పరచి వేసితిని ....గాని కఠినవిధి నాబ్రతుకు చూసి కన్నుకుట్టుకుంది' అని గుండెబ్రీలి పలవిస్తుంది. ఆమెకు ఎటు చూసినా దారుణాంతరమ ప్రతిధ్వనులే వినిపిస్తుంటాయి. హృదయ కవాటము పొరతెరచి వేయబడుతుంది.

'తేనె తావుల బరువోపలేని పూవు
ప్రొద్దు పొడుపునకై వేగిపోవు పగిది
బ్రతుకు బ్రతుకెల్ల తీయని వలపు నింపి
వేచి యుంటి నీరాకకే వేళస్వామి'

అనియంటుంది. ఎంతరమ్యమైన భావుకత. 'పూవులు వాడిపోయినవి. హారతికునుకుచున్నది. కారుమొయిలుతో రేయిభీకరమైనది. అనాథనై ఈ శూన్యాలయములో నొంటిగా పడియున్నాను' అని వాపోయింది. ఆమెలో తీవ్ర నిరాశ కలిగింది. పలాయన వాదము ఒరెత్తింది.

'చీకటుల పాలేన ఈ కలువ బ్రతుకింక
సోకదా నీ సుధా శ్రీకరమ్ముల పలుప'

అని ఆక్రందిస్తుంది.

జగమంతటిని సన్నిధికై భక్తుని ఆవేదన మనకు ద్యోతకమౌతుంది.

(2) మాధవునికై రాధ ఆరాటము :- భాగవతము నందలి వైష్ణవగీతము ప్రభావము పడిన భావకవులలో శ్రీ వేదుల ఒకరు. వీరి రాధ మాధవునిపై ప్రేమ పారవశ్యములో

"నాలోనె నేడు బృందావనము విరిసినది
నాలోనె నేడు యమునా తటిని మొరసినది
ఏవసంతా నిలయము ఏగాన కలకలము
ఈ నా యెడద నిండా నిండిపోయినది"

'ఓ దివ్యగాయకా ! ఓ ప్రాణ నాయకా ! ఏది ఇంకొక్క మారూదరా నీమురళి' అని ప్రాధేయ పడుతుంది. గోప కిశోరు డెందు బోయెనో యని కలవర పడుతుంది.

తీయని వాయు పూరణ గతిన్నును జుగ్గలు బూరటిల్ల, హర్షాయితమై ప్రపంచము తరంగగ చేసే మోహన వేణుగానము లేక నీప వాటికాచ్ఛాయల విన్నబాటు కొనసాగినవి. కళిందజా సరిత్తుల్ల తరంగ మాలికలు మంత్రితవ్యాళములవలె నున్నవి. లేత యాకదుపులు మోములు వంచి బిచ్చపడి యున్నవి. బృందావని శూన్యమైనది. పూవులలోను, తీవెలలోను, చివురాకులలోను ఆక్రందము సందడించింది. కోయిలలు జాలిగ కూయుచున్నవి. కొలకు దర్భలురాల్చుచు కొదమలేళ్ళు భాష్పార్ద్రదృష్టితో దిక్కులు చూచుచున్నవి. కోమల వల్లికా నికుంజ తలములలో గాని, శాద్వల శ్యామల భూములలోగాని, సువిశాల తమాల హీజ వాటికారామములలోగాని, శీతల తరంగ సిక్త నదీ తటోపస్తోములలోగాని గోపాలుని యునికి లేక పోవడముతో ఆందోళన చెందినది రాధ. ఆ శ్యామ సుందరుని మురళీ మృదు గాన రవము కొరకు తనే గాక పశు పక్ష్యాదులు మొదలుకొని సకల చరాచర జీవరాసులు ఆరాట పడుచున్నవి. అన్వేషిస్తున్నవి. వేణునాదము జీవులకు ఆనంద ప్రదాయినిగ మాత్రమేగాక ఇందు గభీర తత్త్వమిమిడి యున్నది. డా. సి. నారాయణరెడ్డిగారు తమ ఆధునికాంధ్ర కవిత్వములో వ్రాసినట్లు (పే. 467) "మాధవుడు పరమాత్మ సమస్త జీవులు జీవాత్మలు. పరమాత్మలో సంలీనముగుటకు జీవాత్మ లుబలాటపడుచుండును. ఈ రెంటి మధ్య నున్న తగులమును బలియ మొనర్చు సూత్రమే వేణునాదము."

అందుకే రాధ "తీవనో, పూవనో, పసులతీజమునో, యమునాపగోర్మినో, గోపునో, మబ్బునో వెదురు క్రోవినో, చుక్కనో యై జన్మించి యుంటే వేణుగానము సదా వినుచుందును గదా" యని చింతా వివశాత్మ యౌతుంది. రాధ గ్రుచ్చిన దండ విచ్ఛిన్నమై పూలరేకులూడి పడిపోగా ప్రేమ వాసనాప్లావితమైన తంతువు మాత్రము మిగిలినది. దానితో నామెద యురిపై చెదవో

లేక నీ వరహస్త మందభయ హస్తముగా ధరించెదవో యని ప్రభుని ప్రశ్నిస్తుంది.

శారద యామినీ సమయములో మధురలో వీధులన్నీ వెదకి రాధ చివరకు బృందా విహారుని చేరుకుంటుంది. దూరమున నుండి గోపాలుని మురలీరవము హృదయము సోకినంత మేనెల్ల మరచి యమునానదీ పులిన సీమలలో వెఱ్ఱియై తిరుగుతుంది. "ప్రకృతి పులకింప యమునా ప్రవంతి పొంగ, భావము చిగుర్చ పిల్లనగ్రోవి నూది పరవశము చేసి ప్రేమతనివార నొకముద్దు పెట్టుకొనుము"ని గోపాలకృష్ణుని యర్థిస్తుంది.

అతని సుకుమార హస్తముల ఈ ప్రకృతి యెల్ల నిదుర వోయేడి మౌనవేళ శిథిల వీణను సవరించి అతని కరుణారస శ్రీవిభవమ్ము గళములో నింపి ప్రణయార్ద్ర గీతికలు పాడుతుంది. అవి కన్నీటి పాట లౌతాయి.

కారు చీకటిలో కన్నులు మూసుకుని ఆమె నిద్రనుండిన వేళ శ్యామసుందరుడు చిరునవ్వు చిలుకుతు చెంతను జేరి తీయని కల వలె అదృశ్యమైనాడు. అతను కనులెత్తి కనినంత కరగి పోయింది. అతని పాదాల చెంత సుమాల మాల వగిది వ్రాలి పోయింది. అంతలోనె అతను సుందర సురచాపమువలె, మంజుల గానమువలె మటుమాయమైనాడు. ఆమె హృదయేశ్వరుని కోసము ఆయాసమునక అడవెల్ల తిరిగింది. సొదరూపు గన్న ఆమె శుష్క జీవితము సైపలేనంటుంది.

> ''అలరులు ముకిచిన ఆమని రేల; తల విప్పుకొని యాడు
> తొలకరి వేల
> వెలి రెక్కలల్లార్చు వెన్నెల రేల; జడివాన కన్నీటి చలి
> కారు రేల
> మరులు గొల్పెడి యాతని మధురరూపమును తలపోసుకుని"

దుస్సహమైన వియోగ జీవితమును సాగించింది. రాధ దుఃఖ తీవ్రతను మనగుండెలలోకి అనువదించడానికి కవి పై భావ చిత్రాలను ప్రయోగించినారు.

'ఎక్కడ నుండియో హృదయేశుని మురళి ఎదసోకినంతనె నిలువలేక సెలయేటిదరి చెట్ల చేమల నడుమ 'బ్రతుకెల్ల కన్నుగా' వెతుకాడు కొంటుంది. రాధ నిరీక్షణలోని అన్వేషణలోని తీక్ష్ణత, తీవ్రతలకు 'బ్రతుకెల్ల అనే బాణమువంటి భావచిత్రాన్ని వాడినాడు.

ఇంతవరకూ రాధలోని స్త్రీసహజమైన సిగ్గుదొంతరలు వీడ లేదు. ఇంక ఆ సిగ్గులన్నీ ఓమూలకు ద్రోచి తన విరహ జీవితాన్ని మొరపెట్టుకుంది. ''ఎలప్రాయపు టెడదలోని కోరిక నిట్టూర్పుల లోను, మేను పులకింతలలోను, చెక్కిలి చెమర్పులలోను తెలియుట లేదా ? ఎన్ని జన్మలదో ఈ మన ప్రేమ. ప్రాణేశ మన కేటి వంతమ్ములోయి'' అని రాధ గడుసుదనముగా తన ఆత్మీయత వ్యక్త పరచింది. ఎంత ప్రార్థించినా లవలేశమైన లాభింపలేదు. బాహిరముగా ఆతనితో ఎడబాటు కలిగినా ఎదలోని మూర్తితో ఆమెకు ఎవ్విధమైన ఎడబాటు లేదు.

ఆ నడుకానలో ఆ ఏకాంతములో చెట్లు చేమలతో, సెల యేళ్ళతో పూలతోను, పులుగులతోను ఆడుతూ, పాడుతూ విహరించడానికే నిర్ణయించుకుంది. "బ్రతుకె దుఃఖమ్మాశపడుటె దుఃఖమ్ము; వలపు దుఃఖము ప్రాణపతియె దుఃఖమ్ము ఏనె దుఃఖమును నాదే దుఃఖమింక" అని రాధయొక్క తీవ్రమైన వియోగ దుఃఖపుగ్రతను ప్రకటిస్తాడు కవి.

ఇంక రాధ పగటి కలలు కంటుంది. అనంత లోకాయతన శాంతికై బయలుదేరిన అతని దివ్య విజయాంక రథము దీపములేని ఆమె కుటీద్వారము ముందు నిల్పొనుట, దూరమునుండి మురలీ నినాదములు దోచుట, రథము దిగిన అతని కనుల చిరునవ్వు గని ఆమె కృంగిపోవుట, ఆమె ముఖపైఖరి చూచుట కాతడు ఒక్కమారామె తల ఎత్తుట, ఆమె అతని పవిత్ర చరణమ్ములపైపు చూపు మరల్చుట, ఇలా అతని రథము భావనా శ్రీపథమందె చూచుకొని ఆమె మనస్సు సిగ్గుతో కృంగిపోయినది. తన జీవితకావ్యమెప్పుడో ఆతని కంకితమైపోయినది. నాటి ప్రేమాక్షరములు కన్నీటితో చెరిగి పోవు. ఐనా తన పేదబ్రతుకు ఒక మెరుపువలె, పూవువలె, కల వలె అర్పించుకునే భాగ్యమింకా లేదా యని పరితపిస్తుంది. తన వలె వియోగవ్యథ ననుభవించు చకోరికను చూసి జాలి పడుతుంది. ''నీకోసమె విరిసిన ఈ కోమల కుసుమము కోసుకొమ్ము. లేకుంటె మ్లానమై పోవునొ, ధూళి రాలిపడునొ, వసంత శోభావిభవము మాపువడి యడగి పోవునొ'' యని ప్రాధేయ పడుతుంది. నిమేష యుగ ప్రతీక్షతో వేచి చూస్తుంది. ఎంతకీ గోపాలుడు కన్పించక పోవడముతో ఆమె హృదయము సంశయచ్ఛాయల నూగిసలాడింది. రేయెల్ల ప్రియుని కోసము వృథాభిసరణము చేయడముతో మధు విభావరి గడిచి పోయింది. తొలుత కోరి యాతడు బ్రతిమాలు కొన్నపుడు వంతగించింది. ఇపుడాతని రాకకు అభిసారికయై నిరీక్షించినది. ఆమె బాష్ప మౌక్తికములతో ప్రేమ రాగావహ దుఃఖ గీతికలు ముక్తావళిగా కూర్చినది. ఆ సుకుమార మాల ధరించి అతని అనురాగ నిశ్వాస పరిమళానిలపు స్పర్శసుఖము ననుగ్రహించమని యర్థించింది.

ఎట్టకేలకు మాధవుని యనుగ్రహము లభించినది. హరి పదాంభోజ దళముల చిందువారెడి కాంతి మరందలహరులు ఆమె దరిద్ర కుటీరాంగణమున చైత్ర ప్రభాత శరీరుశములు గుమ్మరించాయి. ఆమెకు చిమ్మచీకట్ల త్రోవల తిరుగులాడిన వేసట తీరి పోయినది.

'పూల చిరునవ్వుతో పొంగిపోవు పొలుపు, గాలి యూర్పుల చిరు తరంగాల వలపు చివురు జొంపాల వెచ్చని కౌగిలింత, పులుగు గొంతుక తీయని పులకింత' అతని దర్శన మాత్రము నామె హృదయములో నిండిపోయినది. సంభ్రమాశ్చర్యకర సుఖ, స్వప్నశాంతి, సంతతానందమయ నూత్న సత్యకాంతి పాదు కొన్నది. ఆమె కుటీర మిక ఆనంద నందనమైనది.

(3) ప్రేయసికై ప్రియుని తపన :- కవి తానొక ప్రణయ మూర్తియైనపుడు చాతకవధూటి తనకడనె జీవనానందగీతి నేర్చినది.

శలభకాంత వెలుగు దీపికలో ఆత్మార్పణ చేసుకొనుట, నింగినెలత ప్రణయ ప్రదానము చేయుట, పూవుకై పడుచుతేటి విధురగీతా కలనము, పికము మౌనగానము, అంబుజము, కైరవము ప్రసవచయము ప్రణయ హేవాక కేళి అతని కడనే నేర్చినవి. ప్రకృతికే ప్రణయపాఠాలు నేర్పగల ప్రణయ తంత్రులు పవంచి యైనాడు. తరతరమ్ముల ప్రేమ స్వతంత్రులు పోయెడిదారి జన్మ జన్మల యాత్ర సాగించుటకు ప్రియురాల నాహ్వానిస్తాడు. అతని ఎదలో విరహ దుఃఖంపు బరువు చూచి పెంపుడు నెమలి కూడా పురివిప్పి యాడబోదు. ప్రకృతికి కూడా తనపై సానుభూతి కలుగు తుంది. ఆమెను వలచినందుకు అమరణ ప్రేమ గాయకుడయ్యాడు.

"నా హృదయ రక్తమే లలనా విలాస లాక్షగా
నీ పదాల కలంకరింతు
నీవు మాత్రము పూలవెన్నెలల రేల
చైత్ర నృత్యోత్సవమ్ములు సలుపుకొనుము"

అంటూ ప్రేమ నైఫల్యము పొందినందులకు కినుక వహించక ఆమె శ్రేయస్సునే ఆకాంక్షించిన నిస్వార్థజీవి. అహంభావరహితుడు. ఆత్మార్పణ తత్పరుడు. అతని హృదయతృప్తికి ఆమె చేసిన కృత్రిమ ప్రేమగతుల చిత్రించిన విషాదకావ్యమును చించి గాలిపటము కట్టి దీర్ణహృదయ దుర్లభాశామృతాల తంతువుతో నవాషాఢమాస సంధ్యాలోకములో ఎగురవేసి శాంతి పొందినాడు. అతని ప్రేమించేవారి ఆనందానికి ఒక యూర్పైనా విడువలేదు. కాని అతనిని నిరసించే ఆమె చిరునవ్వు కోసమె బ్రతుకు వెలిగించి వలపు దివాళి జరిపినాడు. కలత యెరుగని లేప్రాయపు టెడదలో తీగవారిన గత స్మృతులు జ్ఞప్తికి వచ్చినపుడు అతని కన్నులు చెమ్మగిల్లిపోయినవి. తిరిగే పులుగు జతలను, దొంతరల్లిన మబ్బులను చూచినపుడు బ్రతుకు పంట ఏదో కోల్పోయిన రీతిని వాపోయినాడు. కవి తన వియోగమగ్నతను ఇందులో బొమ్మకట్టి చూపినాడు.

ప్రకృతి అతనికి సహాయపడినది. అతని మనోగత విషాద తమసంతయును గౌతమీనది తనలో దాచుకుంది. గాలి తరగల చల్లని కడుపులో నాతని యూర్పుగాడ్పులు కన్నుమూసినవి. అతని యశ్రుకణములు తారలు ఏరుకొన్నవి. 'యుగ యుగాంతర విశ్వ మహోగ్ర దుఃఖ జీవగీతాల కావృత్తి చెప్పుకొనుచు, ఎడతెరిపిలేని దారుణ జీవితంపు టెడారిలో తిరుగాడుచు, దుఃఖ బాష్ప శోణితల హరులు త్రావుచు గడిపినాడు.' 'కోర్కెలొండొంటిని గ్రసియించు కొనెడి కొలది కాల మృత్యువును కొంచె కొంచెముగ కబళించ సాగినాడు.' 'అతని దుస్థితికి కనికరము చూపు చిరునవ్వు తునకయైన కరువైనందుకు వాపు తీపి యెరుగని వట్టి రాతిగుండె లోకమని బాహ్య ప్రపంచాన్ని గర్హించినాడు. తనలో ప్రేమకాంక్ష బ్రతికి యున్నంత వరకూ ఏడ్చుకుంటూ బ్రతుకుతానంటాడు. చక ప్రపంచమంతా మృగతృష్ణల ఇంద్రజాలమువలె అతనికన్పించినది.

ప్రబంధ నాయికా నాయకులు దూషించిన చంద్రుడు, మలయానిలము చందనాది లేపనము, సుమశయ్య మొదలగునవి కవికి కష్టపుంబాటున దుఃఖమే విధముగా విరక్తములై కనిపిస్తాయి. కవిలో విషాదము పరాకాష్ఠనందుకున్నది.

ఇంక కవి లౌకికమైన యనుభూతుల్ని కాక అలౌకికమైన భ్రాంతి జనకానుభూతులకు లోనౌతాడు. తను గౌతమీనదీ పులిన భాగములందు తిరుగాడుతూ వుంటే 'రహోవిరహ భగ్నదురంత విషాద మర్మరారవములే' విన్పిస్తూ ఉంటాయి. 'ఎవరో కోమల తారకా ద్యుతి నిగూఢ రవమ్ముల రమ్మన్నట్లు, గత స్మృతులెల్ల నాత్మలో కోయని కోతలైనట్లు, అకాల మృత్యు గర్జాకవితాట్టహాసముల సవ్వడులు వినిపిస్తున్నట్లు' భ్రమలకు లోనౌతాడు. తుదిలేని సైకతాల నిశ్శ్వాస జీవన భరమ్ము స్మరించుచు రక్తబాష్పములు సోనలు వారినట్లు ఏడ్చినాడు. అతని శిశిర జీవనము నందిక చైత్రి శుభ ప్రభాత వంశీ కలగానమే లేదాకోయని నిరాశతో సంశయాత్ముడైనాడు. అతని ప్రియురాలి తను వికాశమాత్మ జీర్ణించు వరకు మౌన ప్రేమ బాష్పగీతి భగ్నవీణపై పాడుకుంటాడు. పలాయనవాదిగా మారిపోయాడు.

దీపావళి నాటి కీతని విషాద మంచులు దాటింది. ఆ నిశీధిలో మరణవాద్యములు వలె గుండెలు కొట్టుకొనగా ఏడ్చినాడు. దహిం

చుకొనిపోయే గుండెను బాష్పములతో చల్లబరచడానికి నేత్రములు శమంత తాము మూతలు పడినవి. ఇంక బహిరంతరములు అతనికి రాత్రియే మిగిలింది. ఇక్కడ కవిగారి భావుకత మహోన్నత శిఖరము నందుకున్నది.

అతన్ని నిరసించేవారి యానందములో భాగము వలదంటాడు. ఇరువదైదేండ్ల ప్రాయమువరకు సఖునయుడుగు జాడలేలేని బ్రతుకుగడిపినాడు. కన్నీటి జడులతో పంకిలమైన జీవనప్రాంగణమున శాంతిదేవతాచరణ లాక్షారసారుణాంక లవలేశములను వెతుకాను కుంటాడు. ప్రవాస దుస్వప్నవ్యథల మడతలను మాయకుండా సర్దుకుంటాడు. మొక్కిన కొలది కాలితో త్రొక్కివేయు నీ కఠిన లోకాన్ని బహిష్కరిస్తాడు, కష్టభూయిష్ట దుఃఖాంత కథలతో నిండిన తన జీవిత కావ్యపు పుటల్ని త్రిప్పిన కొలది విసిగి పోయినాడు. కునుకు దీపమారదు. పొడికనులకు నిదురరాదు. కవి పలాయన వాదాన్నే పలవిస్తాడు. ఆ స్థితిలో ఎన్నో విషాదగీతాలను ఆలపిస్తాడు.

ఇంక కవి హృదయము దిట్టబరచు కున్నాడు. 'సుఖదుఃఖముల కతీతముగా ఈ ధాత్రి పైన స్థితప్రజ్ఞతతో నా ఆత్మవలపు వెరజల్లి ప్రశాంతి గాంచెద నన్నాడు. ధైర్యాన్నలవరచుకున్నాడు. 'గాఢ దుఃఖాగ్ని కీలలు ఎంత కాల్చినా వేడినిట్టూర్పు నైనా కదుపడు.' 'ఎన్ని యాతనలు వచ్చినా ఒక్క లాష్పకణము రానీయడు. ఆశలు భగ్నమైనా రోదించడు. అంత మాత్రమున తన హృదయముతో ఆవేదన లేదని కాదు. 'ఎవ్వరికి తెలియని బడబానల జ్వాల ఆతని మహాసాగరగాఢ హృదయంలో ఉంచుకుని "ఓ యమృతశాంతి ! దివ్యకాంతి ! స్వప్నరాజ్ఞి ప్రేయసీ ! దయ సేయుము" అని ఆహ్వానిస్తాడు. "మాతృవక్షమ్ము వోలె ప్రేమ ప్రసన్నమైన యద్వంద్వకాంతి సీమాంతరమున ప్రశాంతుని చేయుము" అని అర్థిస్తాడు. కవి ఇంతవరకు తను ప్రేమించిన ప్రేయసిని విస్మరించి ఊహాప్రేయసిని ఆరాధిస్తాడు. ఊహాప్రేయసీ సమారాధనతో కవి ప్రేమ సాధారణీకరణం చేస్తాడు.

"ఆమె నవనీతహృదయ, నా అంతరంగ శాంతి దేవత. ఆశా పథాంతరళ పారిజాతము, నాతపః కల్పవల్లి" అని యంటాడు. ఆమె పదసన్నిధాన దివ్యస్థలాన భక్తినమ్రుడై నిలంబడి నపుడు యాతని వేదనను తలపునకు తెచ్చుకొని యామె యౌన్నత్యమునకు పీఠము వేస్తాడు. ఊహా ప్రేయసిని మాతృమూర్తిగా అభివర్ణించడంతో కవి ప్రణయానికి పవిత్రత లభించినది. ఒక తపస్సిద్ధివలె ఇరువురి మనోరథములకేక ఫలము సిద్ధించినది. బ్రతికినన్నాళ్ళకీ ముహూర్తమున జీవమాధుర్యరుచులు విరిసాయి. విశాల గగనమున కోటి విజయ శంఖములు మ్రోగినవి.

కవి ఊహా ప్రేయసిని దర్శించిన తరువాత "ఇంత సౌందర్యమింత ప్రశాంతి సౌఖ్యమింత మాధుర్య మెటనాగె నింతవరకు" అని దిగ్భ్రాంతి చెందినాడు.

"ఈ యమృత శాంతియే చాలునెపుడు నీకటాక్ష భిక్షునకు" అని కవి తన ప్రేమ పునీతము చేసుకుని పరితృప్తి పొందినాడు.

(4) ప్రకృతి కవిత్వము : కవి అంతర్ముఖుడగుట వలన ప్రకృతి యొక్క సుకుమార సుందర తత్త్వాన్నే అభివర్ణించాడు. బాహ్య వర్ణనలకు స్వస్తి పలికినాడు. ప్రబంధ కవులవలె వీరు ప్రకృతిని నిందించలేదు. వీరి వియోగ బాధా పరితప్త జీవితానికి ప్రకృతి సహాయకారిగా ఉపకరించినది గాని ఎక్కడా వైరుధ్యాన్ని ప్రకటించలేదు. పైగా ప్రణయోద్దీపనముతో పాటు తాపోపశమనమునకు ఉపస్కారకమైనది. కవికి హేమంతకాలరాత్రి విరహబాష్ప తుషారమ్ము కురిసి కురిసి కనుమొగిచ్చినట్లు కన్పించినది. ఆషాఢ మేఘాన్ని చూసి విరహార్తులకు, తరుణీ దూరులకు, ప్రేమ జీవన దరిద్రులకు ప్రణయ దౌత్యము చేసే మేఘోత్తమునిగా ప్రశంసించినాడు. విరిసిన పూల వెన్నెలల చక్కదనాల హంసియై యరిగెడు చందమామను చూసి బాష్పశాంతి చెందినాడు. కవికి పూర్ణిమ ఉదయాద్రినుండి అరుణారుణమౌ ముఖమెత్తి గాఢలజ్జాయుతయౌ నవోఢవలె కన్పిస్తుంది.

(5) ప్రబోధ కవిత్వము: కవి ఎంత నిరాశామయ జీవితము గడిపినా యంత ఆశాజీవి యని నిరూపించుకున్నాడు. 'కాగడా అనే ఖండకావ్యములో "ఘూర్ణిల్లిన గాలితో పోయె పాదపము, గాలి కలసిన పాటకై పక్షి వెతకదు" అని గతాన్నే స్మరించుకుంటూ జీవన వాస్తవాన్ని నిర్లక్ష్యం చేయరాదంటాడు. ప్రకృతికి నాశము లేదని అది నిత్యనూతన పరిణామము చెందేదని అంటాడు.' "పూవు పడిన గాలి పుట్టదు ఫలము. ఫలము రాలక జనింపదు నవాంకురము. దగ్ధదినైక చితాభస్మరాశి సుప్తిపీడెడి యుషస్సునకు పునాది' అని గతాన్ని తలచి క్షతికి విలపించవలదంటాడు. దీనిపై షెల్లీ "ఓడ్ టు ది వెస్ట్ విండ్" ప్రభావ మున్ననూ కవి తెలియజేయుటలోని వైలక్షణ్యము కొనియాడ దగినది.

(6) దేశభక్తి కవిత్వము: 'కాంక్ష' అనే ఖండకావ్యములో వీరి స్వాతంత్ర్య దీక్ష, మాతృదేశ సేవాతత్పరత మనకు దర్శనమిస్తాయి. ఆ ఖండికలో 'పూవు' తన ఎదలో మోసులువారిన నూతన మనోరథము గురించి వివరిస్తుంది. "రాతి బొమ్మ్లందూదర పోవుటకుగానీ, కొదమ తేంట్ల నృత్య గీతాను నయమునకు గానీ, లలనాకబరీభరైక భూషణముగాగానీ, హారమునందుగానీ, ద్వారతోరణమునందుగానీ.... నిమేషరక్తికై ఉసురు రాల్పగ లేననీ.... ఒక

దేశభక్తుని సమాధి నలంకరించెదననీ' యిలా నివేదిస్తుంది. 'నీచపు దాస్యవృత్తి మననేరని భారత మాతృదేశ సేవా చరణమ్ము నంద నువులర్పణ జేసిన వారి పార్థివ శ్రీ చెలువారు చోటచదస్ప్రగుచు లన్ వికసించి వాసనల్ వీయుచు రాలిపోవగ వలెన్ తదుదాత్త సమాధి మృత్తికన్" ఇది 'ఫూల్ కే చాహ్' అనే మాఖన్‌లాల్ చతుర్వేది వారి కవితకు అనువాదమే యైనను మాతృకలో లేని ఉదాత్తత, సమగ్రత ఇందు భాసిల్లుచున్నవి. శ్రీ వేదులవారు మాతృదేశాభిమానాతిరేకతలో ఒకచోట "జయము హిమగిరి మణీ కిరీటా. జయము సింహళ పాదపీఠా" అనినారు. ఇది సాహితీచమత్కారముగా నున్నను వాస్తవికార్థమునకు ప్రయత్నించిన ఔచిత్యముగా దోపదు. ఆ కాలములో ఇట్టివి పలువురు యొనర్చినవగుట సామాన్య విషయముగా తేలినది. వారి భావచిత్రములు మచ్చునకు మరికొన్ని : తలపులను కోసి దండలుగ గ్రుచ్చుట, రేయివిప్పిన నీలిరెక్కల నీడ, కొదమ తెమ్మెర పిల్లన గ్రోవి, పాట రెక్కలు విదల్చుట దుఃఖము కడుపార మెక్కుట వీరి రమ్యమైన ఊహా చిత్రాలకొక ఉదాహరణ :- కృష్ణునుద్దేశించి రాధ ఇలా అన్నది. "నీ మధురాధరారుణిమ నిండిన నీ యనురాగ హాసముల్ నామలినాశ్రుపూరితతులంబడినప్పటి ఇంద్ర చాపరేఖామణి భూషలీ యెడద గప్పుటచే జనానాంతరామృత ప్రేమ రహస్యముల్ వెలువరించుకొనన్ మరపయ్యె నీకడన్."

వీరు స్వీకరించిన ఆరోగ్యకరమైన సంప్రదాయములు :-

1. భస్మరాసులనుండి పావనత మేలుకొలిపినట్టి భాగీరథ జలము
2. నాకకల్లోలినీ పదనాసమునకు దరవినతమైన హరజటాభరము.

భావ కవితా లక్షణములైన ప్రేమ, వియోగము, నిరాశ, నిట్టూర్పు, చీకటి, దుఃఖము, ఒంటరితనము, పలాయనము మొదలగునవి ఈ కావ్యములో పుష్కలముగా నున్నవి.

శ్రీ కందుకూరి వీరభద్రరావు గారన్నట్లు "శ్రీవేదుల వారి భావనాశక్తి బలమైనది. తెలుగు గడ్డను పుట్టిన యుత్తమ సంప్రదాయముల నుల్లంఘింపలేదు. వారి భాషకు ప్రాచీనుల పటిమ యున్నది. జీవిత కల్లోలమునుండి యుబికిన దగుటచే వారి కవిత్వమునకు నిండు జీవమున్నది."

శ్రీ వేదుల 'చీకటి గ్రమ్ముకున్న వనసీమను పూవులురాలు చప్పుడులు వినగలిగిన సుకుమార భావుకులు. వారి మాటలలో చెప్పవలెననిన' మధుర మంజుల సుమామృతములోని మధురిమము మధుర చంద్రాతపములోని మార్దవము, మృదుసమీరములోని పరిమళము ఈ దీపావళి కావ్యమునందు పుష్కలముగా కలవు.

ఉ ప యు క్త గ్ర ం థ ము లు

1. దీపావళి - శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి
2. ఆధునికాంధ్ర కవిత్వము - డా॥ సి. నారాయణ రెడ్డి

టెలిగ్రాం కవిత

శ్రీ శశికాంత్ శాతకర్ణి

కాలంలా
అనంతంగా సాగే
మహాకావ్యాలకు
కాలం చెల్లిపోయింది!
టెలిగ్రాంలా కలవరపెట్టే
కవితల కాలం ఇది!

సంతూర్

శ్రీ నందిని సిధారెడ్డి

శతటాకం మీద రెండు చేతులు అట్లా ఆడుతాయి—
కాలి గజ్జెలు సవరించుకుంటూ
వెయ్యి అలలు బిలబిలా కదుల్తాయి.

చీరల్నుంచీ కారందాల్నుంచి
మానసిక వివశుల్ని చేసే బహురంగుల్నుంచీ
తీగచేతులు మనల్ని చేరదీస్తాయి.

గాలిపెదవి గడుసుగా చర్మ రంధ్రాల్ని ఊదుతుంది.

శరీర చైతన్యమంతా
ఎక్కడికక్కడ ఫ్లూటులుగా విడివడి
జీవరాగం ఆలపిస్తుంటుంది.
తీగ ప్రవహిస్తుంది—
శరీరం గడ్డ కడుతుంది.

తీగ నాట్యం చేస్తుంది—
కన్నీళ్ళూ రాతిచక్రాల వాతపడి కలతవడి
మనముంటాం కదా,
తీగ వెయ్యిచేతుల్తో వెయ్యిగొంతుల్తో పిలుస్తుంది మనల్ని.

నరాల్ని లాగి పట్టుకుని
మనం మెల్లమెల్లగా తీగల్లోకి ఇమిడి పోతాం
తీగమీద కదిలే చేతులు మనల్ని హిప్నటైజ్ చేస్తాయి.

మనం ఎక్కడో
అడవిలో
లోయలు దిగుతూ
అరవిందన్నయనాల్లా సాగిపోతుంటాం.
గోదావరి మనమధ్య
వెయ్యి తీగలై ప్రవహిస్తుంది!

చేతులు హిప్నటైజ్ చేస్తాయి—
సముద్ర పొడ్డున ఇసుకలో
బ్లాక్ స్టాలియన్ వెయ్యి పరుగులై
తీగమీద కదుల్తుంది!

నీలాకాశంలో నిశ్శబ్దాన్ని చీల్చే
విమానం వెయ్యి ఫారాషూటై
తీగమీద అల్లుకుంటుంది.

తీగమీద వెయ్యిపుష్పాలు ఒక్కసారి విచ్చుకుంటాయి.
వెయ్యిచిర్నవ్వులూవెయ్యికేరింతలూఒకసారేచిమ్ముతాయి.

తీగమీదవెయ్యిసూర్యుళ్లు ఒకేసారిఉదయయాత్రచేస్తారు.

నిషేధాజ్ఞలు దాటుతూ
లాఠీచార్జి తుపాకి గుళ్ళను దాటుతూ
గిరిజన సమీరాలు తీగమీద
అట్నుంచిటూ ఇట్నుంచటూ వీస్తాయి.

నేను తీగ,
శబ్దం తేనెటీగ.

చేతులు హిప్నటైజ్ చేస్తాయి.

ఆ చేతులు అట్లావీస్తే....
తుట్టెమీంచి
వెయ్యి తేనెటీగలు ఝూమ్మంటూ లేస్తాయి

చేతులు హిప్నటైజ్ చేస్తాయి.

ఆ చేతులు అట్లా కదిల్తే...
నే నంతా
వెయ్యి కరపత్రాలుగా వెదజల్లబడతా!

★ ★

[ఇటీవల హైదరా 'బాధ' లో శివకుమార్ శర్మ 'సంతూర్' విని....]

బౌద్ధ మతము హిందూ మతమునకు భిన్నమైనదా ?

క్రీ. పూ. ఆరవ శతాబ్దమున మత మౌఢ్యము, అహింస, వేదసమ్మతమైన యజ్ఞ యాగాదులు, మరియు కులభేదములు భారతీయ - సమాజమును కలవరపెట్టుచుండెను. అట్టి సమయమున బుద్ధుడు అవతరించి సంఘమునగల హెచ్చు తగ్గులను, అహింసను, మూఢాచారముల తీవ్రతను తగ్గించెను. నైతిక వర్తన, సమానత్వమును లోకమున స్థాపించెను. స్త్రీలను కూడ బౌద్ధ సంఘారామములలో, చేర్చుకొని వారు ఆధ్యాత్మికౌన్నత్యము సాధించుటకు అవకాశము కల్పించబడెను. సంఘ ప్రవాహమున కెదురీది, ధర్మమును నెలకొల్పుట మహాత్ముల లక్షణము. 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' (గీ. 4-8) అను గీతాకారుని వాక్యము ప్రకారము 'బుద్ధుడు' ధర్మ సంస్థాపనకై అవతరించిన అవతార పురుషునిగా పరిగణించబడినాడు.

సంస్కృతమున 'బుద్ధుడు' అనగా జ్ఞాని అని అర్థము. గౌతముడు జ్ఞానోదయమంది బుద్ధుడయ్యెను. 'దుఃఖ' నివారణకై తపస్సు, సత్యాహింసలు, త్యాగం మొదలగు ధర్మగుణముల ప్రాధాన్యతను ప్రచారము చేసెను. ఇతడు సన్యసించుట లోకోద్ధరణ కొరకు కలిగించబడెనని ప్రవచించెను. కావున బౌద్ధ సన్యాసుల సంఘారామములు గ్రామములు, పట్టణముల చుట్టు పట్ల ఏర్పడి మానవతావాదమును, సేవాభావమును మానవులకు అలవడునట్లు చేసినవి. బౌద్ధము, హిందూ అద్వైతమును నిష్కామ కర్మ (ఫలాపేక్షలేనిది) ప్రాధాన్యతను బోధించినది. బుద్ధుడు జ్ఞానోదయమైన తరువాత వారణాసిలో ప్రథమముగా ఐదుగురు శిష్యులకు బోధించుటకు 'ధర్మచక్ర ప్రవర్తన' సూత్రోపన్యాసమునిచ్చెను. కావున బౌద్ధమతము 'ధర్మచక్ర ప్రవర్తన' అనగా ధర్మమార్గముగా పరిగణించబడినది.

అశోకుని సారనాథ స్తంభము :- సారనాథ స్తంభము లోని ధర్మచక్రము శ్రీమన్నారాయణుని సుదర్శన చక్రమువలె ధర్మచక్రమై నిర్దేశించబడినది. వృషభము (ఎద్దు) ధర్మదేవత రూపముగా చిత్రించబడినది. భాగవతమున వృషభము ధర్మదేవత రూపముగా పేర్కొనబడినది. వ. అనిన ధర్మనందను పౌత్రునకు (పరీక్షిత్తు) వృషభమూర్తి యున్న ధర్మదేవుండిట్లనియె. (ప్రథమ స్కంధము పుట. 62 క్ర. సం. 388)

వ. నీవు (వృషభము) ధర్మదేవతవు. కృత యుగంబునందు తపశౌచ (నైర్మల్యము) దయా సత్యంబులను నాలుగు నీకుం బాదంబులని చెప్పుదురు .... (ప్ర. స్కంధం క్ర. సం. 392)

ధర్మదేవత నాలుగుపాదములుగా తెలుపబడిన తపస్సు, మనో నైర్మల్యము, దయాసత్యములు బౌద్ధమతమున అధిక ప్రాముఖ్యము నందుట గమనార్హము.

దుఃఖ నివారణోపాయము

సంతృప్తి (కోరికలు లేకుండుట) - ఒకసారి శిష్యులతో మాట్లాడుచు బుద్ధుడిట్లనెను: 'మీ కన్నీళ్ళు నాలుగు మహాసముద్రములుగా మారినవి. కాని ప్రేమలో మీ భాగము లేదు.' అనగా మానవుని జీవితము దుఃఖపూరితమైనది. దుఃఖమునకు మూలము తృష్ణ (కోరికలు). తృష్ణను నిరోధించిన (సంతృప్తిచే) దుఃఖము నశించును. దానికై అష్టాంగమార్గమున (ధర్మమార్గమున) నడచిన ప్రతివాడు పరినిర్వాణము (మోక్షము) పొందవచ్చునని తెలిపెను. ఇవి ఆర్య సత్యములు.

సంతుష్టుడు పొందు మేలు క్రింది భాగవత పద్యమున చక్కగా వివరింపబడినది.

సీ. సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుండు; సంతోషికెప్పుడు జరుగు సుఖము
సంతోషిగాకుంట సంసార హేతువు (పునర్జన్మ)
సంతసంబున ముక్తి సతియు (మోక్షము) దొరుకు ....

(అష్ట. స్కం. పుట. 673. క్ర. సం. 580)

కార్య కారణ సంబంధము :- కార్యకారణ సంబంధమునే మానవుడు అనేక జన్మ పునర్జన్మల నందుచున్నాడు. అనగా వ్యక్తిచేయు కర్మలు (పనులు) అతనికి తర్వాత వచ్చు జన్మను నిర్ధారించునని బుద్ధుడు తెలిపెను. తన పూర్వజన్మ వృత్తాంతములను దృష్టాంతముగా వివరించెను. బుద్ధ జాతక కథలలో బుద్ధుని పూర్వజన్మ వృత్తాంతములు వివరముగా వర్ణించబడి యున్నవి.

హిందూమతమున గల కర్మ, పునర్జన్మ సిద్ధాంతములు బుద్ధుడు గ్రహించుట గుర్తింప తగిన విషయము.

శ్లో. పురుషః ప్రకృతిస్థోహి భుఙ్క్తే ప్రకృతి జాన్గుణాన్
కారణం గుణ సఙ్గోస్య సదసద్యోనిజన్మసు (గీ. 13-21)

ప్రకృతి యందు పురుషుడు (ఐక్యభావముతో) నిలచి ప్రకృతి జనిత గుణములను భోగించును. అతడు యోగ్యగర్భములందు, అయోగ్య గర్భములందు జన్మించుటకు కారణము అతనికి గుణములతో గల సంగమమని పై శ్లోకము తెలుపుచున్నది. (శ్లో. వాసాంసి జీర్ణాని.. గీ. 2-22) మానవుడు చినిగిన గుడ్డలు త్యజించినట్లు ఆత్మ అక్కరకురాని శరీరములను త్యజించునని తెలుపబడినది. జన్మ పునర్జన్మలు చక్రభ్రమణమున కొనసాగును. బృహదారణ్యకోపనిషత్తులో కూడ కర్మ పునర్జన్మల సంబంధము వర్ణింపబడినది.

మహాకరుణ చిత్తులైన బోధిసత్వులు :- క్రీ. శ. ఒకటవ శతాబ్దమున బౌద్ధమతము హీనయాన, మహాయాన శాఖలుగా విడిపోయినది. మహాయానము బౌద్ధమతమును హిందూ మతమునకు మరింత సన్నిహిత మొనర్చినది. ఈ శాఖవారు బుద్ధుని, బోధిసత్వులను దేవతలుగా నమ్మిరి. విగ్రహారాధన, భక్తి హిందూ సాంప్రదాయములను పాటించిరి. (134-138, గ్లింప్సెస్ ఆఫ్ ఏన్షంట్ ఇండియా)

బోధిసత్వుల అవతరణ మహాయానశాఖ ఉత్కృష్టతను యినుమడింప జేసినది. బుద్ధత్వమందుటకు యత్నించువారు బోధిసత్వులు. వీరు పరినిర్వాణము(మోక్షము)పొందు అర్హతయుండియు పొందుట కిచ్చగింపక తోటివారిని సన్మార్గమున నుంచుటకై (పునర్జన్మ నంది) యత్నించుట వీరి త్యాగ (కర్మఫలత్యాగము)గుణమును తెలుపును. కావున వీరిని మహామైత్రి మహాకరుణ చిత్తులందురు.

'అందరు బోధిసత్వులు మహాకరుణ చిత్తులై అందరిపట్ల ప్రేమను ప్రదర్శించుట వారి ముఖ్యకర్తవ్యము. ధ్యానలబ్ధమైన జ్ఞానముతో వీరు స్వీయ సంతోషమును మాత్రమే ఆశింపరు. జ్ఞానోదయ మార్గమున వెనకబడిన వారిని వీరి కరుణ హృదయము వదలివేయదు.' అని నాగార్జునుడు బోధిచిత్తలో తెలిపెను.

సత్యము:- 'సత్యమేవ జయతే' అని ముండకోపనిషత్‌లో తెలుపబడినది. దీనిని మన జాతీయ ముద్ర క్రింది భాగమున గమనింప వచ్చును.

'సత్యాత్మకం త్వాం శరణం ప్రపన్నా'

(భాగవతము దశమస్కం. - 2 - 23)

సత్యస్వరూపుడైన భగవంతుని శరణు వేడుచున్నామని పై శ్లోకార్థము.

'సత్యంవద, ధర్మం చర ....' తైత్తిరీయోపనిషత్తు వాణి.

'మృత్యుర్ ఆపాదయతే మోహాత్,
సత్యేన 'ఆపాదయతే అమృతం' (భారతము)

కోరికలు మృత్యువును కలిగించును, సత్యవర్తనము మోక్షము నొసగును అని అర్థము. సత్యమే జయించును, సత్యవ్రతుడు మోక్షము పొందును. భగవంతుడు సత్యస్వరూపుడు అని బుద్ధునికన్న ముందుగ పలు గ్రంథములలో వివరింపబడినది. ఇట్టి గొప్ప మహిమగల 'సత్యము' బౌద్ధమతమున ప్రధాన ధర్మముగా గ్రహింపబడుట గమనార్హము.

అహింస :- ఉపనిషత్తులవలె బౌద్ధమతముకూడా యజ్ఞయాగాదులను నిరసించెను. హింసను వ్యతిరేకించెను. కావున బుద్ధుడు ఉపనిషత్తుల మరియు ఉపనిషత్ సాంప్రదాయమునుసరించువారి సానుభూతి పొందెను.

శ్లో. 'అహింసా సత్యమస్తేయ కామ క్రోధలోభతా,
భూతప్రియ హితేహాచ ధర్మోయం సార్వవర్ణికః'

(భాగవతం, ఏకాదశ స్కం. 17-20)

ఎవరిని హింసించకుండుట, సత్యము పాలించుట, దొంగతనము చేయకుండుట, సమస్తప్రాణుల యెడ దయ కలిగియుండుట అన్ని వర్ణములవారు పాటించుట ధర్మమని పై శ్లోకార్థము.

సాంఖ్య దర్శనము :- కపిలుని సాంఖ్యదర్శనము ప్రపంచము త్రిగుణ అనియు నశించునని తెలుపును. భగవంతుని నమ్మదు. (త్రిగుణాత్మకమైన) ప్రకృతి, పురుషుడు వేర్వేరనియు శాశ్వతమని భావించును. జన్మ పునర్జన్మలను నమ్మును. పై లక్షణములన్నియు బౌద్ధమతమున నుండుటచే సాంఖ్యమునుండి బౌద్ధమతము గ్రహించబడినదని ప్రొఫెసర్ జాకోబి తెలిపెను.

(వి. డి. మహాజన్, ఏన్షంట్ ఇండియా - పు. 79-80

కులభేదము :- కులమత భేదములను బౌద్ధమతమేగాక ఉపనిషత్తులు, భాగవతము కూడ ఖండించినవి.

భాగవతమున నారదుడు ధర్మరాజునకు వర్ణాశ్రమధర్మములు తెలుపు సందర్భమున క్రిందివిధముగా తెలుపును.

వ. .... జాతి మాత్రంబున పురుషునికి వర్ణంబు నిశ్చయింపబడలేదు. శమదమాది వర్ణలక్షణ వ్యవహారంబుల గణ్యయు ..

(పుట. 59

పరినిర్వాణము :– జన్మ పునర్జన్మలు దుఃఖ భాజనమైనవి. మానవజన్మ పరమావధి పరినిర్వాణము లేక మోక్షమని హిందు బౌద్ధమతములు నమ్ముచున్నవి. జన్మరాహిత్యము పరినిర్వాణముగా బౌద్ధమతమున పేర్కొనబడినది. నిర్వాణము జీవితకాలమున పొందు ఆనందము. పరినిర్వాణము జన్మరాహిత్యమైనది. ఇది మరణానంతరము మాత్రమే అనుభవయోగ్యము.

(ఇండియన్ ఫిలాసఫీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, పు. 35)

దీనికి బోధిసత్వుల జీవన విధానము ఆదర్శప్రాయము.

తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర
అసక్తోహ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః

(గీ. 3–19)

అనాసక్త చిత్తముతో (ఫలాపేక్షరహితముగా (త్యాగము) కర్మము నాచరించువాడు మోక్షమందును. అనగా త్రిగుణోన్నతుడు (సత్వరజస్తమోగుణ రహితుడు) అమృతత్వమందునని గీత సూచించుచున్నది.

శ్లో. అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయా,
మృత్యోర్మా అమృతంగమయా

మృత్యువు (పునర్జన్మ) నుండి అమృతత్వము (పునర్జన్మలేని) వైపు నడిపింపుము అని ఉపనిషత్తు తెలుపుచున్నది.

కొందరు పాశ్చాత్య పండితుల అభిప్రాయము

"గౌతముడు హిందువుగాపుట్టి, పెద్దవాడై హిందువుగనే మరణించెను. అతని కన్న పూర్వము, తరువాత వ్రాయబడిన గ్రంథములలో నైతికవర్తన ప్రాధాన్యము గోచరించును. తనకన్న ముందు తెలుపబడిన మత సిద్ధాంతములను బుద్ధుడు తనకు తగిన విధముగా సవరించెను .... అతని అమిత దయాళుత్వము అతనిని పూర్వుల నుండి వేరు చేయును."

(బుద్ధిజమ్. పుట. 83–84)

రైస్‌డేవిడ్ ఓల్డెన్ బర్గ్ ఉద్దేశము "బౌద్ధమతము బ్రాహ్మణ మతము (హిందూమతము) నుండి పలు ముఖ్య సిద్ధాంతములను గ్రహించినది ...."

(బుద్ధ, పుట 53)

ప్రొఫెసర్ జాకోబి ఇట్లు తెలిపెను, "బౌద్ధమతముసాంఖ్య దర్శనము నుండి గ్రహింపబడినది."

హిందూ ధర్మశాస్త్రములను కూలంకషముగా అధ్యయనము చేసిన మాక్సుముల్లర్ అభిప్రాయము. 'పవిత్ర బౌద్ధమత గ్రంథములద్వార తెలియవచ్చు. బౌద్ధమతము (పూర్వబ్రాహ్మణమత) ధర్మశాస్త్రజ్ఞుల ఉద్దేశములను పూర్తి చేసినదేకాని ఖండించలేదు .... వేదములలో గల ధర్మ సూత్రములకు బౌద్ధమత సూత్రములు సవరణలు మాత్రమే. బుద్ధునకు కలిగిన పలు సంశయములు ఉపనిషత్తులు, బ్రాహ్మణములు, సూత్ర, శాస్త్ర, దర్శనములలో అగుపించును .... '

ఉపసంహారము

బౌద్ధమత సిద్ధాంతములు వేదములు, ఉపనిషత్తులు మొదలగు హిందూమత గ్రంథములనుండి స్వీకరింపబడి నాటి సాంఘిక అవసరములకు తగిన విధముగా మార్చినట్లు పై పరిశీలన వెల్లడి చేయుచున్నది. ఉపనిషత్తులు, భగవద్గీతవలె బౌద్ధమతము నిష్కామ కర్మద్వారా (త్యాగము) పునర్జన్మరాహిత్యమైన మోక్షము సాధింపవచ్చునని వివరించును. మోక్షసాధనకు భక్తిమార్గము సులభమైనదని బౌద్ధమత మహాయానశాఖ ప్రచారముచేసెను. సాంఖ్యదర్శనమువలె ఈ మతము ప్రపంచము భ్రమ అని, దేవుని ఉనికిని నమ్మదు. సత్యవాక్ ప్రభావము, నైతికవాదము, అహింసా సూత్రములను భారత, భాగవత, దర్శనాదులనుండి గ్రహించి లోకమున వ్యాప్తి చేసినది.

వేద సమ్మతమైన యజ్ఞయాగాదులను, కులభేదములను ఖండించుటలో బౌద్ధమతము ఉపనిషత్తులను మించినది. సామాన్య మానవుడు ఆచరించగల అష్టాంగమార్గమును (ధర్మమార్గము) దుఃఖ నివారణోపాయముగ ప్రజలకు బోధించినది. నాటి ప్రజల భాషయైన పాళి, ప్రాకృత భాషలలో మత ప్రచారము చేయుట, గ్రంథ రచన కావించుట బౌద్ధమత ప్రత్యేకతలుగా గుర్తింపవచ్చును.

నేటి తార్కికులకు, శాస్త్రవేత్తలకు కూడ బౌద్ధమతము అనుసరణీయమైనది. ఇది భారతదేశమునకే గాక ప్రపంచమునకు శాంతి సందేశమివ్వగల మతము. నైతిక స్థాయి దిగజారి, హింస పెరిగిన నేటి సమాజమునకు బౌద్ధమత ప్రచారము అత్యంతావశ్యకము. ఈ మతము మతకల్లోలములను అణచి, మానవతావాదమును వ్యాప్తిచేసి ఐకమత్యము ఒనగూర్చును. శాంతి ప్రియుడైన గౌతమ బుద్ధుడు చిరస్మరణీయుడు.

శ్రీ రేబల్లి వేంకటేశ్వర్లు
ఆదిలాబాదు

విట్‌గెన్‌స్టైన్ దార్శనిక చింతనలు

"దర్శన శాస్త్రం కొన్ని సిద్ధాంతాల సముదాయంకాదు. అది ఒక ప్రక్రియ. వాక్యములను వివరించి, స్పష్ట పరచటమే దాని లక్ష్యం. దర్శనశాస్త్రం వివరించే వాక్యములు ప్రపంచానికి సంబంధించిన దార్శనికేతర వాక్యములేగాని, దార్శనిక వాక్యములుకావు. ఈ వాక్యములు వివరింపబడినప్పుడు ప్రపంచం యొక్క తార్కిక రూపం వీటిలో ప్రతిబింబిస్తుంది. ఈ విధంగా దర్శనశాస్త్రం దార్శనిక వాక్యములలో చెప్పనలవికాని దానిని దార్శనికేతర వాక్యములలో ప్రదర్శిస్తుంది," అని లుడ్‌విగ్ విట్‌గెన్‌స్టైన్ తన "తార్కిక దార్శనిక గ్రంథం"లో చేసిన వ్యాఖ్యలు ఆయన దార్శనిక చింతనా ధోరణిని సూచిస్తాయి. ఈ శతాబ్దపు పాశ్చాత్య అగ్రశ్రేణి దార్శనికులలో విట్‌గెన్‌స్టైన్ ఒకరు. ఆయన 1889లో వియన్నాలో ఒక సంపన్న యూదు కుటుంబంలో జన్మించాడు. బెర్లిన్ నగరంలో ఇంజనీరింగ్ విద్య అభ్యసించి, మాంచెస్టర్ విశ్వ విద్యాలయంలో పరిశోధన జరపడానికి వెళ్ళాడు. అక్కడ విమానాల ఇంజన్ ఒకదానికి రూపకల్పన చేస్తూండగా ఆయన దృష్టి గణితశాస్త్రం మీదకు మళ్ళింది. బెర్‌ట్రాండ్ రసెల్ వ్రాసిన "గణితశాస్త్ర మూలతత్వములు" గ్రంథం చదివాడు. ఆ గ్రంథాన్ని అధ్యయనం చేయడంవల్ల ఆయనకు ఫ్రెగే గణిత శాస్త్రీయ భావాలతో పరిచయం కలిగింది. అనంతరం ఆయన ఫ్రెగే సలహాపై కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రసెల్‌వద్ద దర్శన శాస్త్రాధ్యయనం చేయడానికి వెళ్ళాడు. అక్కడ కొంతకాలం గణిత తర్కం చదివి ఆ తరువాత నార్వేవెళ్ళి, 1914లో యుద్ధం ప్రారంభమయ్యే వరకు ఏకాంతవాసం చేశాడు. అనంతర కాలంలో విట్‌గెన్‌స్టైన్‌కు అపారమైన కీర్తిని సంపాదించి పెట్టిన ఆయన దార్శనికచింతన నార్వేలో ఉన్నప్పుడే ప్రారంభమైంది. యుద్ధం ప్రారంభం కాగానే విట్‌గెన్‌స్టైన్ ఆస్ట్రియా శతఘ్ని దళంలో చేరి, అసాధారణమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి అధికారుల ప్రశంసలు పొందాడు. 1918 లో ఇటలీ సైన్యానికి ఖైదీగా పట్టుబడ్డాడు. సైన్యంలో ఉంటూనే విట్‌గెన్‌స్టైన్ తన దార్శనిక చింతనలను నోట్ పుస్తకాలలో వ్రాసుకున్నాడు. ఇవే ఆయన జీవితకాలంలో ప్రచురించబడిన ఏకైక దార్శనిక గ్రంథం "తార్కిక దార్శనిక గ్రంథాని"కి మూలం.

విట్‌గెన్‌స్టైన్ ప్రతిభ, పాండిత్యం బహుముఖమైనవి. జీవితంలో ఆయన చవి చూచిన అనుభవాలలో ఎంతో వైవిధ్యం ఉన్నది. నిర్భీకత, నిస్సంగత్వం ఆయన ప్రధాన లక్షణాలయితే, నిరంతరమైన సత్యాన్వేషణ ఆయన దార్శనిక చింతనల పరిణామానికి, పరిణతకి దోహదించాయి. యుద్ధానంతరం విట్‌గెన్‌స్టైన్ స్వదేశానికి తిరిగి వచ్చాడు. తన తండ్రినుంచి సంక్రమించిన యావదాస్తిని త్యజించాడు. 1919లో వియన్నాలో ఉపాధ్యాయ శిక్షణపొంది, ఆరు సంవత్సరాలపాటు ఆస్ట్రియా మారుమూల గ్రామాలలో అధ్యాపకుడుగా పని చేశాడు. 1926లో ఉపాధ్యాయ వృత్తిని విడనాడి ఏవేవో పనులు చేస్తూ మూడేళ్ళు కాలక్షేపం చేశాడు. వియన్నా బృందం వ్యవస్థాపకుడుగా పేరుపొందిన వియన్నా విశ్వవిద్యాలయం దర్శనశాస్త్ర ఆచార్యుడు మోరిట్జ్ షిలిక్‌తో విట్‌గెన్‌స్టైన్‌కి ఆ కాలంలోనే పరిచయం కలిగింది.

దర్శనశాస్త్రంలో రెండు ప్రధాన విభాగాలు గోచరిస్తాయి. (1) అతిభౌతిక శాస్త్రం (మెటఫిజిక్స్) (2) జ్ఞాన మీమాంస (ఎపిస్టిమాలజీ) ఆత్మ, పరమాత్మ, విశ్వం - వీటిని గూర్చిన చింతనయే అతిభౌతికశాస్త్రం. (దార్శనికులు వీటినే పరమ తత్వములు అని అంటారు) జ్ఞానోత్పత్తి, దాని పరిమితులను గూర్చి చర్చించు విభాగాన్ని జ్ఞానమీమాంస అంటారు (ఇంగ్లీషులో "ఫిలాసఫీ" అనే పదానికి జ్ఞాన ప్రేమ అని అర్థం). పాశ్చాత్యదార్శనిక చింతనలు ఆధునిక పాశ్చాత్య దర్శన శాస్త్ర పితగా ప్రసిద్ధి పొందిన రేన్ డేకార్ట్‌తో ఒక నూతన పంథాను అనుసరించాయి. ఖగోళ, గణిత, భౌతిక శాస్త్రాలు, తదితర శాస్త్రాలు ఆవిష్కరించిన నూతన సత్యాల ప్రభావం వాటిపై పడిందని చెప్పవచ్చు. లాక్, బర్కిలె, హ్యూమ్ వంటి అనుభవవాదులకు, స్పినోజా, లైబ్నిజ్, కాంట్ వంటి హేతువాదులకు మధ్య జరిగిన వాద ప్రతి వాదాలలో వివిధ శాస్త్రాల ప్రభావం గోచరిస్తుంది. విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధితో దర్శన శాస్త్రంలో పరమతత్వములపై చర్చకు ప్రాధాన్యం కొంత తగ్గినదని చెప్పవచ్చు. సత్యావిష్కరణకు విజ్ఞాన శాస్త్రీయ పద్ధతుల కంటే భిన్నమైన పద్ధతులు లేవన్న భావం తదుపరి కాలంలో మరింత బలపడింది. వివిధ శాస్త్రాలు కనుగొన్న ఖండిత సత్యాలని సమన్వయపరచి విస్తృతమైన, సమగ్రమైన సత్యానికి రూపకల్పన చేయడం దర్శన శాస్త్ర లక్ష్యమని రసెల్‌వంటి దార్శనికులు అభిప్రాయపడ్డారు. అతిభౌతిక శాస్త్రం చర్చించు సమస్యలు, ఆ సమస్యల పరిష్కారానికి అది చేసే ప్రతిపాదనలు శుష్కమైనవని వీరి భావం. దార్శనిక సమస్యలపై విట్‌గెన్‌స్టైన్ భావాలు కూడా ఈ కోవకు చెందినవే.

"దర్శన శాస్త్రం జీవిత సమస్యలకు సమాధానాలు ఇవ్వదు. వాక్యాలు వస్తుస్థితిని తెలుపుతాయి. ఉత్కృష్టమైనదానికి ప్రపంచంలో వస్తుస్థితి ఎలా ఉన్నదన్న విషయంతో నిమిత్తం లేదు. ఈశ్వరుడు ప్రపంచంలో తనను తాను ఆవిష్కరించుకొనడు." అని విట్‌గెన్‌స్టైన్ అంటాడు. జీవిత సమస్యలను అసలు ప్రశ్నలుగా రూపొందించే అవకాశమేలేదని ఆయనవాదం. "సమాధానమే కాదు. ప్రశ్నలని కూడా మాటలలో చెప్పడానికిగాని, అడగడానికి కానివీలులేదు. ప్రశ్న అడగడానికి అవకాశం ఉంటే సమాధానం చెప్పటానికి అవకాశం ఉంటుంది. సంశయవాదం ఖండనకు అతీతమైనది కాదు కాని, ప్రశ్నించే ఆస్కారంలేని సందర్భంలో సందేహాలు లేవదీయటానికి ప్రయత్నించటం అర్థరహితం. అసలు ప్రశ్న అంటూ ఒకటి ఉంటేకదా సందేహానికి, సమాధానం అంటూ ఉంటే కదా ప్రశ్నకు, ఏదైనా చెప్పడానికి వీలు అంటూ ఉంటే కదా సమాధానానికి అవకాశం ఉంటుంది." అని విట్‌గెన్‌స్టైన్ విశదీకరించాడు. "శాస్త్రీయమైన ప్రశ్నలన్నిటికీ సమాధానాలు లభించిన తరువాత కూడా జీవిత సమస్యలన్నీ యథాతథంగానే ఉండిపోతాయి. అయితే అప్పుడు ప్రశ్నలేవీ ఉండవు కాబట్టి దానికి ఇదే సమాధానం. జీవిత సమస్యలకు సమాధానం సమస్యలంటూ లేకపోవటమేనని కూడా ఆయన అంటాడు.

తార్కిక ప్రత్యక్ష జ్ఞాన ప్రాధాన్యవాదం (లాజికల్ పాజిటివిజం), విశ్లేషణాత్మకదర్శనం (ఎనలిటికల్ ఫిలాసఫీ) అనే రెండు ప్రధానదార్శనిక సంప్రదాయాలకు విట్‌గెన్‌స్టైన్ దోహదం చేశాడు. ఆయన తొలిరచన "తార్కికదార్శనిక గ్రంథం", వియన్నాబృందంలోని కొందరు సభ్యులతో ఆయన జరిపిన చర్చలు తార్కిక ప్రత్యక్షజ్ఞాన ప్రాధాన్యవాదవికాసానికి, రూపకల్పనకి తోడ్పడ్డాయి.

తార్కిక నియమాలు, గణిత శాస్త్రీయ వాక్యాలు రెండు పరస్పర విరుద్ధ లక్షణాలను ప్రదర్శిస్తాయి. అవి సామాన్యములు, అవశ్యకములు. కాని అవి వ్యావహారిక సత్తాకు అన్వయింపదగినవి. ఒక సత్యం సర్వ సామాన్యంగా ప్రమాణసిద్ధం, నిత్యం అయినట్లయితే దాని విషయం కూడా పరిణామ రహితము, నిత్యము కావాలని అతీతవాద దార్శనికులు భావించారు. విషయం మారుతున్నట్లయితే ఇప్పుడు సత్యమైనదాని జ్ఞానం భవిష్యత్తులో అసత్యమవుతుంది. విషయమును గురించిన జ్ఞానం సత్యం గావించాలంటే విషయంలోని మార్పులకు అనుగుణంగా నిత్యం మన జ్ఞానాన్నికూడా మార్చుకోవలసి వస్తుంది. కాని రెండు రెండ్లు నాలుగు అన్న జ్ఞానం ఇట్టిదికాదు. గణితశాస్త్రీయ విషయాలు, భావాలు, తత్వములు నిత్యములు,పరిణామరహితమైనవి కనుక వాటిని ఒకసారి తెలుసుకుంటే శాశ్వతంగా తెలుసుకున్నట్లేనని ఈ దార్శనికులభావం. ఈ విషయమే ఇట్టి జ్ఞానం ఎందుకు సర్వసామాన్యం, అవశ్యకం అవుతుందోవివరిస్తుంది. దీని విషయాలు హేతుబద్ధమైనవి. వాటి మధ్య సంబంధాలు హేతువుచేత సమర్థనీయములు. అంటే ఇవి అవశ్యకములన్నమాట.

అయితే ఇట్టి జ్ఞానాన్ని అనుభవ విషయములకు ఎట్లా అన్వయించ వచ్చునో ఈ సిద్ధాంతం వివరించడం లేదు. గణిత శాస్త్రీయ వాక్యాలు, తార్కిక నియమాలు అనుభవంనుండి సేకరింపబడినవేనని అనుభవవాదాలు తెలిపారు. అలా అయితే ఇవి సర్వసామాన్యములు, అవశ్యకములు ఎలా అవుతున్నాయో వీరు వివరించలేదు. విట్‌గెన్‌స్టైన్ ఈ సమస్యకు సూచించిన పరిష్కారం సామాన్య దార్శనిక సమస్యల స్వభావం గురించి ఆయన ప్రతి పాదించిన సిద్ధాంతం మీద ఆధారపడి ఉన్నది. దార్శనిక సమస్యలు పరిష్కరింప వీలులేనివని ఆయన వాదం. పరిష్కరించడానికి వాస్తవానికి సమస్యలే లేవని నిరూపించడానికి ఆయన ప్రయత్నించాడు. దార్శనిక సమస్యలు భాషయొక్క అస్తవ్యస్తతవల్ల జనించినవనీ, గణితశాస్త్ర సత్యములు, తార్కిక నియమాలు ఇతర దార్శనిక సమస్యలవలెనే పరిష్కార యోగ్యంకావనీ ఆయన అభిప్రాయం. ఈ వాక్యములు ఏదో ఒక విషయమును గురించినవి కావు. ఒక ప్రత్యేక విధమున కొన్ని సంకేతాలను ఉపయోగించాలన్న మన నిర్ణయాన్ని మాత్రమే ఇవి తెలియజేస్తాయి. ఆ సంకేతములనే మరొక విధంగా ఉపయోగించాలని నిర్ణయించుకొన్నట్లయితే భిన్నమైన గణితం, భిన్నమైన తర్కం లభిస్తాయి. ఈ వివిన్న వ్యవస్థలన్నీ సమానములే. చదరంగ క్రీడలోని నియమముల వంటివే తార్కిక నియమాలు, గణిత శాస్త్రీయ నియమాలు. కొన్ని నియమాలకులోబడి ఆట ఆడనిశ్చయించుకున్న తరువాత స్వవచన వ్యాఘాత దోషం లేకుండా ఆ నియమాలను ఉల్లంఘించలేము. ఈ విషయమే గణిత, తార్కిక నియమాల అవశ్యకతను వివరిస్తుంది. గణిత, తర్కశాస్త్ర సత్యములు తత్వముల యొక్కగాని, అనుభవ విషయముల యొక్క గాని, జ్ఞానం ఇవ్వజాలవు. ఈ సత్యములు పునరుక్తులు (టాటాలజీస్) అని విట్‌గెన్‌స్టైన్ తెలిపాడు. కల్పిత నియమాలు, నిర్మాణం, పరివర్తన వీటి నియమాలు. అయితే సాధారణానుభవజన్యమైన నియమములను, నిర్వచనములను మాత్రమే మనం ఎన్నుకుంటాం కాబట్టి అనుభవవిషయాలకు అన్వయించ వీలు అవుతుంది. భాషయొక్క అస్తవ్యస్తతవల్ల దార్శనిక సమస్యలు ఎట్లాఉదయిస్తాయో చెప్పడంవల్ల అసలు దార్శనిక సమస్యలన్నవే లేకుండా చేయవచ్చునని విట్‌గెన్‌స్టైన్ నిరూపించాడు.

దార్శనిక సమస్యలు భాషయొక్క అస్తవ్యస్థతవల్ల జనిస్తున్నాయన్న సిద్ధాంతాన్ని నిరూపించేందుకు భాషా నిర్మాణాన్ని, దానికీ సత్తా (రియాలిటీ) కీగల సంబంధాన్ని అనగా అర్థ సమస్యను విట్‌గెన్‌స్టైన్ కూలంకషంగా చర్చించాడు. ఆయన తన ప్రథమ రచన "తార్కిక దార్శనిక గ్రంథం"లో విస్తరించిన ఈ అర్థ సిద్ధాంతమే అర్థమును గురించిన "చిత్ర సిద్ధాంతం." ఒక వాక్యం భూతార్థములకు (ఫ్యాక్ట్స్) అనుగుణంగా ఉన్నట్లయితే అది సత్యమవుతుంది. అట్లా లేకపోతే అసత్యమవుతుంది మరి భూతార్థమంటే ఏమిటి? విట్‌గెన్‌స్టైన్ దృష్టిలో ఒకనియత సంబంధం కలిగిన విషయముల సమూహమైన స్వతంత్ర వస్తువే భూతార్థం. ఇతర భూతార్థముల సమ్మేళనం లేనటువంటి భూతార్థం పరమాణు భూతార్థం. స్వతంత్ర పరమాణు భూతార్థముల సమూహమే ప్రపంచం. ఇతర వాక్యములు భాగములుగా లేని సరళ వాక్యం భూతార్థం యొక్క "ప్రతికృతి" లేదా చిత్రం. ఏ భూతార్థమును తాను చిత్రిస్తున్నదో, దేనికి అది ప్రతికృతి అయి ఉన్నదో అట్టి భూతార్థమునకు తనకు సామాన్యముగా కొన్ని లక్షణములు కలిగి ఉండి, తాను కూడా ఒక భూతార్థమై ఉండు సందర్భంలోనే వాక్యం యొక్క ప్రతికృతి లేదా చిత్రి స్వభావం ఇమిడి ఉన్నది. ఆ సామాన్య లక్షణాలు (1) ఒక సమాన తార్కిక రూపం (2) రెండు భూతార్థములలోని విషయముల మధ్య ప్రత్యేక పరస్పర అనుగుణ్య సంబంధం. తాను చిత్రించు, ప్రతికృతిగానుండు భూతార్థమే వాక్యమునకు అర్థం. అర్థం కలిగి ఉండటమంటే చిత్రించుటయే. అయితే విట్‌గెన్‌స్టైన్ వ్రాసిన తరువాతి గ్రంథం "దార్శనికాన్వేషణలు"లో ఒక మాట యొక్క లేదా ఒక వాక్యం యొక్క అర్థం దాని ఉపయోగంలోనే ఉన్నదన్న సిద్ధాంతాన్ని స్వీకరించి ఈ అర్థ సిద్ధాంతాన్ని విసర్జించినట్లు కనపడుతుంది.

శ్రీ శివపురపు వేంకటేశ్వరరావు

అరవం - తమిళం - ద్రావిడం

ఈ కాలంలో కూడా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం మీద కోర్టులలో కేసులు నడుస్తున్నాయి.

ఇంగ్లాండులోని స్టోన్‌హెంజి నిర్మాణాలు లేదా అవశేషాలు ఆదేశంలో కావలిసినంత వాగ్వివాదానికి కారణాలు అవుతూనే ఉంటాయి.

భారతదేశంలో ద్రావిడ - అరవ - తమిళ శబ్దాలకి సంబంధించిన వివాదాలు, చర్చలు జరగటంలో ఆశ్చర్యం ఏమిటి?

ద్రావిడ → తమిళ అని కొందరి అభిప్రాయం. గ్రీసు ప్రాంతంలోని ఒక తెగ (త్రిమిలాయి ?!) పేరు 'తమిళ' అనే శబ్దానికి మూలం అన్న సిద్ధాంతం ఉంది.

బిషప్ కాల్‌డ్వెల్‌గారు ద్రావిడులు 'తురాన్' నుంచి వచ్చిన వారని అనుకున్నట్లు ఈ విలేఖరికి అర్థం అయింది. ఇది ఇరాన్‌కి సుమారుగా తూర్పుగా ఉన్న ప్రాంతం, ఇక్కడే కాకపోయినా ఈ చుట్టుపట్ల 'తెర్మెజ్' అనే తెగ ఒకప్పుడు ఉండేదని చరిత్ర పుస్తకాలు చెబుతాయి. ఇది ఒక తురుష్కుల తెగట. ఇక్కడే 'తలెఫీ' అనే తురుష్క తెగ ఉండేదిట! కొందరు మంగోల్ జాతివారు నేటి బెంగాలులోని తామ్లుక్‌కి వచ్చి అక్కడి నుంచి సముద్రంమీదుగా కంచి ప్రాంతానికి వచ్చారని కొందరు అంటారు. తామ్లుక్ నుంచి 'తమిళ' శబ్దం వస్తుందిట!

ఇలాంటి ఊహా కల్పనలకి అంతులేదు.

'ద్రావిడ' లేదా 'ద్రవిడ' అనే మాట 'తమిళ' కాలేదనే వారూ ఉన్నారు! ద్రావిడులు నాగజాతి వారుట వారు ఏదో ప్రాకృతం మాటలాడే వారుట! తమిళులు వేరేట.

అప్పుడూ ఇప్పుడూ కూడా కొందరికి పురాణాలే చరిత్ర — అని ప్రొఫెసర్ నీలకంఠశాస్త్రిగారు వ్యంగ్యంగా రాశారు. ఫరవా లేదనుకుని కాస్త పేటిజోలికి పోతే - శ్రీ కృష్ణుడికి జాంబవతి ద్వారా జన్మించిన కొడుకు పేరు ద్రావిడుడని తెలుస్తుంది. కంసుడి తండ్రి ఉగ్రసేనుడు కాడు ద్రమిళుడనే దానవుడనీ తెలుస్తుంది. ఋషభుడనే ఋషికి ద్రమిళుడనే కొడుకు ఉంటాడు. భరతుడు (దుష్యంతుడి కుమారుడు కాడు) ఇతని సంతతి వాడేట. ఈ భరతుడి వలననే 'భరతవర్షం' అనే పేరు వచ్చిందిట ....

సాధారణంగా చరిత్ర తెలిసిన తమిళు లెవరయినా 'అసలయిన తమిళ దేశం' కొల్లడం, వైగై నదులమధ్య దేశమే అన్న సంప్రదాయం ఉందంటారు. తొండై మండలమే ద్రావిడ దేశంట అంటారు - అంటే పల్లవులు ఏలిన ప్రాంతం అన్నమాట. ఇక్కడ తమిళ శాసనాల కన్నా ప్రాకృతంవే పాతవి అంటారు కదా!

తమిళ దేశంలో ఎన్నో నాడులు ఉంటే వాటిలో అరువా నాడు ఒకటి అని చరిత్ర పుస్తకాలు కొన్నిటిలో ఉంటుంది కాని ప్రొఫెసర్ నీలకంఠ శాస్త్రిగారు ఈ విషయానికి అంతగా

ప్రాముఖ్యం ఇవ్వలేదు, ఎందుకో .... అయినా సరే, అరువానాడుకి చెందిన వారిని తెలుగు, కన్నడం వారు 'అరువలు' అంటే క్రమంగా అది 'అరవలు' అయిపోయిందని కొందరి ఊహ.

'అరువ' అంటే ఏమిటి? 'పాము' అన్న అర్థం ఉంది కాబట్టి అరువలు నాగులే అన్నవాదం ఉంది. ('సర్పం' అన్నమాట 'సరువం' అయి అదికాస్తా 'అరువం' అయినా ఆశ్చర్యంలేదు. తమిళంలో సంస్కృతం మాట 'సభ' కాస్తా 'అవై' అయిందిట!)

భారతదేశంలో గౌడ, ద్రావిడ విభజన ఉంది. 'అసలు గౌడదేశం' ఇంద్రప్రస్థం చుట్టూ వున్న చోటు మాత్రమేననీ, అది క్రమంగా వింధ్యకి ఉత్తరాన ఉన్న దేశానికి అంతటికీ వర్తించటం జరిగిందనీ, చివరికి బెంగాలు ఉత్తరాన ఒక భాగానికి మాత్రం 'గౌడ' శబ్దం వర్తించిందనీ వింటాము. (గౌర్ బ్రాహ్మణులని ఉన్నారు. వీరు రాజస్థాన్‌లోని జయపూర్ చుట్టు పక్కల వారుట.) ఇప్పుడు గౌడ బ్రాహ్మణులు అంటే బెంగాలీ బ్రాహ్మణులు అనే అర్థం వస్తుందిట.

అదే విధంగా ఒకప్పుడు ద్రావిడులు ఎవరయినప్పటికీ నేడు అరవవారిని మాత్రమే ద్రావిడులనే ధోరణి ఉందనవచ్చు. (పంచ ద్రావిడులలో మరాఠీ, గుజరాతీ, తెలుగు, కన్నడం, తమిళ లేదా ద్రావిడ బ్రాహ్మణులు ఉంటారుట.)

భారతదేశంలోని దేశాల పేరులు చాలా వరకు యాదవ సంతతికి చెందిన రాజుల పేరులయి ఉంటాయి. "ఆంధ్ర" అనే పేరుకీ యాదవులతో సంబంధం ఉందంటారు కదా? అయితే హోరోవిట్స్ అనే భాషా శాస్త్రవేత్త ప్రకారం ఇంద్రుడి ఉపాసన చేసేవారే అంద్రులు. 'అంద్ర' అనే మాటకి ఇరాన్ పద్ధతిప్రకారం మహాప్రాణం వచ్చి 'అంధ్ర' అయిందని హోరోవిట్స్ అభిప్రాయం. (శ్రీకృష్ణుడు ఇంద్రోపాసన వద్దంటాడు! అతనితో మల్లయుద్ధం చేసిన వారిలో ఆంధ్రులూ ఉన్నారని విష్ణు సహస్ర నామమే సూచిస్తుందికదా ?!)

చాణక్యుడు కేరళవాడని కొందరంటారు. నిజానికి అతను తక్షశిల వాడని మాత్రమే ఊహించవచ్చు. అయితే, అతనికి 'ద్రావిణు'డనే పేరు ఉంది. అంటే 'బంగారం' అన్నమాట! ముద్దుపేరు అయివుండవచ్చు ....

'మదరాసు తెలుగు' ఉన్నట్లే 'మదరాసు తమిళ'మూ ఉంది! పాత తమిళ పుస్తకాలలో సయితం ఈ ప్రాంతపు భాష అంటే అంత గొప్ప అభిప్రాయం కనిపించదుట!

ద్రావిడ వేరు, తమిళ వేరు - అంటే తప్పేముంది? ఈ మధ్యనే ప్రొఫెసర్ థామస్ బరోగారు 'ఈశ్వర - అసుర' జ్ఞాతి పదాలని అంగీకరించారు. పూర్వదైవులే అసురులన్నమాట ఇప్పటిది కాదు.

చివరిమాట: సంగం, తమిళ సాహిత్యం "అంత" ప్రాచీన మయినదని తోచదు. క్రీ. శ. 400 ముందు సంగం సాహిత్యం ఉందని ఎవరూ గట్టిగా అనలేరు.

అందుచేత వయిన చెప్పినదంతా స్థిరంగా నిలిచేది కాదు. కొన్నిపాత సంప్రదాయాలు ఆధునిక కాలంలో కూడా నిలుస్తున్నా యని అనుకోవాలి - అంతే.

"రాగం"

'అరవ'

1

'అరవ' అనే మాట ఒకదేశాన్ని, ఒక జనాన్ని, ఒక భాషనీ కూడా సూచిస్తుంది. దాని వివరణ ఈ కింద:

2

"ది తమిళ్స్ ఎయిటీన్ హండ్రెడ్ యియర్స్ ఎగో" అనే పుస్తకం (1904) లో శ్రీ వి. కనకసభయి ఇలాగ అంటారు: "తమిళగాన్ని పదమూడు నాడులుగా విభజించారు. అవి: పాండి, తెన్‌పాండి, కుట్టమ్, కుడమ్, కర్క-, వెన్, పూళి, పణ్రి, అరువ, అరువా-వడతలై, చీవమ్, మలడు, పుణల్-నాడు" (పు. 12)

"పుణల్‌నాడుకి ఉత్తరాన అరువ-నాడు ఉండేది. దీనికి అవతల అరువా వడతలై లేదా ఉత్తర అరువదేశం ఉండేది, దాని రాజధాని కాంచి" (పు. 27)

"అమిత సాగరుడు రాసిన యాప్పరుంకలమ్‌కి గుణసాగరుడు ఒక వ్యాఖ్య రాశాడు. ఇందులోని ఒళిపియల్ యొక్క మూడవ భాగంలోని ఎనిమిదవ సూత్రం చెన్-తమిళ్-నాడు ఎల్లలేవో చెబుతుంది. శుద్ధ తమిళం మాట్లాడే ఈ దేశం వయిఘయికి ఉత్తరాన, మరుతనదికి దక్షిణాన, కరువూర్‌కి తూర్పున, మోరువర్‌కి పడమట ఉండేది."

ఇదంతా ఉజ్జాయింపుగా నేటి మధురజిల్లా ఉత్తర భాగం, తంజావూరు, తిరుచిజిల్లా లన్నమాట, పాండ్యుల రాజధాని మధుర

ఇందులో ఉండదు. వ్యాఖ్యాత అయిన చెన్ వరయర్, ఆయన తరువాతి వాడయిన నచ్చినర్కినియర్ లు ఈ చెన్ తమిళనాడు నిర్వచనానికి అంగీకరించారు. వారు చుట్టుప్రక్కల నాడులని కొన్నిటిని వివరిస్తారు. ఇవి ఆగ్నేయం నుంచి వాయవ్యం వయిపుకి ఇలాగ వుంటాయి : "పొంకర్, ఒళి, తెన్‌పాండి, కుట్టమ్, కుడమ్, పన్రి, కర్కా, చీతమ్, పూళి, మలయ మానాడు, అరవ, అరవావడతలయి" [పు. 14 లోని అధోజ్ఞాపిక.]

"అరువనాడు, అరువావడతలయిలలో నివసించిన నాగ జాతి వారికి స్థానికంగా అరువాళర్ అనే పేరు వుండేది." (పు. 44)

"తమిళ్ ఇండియా" అన్న తమ పుస్తకం (1963) లో శ్రీ ఎమ్. ఎస్. పూర్ణలింగం పిళ్ళయి "తమిళ దేశాన్ని చెన్ (శ్రేష్ఠ), కొడుమ్ (సాధారణ) భాగాలుగా విభజించారు." అని రాశారు. (పు. 5)"

మదురయి పేరగారాది (తమిళ నిఘంటువు) అరవ, కొడుమ్ తమిళాల అర్థాలని ఈ విధంగా ఇచ్చింది :

అరవమ్ : ఒళి (శబ్దం), షిలంబు, పతంజలి ముని
వర్, మనక్కలకమ్ (కలవరం), పాంబు
(పాము), పేరొళి (పెద్దశబ్దం)

అరువార్ : తమిళ్ మక్కళ్ (తమిళ జనం)
తమిళ్ మొళిమాళర్ (తమిళం మాట్లాడే
వారు)

అరుపమ్ : ఉరువ మిల్లాదదు (రూపం లేనిది),
అసరీరి (అశరీరి)

అరువ : కొడుమ్ తమిళ్‌నాడు, పణ్ణి రెండు పగుదియి
నొంఱుర్రి, అరువనాడు, అరువానాడు

కొడుమ్ తమిళ్‌నాడు : చెన్ తమిళల్లాదు కొడుమ్ తమిళ్‌పేసప్పడు
వనవగియ (చెన్ తమిళ్ మాట్లాడ బడని
పన్నెండు దేశాలు: అంటే కొడుమ్ తమిళ్
మాట్లాడ బడే చోటు-తెన్‌పాండి, కుట్టమ్,
కుడమ్, కర్కా, వేనాడు, పూళి, పన్రి,
అరువ, అరువావడతలయి, చీదత్,
మలాడు, పుణ్ణాడు.

కన్నడ సాహిత్య పరిషత్‌వారి నిఘంటువులో 'అరవర్, అరువర్' అనే మాటల నుంచే కన్నడం 'అరవ' వచ్చిందని ఉంది (పు. 373, సం. I). కిట్టెల్ కన్నడ నిఘంటువులో 'అరవ' అనే మాటకి ఈ వివరణ ఉంది: శిష్ట తమిళం మాట్లాడబడే దేశం చుట్టూ వున్న 12 మండలాలలో ఒకటి. ఇప్పుడే శ్రేష్ఠం కాని సాధారణ తమిళం మాట్లాడ బడుతుంది. (పు. 99, సం. I)

'అరువానాడు'లో మాట్లాడబడిన తమిళ భాషని తమిళులే 'అరువ' అనే వారన్నమాట. అదే పక్కనేవున్న తెలుగు, కన్నడ దేశాలలో 'అరవ'గా మారి వుండవచ్చు. కీ. శే. రావు బహద్దూర్ నరసింహాచార్య ఈ విధంగా ఊహించారు : "(నేను ఇక్కడ చెప్పవలిసింది ఇంకా ఏమిటంటే) ప్రాచీన గ్రీసు, రోమ్‌రచయితలు మరి రెండు ద్రావిడ తెగలని పేర్కొన్నారు. ఇవి ఒరిటే, అరాబిటే. తెలుగువారు, కన్నడిగులు తమిళులని 'అరవ' లంటారు, ఈ మాటకీ 'అరబిటే'కి సంబంధం ఉందని పిస్తుంది. (హిస్టరీ ఆఫ్ కన్నడా లాంగ్వేజి, పుట 17 లోని అధోజ్ఞాపిక, 1934.)

3

అరవనాడుకి చెందిన వారిని 'అరువాళర్'లనే వారని ఇంతకి ముందే చెప్పబడింది. కాని, ఆంధ్రదేశంలో కూడా 'అరవ' లనే వారు ఉన్నారు. "కాస్ట్‌స్ ఎండ్ ట్రయిబ్‌స్ ఆఫ్ సౌత్ ఇండియా" అనే తన పుస్తకంలో ఎడ్గార్ థర్‌స్టన్ 'అరవ' అనే శీర్షిక కింద ఈ కింది విధంగా రాశాడు (సం. I) :

"అరవ" : అరవ, తమిళ్‌కి వాడేమాట, గొల్ల, వెలమల లోని ఉపశాఖగా ఉల్లేఖించ బడింది. కాని, ఈ పేరు తమిళ 'ఇడయన్', 'వెళ్ళాళ' లకి వాడబడింది. వీరు తెలుగుదేశంలో స్థిరపడి పోయారు. వారికి 'అరవగొల్ల', 'అరవవెలమ' అన్న పేరులు ఉన్నాయి. తెలుగుదేశంలో కొన్ని చోట్ల తమిళ పరయన్‌లని యూరోపియన్‌లు సేవకులుగా వాడుకుంటూ వుంటారు. వీరికి 'అరవమాల' లన్నపేరు ఉంది. ఉత్తర ఆర్కాటు జిల్లాలోని 'ఇరుళలు' అనే వారిని ఇదే విధంగా 'అరవ య్యానాదు' లంటారు. 'తమిళపల్లి' యులు కొందరు మైసూరులో స్థిరపడి పోయారట. వీరిలో ఒక శాఖ వారిని 'తిగళ' లంటారు." (పు. 55, 56.)

4

'అరవ' అన్నమాట యొక్క అర్థమే 'అరవ' అన్న పేరు ఎలాగ వచ్చిందో చెబుతుందని మరికొందరి అభిప్రాయం.

థర్‌స్టన్ రచనలో (పయిన చెప్పిన శీర్షిక కిందనే) ఇలాగ ఉంది : "అర అంటే సగం, వాయి అంటే నోరు ; అందుచేత మహాప్రాణాలు వగయిరాలులేని తమిళ అక్షరాలని పట్టి, ఎక్కువగా హల్లులతో అంతం అయ్యే తమిళ పదాలని పట్టి 'అరవ' అనేమాట వచ్చిందని కొందరు తెలివిగా ఊహిస్తున్నారు. (పు. 56)"

1919లో కీ. శే. ఎ. ఆర్. కృష్ణశాస్త్రి (మైసూరు యూనివర్సిటీలో కన్నడం ప్రొఫెసరుగా పనిచేసినవారు) తయారు చేసిన 'నోట్స్'ని గురించి ఇక్కడ చెప్పటం సమంజసంగా ఉంటుంది. (ఇవి ఇంకా ప్రచురింప బడలేదు. బెంగుళూరులోని గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎఫెయిర్స్ గ్రంథాలయంలో వ్రాత ప్రతి రూపంలో వున్నాయి.)

ద్రమిడ (> ద్రవిడ) > దమిళా (పాలీ) > తమిళ్ పండితులు 'మాధుర్యవాచి' అంటారు. 'అరవం' అని కూడా అంటారు. మూతం ?

'అఱవ్య' (నీతి బోధకులు) 'అఱం, ధర్మ' మంచి (తమిళ్ సాహిత్యంలో నీతికి గుర్తింపు అత్యధికం కనుక). ఇంకొక సిద్ధాంతం : 'అఱివు' లేదా 'అరువ' (తమిళ దేశంలోని ఒక మండలం) మొదటి సిద్ధాంతం అంగీకార యోగ్యమయినది కాదు. ఎందుకంటే, 'అరవు' తమిళంలో లేదు. బహుశ సంస్కృతం 'అరవ' (ఇంపుగా లేనిది : మహాప్రాణం లేనిది) (పు. 2)

5

కన్నడ కావ్యాలలో 'అరవ' అనే పదం నాకు కనిపించలేదు. కన్నడ సాహిత్య పరిషత్‌వారి కన్నడ నిఘంటువు, కిట్టెల్ కన్నడ-ఇంగ్లీషు నిఘంటువు కూడా ఈ మాట పాత కావ్యాలలో వాడబడినట్లు (నేనెరిగి నంత వరకు) తెలుపటంలేదు. క. సా. ప. వారి నిఘంటువు ఇది అర్వాచీన సాహిత్యంలో వాడబడినట్లు తెలుపుతుంది. డాక్టర్ బుక్నాన్ తన 'ట్రావెల్స్' (1800) గ్రంథంలో 'అరవ' అన్నపదం వాడినట్లే తోచదు. ఇంకా పరిశోధనలు జరిపితే కావ్యాలలో, శాసనాలలో ఈమాట ఉందేమో తెలుస్తుంది.

6

అందుకనే, 'అరువ' అనే పదమే 'అరవ'గా మారి ఉంటుందని ఊహించటం సహేతుకంగా ఉంటుంది. తమిళులే ఈ మాటకి ఒక దేశాన్నీ, ఆ దేశంలో వాడుకలో ఉన్న భాషనీ గుర్తించటానికి ఈ పదాన్ని వాడారు. థర్‌స్టన్ 'అరవ' అన్నమాటకి కొందరు తెలివిగా అర్థం చెప్పారని రాశాడు; ఆయన తెలివిగా అన్నమాట వాడటంలో కొందరు సహేతుకంగా కాకుండా తమ వ్యక్తిగతాను భవాలని పట్టి ఈ అర్థం చెబుతున్నారన్నభావం ధ్వనిస్తుంది. తమిళులూ, తెలుగువారూ, పరస్పర సంబంధాలు లేకుండా జీవించలేదు. కొన్ని శతాబ్దాలుగా వీరి మధ్య సంబంధాలు ఉండేవి. వీటిలో కొన్ని జ్ఞాపకం చేసుకుంటే సంతోషంగా ఉండవచ్చు. మరి కొన్నిటిని జ్ఞాపకం చేసుకుంటే సంతోషంగా ఉండకపోవచ్చు. ఈ సంబంధాలలో ప్రేమ - ద్వేషం కలిసి పోయాయని మాత్రం అనవచ్చునేమో !

డి. ఆర్. వెంకట రమణన్
గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎఫెయిర్స్,
బెంగుళూరు - 560 019

లేఖలు

సమాధానం

ఏప్రిల్ భారతిలో ప్రచురింపబడిన ప్రభంజనం కథల పుస్తకంపైన నా సమీక్షను చూశాక వచ్చిన ద్వా. నా. శాస్త్రి, దిలావర్‌గారల ఉద్రేక పూరితమయిన లేఖలు గమనింపుకి వచ్చినాయి. వాటిల్లో ఉద్రేకంతోపాటు ఆరోపణలు కూడా వున్నందున నేను సమాధానం ఇవ్వవలసిన అవసరం వుందని అనిపించింది.

సమీక్ష కథల గురించి గనుక, మొదటి లైన్లల్లో, విచిత్రమయిన మన తెలుగు సాహిత్య ప్రపంచంలో, సాహిత్యాన్ని నడుపుతున్నామని గొప్పలు చెప్పుకునే కొందరి వలన, మన సాహిత్యం ఏ రకంగా వెర్రితలలు వేస్తున్నదీ అన్న విషయాన్ని కేవలం స్థూలంగా వుదహరించటం జరిగింది. అంతేగాని అభ్యుదయ సాహిత్యానికీ, తాము నమ్మిన సిద్ధాంతాలను చిత్తశుద్ధితో కళాత్మకంగా ఆవిష్కరించటానికి ప్రయత్నించే రచయితలకూ, మనుషులు కోల్పోయిన మానవత్వాన్ని తిరిగి రాబట్టుకొనే మంచికాలం కోసం తపించే వుద్యమాలను ఆహ్వానించి, ఆదరించే ఎత్తుకు ఎదగటానికి ప్రయత్నించేవారికీ వ్యతిరేకంగా వుద్దేశించబడినవికావు అని మనవి.

మిత్రులు సమీక్షను కలగాపులగంచేసేసేసి, సరియయిన అవగాహన లేకుండా, ఆవేశానికి లోనుగావడం వలననే, నన్ను అభ్యుదయ సాహిత్యానికి వ్యతిరేకినిగా ముద్రవేయ ప్రయత్నిస్తున్నారని అన్పిస్తుంది. అంతేగాక 'పాలడుగు బోంట్లవారు' అంటూ దిలావరు గారు, గ్రూపులుకట్టి ఫైటింగుకి సిద్ధమయి, నిగ్రహాన్ని కోలుపోయి నిందారోపణలకు పూనుకోవటం, ప్రతిభను విస్మరించి కేవలం నినాదాల్ని పట్టుకుని డప్పులు గొట్టే క్షుద్ర మనస్తత్వానికి ప్రతీకగా నిలిచి, విచారాన్ని కలిగిస్తుంది. దొంగలు కానివాడు గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు తడుముకొనవలసిన అవసరం లేదు. మన వుద్యమాలూ, సంఘాలూ, కేవలం నినాదాలకే ప్రాధాన్యతను ఇచ్చి, ప్రతిభనూ, కళాత్మకమయిన ఆవిష్కరణనూ విస్మరిస్తున్నాయన్న ఆరోపణ ఒకటి లేకపోలేదు.

సమీక్షను తమ కనువయిన రీతిలో ముక్కలుచేసి - కొన్ని విషయాలను తేల్చుకుంటామన్నారు ఒకరు. సంతోషం. వాస్తవం కటువుగానేవున్నా, నిజం చేదు అన్పించినా సరే - అవసరమయిన కొన్ని విషయాలను మన యువక మిత్రులు తెలుసుకొనవలసిన అవసరం తప్పకుండా వుంది. నేను స్పష్టం చేయదలచిన కొన్ని విషయాలు ఇవి.

1. నేను సమీక్ష మొదటలో చిత్రించిన విచిత్ర పరిస్థితి వివరణ అరసానికీ, విరసానికీ, నరసానికీ దేనికి వ్యతిరేకంగా వుద్దేశించినది గాదు.

2. అభ్యుదయ సాహిత్యం నా వొంటికి సరిపడదని ఆరోపణ చేయటంలో న్యాయంలేదు. అభ్యుదయ సాహిత్యం అనే దానిలో లోపాలు అసలు వుండవు, వాటిని ఎవరూ వేలెత్తి చూపరాదు, అని ఆవేశపడి దూషణలకు పాల్పడటం అక్రమం.

3. సాడిజంఅనేది ఎంతోకొంత ప్రతివాళ్ళకీవుంటుంది. లేదనుకుని భ్రమించి, దిలావర్‌గారు గాలిలోచిన్న సర్కస్‌చేయ బూనారు.

4. తమ లేఖ చివరి పేరాలలో దిలావర్‌గారు విమర్శకు ఆపాదించిన విశేషణాలు వారి ఆవేశాన్నీ, ఉద్రేకాన్నీ, కసినీ వెల్లడిస్తున్నాయే గాని వివేచన, నిగ్రహం ప్రదర్శించవు.

విమర్శకులతోపాటు ప్రతి విమర్శకులు కూడా కొంత నిగ్రహాన్ని పాటించాలనే అభిప్రాయంతో నేను ఏకీభవిస్తాను.

అపోహలు

జూన్‌నెల భారతి సంచికలో ప్రభంజనం పుస్తకం మీద నా సమీక్షను గురించి ద్వా. నా. శాస్త్రి గారి లేఖలోని అమూల్యమయిన విమర్శను అవగతం చేసుకొనటం జరిగింది. శాస్త్రిగారి అపోహలను తొలగించటానికిగాను నేను రెండు విషయాలను స్పష్టంచేయాలి.

1. ఆ గ్రంథవిమర్శలోని వుపోద్ఘాతం నేటి విచిత్రమయిన మన తెలుగుసాహితీ సీమలో సాధారణంగా నెలకొని వుండిన తీరుతెన్నుల గురించిన పరామర్శమాత్రమే. అది ఏ సంఘాలకీ వుద్దేశించినట్టిదిగాదు. వ్యక్తిగతమయినదీకాదు.

2. అరసంమీదా, విరసంమీదా నాకుఅభిమానమే గాని ఎటువంటి విద్వేషమూ లేదని మనవి. కేవలం తీరుతెన్నులగూర్చి భేదాభిప్రాయం. విమర్శలలో వ్యక్తి పరమయిన లేక 'సంఘ' పరమయిన దూషణలు పరిహరింపబడవలసిన అవసరం వుందని నాతోపాటు శాస్త్రిగారూ అంగీకరిస్తారని ఆశించటంలో తప్పులేదను కుంటాను. తొందరపాటుతనం, రాగద్వేషాలు అసలేఅవాంఛనీయాలు.

పాలడుగు వెంకటేశ్వరరావు
ఒంగోలు

కృతజ్ఞత

నేను జూన్ నెల 'భారతి'లో వ్రాసిన సవరణలోని 'బాణాల కోట' విషయముగ పరిశీలించి - మలకసీమలో నున్నదని తెలియఁ జేసిన శ్రీ అశోకుబాబు - కిశోరుబాబులకు కృతజ్ఞతను తెలియ చేయుచున్నాను.

నేను చూపిన వారలకేగాక - శ్రీ వేదము పండితుల వదలిన ప్రఖ్యాతుల నెందరో గుర్తింప చేసిన రచయితలకు వందనములు. ఈ విశ్వబ్రాహ్మణ శాఖలో మహాకవులేగాక మహా పండితు లెందరో మారుమూల గ్రామాలలో ఆదరణ పోషణ లేక నున్న వార లెందరో కలరు. ఈ శాఖలో సుప్రసిద్ధులైన - డా. వి. వి. ఎల్. నరసింహారావుగారు వంటి వారలీయత్నము చేసిన కొంత వరకు ఫలవంతము కాగలరు. వారల జీవితములు - గ్రంథములు వెలుగునకు రాగలవు. అట్టి యత్నము చేయుదురుగాక -

పరిశీలకులు మారుమూలలో కూర్చొని విమర్శలు, కల్లబొల్లి కథలతో కావ్యములు రచింపక మెట్టుదిగి 'సత్యాన్వేషణ తత్పరులు కావలయు' అని వ్రాసిన దానికి - బాణాల కోటయే ప్రత్యక్ష సాక్ష్యము.

నా సవరణలో దొర్లిన పొరపాటును తెలిపిన మిత్రులు శ్రీ నాగభైరవ కోటేశ్వరరావుగారికిని - ఈ పత్రికా ముఖమున కృతజ్ఞతను వెల్లడించి కొనుచున్నాడను -

విద్వాన్ కొమాండూరి రామానుజాచార్యులు

కందుకూరు

విశ్వబ్రాహ్మణ కవులు

శ్రీమాన్ వేదం వెంకట్రాయ శాస్త్రులవారు భారతిలో ప్రచురించిన విశ్వబ్రాహ్మణ కవులు అను సానుభూతి పూర్వకమైన వ్యాసముపై కొన్ని చర్చలు సాగినవి. అందులో ప్రతిపక్షమువారు సూపిన దోషములు, దోషములు కావు. అవి వారి మానసికస్థితికి దర్పణములు. విక్రాలవారు భావించినట్లు విశ్వబ్రాహ్మణులు కాని వారిని వేదంవారు పేర్కొనలేదు. వారుదహరించిన కీ. శే. జలదంకి కృష్ణస్వామిశర్మగారు - విశ్వబ్రాహ్మణ పత్రికను ఒంగోలు నుండిప్రచురించి సమాజసేవయొనర్చిన ధన్యులు. అదేపేరుతో వారి బంధువులు గూడ యుండిన యుండవచ్చును. అది వేరు విషయము. తదుపరి కందుకూరి రుద్రకవిని గూర్చిన ప్రసంగములో వారి అగ్రేసరత్వమును కాదనుటకు లెక్కలుచెప్పిరి. అవి యన్నియు వారి మానసిక స్థితికి దర్పణములేగాని రుద్రకవి గొప్పదనమును తీసివేయునవిగావు. వయసుచే పెద్దతనము గుణముచే పెద్దతనముననువిషయములు సుజనులెరిగినవే. దానిని రాద్ధాంతము చేయుట జల్పమేగాని గుణము కాజాలదు..

తదుపరి అనంతపురము శ్రీ ఓబుళరెడ్డిగారి లేఖలో శ్రీమత్ కన్నర్తి బసువాచార్యులవారి రథకారాధికరణమును గూర్చి ప్రచురింపబడినది. శ్రీమదాచార్యులవారు వ్రాయలేదనీ ఎవరికో డబ్బులిచ్చి వ్రాయించుకొన్నట్లునూ ఒక చారిత్రక పత్రమును బయటపెట్టిరి. సదరు బసువాచార్యులవారు జన్మింపక పూర్వమే అధికరణముగ మీమాంసాశాస్త్రములో చర్చింప బడినదే.

విద్వత్పెదపాటి నాగేశ్వరశాస్త్రులు

హైద్రాబాదు.

అప్సరలు

1982 ఆగష్టు నెల సంచిక అప్సరస్త్రీల జాతులు అను శీర్షిక క్రింద ప్రచురింపబడ్డ నా లేఖకు అనుబంధముగా క్రింది విషయము వ్రాస్తున్నాను.

శివరాత్రి మాహాత్మ్యములో కిరాతము లేఖలో పేర్కొనబడిన శ్రీనాథుని సీసములో 'నీరవని' అను నాల్గక్షరములలో రెండు

అప్సరస్త్రీల జాతులున్నవి (నీరు + అవని). 'నీరవని'కి బదులు నీరంబు సవరణ ఉచితము. 14 జాతుల వర్ణనలో ఒక్కొక్క జాతికి కనీసము 4 అక్షరములైన వాడిన కవి రెండు జాతులను నాల్గక్షరములలో కుదించు కర్మ పట్ట నేరదు. ఈ జాతులను భీమ ఖండమందు, హరవిలాస మందు వచనమున క్రింది విధముగా విపులీకరించెను.

"మార్తాండ చంద్రమండలంబుల వలనను, బాలసముద్రంబు వలనను, మధుకైటభారి యూరుకాండంబు వలనను, గృపీట భవ జ్వాలాజాలంబు వలనను, గంధర్వ సార్వభౌమువలనను బ్రభ వించి"

భీమఖండము 1వ అశ్వాసము 118వ ప.

"మార్తాండ మండలంబు, విద్యుత్తండంబులు, మృత్యు దేవతా వదనగహ్వరంబు, నారాయణోరు కాండంబు, వేదసందో హంబగ్ని జ్వాలాజాలంబు, శంబరా రాతిచెఱుకువిల్లు ముక్కంటి నొసలిచిచ్చరకన్ను, గంధర్వ వంశద్వయం బాదిగా బహు విధాన్వ యంబుల నుత్పన్నంబులగుటం జేసి"

హరవిలాసము 5-40.

పై విధముగ వచనములలో జాతుల వర్ణన విన్యాసము చూపుటేకాక భీమఖండ 5వ అశ్వాసము 98వ పద్యములో

శా॥ సందుగ్ధార్ణవ చంద్రమండల శిఖి
జ్వాలా తటిద్వల్లరీ
కందర్పేక్షు శరాస నాచ్యుతతనూ
గంధర్వ వంశోద్భవల్"

పై విధమున వచనముల, పద్యభాగమున విడి విడిగా వర్ణించిన శ్రీనాథుడు 'జలజ గర్భుని మానసంబు' అను సీసములో రెండు జాతులను నాలుగక్షరములలో (నీరు + అవని) ఇరికించు స్వభావము కలవాడు కాడు. పైగా 'అవని'కి బదులు దాక్షాయణీదేవి అను రమ్యాక్షరముల వేయునే కాని వేరొండు విధముగ వర్ణించడు. కావున 'నీరవని'కి మారుగ 'నీరంబు' సవరణ సముచితము.

పై విధముగ చూపబడిన ఆయా వర్ణనలలో పై 14 జాతులే గాక శ్రీ నాథుడు అదనముగా 2 జాతులను పేర్కొనినాడు.

1. మధుకైటభారి యూరు కాండంబు లేక నారాయణోరు కాండంబు లేక అచ్యుత తనువు

2. ముక్కంటి నొసలి చిచ్చఱ కన్ను.

చివర పేర్కొనబడిన రెండు జాతులు పై సీసములో నెచ్చటను పేర్కొన లేదు కావున బాణుని కాదంబరిలోని 14 జాతులను యథాతథముగా శ్రీనాథుడు అనువదించినాడు. బాణునిపై శ్రీనాథునికి మక్కువ ఎక్కువ. నైషధమున, భీమకాశ ఖండముల, శివరాత్రి మాహాత్మ్యమున ఇతనిని మాఘుని పేర్కొనినాడు. శివ రాత్రి మాహాత్మ్యమున కొన్ని పాత్రలు కాదంబరిలోని పాత్రలను బోలియున్నవి. అందుచే "వేద" "దేవ" అను జాతుల వ్యత్యాసము తక్క మిగిలిన జాతులను వర్ణించి నపుడు శ్రీనాథుడు బాణునే ననుకరించినాడు.

పచ్చమట్ల కృష్ణ సూర్యనారాయణరాజు
వి జ య వా డ

అ వ గా హ న - 5

చెరబండరాజు సంస్మరణ సంచిక

ఆధునిక ఆలోచనావీచికగా (79 నుంచీ) వెలువడుతున్న అవగాహన 5వ సంచిక — చెరబండరాజు సంస్మరణ సంచికగా వెలువడనున్నది. చెరబండరాజు ప్రత్యేకముఖ్యచిత్రంతో — అతని సాహిత్యవ్యాసంగంపై సచిత్ర వ్యాసంతోపాటు, అతని అముద్రిత రచనలుకూడా వుంటాయి. అతని కవిత, పాటలు, నవలలపై ప్రముఖుల పరిశీలనా వ్యాసాలుంటాయి. ఆచార్య రోణంకి అప్పల స్వామి, చాసో, సోమసుందర్, అరుణకిరణ్, ఉప్పల అప్పలరాజు, సి. ప్రసాదరాజు, బి. వి. నాగేశ్వరరావు, బి. శశి, ఎమ్. నళినీదేవి మొదలైనవారి రచనలుంటాయి. కొత్తవారి కవితలకూడా ఇతోధిక ప్రోత్సాహం యివ్వబడుతుంది. రచనలు పంపవలసిన చిరునామా :

మానేపల్లి సత్యనారాయణ
ఎడిటర్ - అవగాహన
(బుక్స్ అండ్ బుక్స్ ప్రచురణ)
బొండాడవీధి, విజయనగరం - 531 201.

గ్రంథ విమర్శలు

శ్రీ రామాయణ కథాసుధ

[రచన : శ్రీ అన్నంరాజు సత్యనారాయణరావు, డెమ్మీ సైజు 20+216 పుటలు. వెల రు. 12-50. ప్రాప్తిస్థానం - రచయిత, 5వ లైను, పండరీపురం, గుంటూరు - 522 002]

ఆస్తిక భావం, ప్రాచీన పురాణాది గ్రంథాలపై అభిమానం ఉన్న రచయితల దృష్టి సాధారణంగా భారత భాగవత రామాయణాలపైకీ, భగవద్గీత పైకీ పోతూవుంటుంది. అందువల్లనే ఒక వైపునుంచి నూతన వాఙ్మయం పొంగి పొరలి దేశాన్ని ఆక్రమించుకుంటున్నా పైవాటి అనువాదాలు, అనుసరణలు పలుప్రక్రియలలో వస్తూనేవున్నవి. అవి ప్రజల దృష్టిని ఆకర్షిస్తూనే ఉన్నవి. అట్టి వానిలో రామాయణ కథను తెలిపే వచన రచనలలో ఈ గ్రంథ మొకటి.

దీనిని రచించుటకు సత్యనారాయణరావుగారు సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్నీ, తెలుగులో ప్రసిద్ధమైన భాస్కర రామాయణాది పద్య రామాయణాలను పరిశీలించి, వాటిలోని విషయాలను గ్రహించారు. కుశలవులు గానంచేసిన కథను గ్రహించుటవల్ల దీనికి శ్రీ రామాయణ కథాసుధ నామం వచ్చింది. ఉత్తర రామాయణ కథ కూడా చేర్చబడి, గ్రంథం సుఖాంతంగా ముగించబడింది. పాఠకులకు ఆసక్తిని కలిగించి, వారికి ఆనందాన్ని కూర్చుటకై అక్కడక్కడ వాల్మీకంలోని శ్లోకాలు, ఆంధ్రంలోని పద్యాలు చేర్చబడినవి. మధ్యతరగతి చదువరులును, స్త్రీలును చదువుకొనుట కనుకూలంగా, సంధులను సైతం పాటించకుండా సులభశైలిలో దీని వ్రాసినట్లు రచయిత చెప్పుతున్నారు. వారి మాట ముమ్మాటికీ సత్యం. డాక్టర్ ప్రసాద రాయకులపతిగారు, కవిశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు దీనిపై చక్కని అభిప్రాయాలిచ్చారు.

తిరుమల తిరుపతి దేవస్థానం వారి యొక్కయు, దేవినేని రామకృష్ణగారి యొక్కయు ఆర్థిక సహాయం వల్ల ఇది ముద్రిత మయింది.

రామాయణ కథను సులభ పద్ధతిలో సమగ్రంగాను, సంగ్రహంగాను గ్రహించుటకు మిక్కిలి ఉపయోగ పడగలదు. దీనికి మంచి ప్రచారం లభించగలదని భావిస్తున్నాము.

సాయితత్త్వం

[రచన, ప్రచురణ : శ్రీ గుడిపాటి శ్రీహరికృష్ణ. డెమ్మీ సైజు 34 పుటలు వెల : మూడు రూపాయలు. ప్రతులకు : రాజమండ్రి త్యాగరాజ నగర్‌లోని ప్రకాశకులకు వ్రాయవలెను.]

ఈ శతాబ్దంలో మహా ప్రభావంగల మహనీయులలో షిరిడీ సాయిబాబా అగ్రశ్రేణికి చెందినవారు. శ్రీసాయిబాబా భగవదవతార మూర్తి అనే విశ్వాసం అసంఖ్యాకులకు ఉన్నది. దేవాలయాల వంటి మందిరాలను నిర్మించి ఆయనను భక్తులు పూజిస్తూ ఉంటారు. ఆయన భక్తులు రచించిన శ్రీ బాబా జీవిత గ్రంథాలు ఎన్నో వెలువడినవి. వాటిలో ఆయన అద్భుత కృత్యాలు, సర్వమత సమానత, భక్త జన వాత్సల్యం, బోధనలు మున్నగునవి విపులంగా వివరించబడి ఉన్నాయి. ఆ గ్రంథాలు లభించే అవకాశం, వానిని పఠించడానికి తగిన సమయం దొరకని వారికి యీ చిన్న పుస్తకం, ఆ మహనీయుని తత్త్వాన్ని గ్రహించడానికి ఉపయోగపడుతుంది.

మహా మహిమాన్వితులైన శ్రీ సాయిబాబా తాను అవతార పురుషుడని చెప్పలేదు. వివిధ స్థలాలు పర్యటించి తన మహిమలను, ఆశయాలను ప్రచారం చెయ్యలేదు. తన వద్దకు వచ్చిన వారికి బోధించిన అంశాలు ఏ ప్రత్యేక మతానికీ సంబంధించినవి కావు. ఇహ పర సాధనకు సులభమైన మార్గాన్ని ఆయన చూపారు. సంసారాన్ని వదిలివెయ్యాలని ఆయన చెప్పలేదు. విధ్యుక్త ధర్మాలను ఆచరిస్తూ, వీలునుబట్టి భగవంతుణ్ణి ప్రార్థించమన్నారు. సత్య మార్గాన్ని విడువ వద్దన్నారు. అందరినీ సమానంగా చూస్తూ, ఉన్నదానితో తృప్తిపడి, అందులోనే ఇతరులకు సహాయం చేయవలెనన్నారు. ఇవి ఆస్తిక భావం, మహనీయులపట్ల ఎక్కువ గౌరవం లేని వారిని కూడా ఆకర్షించేవే. ఇట్టి విషయాలను గూర్చి ఇందులో ఉన్నది.

శ్రీ సాయిబాబా ముఖ్యశిష్యులు స్వామి కేశవయ్యాజీగారు కూడా ప్రభావ సంపన్నులు. ఈ చిన్న పుస్తకంలో ఆయనను గురించి కూడా ఒక శీర్షికలో చెప్పబడింది.

దీని అట్ట మీద శ్రీ సాయిబాబా చిత్రం, చివరి పుటలో మద్రాసులో, షెనాయ్‌నగర్‌లో పూజా మందిరంలో శ్రీ సాయిబాబా చిత్రానికి సమీపంలో ధ్యాన నిమగ్నులైయున్న స్వామి కేశవయ్యాజీ చిత్రం ఉన్నాయి.

సూక్ష్మంగా శ్రీ సాయిబాబాను, ఆయన సిద్ధాంతాలను గురించి తెలుసుకొనుటకు ఈ పుస్తకం బాగా ఉపయోగిస్తుంది.

మానిషాదమ్

[రచన : డాక్టర్ బొడ్డుపల్లి పురుషోత్తంగారు, ఎం. ఏ., పిహెచ్. డి., తెలుగుశాఖ, నాగార్జున విశ్వవిద్యాలయము. క్రౌను. 8 + 108 పుటలు. వెల : 5 రూ. ప్రకాశకులు. శ్రీ గిరిజా ప్రచురణలు, విద్యాలంకార్ - బి - 31, శ్రీనివాసనగర్ కాలనీ, గుంటూరు - 6.]

"పూర్వేతివృత్తాన్ని ప్రక్రియాంతరంలో సవిమర్శకంగా చాలావరకు ఆయా కవుల భాషలోనే విరచించి, వాటివల్ల నూతనాసక్తి కలిగించడానికి చేసిన ప్రయత్నమిది" అని డాక్టర్ పురుషోత్తంగారు తమ మాటగా తెలుపుతున్నారు. ఇలాంటివి పత్రికలలో పడినవి చాలా ఉన్నా నాలుగు నాటికలనే యీ పుస్తకంగా ప్రకటిస్తున్నారు. ఇవి మానిషాదమ్, శ్రీమద్భాగవతావిర్భావం, వ్యాసాగమనం, నత్కీరుడు - అనే నాలుగు నాటికలు. ప్రథమమైన 'మానిషాదం' పేరే పుస్తకానికి పెట్టబడినది.

ఆది కావ్యమైన శ్రీ మద్రామాయణాన్ని వాల్మీకి మహర్షి రచించడానికి హేతుభూతమైన 'మానిషాద ప్రతిష్ఠాంత్వం' అనే శ్లోకం ఆధారంగా తొలి నాటిక కూర్చబడింది. బ్రహ్మ, నారదులేకాక వాల్మీకి మహర్షి శిష్యుడైన భరద్వాజుడు, అతని శిష్యులు కూడా ఇందులో ప్రవేశం కల్పించుకున్నారు. బ్రహ్మ ప్రోత్సాహం, నారదుని కథా కథనం రసవంతంగా కూర్చబడినవి.

వేదాలను విభజించి, అష్టాదశ పురాణాలనూ చెప్పిన బాదరాయణ మహర్షి మనో విచారం, భాగవత రచన చక్కని సంఘటనలతో రసవంతంగా వివరించబడినవి.

మూడవ నాటికలో వ్యాసుని పరీక్షించుట, అతని కోపం, శాపం, అగస్త్యలోపాముద్రలతోడి సంభాషణలలో చక్కగా వ్యక్తం చెయ్యబడినవి.

నాల్గవ నాటికలోని నత్కీరుని కథ శ్రీ కాళహస్తి మహాత్మ్యంనుంచి గ్రహించబడి యథాతథంగా దృశ్యరూపం ధరించినది.

ఈ గాథలన్నీ పురాతనాలే అయినా నూతన రచనా పద్ధతిని అనుసరించుటవల్ల క్రొత్తదనాన్ని ప్రకటిస్తూ పాఠకుల మనస్సులనాకర్షిస్తున్నవి. వీటి ప్రాశస్త్యాన్ని శ్రీ అమరేంద్ర (డాక్టర్ సి. యస్. శాస్త్రిగారు) చక్కగా ఉగ్గడించారు.

ఈశావాస్యోపనిషత్తు వివరణోపన్యాసము

[రచయిత : శ్రీ అరిపిరాల వేంకట సోమాచార్యులు, రిటైర్డ్ ఇంజనీరు (పి. డబ్ల్యు. డి.) బాపూజీనగర్, కొవ్వూరు, పశ్చిమ గోదావరిజిల్లా. క్రౌను సైజు 20+148 పేజీలు. వెల పేపర్ బైండు 5 రూ. స్టిఫ్ బైండు రూ. 6 లు.]

రచయిత బాధ్యతాయుతమైన ఇంజనీరు ఉద్యోగంలో ఉన్నా, ఆధ్యాత్మిక విషయాలపై ఆసక్తి ఉన్నందున, ఆవిషయంలో కృషి చేశారు. శ్రీకాకుళ వాసులూ, వైద్య సాహిత్య వేదాంతాది విద్యలలో గొప్ప విద్వాంసులు, శ్రీయానందనాథ దీక్షానాములు అయిన ఈశ్వర సత్యనారాయణ శర్మగారి శిష్యరికంలో వేదాంత విద్యలో పరినిష్ఠితమైన జ్ఞానాన్ని సంపాదించి, ఈ గ్రంథరూపంగా దానిని తెలుగు వారికి అందిస్తున్నారు.

ఆత్మజ్ఞానావగతికి ఉపనిషత్తులు ఆధారాలు. వాటిలో ఈశ-కేన-కఠ-ప్రశ్న-ముండక-మాండుక్యాదులగు దశోపనిషత్తులు ముఖ్యమైనవి. ఆ పదింటిలోనూ ఈశావాస్యోపనిషత్తు ప్రధానమైనది. ఆ ఉపనిషదర్థాన్ని శంకర భగవత్పాదుల భాష్యానికి విధేయంగా సులభమైన భాషలో సులలితంగా ఇది వివరిస్తూ ఉన్నది. ఉపనిషత్సారాన్ని బాగుగా అవగాహన చేసుకోకపోతే యీ విధంగా వివరించడం సాధ్యంకాదు. సోమాచార్యులుగారి అనుభూతి యిందు వ్యక్తమవుతూ ఉన్నది.

రచయిత ఇందులో లొలుత ఉపనిషత్తు సంస్కృత మూలాన్ని ఇచ్చి దానికి సరియైన తమ తెలుగు అనువాద పద్యాన్ని ఇచ్చారు. తర్వాత ఆ మూలాభిప్రాయాన్ని విపులంగా ఇచ్చారు. 'సంస్కృతాంధ్రాంగ్లాలలో సమర్థులైన విద్వాంసులగుటచే రచయిత ఆంగ్లానువాదాలను కూడా పరిశీలించి పెక్కు విషయాలను తమ అవతారికలో తెలియజేశారు. ఆ ఉపోద్ఘాతమే వీరి నిశిత దృష్టికి తార్కాణం.

మూలానువాదాల కొక్క ఉదాహరణ -

మూలం -

యస్మిన్ సర్వాణి భూతాని
ఆత్మైవాభూ ద్విజానతః,
తత్ర కో మోహః కః శోకః
ఏకత్వ మనుపశ్యతః

అనువాదం -

అన్ని భూతము లెవ్వానియందు నెపుడు
తనకు వేఱుకావని యెడు తలఁపు నింపు
నాతఁ డేకత్వమేగాంచి యందు నుంట
శోకమోహములవ్వాని సోఁకఁగలవె ;

అనువాదం ఎంతో స్పష్టంగా ఉన్నది.

తిరుమల - తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ (ఐ. ఏ. ఎస్.)గారు, మామండూరి నాగభూషణంగారు, తిరుమల వేదశాస్త్రాగమ విద్యా కేంద్రం ప్రిన్సిపాల్ ధూళిపాళ రామచంద్రశాస్త్రిగారు, మానాప్రగడ శ్రీరాములుగారు, తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు దీని ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు. ఆత్మ జ్ఞాన జిజ్ఞాసువులకీ గ్రంథం అత్యంతోపయుక్తమైనది.

దీని ముద్రణకు తిరుమల - తిరుపతి దేవస్థానములవారి ఆర్థిక సహాయం లభించడం మిక్కిలి సముచితంగా ఉన్నది.

మాండూక్య గీత

[రచయిత: శ్రీ బి. ఎల్. సత్యనారాయణశాస్త్రి. క్రౌను సైజు 55 పుటలు. వెల : నాలుగురూపాయలు. ప్రకాశకులు - శ్రీదేవి బల్లి శేషమ్మ, రామలింగేశ్వర అగ్రహారం, కాకినాడ - 533 004.]

ఇది మాండూక్యోపనిషత్తునకు గేయరూపమైన అనువాదం. సులభంగా బ్రహ్మవిద్యను బోధించేవి ఉపనిషత్తులు. స్వరూపంలో చిన్నవయినా అవి ఎన్నో నిగూఢార్థాలను అందిస్తూ ఉన్నవి. వాని అనువాదం గేయ రూపంగా ఉంటే సర్వజనామోదయోగ్యంగా ఉంటుందనే అభిప్రాయంతో రచయిత యీ మాండూక్యాన్ని గీతంగా రచించి ఉండవచ్చును. ఇది ఆ ఉపనిషత్తులోని సారాన్ని తెలిపేదేకాని అనువాదం కాదు. తనకు ఛందస్సు తెలియదనీ, ఛందోబద్ధంగా దీని అనువదిస్తే తన రచనతో చేర్చి ప్రకటించు కుంటాననీ రచయిత కోరినందున సుప్రసిద్ధ విద్వత్కవులు ఆస్థానకవి శిరోమణి విద్వాన్ బులుసు వేంకటేశ్వర్లు (ఎం. ఏ) గారు గీత పద్యాల్లో ఈ ఉపనిషత్తును అనువదించారు. ఆయన తమ రచనకు అవతారికగా వ్రాసిన పద్యాలలో ఈ విషయం వెల్లడించడం కోరుండా సత్యనారాయణ శాస్త్రిగారిని ప్రశంసిస్తూ బులుసు వారి వంశం యొక్క ఆనైక్యతను ఉగ్గడించారు. అది కొంత అప్రస్తుతంగానే తోచినా, రచయిత ప్రత్యేకతను వ్యక్త పరుస్తున్నది. రచయిత మొదట ఉపనిషన్మంత్రాలను, వాటికి తమ వ్యాఖ్యానాన్నీ ఇచ్చి, తర్వాత తమ గీత రచనను చేర్చారు. సాహిత్యంతోగాని, వేదాంతంతోగాని సంబంధంలేని ప్రభుత్వ పద వులను నిర్వహిస్తూనే శాస్త్రిగారు ఆధ్యాత్మిక విషయం కృషి చెయ్యడం ప్రశంసించదగినది. రచన, తాత్పర్య వివరణ సులభ శైలిలో ఉన్నాయి. ఇది తిరుమల - తిరుపతి దేవస్థానంవారి యొక్కయు, తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్‌గారి యొక్కయు ఆర్థిక సహాయంవల్ల ఇది చక్కగా ముద్రింపబడింది. రాయప్రోలు లింగన సోమయాజిగారి 'మొదటిమాట', ఆంగ్లంలో బి. శేషయ్య గారిచ్చిన సదభిప్రాయం, అవధూత ఆనందనాథ స్వామివారి ఆశీస్సు దీని ప్రశస్తిని వెల్లడిస్తున్నవి.

అనువాద, గీతాలకు ఉదాహరణ -

మూలం -

"ఓమిత్యేత దక్షర మిదగ్ం సర్వం
తస్యోపవ్యాఖ్యానం భూతం భవద్భవిష్యదితి
సర్వమోం కార ఏవ యచ్చాన్య
త్త్రికాలాతీతం తదప్యోంకారఏవ (మొదటి మంత్రం)

బులుసు వేంకటేశ్వర్లుగారి పద్యానువాదం -

అన్నిటికి మూల మోంకార మక్షరంబు
వర్తమాన గతా గత ప్రథిత కాల
మెల్ల ఓంకారమే యగు నీ త్రికాల
ముల కతీత మోంకారమే తలఁప నిజము.

సత్యనారాయణశాస్త్రిగారి గీతం -

ప్రణవమే యక్షరము
ప్రణవమే సర్వమ్ము
మూడుకాలము లందు
నిజమైన తత్త్వమ్ము.

ఇది బిల్లేశ్వమూడి అమ్మగారికే అంకిత మియ్యబడినది.

"ఆంగీరస"

రాజపాళయం రాజకవుల యక్షగానములు

[పరిష్కర్త: డాక్టర్ తిమ్మావజ్ఝల కోదండరామయ్య, ఎం. ఏ. పి. హెచ్. డి, తెలుగు శాఖాధ్యక్షుడు, మదురై కామరాజ విశ్వవిద్యాలయము, మదురై, డెమ్మీ సైజు 24+128 పుటలు. వెల 6 రూ. ప్రచురణ: బహుభాషా ప్రవీణ శ్రీ ముదునూరి జగన్నాథ రాజు, అధ్యక్షుడు, తెలుగు విద్యాలయము, రాజపాళయం, తమిళనాడు.]

కృష్ణదేవరాయల కాలంలో ఆంధ్ర భాషా వాఙ్మయాలు తెలుగు నాట మాత్రమే కాకుండా కర్ణాటక, తమిళ ప్రాంతాలలో కూడా విస్తరించాయి. తంజావూరు, మధురలను పాలించిన నాయక రాజులు, పుదుక్కోట తొండమానులు ఆంధ్రభాషా వాఙ్మయాల పట్ల ఎంతో ఆప్యాయత చూపేవారు. వారు సంగీత సాహిత్యాలు రెండింటిలోను సమర్థులు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత ప్రాంతీయాభిమానాలు పెరిగి తెలుగును చిన్న చూపు చూడడం జరిగింది. తమిళనాడు దక్షిణ ప్రాంతంలో తెలుగు నామావశిష్టమయింది. అయినా - రామనాథపురం జిల్లాలో శ్రీ విల్లిపుత్తూరు సమీపంలో ఉన్న రాజపాళయంలో మాత్రం నేటికీ ఆంధ్రభాషా వాఙ్మయ పోషణ జరుగుతునే ఉన్నది. ఆంధ్ర దేశం నుంచి అక్కడికి వలసవెళ్ళి స్థిరపడిన క్షత్రియ వంశీయులగు రాజులు ప్రాంతీయ భాషతోపాటు తెలుగు భాషపైని కూడా ఆదరం చూపుతూ దాని అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తున్నారు. పిల్లలకు తెలుగు కూడా నేర్పిస్తున్నారు. వారు నిర్మించుకొన్న పాళెమే రాజ పాళయం అయి, వారి మూలంగానే సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పారిశ్రామిక రంగాలలో ప్రఖ్యాతి గడించినది. ఉన్నత పదవులను అలంకరించిన వారు ఎందరో ఉన్నారు. ఆ రోజులలో పూర్వంనుంచీ విద్వత్కవులున్నారనేటందుకు ఈ యక్షగాన సంపుటమే ఉదాహరణ. అట్టివారు ఇప్పుడూ ఉన్నారు. వారిలో బహుభాషా ప్రవీణులు, ప్రతిభావంతులు, విద్వత్కవులు, దక్షిణ భారత భాషలన్నింటిలోనూ రచనలు సాగించిన వారూ, తెలుగు విద్యాలయం ప్రెసిడెంటు అయిన ముదునూరి జగన్నాథరాజుగారు ముఖ్యులు. వారి ప్రయత్నంవల్లనే ఈ యక్షగాన సంపుటి వెలుగులోనికి వచ్చింది. దీనిముద్రణకు హైదరాబాదులోని ఇంటర్నేషనల్ తెలుగు ఇన్‌స్టిట్యూటువారు, ఇతర వదాన్యులు ఆర్థిక సహాయం చేశారు. విద్యాసంస్థకు, ఈ ప్రకటనకు సంబంధించిన వారి చిత్రాలతోకూడా ఇది చక్కగా ముద్రితమై ప్రకటించబడింది.

ఆ కాలపు నాయక రాజులకూ, రాజులకూ సాహిత్యంతో పాటు సంగీతంపై కూడా ఎంతో ఆదరం ఉండేది. వారు ఆ రెండిటినీ సమానంగా పోషించేవారు. అందువల్ల సంగీతంతో సంబంధం ఉన్న యక్షగానాలకు దక్షిణ దేశంలోనే ప్రచారం ఎక్కువ. వాటిరచనకే ఎక్కువ ప్రోత్సాహం ఉండేది. ప్రభువులు కూడా వాటిని రచించే వారు. వాటిని గానంచేస్తే విని జనసామాన్యం మిక్కిలి ఆనందించేవారు. యక్షగానాలు చాలావరకు ఆ ప్రాంతం వారు రచించినవే!

రాజపాళయం రాజకవులు ముగ్గురు రచించిన మూడు యక్షగానాలు ఈ గ్రంథంలో ఉన్నవి. అవి-సీతాకల్యాణము, పారిజాతాపహరణము, సావిత్రి అనునవి. ఈ మూడూ ఒక కుటుంబం వారి రచనలే. సీతాకల్యాణ రచయిత గొట్టుముక్కల కృష్ణమరాజు. కుమార పెద్దిరాజు ఆ కృష్ణమరాజు కుమారుడు. సావిత్రియక్షగాన కర్త. కుమార పెద్దిరాజు మనుమడు సింగరాజు పారిజాతాపహరణాన్ని రచించాడు. దీనికి మున్నుడిని వ్రాసిన ముదునూరిజగన్నాథ రాజుగారు రాజపాళయం రాజకుటుంబాలు, వారి చరిత్ర, సాంఘిక రాజకీయ పారిశ్రామిక పరిస్థితి, సాహిత్యసేవ, ఈ యక్షగానముల ప్రకటన మున్నగు విషయాలను గురించి తెలియజేశారు.

తెలుగు వాఙ్మయంలోని ఇతర ప్రక్రియలవలె యక్షగానములు ఎక్కువ ప్రచారాన్ని పొందలేదు. దానికి, అవి దక్షిణ ప్రాంతంలోనే రచితములై అక్కడే వ్యాప్తిలో ఉండడం కారణమేమో! వీటిలో దేశీయ ఛ్ఛందస్సులో రచితములైన జంపె, దరువు, ఏల, సువ్వాల మున్నగునవి పద్యాలకన్న అధికంగా ఉంటాయి. అందువల్ల విద్యలేని సామాన్య ప్రజలకు వీటిపై మక్కువ ఎక్కువ. క్రమంగా ఇవి విద్వాంసులనుకూడా ఆకర్షించాయి. దీని సంపాదకులు, సంస్కర్తలు అయిన కీ. శే. డాక్టర్ తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారికి, జగన్నాథ రాజుగారు చూపిన తాళపత్ర సంపుటిలో పయి మూడు యక్షగానాలతోపాటు సుగ్రీవ విజయం, ఆండాళ చరిత్ర అనే మరి రెండు యక్షగానాలు కూడా ఉన్నవట! సుగ్రీవ విజయం ఇదివరకే ముద్రితమై ఉన్నది. అది కందుకూరి రుద్రకవి రచించినది. చాలా ప్రసిద్ధమైనది. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు దాన్ని సంస్కరించి యక్షగానాల లక్షణాదులను వివరించే విపుల పీఠికను సమకూర్చారు. కపిలేశ్వరపురం జమీందారులు కీ. శే. శ్రీ బలుసు బుచ్చిసర్వారాయుడు బహద్దరువారు చక్కగా ముద్రింపించి ప్రకటించారు. తక్కినవి ఇంతవరకూ ముద్రితాలు కాలేదు. బహుభాషా ప్రవీణులు, జగన్నాథరాజుగారి కోరికపై కోదండరామయ్యగారు విపులమైన పీఠికతో శుద్ధ ప్రతిని తయారు చేశారు. చక్కని పరిశోధకులు,

విఖ్యాతకృపులు అయిన కోదండరామయ్యగారు తమవిపుల పీఠికలో యక్షగానాలకు, విశేషించి యీ యక్షగాన త్రితయానికీ సంబంధించిన అనేకవిషయాలు వివరించారు. ఆయన "తాళపత్ర గ్రంథములో లిఖింపబడిన తీరును యథాతథముగా ననుసరించితిని. అధునాతన లేఖన సంప్రదాయముల ననుసరించి యెట్టి మార్పును చేయదలపెట్టలేదు. సందిగ్ధములైనపట్టుల,దుష్టములనికోచినపట్టులనాయభిప్రాయములను కుండలీకరణములలో సూచించితిని. అర్థము కుదురని పట్టులమార్పు దొరకొనక యట్లట్లే యుంచివేసితిని. గ్రంథపాతములుగల చోట్ల గీతలతో సూచించితిని. గ్రంథ భాగమునందెచ్చటను సవరణలుగాని, సంస్కారములుగాని చేయలేదు. మొత్తముమీదకవిహృదయమును, ప్రాచీన లేఖన పద్ధతులను వెల్లడి చేయురీతిగా వీనినుద్ధరించి వ్రాయుటకు ప్రయత్నించితిని" అని తమ సంస్కరణ పద్ధతిని తెలియజేశారు. ఉత్తమ పరిశోధకులు అనుసరించవలసిన పద్ధతియే యిది. ఇందు సంపాదకులు కృతకృత్యులైనారని చెప్పక తప్పదు.

వీటిశైలి చాలా సులభంగానూ, ఇంపుగానూ ఉన్నది. మూడు యక్షగానాల నుంచీ ఒక్కొక్క ఉదాహరణ :

(1) క. సుతహీనుడైన యతనికి
గీతి లేదని వేదవాక్యగతి దెలుపంగా
సతతము చెప్పగ నేటికి ?
సుతులకు సుద్యోగినగుదు సూనృతవర్యా !

వ. మరియు నిట్లనుచున్నాడు –

త్రిపుట –

ఎన్నదగియెడునట్టి సతకామేష్టి జేసిన సుతులు కలిగెద
రన్న వగపగనేల నీకు నను దినంబున్
యాగసంభారములు దేరగనంపు ఋషులను బిలువ
బంపుము
వేగముగ సాగింపు మింకను జాగు లేలా ?
(సీతాకల్యాణము, పుట 8)

(2) జంపె –

ఏవేళ నే యింతి యేలీల గోరునో
ఆవేళ నా యింతి కవి దెచ్చి యిచ్చున్
ఏయింట జూచినా నెలమి మెలగుచు పెక్కు
హాయా వినోదయా పాయత్తు డగుచున్
చంద్రశాలలయందు సౌధరాజములందు
చంద్రకాంతపు శిలాస్థల వేదులందు
కేళీ గృహములందు కృతక శైలములందు
పూలతోటలయందు పొదరిండ్లయందు
కేళీవిలాసబహు లీలలను లలిజేసి
యా లలనలను గూడి వారినోలలాడి.
(పారిజాతాపహరణము. పుట–62)

ఆటతాళము– "మగువ పొద్దున మేలుకని సుఖసుజ్జనంబై
సలిపతుని
పొగడివందన మాచరించుచు పూజ లొనగి
అత్త మామల చరణ యుగళికి అధికభక్తి మ్రొక్కిన
ఉత్తమోత్తమమైన దీవన లొసగ ప్రీతిన్
అను...... కలను సలుపన్ పలయును
తెలివిమీరయనుజ్ఞ యొసగుడు వెలయువేడ్కన్
అనుచు వేడిన హర్ష మందుచు యత్తమామల్......
ఘనత సలుపుము దీన నీకును గలుగు
సుఖముల్."

వ. యివ్విధంబున యనుజ్ఞగొని వ్రతం దేక్రమాన నడపుచున్నది– (సావిత్రి, పుట–116)

/ శ్రీ బులుసు వేంకటరమణయ్య

వేమన – సి. ఆర్. రెడ్డి

[రచన : బంగోరె. ప్రచురణ : సి. ఆర్. రెడ్డి శత జయంత్యుత్సవ సంఘము, ఆంధ్రాయూనివర్సిటీ. మొత్తం నూట మూడు పుటల పుస్తకం వెల : ఏడు రూపాయలు. ప్రతులకు : డిప్యూటీ డైరెక్టరు, ఆంధ్రా యూనివర్సిటీప్రెస్ & పబ్లికేషన్స్, వాల్తేరు, విశాఖపట్నం – 530 003.

ఈ రచయిత బ్రౌనుదొర గూర్చి చేసిన పరిశ్రమకు కొంత గుర్తింపు పొందారు. మూలన పడి ఉన్న అనేక పత్రాలను వెలికి దీయడం ఈయన ప్రత్యేకత. విశ్వ విద్యాలయాల వారి పరిశోధన లన్నా ప్రాచీన పండితులన్నా ఈయనకు తక్కువ గౌరవముందని వీరి గ్రంథాలను బట్టి తెలుస్తుంది. సద్విమర్శకునకుండదగని ఆవేశం బంగోరెలో ఉన్నదనికూడా పలువురు పెద్దలు అంటుంటారు.

తెలుగుదేశంలో రెడ్లకేగాక ఇతర కులస్థులకు కూడా వేమనపై అభిమానం మెండుగానే ఉన్నది. రెడ్డికుల సంబంధమైన సంఘంతో సి. ఆర్. రెడ్డిగారికి ప్రత్యక్ష సంబంధం ఉన్నదనే

సంగతి అందరికీ తెలిసిందే! అయితే ఇదొక్కటే ఆయనకు వేమనపై ఉన్న అభిమానానికి కారణం అని చెప్పడానికి గట్టిసాక్ష్యం లేమీలేవు. ఈ పుస్తకం ఉపోద్ఘాతంలో అవుల సాంబశివరావుగారు 'ఈ ఇద్దరిలో వున్న భావాల దగ్గరితనమే' వేమన అంటే కట్టమంచి వారికి ఇష్టమవడానికి కారణం అని చెప్పారు.

"దీని మూలంగా రెండు ఫలితాలను ఆశిస్తున్నాం. ఒకటి వేమన భావసరళికి ఉచితమైన స్థానం లభించడం, రెండు తెలుగు వారిలో వికాసం పెంచాలని రామలింగారెడ్డిగారు పడిన తపన, చేసిన ప్రయత్నం విశదపరచడం" అని అవులవారు ఈ పుస్తకం ప్రచురించడంలో గల ఉద్దేశాలను స్పష్టపరిచారు.

ప్రాచీనాంధ్ర కవులలో వేమన ఒకడు. ఆయన పద్యాలకు ప్రత్యేక ప్రచారం అవసరం లేకపోవడమే ఆయన ప్రత్యేకత. ఆబాల గోపాలానికీ వేమన పద్యాలు నాటి నుండీ నేటి దాకా నోటికి వచ్చు. అందుకే అవి అచ్చుయంత్రాలు లేనప్పుడు గూడా నిలబడ గలిగాయి. ఆయనకేదో అన్యాయం జరిగిందనుకోవడం ఒకభ్రమ.

తెలుగు వారిలో వికాసాన్ని పెంచాలని రామలింగారెడ్డిగారు ఎంత తపన పడ్డారో ఈ పుస్తకాన్నిబట్టి ఏమీ తెలియడం లేదు.

"మాజీ దిగంబరకవి శ్రీ జ్వాలాముఖి వొకరున్నారు. తన మహోపన్యాసంతో ప్రేక్షకుల నుండి చప్పట్లు ఆశించి చేసిన నిర్బద్ధతా వుద్ఘాటనల్లో భాగంగా పరిగణించాల్నో లేదో కానీ ఆయన 1981 మే లో వేమన గూర్చి తమ అవగాహన తెలియ చేస్తూ చెప్పిన పున్యాసానికి యేపాటి విలువ వున్నా - అందులో మార్క్సిస్ట్ పడికట్టు రాళ్ళ గల గలలతో ...." — ఈ రకమైన వ్యాఖ్యానాలు ఈ పుస్తక స్థాయిని బాగా దిగజార్చాయి. 'ముఖ్యంగా బ్రౌను మనల్ని దారి తప్పించాడు' అని జ్వాలాముఖిగారు అన్నందుకు బంగోరెగారు విరుచుకుపడ్డారు. వివిధ దృక్పథాలనుండి చరిత్రను తర్కించే దర్శించే హక్కు అందరికీ ఉంది. తెల్లవాళ్ళలో కొందరు తమ అవసరాలకు, అభీష్టాలకు అనుగుణంగా భారతీయ భాషలను అభ్యసించారు. కొన్ని పుస్తకాలను అచ్చువేయించి కొంత సేవచేశారు. అలాంటివాళ్ళలో మన భాషకు సంబంధించినంతవరకు బ్రౌనుదొర ముఖ్యుడు. ఆయన మీద అభిమానం ముదిరిన వారికి, ఇతరుల అభిప్రాయాలు ఎలా కనబడతాయో బంగోరెగారి మాటలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

'వేమనోపన్యాసాల నేపథ్యం'తో అసలు విషయం ప్రారంభమవుతుంది. మొదట ఆంధ్ర విశ్వకళా పరిషత్తువారి ఆంధ్రపత్రిక ప్రకటన ఉన్నది. 'సి. ఆర్. రెడ్డిగారి హయాంలో వేమనోపన్యాసాలు ఇప్పించడానికిగల కారణాలేమిటి?' మొదలైన తక్కువ మందికి ఆసక్తి గొల్పే విషయాలిందులో ఉన్నాయి. తరువాత శీర్షిక విద్యా ప్రణాళికలో వేమన పద్య అవస్థలు : సి. ఆర్. రెడ్డిని నడిపించిన చారిత్రకశక్తులు. 'వేమనకు విశ్వవిద్యాలయ పరిధిలో వొక ఘనమైన గుర్తింపు లభించడం యిదే ప్రథమం అనీ అందుకు కారకులు ప్రేరకులు సి. ఆర్. రెడ్డి అని కూడా చెప్పకున్నాం' అని ప్రారంభించి రెండవ పేరాలో విహంగావలోకనం చేసి రచయిత 'నిజానికి విశ్వ విద్యాలయ స్థాయిలో యిటువంటి గుర్తింపు కలగడం అది ప్రథమమనుకాదు, సి. ఆర్. రెడ్డి మొదటి మేటీకాదు' అంటారు. వేమన పద్యాలను కుంఫిణీ ప్రభుత్వం అచ్చు వేసిన మైనం వివరించారు. మళ్ళీ ఆ గౌరవాన్ని బ్రౌనుకి ఇచ్చారు. బ్రౌను పేరు వస్తే బంగోరెకు పరమానందం. వెంటనే నాలుగు పుటలు వ్యర్థమవుతాయి. కొన్ని ఉత్తరాలూ, డైరీలూ, తీర్మానాలూ చరిత్రకు ముఖ్యమైనవేగానీ వాటిని ఉటంకించడానికి సమయమూ, సందర్భమూ ఉండాలి. సారాంశం వ్రాసేచోట మొత్తం ఎత్తివ్రాస్తే పాఠకులకు విసుగు కలుగుతుంది.

"అలనాడు వేమన పద్యాలను విద్యా ప్రణాళిక నుంచి తొలగించి, వేమనను కవుల జాబితాలోకి, తెలుగు సాహిత్య చరిత్రలోకి రానీకుండా చేయాలని జరిగిన సంప్రదాయజ్ఞుల ఆ 'మూగకుట్ర'కు రియాక్షన్‌గా వేమనను వొక అకడమిక్ పరిధిలో పరిశీలింప జేసి ఆయన కవిత్వానికి, భావనకు ప్రతిష్ఠ చేకూర్చి లోగడ జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలనే అభ్యుదయ వాదుల పెను ప్రయత్నంగా యీ వేమనోపన్యాసాల యేర్పాటును భావిస్తే 'సున్నకు సున్న హళ్ళికి హళ్ళి'గా సరిపోయిందనుకోవచ్చు." అని రచయిత 'చారిత్రక శక్తులు' అధ్యాయాన్ని ముగించారు.

ఈ పుస్తకాన్ని చదివేటప్పుడు పాఠకునిలో అనేక ఆలోచనలు కలుగుతాయి.

వేమన పద్యాలు సులభంగా అర్థమవుతాయి గదా! ఆ పద్యాలను ఒకళ్ళు వివరించనవసరంలేదు. ఇక వేమనను గూర్చిన చారిత్రకాంశాలు ఎప్పటికీ తేలేవికావు. ఏ విషయమూ స్పష్టంగా తెలియదు. ఆ పద్యాలను ప్రజలే నిలుపుకున్నారు. సంప్రదాయజ్ఞులు 'మూగకుట్ర' చేసినా చేయకపోయినా ఒక్కటే! వేమన పద్యాలను మెచ్చుకునే వర్గమే వేరు. వారికి పండితులతోనూ పాండిత్యాలతోనూ పనేలేదు. అసలికి యూనివర్సిటీల్లో వేమనోపన్యాసాలనిప్పించడమే ఒక దండగమారి పని. వేమన పద్యాలు నిలవడానికి యూనివర్సిటీలుగానీ, సి. ఆర్. రెడ్డిగానీ, బ్రౌన్‌దొరగానీ కారణం గాదు. తెలుగు వాళ్ళే వేమన పద్యాలను నిలుపుకున్నారు.

రాళ్ళపల్లికి రెడ్డిగారు వ్రాసిన జాబులూ, సిండికేట్ నిర్ణయాలూ యూనివర్సిటీలో భద్రపరచదగినవి. ఈ పుస్తకంలో అచ్చు వేయడం దండగ.

ఇందులో పుస్తకం పేరును సార్థకం చేసేవి చివరి పది పేజీలే : వేమన గురించి సి. ఆర్. రెడ్డి ప్రస్తావనలు, ప్రసంగాలూ, వేమూరివారి జాబూ అందులో ఉన్నాయి.

సెలక్టెడ్ రైటింగ్స్ ఆఫ్ సి. ఆర్. రెడ్డి

(వాల్యూమ్ 1. సం గ్రేట్ లైవ్స్)

[సంపాదకుడు : బి. ముత్తుస్వామి. ప్రచురణ : సి. ఆర్. రెడ్డి సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ. పుటలు : 193, వెల : రూ. 15 లు. ప్రతులకు : డిప్యూటీ డైరెక్టరు, ఆంధ్రాయూనివర్సిటీ ప్రెస్, వాల్తేరు, విశాఖపట్టణం – 5300 03.]

ఆపుల సాంబశివరావుగారి తొలిపలుకులతో ఈ ఇంగ్లీషు పుస్తకం ప్రారంభమవుతుంది. ముత్తుస్వామిగారు పది పేజీల్లో ఉపోద్ఘాతం ఇచ్చారు. ఈ ప్రసంగ వ్యాసాలు సేకరించడానికి బంగోరే గారెంతో కృషి చేశారని ఉపోద్ఘాతాన్నిబట్టి తెలుస్తూంది.

ఇందులో వేమన, రాజారాంమోహనరాయ్, రామకృష్ణ పరమహంస, వివేకానంద, వీరేశలింగం, గోఖలే, అనీబీసెంట్, కృష్ణరాజవడయార్, టాగోర్, గాంధీ, అరవిందులు, నెహ్రూ, యం. యన్. రాయ్, ఒమాండూర్ పెద్ద రామస్వామిరెడ్డి, కార్వే – ఈ మహా పురుషులను గూర్చిన ప్రసంగ వ్యాసాలున్నాయి.

రెడ్డిగారి స్వతంత్ర ఆలోచనా సరళికి ఈ వ్యాసాలు మచ్చుతునకలు. ఆయన కిష్టమైన అంశము 'వేమన'తో ఈ సంపుటి ప్రారంభం కావటం ముదావహం. ఇది రేడియో ప్రసంగం అవడం వలన రెడ్డిగారు పద్యాలు తెలుగులో చదువుతూ ఆంగ్లంలో ప్రసంగించారు. అచ్చులో ఆంగ్ల లిపిలో తెలుగు పద్యాలు ప్రచురితమయ్యాయి. అధస్సూచికలో వాటి ఆంగ్లానువాదాలుంటే ఆంధ్రేతరుల కుపయుక్తంగా ఉండేవి.

కనక మృగము భువిని కలదు లేదనకయె
తరుణి విడచి పోయె దాశరథియు
తెలివిలేనివాడు దేవుడెట్లాయెర !

ఈ పద్యాన్నుదహరించి, రెడ్డిగారు ఇందులో తరుణి శబ్ద ప్రయోగంలో వ్యంగ్యం ఉందని భావించి "నోట్ ది ఐరనీ ఆఫ్ ది టెర్మ్ 'తరుణి' వుచ్ మీన్స్ ఎ యూత్ ఫుల్ వుమన్ ఇన్ ది ఫుల్ ఫ్లెష్ ఆఫ్ హర్ బ్యూటీ. ఇఫ్ ఇట్ హేడ్ బీన్ ఎన్ ఓల్డ్ క్రోన్, ఇట్ వుడ్ నాట్ హేవ్ మేటర్డ్" – అని వ్యాఖ్యానించారు. స్త్రీకి పర్యాయపదాలెన్నో ఉన్నాయి. వాటిని ఇష్టంవచ్చినట్లు వాడుకుంటారు తెలుగు కవులు. వాటికి వ్యుత్పత్తి అర్థాలను తీసి చూస్తే చాలచోట్ల హాస్యాస్పదంగా అనిపిస్తుంది. కొన్నిచోట్ల సరిగ్గా అతకవచ్చు. వేమన పద్యంలో గమనింప వలసింది తరుణి శబ్ద ప్రయోగం కాదు. తెలివిలేనివాడు దేవుడెట్లాయెరా ! అని వేమన దైవ తిరస్కారం చేసిన విధం గమనార్హం. పెద్దలు ఆలోచింపాలి.

ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసమూ ఒక రత్నం. దేశ స్థితిగతులగూర్చి రెడ్డిగారి అవగాహన, ఆవేదన ఎన్నో చోట్ల మనకు స్పష్టం అవుతుంది. రాజారామమోహనరాయ్‌ని గూర్చిన ప్రసంగంలో ఇలా అంటారు–"అవర్ హిస్టరీస్ ఆఫ్ ఇండియా ఆర్ సో డిఫెక్టివ్ దట్ ది యావరేజ్ ఇండియన్ స్టూడెంట్ హార్డ్లీ ఎసోసియేట్స్ ది నేమ్ ఆఫ్ రాజారాంమోహనరాయ్ విత్ ది యాబాలిషన్ ఆఫ్ సతి. ది గ్రేస్ ఆఫ్ దిస్ యాక్ట్ ఈజ్ ఎట్రిబ్యూటెడ్ టు లార్డ్ విలియమ్ బెంటింగ్. ఇన్ ది హిస్టరీస్ ఆఫ్ ఇండియా ప్లేస్‌డు ఇన్ ది హేండ్స్ ఆఫ్ అవర్ యంగ్ బోయ్స్ దేర్ ఈజ్ నాట్ ఎ వర్డ్ సెడ్ ఎబౌట్ రాజారాంమోహనరాయ్ అండ్ హిజ్ గ్రేట్ మిషన్."

రామకృష్ణ పరమహంస, వివేకానందల గూర్చిన వీరి ప్రసంగాలు రెండూ రెండు ఆణిముత్యాలు.

ఈ ఉత్తమ ఆంగ్ల గ్రంథంలో రెడ్డిగారి సంక్షిప్త జీవిత చరిత్ర, ఛాయా చిత్రాలూ ఉంటే ఆంధ్రేతరులకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది.

భారతి

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd , by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 61247.